
# అమృత దర్శనం


(జన్మజన్మల బంధాల అనుభవాలు, అనుభూతులు)



విశ్వపతి



తిరుమల నారాయణగిరి శ్రీవారి పాదాల వద్ద శ్రీచరణామృతం ప్రథమ ప్రతికి
పూజ చేస్తున్న చిత్రం



హర్వార్డ్ యూనివర్సిటీ లైబ్రరీలో లైబ్రరియన్ రిచర్డ్‌ను కలిసినప్పటి చిత్రం

# అమృత దర్శనం

(జన్మజన్మల బంధాల అనుభవాలు, అనుభూతులు)


## విశ్వపతి

**తిమ్మరాజు విశ్వపతి రామకృష్ణమూర్తి**



श्रीं

SHRI DESIGNS

VEDIC LOGO DESIGNERS

www.lordofsevenhills.com

www.vratams.com

Phone : 98494 43752

HYDERABAD

# అమృత దర్శనం

(జన్మజన్మల బంధాల అనుభవాలు, అనుభూతులు)

విశ్వపతి

(తిమ్మరాజు విశ్వపతి రామకృష్ణమూర్తి)

© Copyrights reserved

ప్రథమ ముద్రణ : 2019

ప్రతులకు :

**T.V.R.K.Murthy**
**(Viswapathi)**
Flat No.903, F-Block
Vertex Sadguru Krupa Apartments
Near Sanghamitra School
Nizampet Road
Hyderabad - 500 085, INDIA.
Ph.+91 9849443752

E-mail: viswapathi@yahoo.com
shridesigns@gmail.com

www.lordofsevenhills.com
www.vratams.com

Printed at :
**VIMAL PRINTERS**
1-1-776/3/1, SBI Colony,
Gandhi Nagar, Hyderabad.
Cell : 98491 60301

# నివేదన

ఈ సృష్టి మొత్తానికి కారణభూతమైన దివ్యశక్తి 84 లక్షల జీవరాశులను సృష్టించింది. వీటిలో మానవ జన్మ మహోన్నతమైనది. మొదటి జన్మలో మనందరికి ఎంతో విజ్ఞానం విచక్షణ ఉన్నాయి. కాని తరువాత జన్మలు గడుస్తున్న కొద్దీ అనేక పుణ్య, పాపకర్మలు చేస్తూ అజ్ఞానంతో ప్రవర్తిస్తూ, విచక్షణా రహితంగా జీవిస్తూ ఎన్నో కష్టాల పాలవుతున్నాము. ఎన్నో కర్మలను మూటకట్టుకుంటున్నాము. ఇవి తీరడానికి మరల మరల జన్మలెత్తుతూ, మళ్ళీ కొత్త కర్మలు చేస్తూ ఈ జనన మరణ చక్రంలో కొట్టుకుంటూ తిరుగుతున్నాము. ఇలా అనేక జన్మలలో పయనిస్తున్న ఆత్మకి ఎన్నో బంధాలు ఏర్పడతాయి. ఆ బంధాల ఫలితంగా తరువాత జన్మలలో అనేక వ్యక్తులతో, అనేక ప్రదేశాలతో మనకు అనుబంధం ఏర్పడి వారితోను, వాటితోను మమకారం ఏర్పడి ఇలా అనేక బంధాలు తెచ్చుకుంటూ కొన్ని వేల జన్మలలో ఈ ఆత్మ ముందుకు పయనిస్తూ ఉంటుంది.

ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్‌లో యం.టెక్. చదివిన నేను కొన్నాళ్ళ ఆల్విన్ కంపెనీలోను తరువాత 10 సంవత్సరాలు ఇంజనీరింగ్ కాలేజీలోను పనిచేసాను. 1998 నుంచి వ్యాపార సంస్థలకు వేదశాస్త్రాలు, జ్యోతిష్య శాస్త్రం ఆధారంగా పేర్లు నిర్ణయించడం, లోగోలు డిజైన్ చేయడంలో నిమగ్నమై ఉన్నాను. ఇప్పటిదాకా నేను లోగోలు డిజైన్ చేసిన 6,000 పైగా సంస్థలు దేశ, విదేశాలలో ప్రముఖ స్థానంలో ఉన్నాయంటే అదంతా ఆ శ్రీనివాసుని అనుగ్రహం తప్ప మరొకటి కాదు.

ఆ శ్రీనివాసుని దయ వలన నేను ఇప్పటిదాకా 26 ఆధ్యాత్మిక పుస్తకాలు రచించడం జరిగింది. వీటిలో పదహారు ఆ శ్రీనివాసుని లీలా విశేషాల పైననే! ఈ పుస్తకాలన్నీ దేశ, విదేశాలలోని భక్తులచేత నిత్యం పఠింపబడడం ఆ స్వామి అనుగ్రహం తప్ప మరొకటి కాదు. వీటిలో నేను 2005 సంవత్సరంలో శ్రీ వేంకటేశ్వర స్వామి వారి అనుగ్రహంతో రచించిన శ్రీ వేంకటేశ్వర వ్రతకల్పం 12 భాషల్లోకి అనువదింపబడింది. అటు తరువాత నేను శ్రీ వేంకటేశ్వర వ్రతకల్పంతో పాటు శ్రీలక్ష్మీనరసింహ వ్రతకల్పం, శ్రీఆనంద ఆంజనేయం, శ్రీమహేశ్వర వ్రతం, శ్రీసుబ్రహ్మణ్య వ్రతం, శ్రీ సాయిరక్షా వ్రతం, శ్రీరామరక్షా వ్రతం, శ్రీజ్ఞాన సరస్వతి వ్రతం, శ్రీకృష్ణ వ్రతం రచించడం జరిగింది. ఎంతో తేలిక భాషలో ఎటువంటి నియమనిష్ఠలు అవసరం లేకుండా చేసుకోగలిగే ఈ వ్రతాలు ఈ రోజు ప్రపంచం

అంతా నిత్యం ఎందరో భక్తుల గృహాలలోను, ఎన్నో ఆలయాలలోను ఆచరింపబడుతున్నాయి.

ఈ పుస్తకాలు చదివిన వారందరు ఎంతో శుభప్రదంగా జీవిస్తున్నారు. ఇదంతా ఆ శ్రీనివాసుని అనుగ్రహం తప్ప మరొకటి కాదు. ఈ పుస్తకాలు రచిస్తున్నప్పుడు నాకు ఎన్నో దివ్య అనుభూతులు కలిగాయి. ఎందరో దేవతలు, మహర్షులు, యోగులు, సిద్ధుల అద్భుత దర్శనం లభించింది. మాటలలో వర్ణించలేని ఎన్నో దివ్య అనుభూతులు కలిగాయి.

ఇన్ని సంవత్సరాలుగా నా వద్దకు అనేక సలహాల కోసం ఎన్నో వేలమంది వచ్చారు. వీరిలో కొందరు నాకెంతో ఆప్తులయ్యారు. కొన్ని సంవత్సరాల క్రితం నేను ధ్యానంలో ఉన్నప్పుడు నాకు గత జన్మల విశేషాలు ఎన్నో తెలిసాయి. నాలుగు జన్మల క్రితం నేను ఒక హిమాలయ దివ్య ఆశ్రమంలో ఉన్నట్లు గ్రహించాను. అప్పుడు ప్రపంచంలోని ఎన్నో ప్రదేశాలనుంచి 108 మంది వ్యక్తులు వచ్చి నన్ను కలుసుకున్నారు. వారందరు కొన్ని సంవత్సరాలు నాతో పాటు ఆ ఆశ్రమంలో గడిపారు. వారందరు తరువాత అనేక జన్మలలో అనేక దేశాలలోను, అనేక మతాలలోను జన్మించి ఈ జన్మలో తిరిగి అందరు నన్ను కలుసుకుంటున్నారు. వీరిలో కొందరు నా కుటుంబ సభ్యులుగా జన్మిస్తే, కొందరు వేరే దేశాలలో, వేరే రాష్ట్రాలలో వేరే మతాలలో, వేరే కులాలలో కూడా జన్మించారు. వీరు ఒకొక్కరు నన్ను ఈ జన్మలో తిరిగి చాలా ఆశ్చర్యకర రీతులలో అనిపిస్తుంది.

నేను ధ్యానంలో ఉన్నప్పుడు వీరందరు హిమాలయాశ్రమంలో నన్ను కలిసిన తరువాత ఏ ఏ జన్మలో ఎక్కడ జన్మించింది, ఎలా జీవించింది కూడా నాకు గోచరించింది. ఇంతే కాకుండా మరో విశేషమేమిటంటే వీరిలో చాలామందికి ఇక కొన్ని జన్మల తరువాత జన్మ రాహిత్యం కలిగి ఈ సృష్టి మొత్తానికి కారణభూతమైన ఆ దివ్యశక్తిలో కలవబోతున్నట్లు గ్రహించాను.

ఇలా నా వద్దకు వచ్చిన వీరి జన్మ జన్మల జీవిత విశేషాలను ఈ పుస్తకంలో వ్రాయడం జరిగింది. ఇంతే కాకుండా మానవుల పూర్వజన్మల వాసనల ప్రభావం ఎలా ఉంటుందో కూడా ఈ పుస్తకంలో వివరించాను. ఈ పుస్తకం వ్రాస్తున్న సమయంలో నాకు ఎన్నో గొప్ప అనుభూతులు కలిగాయి. ధ్యానంలో ఉంటూ ఎక్కడో హిమాలయాలలో సంచరిస్తూ, అక్కడి సిద్ధ పురుషుల్ని కలుసుకుంటూ, ఎన్నో గొప్ప

విషయాలు తెలుసుకొంటూ వ్రాయగలిగాను. ఎందరో దేవతలను, మహర్షులను కూడా దర్శించాను.

నేను 2005 లో శ్రీవేంకటేశ్వర వ్రతకల్పం రచించినప్పుడు ఆ శ్రీనివాసుడు తిరుమలలో నాకు విశ్వరూప దర్శనం అనుగ్రహించి ఈ వ్రతకల్ప విధానాన్ని అనుగ్రహించారు. అటు తరువాత నా జీవితంలో ఎన్నో మార్పులు జరిగాయి. ఇప్పటికి ధ్యానంలో ఉన్నప్పుడు ఆ పరబ్రహ్మమూర్తి విశ్వరూప దర్శనం నాకు నా హృదయంలోనే లభిస్తుంది. అప్పుడు మాటలలో వర్ణించలేని ఆనందం కలుగుతుంది. అలా దర్శనం కలిగిన ప్రతీసారీ ఎందరో దేవతలు, ఎందరో మహర్షులు ఆ మహాశక్తిని కొలుస్తూ ఎన్నో స్తోత్రాలు చదువుతుండగా అవన్నీ నా శరీరమంతా దివ్యతరంగాలుగా ప్రతిధ్వనిస్తుంటాయి. ఆ స్థితిలో మనందరం అనుకునే బ్రహ్మానందం కలుగుతుంది. శరీరమంతా తేలిపోతూ దివ్యలోకాలలో విహరిస్తూంటుంది.

ఆ క్షణంలో నేను, ఆ దివ్యశక్తి ఒక్కటేనన్న సత్యం ఎంతో చక్కగా బోధపడుతుంది. ఈ విశ్వమంతా వ్యాపించి ఉన్న మహాతత్వమే, మహాశక్తియే మన ఆత్మయందు కూడా ఉంది. మనం ధ్యానంలో ఎంతో ఉన్నత స్థితికి వెళితే ఈ విషయం చక్కగా తెలుసుకొనగలుగుతాం. ఈ అనుభవం వర్ణించలేని ఆనందాన్ని మనకు కలుగచేస్తుంది. ఈ జనన మరణ చక్రం నుంచి మనం పూర్తిగా బయటపడతాం.

పూర్వజన్మలలో నాతో బంధం ఉన్నవారందరు ఈ జన్మలో ఏ విధంగా తిరిగి నన్ను కలుస్తున్నారో ఈ పుస్తకంలో వివరించాను. అంతే కాకుండా జన్మ జన్మల బంధాలు ఎలా ఉంటాయో కూడా ఈ పుస్తకంలో వివరించాను. ఈ పుస్తకంలోని విషయాలు కొన్ని నమ్మశక్యం కానివిగా అనిపిస్తాయి. అసలు ఏ మాత్రం ఊహకు కూడా అందనివిగాను అనిపించవచ్చును. ఈ పుస్తకంలోని విషయాలు అర్థం చేసుకుంటే మనం నిత్య జీవితంలో ఎదుర్కుంటున్న ఎన్నో ప్రశ్నలకు సమాధానం లభిస్తుంది. ఈ పుస్తకాన్ని నెమ్మదిగా చదవండి. అంతే కాదు... ఒకటికి రెండుసార్లు చదవండి. అప్పుడే మీకు ఇందులో వ్రాసిన విషయాలన్నీ తేలికగా అర్థమవుతాయి. మీకు జీవితంలో ఏ సమస్య కలిగినా, మనశ్శాంతి లేకపోయినా ఈ పుస్తకంలో ఏవైనా నాలుగు పేజీలు చదివితే వెంటనే మీ సమస్యకు పరిష్కారం దొరికి మీకు పూర్తి మనశ్శాంతి లభిస్తుంది. ఇది సత్యం...

ఈ పుస్తకంలో వ్రాసిన విషయాలన్నీ మీలో కొందరికి ఎప్పుడో తెలిసిఉండవచ్చును. మీలో చాలామంది సాధారణ ప్రపంచానికి సామాన్య వ్యక్తులుగా కనబడుతున్న సిద్ధ పురుషులు కూడా కావచ్చును. మీ అందరికి ఎన్నో గొప్ప అనుభూతులు కలిగివుండవచ్చును. ఎందరో దేవతల దర్శనం కూడా లభించి ఉండవచ్చును. ఎవరి అనుభూతులు వారికే ప్రత్యేకం కదా! నేను ధ్యానంలో ఉన్నప్పుడు నాకు కలిగిన అనుభూతులు మీతో పంచుకుంటున్నాను. ఈ పుస్తకం పూర్తిగా చదివి మీకు కలిగిన అనుభూతిని నాతో ఫోన్ ద్వారా గాని, ఈ మెయిల్ ద్వారా గాని పంచుకుంటే సంతోషిస్తాను.

నేను వ్రాసిన ప్రతీ పుస్తకం లాగానే, ఈ పుస్తకం వ్రాస్తున్నంతసేపు నాకు ఈ అక్షర మహా ప్రసాదాన్ని అనుగ్రహించిన తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామి వారికి శతకోటి నమస్కారాలు... అలాగే నన్ను అనుగ్రహించిన దేవతలకు, మహర్షులకు, యోగులకు, సిద్ధులకు నా నమస్కారాలు. ఈ పుస్తక ప్రచురణలో ఎన్నో విధాల సహాయపడిన నా కుటుంబ సభ్యులకు, బంధువులకు, ఎందరో మిత్రులకు, శ్రేయోభిలాషులకు నా కృతజ్ఞతలు.

శ్రీలక్ష్మీ శ్రీనివాస కటాక్ష సిద్ధిరస్తు
సర్వేజనా సుఖినోభవంతుః
సమస్త కళ్యాణానిభవంతుః

తిమ్మరాజు విశ్వపతి రామకృష్ణమూర్తి

Hyderabad
2019

viswapathi@yahoo.com
Ph.: 98494 43752

# అంకితము

నా తల్లిదండ్రులు
కీ॥శే॥ బ్రహ్మశ్రీ తిమ్మరాజు లక్ష్మీ నరసింహారావు
కీ॥శే॥ శ్రీమతి నాగరత్నాంబ గార్ల ప్రీత్యర్థముగా
అమృత దర్శనం పుస్తకాన్ని
శ్రీలక్ష్మీశ్రీనివాసుల దివ్య చరణారవిందములకు
భక్తితో సమర్పిస్తున్నాను.

తిమ్మరాజు విశ్వపతి రామకృష్ణమూర్తి

# అమృత దర్శనం

మనం అందరం ఈ సృష్టి మొదటినుంచి ఎన్నో జన్మలెత్తుతూ ఎన్నో పుణ్య, పాపకర్మలు చేస్తూ వస్తున్నాం. ఒక జన్మనుంచి తరువాత జన్మలకు వెళ్ళగానే గడచిన జన్మ విశేషాలన్నీ మరిచిపోతాం. ఒక జన్మలో ఎన్నో పుణ్యకార్యాలు చేస్తాం, తరువాత జన్మలో మరెన్నో పాపకార్యాలు చేస్తాం, ఇలా ప్రతి మనిషి జనన మరణ చక్రంలో తిరుగుతూ ఉంటాడు. అయితే ఒక్కొక్క జన్మలో ముందుకు వెళ్తున్నకొద్దీ భగవంతుడికి మరింత చేరువ కావడానికి ప్రయత్నించాలి. అదే అన్ని జీవుల పుట్టుక పరమార్థం కావాలి.

ప్రతి మనిషికి వారి జీవితంలో ఎన్నో సుఖాలు, కష్టాలు అనుభవంలోకి వస్తాయి. సుఖాలు వచ్చినప్పుడు పొంగిపోకూడదు, కష్టాలు వచ్చినప్పుడు కృంగిపోకూడదు, రెండిటిని సమానంగా స్వీకరించగలగాలి. మనం ఏ కర్మచేసినా ఆ కర్మని భగవదర్పణంగా చేయాలి. ఏ ఫలాన్ని ఆశించకూడదు. ఎన్ని పుణ్యకార్యాలు చేసినా పుణ్యఫలాన్ని కూడా ఆశించకూడదు. అలా కొన్ని వేల జన్మలు జీవించగలగితే అప్పుడే జన్మరాహిత్యం కలుగుతుంది.

ఈ సృష్టి ప్రారంభంలో బ్రహ్మాండమైన శక్తి ఉన్నది. ఆ శక్తి ఎంతో తేజోవంతమైనది. ఆ శక్తికి స్వరూపం లేదు. ఆ మహాశక్తి మన కంటికి కనబడుతున్న సూర్యుడికంటే కోటి రెట్లు ప్రకాశవంతమైనది. ఆ దివ్యశక్తినుండే ఈ విశ్వమంతా ఉద్భవించింది. ఇన్ని గ్రహాలు, ఇన్ని నక్షత్రమండలాలు, అన్నీ ఈ పరబ్రహ్మం నుంచే ఉద్భవించాయి.

ఈ శక్తినుంచే మనకు తెలిసిన 33 కోట్ల మంది దేవతలు ఆవిర్భవించారు. మనకు తెలిసిన బ్రహ్మ, విష్ణువు, పరమేశ్వరుడు, శ్రీసరస్వతి, శ్రీమహాలక్ష్మి, శ్రీపార్వతీ దేవి, శ్రీకుమారస్వామి, శ్రీవిఘ్నేశ్వరుడు ఇలా మొదలైన దేవతలందరిని ఆ మహాశక్తే సృష్టించింది. ఈ దివ్యశక్తియే ఈ విశ్వం మొత్తాన్ని

సృష్టించింది. ఈ దివ్యశక్తినుండే 84 లక్షల జీవరాశులు ఉద్భవించాయి. అప్పటికి ఇంకా మనకు తెలిసిన వేదాలు, పురాణాలు, ఉపనిషత్తులు ఏమీ లేవు. విశ్వమంతా బ్రహ్మాండమైన చైతన్యం ఆవరించి ఉంది. ఆ చైతన్యం నుంచే ఇవన్నీ ఆవిర్భవించాయి. చలనం ఉన్నవి, చలనం లేనివి అన్నీ ఆ దివ్యశక్తినుంచే ఆవిర్భవించాయి.

ఈ అద్భుత శక్తినుంచే మనకు కనబడే నక్షత్ర మండలాలు, కంటికి కనబడని కోట్లాది గ్రహమండలాలు ఉద్భవించాయి. ఈ గ్రహమండలాలలో ఎందరో దేవతలు, మహాపురుషులు ఉన్నారు. వీరందరు ఒకరితో మరొకరు నిత్యం అనుసంధానమై ఉంటారు. వీరందరు ఈ సృష్టిని ఎప్పుడూ కాపాడుతూ వుంటారు. వీరందరు ఒక గ్రహమండలంనుంచి మరొక గ్రహమండలానికి కేవలం రెప్పపాటు కాలంలో ప్రయాణించగలరు. వారు ప్రయాణించే మార్గం, లోకం వేరు. మనకు కనీసం ఊహకైనా అందనిది. ఈ విశ్వం మొత్తానికి కారణభూతమైన ఆ దివ్యశక్తిని వీరు ఎల్లప్పుడూ ఆరాధిస్తూఉంటారు. వారికి ఆకలి, కోపం, నిద్ర, ఆయుష్షు ఉండవు. వారి తేజస్సు ఒక గ్రహమండలం నుంచి మరొక గ్రహమండలందాకా వ్యాపించి ఉంటుంది. వీరందరు ఎప్పుడూ ఒకరితో ఒకరు అనుసంధానమై, అందరు ఆ దివ్యశక్తితో అనుసంధానమై ఉంటారు. సామాన్య మానవులకు వీరి శక్తి అర్థం చేసుకోవడం చాలా కష్టతరమైనది.

అయితే అప్పుడప్పుడూ కొన్ని సంవత్సరాలకు వీరు భూమిపై మహాపురుషుల రూపంలో జన్మిస్తుంటారు. ఆదిశంకరాచార్యులు, శ్రీమద్రామానుజాచార్యులు, అన్నమయ్య, భక్త రామదాసు, కబీరు, తులసీదాసు, ఇప్పటి కాలంలో శ్రీ స్వామి యోగానంద, శ్రీ రమణ మహర్షి ఇలా గ్రహ మండలాలనుంచి భూమిపైకి ప్రత్యేక కార్యాల నిమిత్తం వచ్చినవారే! వీరందరికీ ఈ సృష్టి రహస్యాలు, ఎన్నో అద్భుత విషయాలు తెలిసినప్పటికి ఎవరితో చెప్పరు. వారు ఈ భూమిమీదకి వచ్చిన కార్యం పూర్తి కాగానే ఈ దేహాన్ని వదిలి వెళ్ళిపోతారు. వీరందరికి ఈ సృష్టి రహస్యాలు అన్నీ తెలిసినప్పటికి అవన్నీ అర్థం చేసుకునే శక్తి అందరు మానవులకు ఉండదని తెలుసు. అందుకే కేవలం తాము వచ్చిన కార్యం మాత్రం నిర్వహించి తిరిగి వెళ్ళిపోతారు. వీరందరు వేరు వేరు కాలాలలో వేరు వేరు ప్రదేశాలలో జన్మించినప్పటికి, నివసించినప్పటికీ, ఒకరితో ఎప్పుడూ అనుసంధానమై ఉంటారు. ఎప్పుడూ మానవాళికి మనం ఏం చెయ్యగలమా, ఎవరి ద్వారా ఏ మంచి

విషయాలు ఈ మానవాళికి ఏ విధంగా అందించగలమా అని నిత్యం ఆలోచిస్తుంటారు. అటువంటి విషయాలను గ్రహించగలిగే జ్ఞాన సంపన్నులు వారి వద్దకు వచ్చినప్పుడు వారికి చెప్తారు. వారికి అన్ని విషయాలు బోధపరుస్తారు.

ఇంకో విశేషం ఏమిటంటే ఈ మహాపురుషులు మన ఎదురుగా ఉన్న సమయంలో మనతో మాట్లాడుతూ, అదే సమయంలో ఒక్కోసారి ఎన్నో గ్రహమండలాల లోనికి వెళ్ళి రాగలరు. మన ఎదురుగా కూర్చుని వారు తమ భౌతిక శరీరంతో మాట్లాడుతూ, వారి సూక్ష్మ శరీరంతో, అద్భుతమైన శక్తితో వేరే గ్రహమండలాలో సంచరిస్తూ ఏకకాలంలో అక్కడా, ఇక్కడా ఉండగలడు. మనతో నవ్వుతూ మాట్లాడుతూ, అనేక విషయాలు వివరిస్తూ ఆ గ్రహమండలాలకు పయనించగలరు. మనతో మాట్లాడుతున్న సమయంలోనే ఆ గ్రహమండలాలలోని దేవతలతో ముచ్చటిస్తుంటారు.

సమస్త సృష్టికారకుడైన బ్రహ్మదేవుని గురించి, సర్వ వ్యాప్త తత్వం కలిగిన శ్రీమన్నారాయణుల వారి గురించి, సర్వ లయ కారకుడైన శ్రీ పరమేశ్వరుని గురించి, సర్వ విద్యలకు అధిదేవత అయిన శ్రీ సరస్వతి దేవి గురించి, సర్వ ఐశ్వర్యాలకు కారణభూతురాలైన శ్రీ మహాలక్ష్మి దేవి గురించి, సర్వ శక్తులకు కారణభూతురాలైన శ్రీ జగన్మాత గురించి, సర్వ విఘ్నాలకు అధిపతి అయిన విఘ్నేశ్వరుని గురించి, సర్వ సైన్యాలకు అధిపతి అయిన శ్రీ సుబ్రహ్మణ్య స్వామి గురించి...ఇలా ఎందరో దేవతలగురించి మనం ఎంతో విశేషంగా చెప్పుకుంటాం కదా! మరి ఈ దేవతలందరికి ఇంతటి గొప్ప శక్తులు, గుణాలు కలిగించిన ఆ మహాశక్తి ఇంకా ఎంత మహత్తరమైనదై ఉండాలి ?

సర్వదేవతా గణము, సర్వమునిగణము, సర్వయోగులు, సర్వసిద్ధులు ఆ మహాశక్తి గురించి తెలుసుకోవడానికి నిరంతరం ప్రయత్నింస్తుంటారు. వీరందరు ఎల్లప్పుడు ఆ మహాశక్తినే ఆరాధిస్తుంటారు. ఆ దివ్యశక్తి తమకు అనుగ్రహించిన శక్తితో ఎంతో మహిమలు గలవారు అవుతారు. ఎన్నో అద్భుత కార్యాలు చేయగలుగుతారు. ఈ సృష్టిలో సామాన్య మానవులచేత ఆరాధింపబడతారు. మనందరికి వీరందరూ ఎంతో పూజ్యనీయులు అవుతారు. మనందరికి ఎంతో ఆదర్శనీయ దేవతలు, శక్తులూ అవుతారు.

ఇంతకుముందు చెప్పుకొన్నటువంటి మహాశక్తివలన సృష్టింపబడ్డ మనమందరం అనేక యుగాల నుండి కోట్లాది జన్మలెత్తుతూ వస్తున్నాము. ఈ సృష్టి మొదలైనప్పటినుంచి కాల గమనంలో ఎన్నో యుగాలు జరిగాయి. సృష్టి ప్రారంభంలో ఆ దివ్యశక్తి 84 లక్షల జీవరాశులను సృష్టించింది. వీటన్నింటిలోనికి మానవ జన్మ ఎంతో ఉత్తమమైనది, ఎంతో విశిష్టమైనది. ఇన్ని జీవరాశులలోను మానవుడొక్కడికే జ్ఞానం, విచక్షణా శక్తి ఆ దివ్యశక్తి ప్రసాదించింది. అయితే మానవులందరు ఆ దివ్యశక్తి అనుగ్రహించిన జ్ఞానాన్ని, విచక్షణాశక్తిని విస్మరించి మరల మరల జన్మిస్తూ ఎన్నో పుణ్య, పాపకార్యాలను చేస్తూ వాటి కర్మఫలాలను అనుభవిస్తూ ఈ మాయనుంచి బయట పడలేక పోతున్నాం. ఈ జన్మ జన్మల బంధంలో చిక్కుకుంటున్నాము.

ఇక్కడ ఇంకో విషయం కూడా చెప్పుకోవాలి. ఈ జన్మలో ఎంతో పుణ్యం చేస్తే ఆ పుణ్యఫలం తరువాత జన్మలోనే మనకి అనుభవానికి వస్తుందని ఎక్కడా లేదు. మనం ఎప్పుడో నూరు జన్మల వెనుక ఒక జన్మలో చేసుకున్న పుణ్యఫలం ఇప్పుడు అనుభవిస్తూ ఉండవచ్చు. అలాగే ఒక 20 జన్మల నాటి పాప ఫలం వచ్చే జన్మలో అనుభవానికి రావచ్చు. ఏ జన్మలో చేసుకొన్న పాపపుణ్యాల ఫలం తరువాత ఏ జన్మలో మనకు అనుభవానికి వస్తుందన్నది ఆ భగవంతుని నిర్ణయం ప్రకారమే జరుగుతుంది. అందుకే ఒక్కోసారి మన చుట్టూ ఉన్న వారిలో కొంతమంది ఎంతో అహంకారంగా ఎన్నో పాపాలు చేస్తున్నప్పటికీ, ఈ జన్మలో వారు సమాజంలో ఎంతో ధనవంతులు గాను, ఎంతో ఉన్నత స్థానంలోను ఉండడం గమనిస్తుంటాము. వారింత నీచ పనులు చేస్తున్నప్పటికి ఇన్ని భౌతిక సుఖాలు ఎందుకు అనుభవిస్తున్నారని మనం అనుకుంటాము. అంతే కాదు ఒక్కొక్కసారి వారి జీవితాలు కూడా ఏ ఒడుదుడుకులు లేకుండా ఎంతో సాఫీగా జరిగిపోవడం కూడా గమనిస్తాం. ఇదంతా ఆ జీవి పూర్వజన్మలలో ఏదో జన్మలో చేసుకున్న గొప్ప పుణ్యఫలం తప్ప మరొకటి కాదు. ఇప్పుడు చేస్తున్న ఈ దుర్మార్గపు పనుల వలన వచ్చే జన్మలలో ఎప్పుడో తప్పక ఫలితం అనుభవిస్తారు. అటువంటి వారిని చూసి మనం అసూయ, ద్వేషం తెచ్చుకోకూడదు. ఏవో పూర్వజన్మల పుణ్యఫలం ఆ వ్యక్తి ఈ జన్మలో అనుభవిస్తున్నాడని గ్రహించాలి.

ఒక్కొక్క జన్మలో కలిగిన ఋణానుబంధాల వలన మరల మరొకచోట పుడుతూ ఆ ఋణాలను తీర్చుకుంటూ తిరిగి క్రొత్త పుణ్యకార్యాలను, పాపకార్యాలను

చేస్తూ తిరిగి ఋణగ్రస్తులవుతుంటాము. భగవంతుడు మనకి ఈ మాయనుంచి బయట పడడానికి విచక్షణా జ్ఞానం ఇచ్చాడు. అయినా మనం మాత్రం మన విచక్షణ ఉపయోగించకుండా అధర్మ కార్యాలను చేస్తాం.

మన మనస్సు, అంతరాత్మ ఎంతో గట్టిగా, ఎన్నో సార్లు వద్దని చెప్తున్నా వినకుండా మనస్సుకి విరుద్ధంగా చేసి కష్టాల పాలవుతాము. పుట్టింది మొదలు ఎందరో దేవతలను ప్రార్థిస్తుంటాము, పెద్దవారి ద్వారా ఎన్నో మంచి మాటలు వింటుంటాము, ఎన్నో పుణ్యక్షేత్రాలు దర్శిస్తాము, ఎన్నో దేవాలయాలు దర్శిస్తాము, ఎన్నో స్తోత్రాలు చదువుతాము, ఎన్నో ప్రవచనాలు వింటాము...కాని తిరిగి ఆ మాయలో పడిపోతాము. ఎందుకు ఇలా అవుతుంది?

ఎందుకు ఇన్ని ప్రవచనాలు విన్నా, ఇన్ని మంచి పుస్తకాలు చదివినా, ఇంత జ్ఞానం సంపాదించినా, ఇన్ని మహాపుణ్యక్షేత్రాలు దర్శించినా మనుషుల ఆలోచనలో, ప్రవర్తనలో ఎందుకు ఏ మాత్రం మార్పు రాదు ? ఎందుకు వారు చక్కటి బుద్ధితో జీవించరు?

వీటన్నింటికి జవాబులు ఒక్క విషయం గురించి అర్థం చేసుకుంటే తేలికగా తెలుస్తాయి. ప్రతి మనిషికి వారి వారి పూర్వజన్మల పుణ్యఫలాలు, పాపఫలాలు బట్టి జీవితం గడుస్తుంది. ఇప్పుడు ఈ జన్మలో మన బంధువులు, మనం కలిసే వ్యక్తులు, అందరూ క్రిందటి జన్మలలో ఎప్పుడో ఒకప్పుడు ఏదో విధంగా మనల్ని కలసినవారే ! వీరిలో కొంతమంది మనతో సహజీవనం చేసినవారే ! కేవలం మన చుట్టూ ఉన్న మనుషులే కారు, మనం ఈ జన్మలో నివసిస్తున్న ప్రదేశానికి కూడా మన పూర్వజన్మతో ఏదో సంబంధం తప్పక ఉండి తీరుతుంది.

అందుకే మనం ఒక్కొక్కసారి ఏదో చదవాలనుకొని, ఇంకేదో చదువుతాము అలాగే ఎక్కడో ఉద్యోగం చేయాలని, మరెక్కడో ఉద్యోగం చేస్తాం. ఒక్కొక్కసారి మనం ఏ మాత్రం కలవ వద్దని మనస్సులో అనుకున్న మనుషుల్నే మళ్ళీ పదే పదే కలుస్తాం. అలాగే ఒక్కొక్కసారి ఎంతో కోపం తెచ్చుకున్న వ్యక్తులమీద తరువాత కాలంలో ఎంతో ప్రేమ పుట్టుకు వస్తుంది. అలాగే మనం ఎంతో అభిమానించే వాళ్ళమీద ఒక్కొక్కసారి మనకే తెలియకుండా నిగ్రహించుకోలేనంత కోపం వస్తుంది. ఆ క్షణం గడచిన తరువాత అప్పుడు మనకి అంత కోపం ఎందుకు వచ్చిందా అని పశ్చాత్తాప పడుతుంటాం. దీనికి అంతా కారణం పూర్వజన్మల

బంధాలే! మనుషులే కాదు మనచుట్టూ ఉండే పెంపుడు జంతువులు కూడా మనతో పూర్వజన్మలో ఏదో బంధం కలిగి ఉంటాయి. అందుకే ఒక్కోసారి ఎక్కడినుంచో వచ్చిన ఒక కుక్కనో, పిల్లినో, ఎంత కసిరినా మన ఇల్లు వదిలిపెట్టకుండా ఉండిపోవడం గమనిస్తుంటాము.

నాకు 2002 లో సం॥లో ఒక దివ్యమైన కల వచ్చింది. ఆ కలలో కంచి మహాస్వామి శ్రీ చంద్రశేఖర స్వామివారు దర్శనమిచ్చారు. నేను ముందు ముందు చేయవలసిన పనులన్నీ గుర్తు తెచ్చారు. నేను ఈ జన్మలో ఇకముందు చేయవలసిన పనులన్నీ నిర్దేశించారు. అంతేకాదు ఇక ఈ పనులన్నీ చేసే సమయం వచ్చిందని చెప్పారు. భారతదేశంలో సంచరించిన ఎందరో మహాపురుషులలో కంచి మహాస్వామి శ్రీ చంద్రశేఖర స్వామివారు ఒకరు. ఒక గ్రహమండలంలోని అద్భుత శక్తియే ఈ భూమిపై చంద్రశేఖర సరస్వతి స్వామివారిగా ఆవిష్కరించారు.

ఇలా ఎన్నో గ్రహమండలాలలోని దివ్యశక్తులు ఆయా కాలాలలో అనేకమైన దివ్య పురుషులుగా అవతరించారు. ఈ మానవాళిని ధర్మం వైపు నడిపించడానికి ఎంతో కృషిచేసారు. వీరందరూ కూడా ఎంతో అద్భుత శక్తులు ఉన్నవారు. వారికున్న అపార మహిమలు, శక్తిలో మనకు తెలిసింది అణువంత. వారు తాము చెయ్యవలసిన పని తాము చేసారు అంతే తప్ప తాము ఎక్కడినుంచి వచ్చాము, తమకున్న మహాశక్తులు ఏమిటి అన్నవి ఎక్కడ బయలు పరచలేదు. శ్రీఆదిశంకరాచార్యులు వారు కేవలం 32 సం॥లు మాత్రమే జీవించి ఈ భారతదేశం మొత్తం సంచరించి ఎన్నో దివ్యస్తోత్రాలను మనకు అనుగ్రహించారని మనకు తెలుసుకదా! కాని ఆ ఆచార్యుల వారికి ఇంతకు మించి సహస్ర రెట్ల శక్తి ఉన్నది. వారు మనకు అందించినటువంటి స్తోత్రాలు, భాష్యాలు కాకుండా ఇంకా అనేకం చేసి ఉండవచ్చును. కాని ఆ దివ్యశక్తి అంతవరకే చేయాలని నిశ్చయించుకున్నారు. కేవలం 32 సంవత్సరాలు మాత్రమే ఉండి ఆ దివ్యశక్తి తిరిగి గ్రహమండలానికి వెళ్ళిపోయింది. ఇలా గడచిన వేలసంవత్సరాలుగా ఎందరో మహాపురుషులు, స్త్రీలు ఈ భూమిపై జన్మించి తాము నిర్దేశించుకున్నంతకాలం ఈ భూమిపై ఉండి తాము వచ్చిన కార్యం పూర్తిచేసి తిరిగి తమలోకాలకు వెళ్ళిపోయారు.

ముందు చెప్పుకున్నట్టుగా ఈ విశ్వంలోని 33 కోట్ల మంది దేవతలు, ఆ దివ్యశక్తినుండి వచ్చినవారే! అలాగే ఎన్నో యుగాలలో ఉన్న మహర్షులు కూడా ఆ

దివ్యశక్తినుండి ఉద్భవించిన రూపాలే ! అయితే వీరందరూ ఆ శక్తిలోని కొంత స్థాయి శక్తితో ఉద్భవించారు. ఒక్కొక్కరు ఒక్కొక్క స్థాయి శక్తితో ఉద్భవించారు. ఈ సృష్టి మొత్తానికి మూలకారణమైన ఆ దివ్యశక్తి గురించి వీరికే పూర్తిగా తెలియనప్పుడు అతి సామాన్యులమైన మనం తెలుసుకోలేకపోయామని బాధపడనక్కర్లేదు. అంతటి అద్భుత శక్తి ఒకటి ఉన్నదని తెలుసుకోగలిగితే అదే మహావిశేషం, మహాఅదృష్టం కూడా అవుతుంది.

ఆ దేవతల లాగానే కొందరు మనుషులు కూడా ఎన్నో శక్తులు కలిగిఉండడం మనం చూస్తూ ఉంటాము. వారిని మనం మహాపురుషులుగా చూస్తూ ఉంటాము. సంఘంలో గౌరవిస్తాం. ఎంతో ఉన్నత స్థానంలో ఉంచుతాం. వీరందరు ఈ సృష్టి మొత్తానికి ఏ దివ్యశక్తి కారణమో ఆ శక్తిలోనుంచి, కేవలం ఆ శక్తి సంకల్పంతో, అతికొద్ది శక్తి గ్రహించి ఈ భూమిపై ఉద్భవించినవారే! మనం వీరందరికి వేరు వేరు పేర్లు పెట్టుకుంటాము గాని అందరు ఆ దివ్యశక్తిలోని వారే! మనకు అనేక తత్త్వాలుగా వీరు కనిపించినప్పటికి నిజానికి వీరందరిదీ ఒకటే తత్త్వం. మనం మనకున్న అత్యల్ప ఆలోచనా పరిధితో వీరికి ఆయా తత్త్వాలను, ఆయా శక్తులను, ఆయా మహిమలను, ఆయా గుణాలను, ఆయా పనులను ఆపాదిస్తాం. మన పరిమిత దృష్టితో వారిని అంతవరకే చూస్తాం. కాని వీరందరిది అపరిమితమైన శక్తి. అందుకే వీరు ఈ భూమినుంచి నిష్క్రమించినప్పటికి ఇప్పటికీ వారు ఆరాధింపబడుతున్నారు. మనం అనేక మహిమలు అనుభవింప గలుగుతున్నాము. ఒక దేవతలే కాదు, మనకి తెలిసిన మానవులు కూడా కొంతమంది గురుపరంపరలోను, పీఠాధిపతులు గాను, ఆరాధింపబడటం మనకు తెలిసిందే కదా ! వీరందరు కూడా తమను నమ్ముకున్న వారిని అనుగ్రహిస్తూ వారిని నిత్యం కాపాడుతున్నారు కదా!

ఈ భూమిమీద ఉన్న అత్యంత పవిత్ర ప్రదేశాలలో హిమాలయాలు ఒకటి. ఆ పర్వత శ్రేణుల్లో అనేక దివ్య పురుషులు దివ్య శరీరధారులై నిత్యం సంచరిస్తుంటారు. మానవ మాత్రులకు వారి దర్శనం దుర్లభం. వీరిలో కొందరు వేరే గ్రహమండలాలనుండి అప్పుడప్పుడు వచ్చి భూలోకంలోని పవిత్ర ప్రదేశాలైన హిమాలయాలతో పాటు కాశీ, తిరుమల, శ్రీరంగం, వైష్ణోదేవి, మధుర, బృందావనం వంటి పవిత్ర ప్రదేశాలలో దివ్య రూపాలలో సంచరించి వెళ్తుంటారు. మనకి ఎన్నో జన్మల పుణ్యం ఉంటే అటువంటి మహానుభావులు మనకి ఎదో రూపంలో

దర్శనమిస్తారు. ఒక్కోసారి వారిని మనం గుర్తించలేకపోవచ్చుకూడా! కాని వారు మనవద్దకు రాగానే ఆ క్షణంలోని మన కష్టాలన్నీ తీరిపోతాయి. దాన్నే మనం రకరకాలుగా అన్వయించుకుంటాము.

ఆ సమయంలో ఏదైనా క్రొత్త ప్రదేశానికి వెళ్ళి వస్తే ఆ స్థల ప్రభావం వల్ల ఈ మార్పు వచ్చిందని అనుకుంటాము. కాని అసలు కారణం అటువంటి మహనీయులు, దివ్యశక్తి ఒకటి మనల్ని మనం గుర్తించలేని రూపంలో వచ్చి అనుగ్రహించడమన్నమాట. ఇది నా చుట్టూ ఉన్న చాలామంది జీవితాలలో జరగడం గమనించాను. ఇప్పటికీ గమనిస్తున్నాను. ఇందాక చెప్పినట్లుగా ఆ శక్తులు కేవలం కొన్ని నిమిషాలు మాత్రమే మనకి కనిపించి వెళ్ళిపోతారు. కాని మన జీవితం మంచి బాట పట్టడానికి ఆ రెండు నిమిషాలు చాలు.

ఒకసారి నేను షిరిడీ వెళ్ళినప్పుడు అక్కడ ఉన్న మార్కెట్‌లో నడుస్తుంటే ఒక వృద్ధుడు చిన్న పిల్లల బొమ్మలు అమ్ముతూ తిరుగుతున్నాడు. ఎవరినీ కొనమని అతను బలవంతం చేయడం లేదు. చేతులో బొమ్మలు పెట్టుకొని భక్తుల మధ్యలో తిరుగుతున్నాడు. ఇంతలో నా ప్రక్కనుంచి ఒక జంట, చంకలో పిల్లవాడితో వెళుతున్నారు. ఆ పిల్లవాడికోసం ఆ వృద్ధుడిని పిలిచి ఒక బొమ్మ కొని ఆ పిల్లాడి చేతికి ఇచ్చారు. ఆ పిల్లవాడు ఎన్నో సంవత్సరాలుగా తెలియని జబ్బుతో బాధపడుతున్నాడు. అతడికి త్వరగా నయం అవ్వాలని వారు ఎన్నో పుణ్యక్షేత్రాలు తిరుగుతూ చివరికి ఇక్కడ షిరిడికి చేరుకున్నారు. సాయినాథుడు వీరిని అనుగ్రహించాలని తలచి బొమ్మలు అమ్మేవాడి రూపంలో వచ్చి ఆ పిల్లవాడికి తన చేతితోనే ఒక బొమ్మను ఇచ్చాడు. సాయినాథుడి స్పర్శ తగలగానే ఆ పిల్లవాడి అనారోగ్యం మాయమైంది. ఆ వృద్ధుడు క్షణంలో మాయమైయ్యాడు. కొద్ది రోజులకే ఆ పిల్లవాడు పూర్తి ఆరోగ్యవంతుడయ్యాడు. కాని తల్లిదండ్రులకు ఆ రూపంలో వచ్చినది సాక్షాత్తు శ్రీసాయినాథుడే అని తెలియదు కదా! ఇన్ని పుణ్యక్షేత్రాలు తిరిగాం కాబట్టి తన పిల్లవాడికి ఆరోగ్యం చేకూరిందని తలిచారు. అంతేకాని ఆ సాయినాథుడే తమకు ఆరోజు దర్శనమిచ్చి పిల్లవాడిని అనుగ్రహించాడని వారికి తెలియదు. ఇటువంటి అనుభవాలు ఎందరో భక్తుల జీవితాలలో నిత్యం జరుగుతుంటాయి.

కొంతకాలం క్రితం నేను తిరుమల వెళ్ళినప్పుడు ఆ ఆలయం ఎదురుగా మెట్లమీద కూర్చున్నాను. ఆరోజు నా మనస్సు ఎంతో చికాకుగా ఉంది. ఇంతలో ఆ

ప్రక్కగా వెళ్తున్న ఒక భక్తుడు ఒక్కసారిగా ఆగి తన చేతిలో ఉన్న ప్రసాదం నాకు, నా శ్రీమతి రుక్మిణికి ఇచ్చాడు. ఇద్దరము ప్రసాదం కళ్ళకద్దుకొని నోట్లో వేసుకున్నాం అంతే! కాసేపటికే మనసంతా హాయిగా అయింది. ఆ వచ్చింది సాక్షాత్తు శ్రీనివాసుడే! ఇలా తిరుమల కొండపై ఎందరికో ఆ స్వామి సామాన్య భక్తుని రూపంలో దర్శనం ఇస్తుంటాడు. ఇలా అనేక పుణ్యక్షేత్రాలలో ఆ క్షేత్రంలో ఉన్న దేవత అక్కడకు ఎంతో భక్తి విశ్వాసాలతో వచ్చినవారికి ఏదో రూపంలో దర్శనమిచ్చి అనుగ్రహిస్తుంటాడు.

మనం పూర్తి ధ్యానంలో లోకి వెళ్ళి మనస్సును ప్రశాంతంగా ఉంచుకుంటే ఎన్నో అద్భుతాలు మన కంటిముందు కనబడతాయి. అలా ధ్యానం చేస్తూ మనం ఇంకా ఎక్కువ ఉన్నత స్థితిలోకి వెళితే మన చుట్టూ జరుగుతున్నవన్నీ మర్చిపోతాము. చుట్టూ ఉన్న ధ్వనులు, వస్తువులు ఏమీ కనబడవు. ఏ శబ్దాలు వినబడవు, ఏ వాసన మనకు తెలియదు. శరీరమంతా ఒక వర్ణించలేని అద్భుతమైన ఆనందం కలుగుతుంది. మనం ధ్యానంలో అంతటి స్థాయికి వెళ్ళిన తరువాత ఎన్నో దివ్య అనుభూతులు కలుగుతాయి. మనం ఎవరిమో, ఎక్కడినుంచి వచ్చామో, మనకి తెలుస్తుంది. మనకు ఈ లోకంతో ఉన్న బంధం ఏమిటి, మన బంధుమిత్రులందరు ఎవరో తెలుస్తుంది. ఇలా ఒకసారి తెలిసిన తరువాత ఇంకా ఈ భౌతిక లోకంలో ఏ కష్టము మనల్ని బాధించదు.

నేను ఇప్పటిదాకా 25 భక్తి పుస్తకాలు రచించాను. వీటిలో 16 పుస్తకాలు తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి వారి పైననే రచించడం విశేషం. 2001 వ సంవత్సరంలో నేను శ్రీనివాస మహత్యం అనే నా మొదటి పుస్తకం రచించాను. ఈ పుస్తకం వ్రాయడానికి దాదాపు 8 నెలలు పట్టింది. వ్రాస్తున్నంతకాలం ఒక దీక్షతో ఉండి ప్రతీరోజు నేలమీదనే నిద్రించేవాడిని. ఆ 8 నెలలు ఎక్కడకి వెళ్ళలేదు. మధ్యలో ఒక వారం రోజుల పాటు తిరుమల వెళ్ళి కొండమీదనే ఉండి ఆ పుస్తకంలో కొంత భాగం వ్రాసాను. శ్రీ శ్రీనివాస మహత్యం కవర్‌పేజీ పై ఏ ఫొటో ఉండాలో, లోపలి పేజీలో ఏ ఫొటో ఉండాలో శ్రీనివాసుడే కలలో కనబడి నాకు చెప్పడం జరిగింది. ఆ పుస్తకం ఎందరో శ్రీనివాసుని భక్తులకు నిత్యపారాయణ గ్రంథం అయింది.

ఆ తరువాత కొంతకాలానికి 2005 వ సం॥లో ఒక నాటి రాత్రి శ్రీవేంకటేశ్వర స్వామి వారు కలలో దర్శనమిచ్చి శ్రీవేంకటేశ్వర వ్రతకల్పం వ్రాయవలసిందిగా అనుగ్రహించారు. ఆ ఆదేశంతో నేను తిరుమల వెళ్ళి అక్కడ

ఆలయం ఎదురుగా కనులు మూసుకొని ధ్యానం చేస్తూ కూర్చున్నాను. అప్పుడు ఆలయంలోని శ్రీవేంకటేశ్వర స్వామి వారు ఆలయం వెనుక ప్రదేశంలో భూమ్యాకాశాలను ఆక్రమిస్తూ విశ్వరూపంలో దర్శనమిచ్చారు. కొన్ని క్షణాల పాటు నన్ను నేను పూర్తిగా మర్చిపోయాను. ఎక్కడ ఉన్నానో ఏం చేస్తున్నానో తెలియదు.

నా చుట్టుప్రక్కల ఎంతో మంది భక్తులు అటు ఇటు తిరుగుతున్నప్పటికి నాకు వారి ఉనికి ఏమాత్రం తెలియడం లేదు. ఏ శబ్దాలు వినిపించడం లేదు. శరీరమంతా ఒక దివ్యమైన శక్తి ఆవహించింది. అప్పటి ఆ విశ్వరూపంలో విశ్వంలోని దేవతలందరూ ఉన్నారు. అప్పుడు నాకు కలిగిన దివ్య దర్శనాన్ని నేను శ్రీమన్నారాయణుల వారి విశ్వరూప దర్శనం అనిగానీ లేదా పరమేశ్వరుడు విశ్వరూపంలో దర్శనమిచ్చాడనిగానీ, సాక్షాత్తు ఆ దుర్గాదేవియే అన్ని దేవతల రూపంలో దర్శనమిచ్చిందనిగానీ అనను. అప్పుడు ఆ కొండపై నాకు కలిగిన అనుభూతి అనిర్వచనమైనది.

ఈ సృష్టిలోని అందరు దేవతలు, సర్వ జీవకోటి ఆవిర్భానికి మూలమైన దివ్యశక్తి నాకు అప్పుడు అక్కడ సాక్షాత్కరించింది. ఆ దివ్యశక్తిలో నేను సమస్త దేవతలను దర్శించాను. సముద్రాలు, లోయలు, కొండలు, నదులు అనేక రకాల వృక్షాలు, మానవులు, సమస్త జీవకోటి, ఎన్నో జంతుజాలాలు, ఎన్నో గ్రహమండలాలు, నక్షత్రమండాలు అన్నీ దర్శనమిచ్చాయి. ఆ దర్శనంతో నేను ముందు ముందు చేయవలసిన పనులన్నీ నాకు గుర్తుకు వచ్చాయి. అలా ఈ విశ్వం మొత్తానికి మూలకారణమైన ఆ దివ్యశక్తి దర్శనం అక్కడ లభించింది.

ఇంత అద్భుతమైన శక్తి ఆ తిరుమల కొండలపై ఆనందనిలయంలో ఉండడంతో తిరుమల ఎంతో శక్తి గల క్షేత్రంగా ప్రకాశిస్తోంది. పూర్వకాలంలో కొందరు మహర్షులు ఈ కొండపై తపస్సు చేసినప్పుడు వారికి కూడా ఈ దివ్యశక్తి దర్శనం లభించింది. త్రేతాయుగంలో రామచంద్రుల వారు సీతాన్వేషణలో ఈ శేషాచల కొండలపైనుంచి వెళుతూ తిరుమల వచ్చినప్పుడు శ్రీరామచంద్రుల వారికి కూడా ఈ దివ్యశక్తి దర్శనం కలిగింది. అలాగే కొందరు దేవతలకు కూడా ఈ తిరుమల కొండపై ఈ సృష్టిమొత్తానికి మూలకారణమైన దివ్యశక్తి ఇక్కడ ఉన్నదని తెలుసుకొని వారెంతోకాలం ఇక్కడే తపస్సు చేసి ఆ మహాశక్తి దర్శనం పొందారు. ఇంతటి మహాశక్తి ఆ ప్రదేశంలో ఉండడం చేత మనమందరము తిరుమలకు ఎంతో

ఆకర్షితులమౌతాము. ప్రపంచంలోని ఎన్నో దేశాలనుంచి ఎంతో దూరం నుంచి భక్తులు ఆ శక్తి వైపు ఆకర్షింపబడతారు. ఇంతకు ముందు చెప్పినట్లుగా ఆ శక్తి ఏ ఒక్క దేవతదో కాదు. ఈ సృష్టి మొత్తం ఆవిర్భానికి బ్రహ్మ, శ్రీమన్నారాయణుడు, పరమేశ్వరుడు కంటే కూడా ముందుగా ఉన్న దివ్యశక్తి అది.

ఇంత అద్భుతమైన శక్తి అక్కడ తిరుమల పై ఉండడం వలన అక్కడ ఎప్పుడూ అద్భుతమైన తరంగాలు ప్రసరిస్తుంటాయి. ఇప్పటికీ అనేక దేవతలు నిత్యం ఆ శక్తిని కొలుస్తూ అక్కడ సంచరిస్తూంటారు. తిరుమల ఆలయంలో శిలారూపంలో మనకు దర్శనమిస్తున్న మూర్తి ఆ దివ్యశక్తియే! సామాన్య మానవులకు ఆ మహాశక్తి దర్శనం దుర్లభం కాబట్టి ఆ శక్తియే ఒక శిలారూపంలో మనకు దర్శనం అనుగ్రహిస్తున్నది. సర్వదేవతలు ఆ శక్తిలో ఉన్నాయి కాబట్టే అక్కడ మూర్తి కొంతకాలంపాటు పరమేశ్వరునిగాను, కొంతకాలంపాటు శక్తిరూపిణిగాను, కొంతకాలంపాటు శ్రీమహావిష్ణువుగాను, కొంతకాలంపాటు శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామిగాను, ఇలా అనేక కాలాలలో, అనేక దేవతల రూపంలో అర్చింపబడింది.

ఇంతే కాదు వివిధ సాంప్రదాయాలకు చెందిన అనేకమంది భక్తులు వారు ఆరాధించే దైవాన్ని ఇక్కడ మూర్తిలో దర్శించారు. ప్రస్తుతం ఆనందనిలయంలో ఉన్నది శ్రీమన్నారాయణుల వారి రూపంగా మనం కొలుస్తున్నప్పటికి కొంతమంది భక్తులకు అక్కడ ఉన్న దేవత పరమేశ్వరుడు గాను, కొంతమంది భక్తులకు శక్తిరూపిణి గాను, కొంతమంది భక్తులకు శ్రీనారసింహుడిగాను, కొంతమంది భక్తులకు శ్రీసుబ్రహ్మణ్యేశ్వరుడి రూపంలో దర్శనమివ్వడం జరుగుతుంది.

అప్పటినుంచి నేను ఎక్కడ ఉన్నా కాసేపు కనులు మూసుకొని ధ్యానంలో ఉన్నత స్థాయికి వెళ్ళినప్పుడు ఆ దివ్యశక్తి తన విశ్వరూపంతో నా హృదయంలోనే దర్శనమివ్వడం జరుగుతోంది. అలా దర్శనం కలిగిన ప్రతీసారి ఎందరో దేవతలు, ఎందరో మహర్షులు ఆ మహాశక్తిని కొలుస్తూ ఎన్నో స్తోత్రాలు చదువుతుండగా అవన్నీ నా శరీరమంతా దివ్యతరంగాలుగా ప్రతిధ్వనిస్తుంటాయి. ఆ స్థితిలో అందరూ అనుకునే బ్రహ్మానందం కలుగుతుంది. శరీరమంతా తేలిపోతూ ఏదో లోకంలో విహరిస్తూంటుంది.

ఆ క్షణంలో నేను, ఆ దివ్యశక్తి ఒక్కటేనన్న సత్యం ఎంతో చక్కగా బోధపడుతుంది. ఈ విశ్వమంతా వ్యాపించి ఉన్న మహాతత్వమే, మహాశక్తియే మన

ఆత్మయందు కూడా ఉంది. మనం ధ్యానంలో ఎంతో ఉన్నత స్థితికి వెళితే ఈ విషయం చక్కగా తెలుసుకొన గలుగుతాం. ఈ అనుభవం వర్ణించలేని ఆనందాన్ని మనకి కలుగజేస్తుంది. ఈ జనన మరణ చక్రం నుంచి మనం పూర్తిగా బయటపడతాం.

ఎందరో మహర్షులకు, మహాపురుషులకు ఇటువంటి దివ్యశక్తి యొక్క విశ్వరూప దర్శనం వారి హృదయాలలోనే లభించింది. అటు తరువాత వారు లోక కళ్యాణానికై ఎన్నో గొప్ప కార్యాలు కూడా చేయడం జరిగింది. అయితే వీరిలో చాలామంది తమకు కలిగిన ఈ దివ్య అనుభవాన్ని బాహ్యంగా చెప్పలేదు. ఎందుకంటే సామాన్య మానవులకు ఇది ఊహకు కూడా అందని విషయం. కాని ఎన్నో జన్మల పుణ్యఫలంచేత, సంస్కారవంతమైన జీవితం గడపడంతోను, సద్గురువుల సాంగత్యంతోను, స్థితప్రజ్ఞతతో జీవించడం చేతను ఈ మహాశక్తి దర్శనం మన హృదయంలోనే తప్పక లభిస్తుంది.

ఆ దివ్యశక్తి అనుగ్రహం వలననే అటు తరువాత రోజులలో నేను శ్రీ లక్ష్మీనరసింహ వ్రతం, శ్రీ ఆనంద ఆంజనేయ వ్రతం, శ్రీ రామరక్షావ్రతం, శ్రీ మహేశ్వర వ్రతం, శ్రీ సుబ్రహ్మణ్య వ్రతం, శ్రీ శుభదుర్గ వత్రం, శ్రీ సాయిరక్షా వ్రతం, శ్రీ జ్ఞానసరస్వతి వ్రతం, శ్రీ కృష్ణ వ్రతం పుస్తకాలు కూడా రచించడం జరిగింది. ఇవన్నీ ఆయా దేవతల స్వరూపాల అనుగ్రహం తోనే వ్రాయడం జరిగింది. అక్షరం పరబ్రహ్మ స్వరూపం. ఒక అక్షరం పలికేటప్పుడు తరంగాలు ఎంతో శక్తి కలిగి ఉంటాయి. అందునా కొన్ని అక్షర సమూహాలు ఇంకా శక్తివంతమై ఉంటాయి. అందుకే మనకు తెలిసిన ఎన్నో మంత్రాలు ఎంతో శక్తివంతమైనవి. వాటిలో నిగూఢమై ఎంతో శక్తి ఉంటుంది. నేను వ్రాసిన ఈ వ్రత పుస్తకాలలోని కథలలో కూడా అంతటి శక్తి ఉంది. ప్రపంచమంతా కొన్ని కోట్ల మంది ఈ పుస్తకాలు చదివి ఎన్నో దివ్యమైన అనుభూతుల్ని పొందుతున్నారు. వారి జీవితాలు శుభప్రదంగా గడుస్తున్నాయి. వారు కోరిన కోర్కెలు తీరుతున్నాయి. కేవలం మనశ్శాంతికోసం ఈ పుస్తకాలు చదివినా మనస్సుకు ఎంతో ప్రశాంతతను కలుగజేస్తున్నాయి.

విశేషమేమిటంటే శ్రీ వేంకటేశ్వర వ్రతకల్పం తెలుగుతోపాటు, హిందీ, తమిళం, కన్నడ, మళయాళం వంటి దేశీయ భాషల్లోనే కాకుండా ఫ్రెంచ్, జర్మన్, ఇటాలియన్, రష్యన్ భాషలలోకి కూడా అనువదింపబడింది. ఆ జాతీయులు

అందరూ కూడా ఈ వ్రతంలోని కథలు చదివి ఎంతో గొప్ప అనుభూతిని పొందుతున్నారు. ఒక మతంతోగాని, ఒక కులంతో గాని, సంబంధం లేకుండా ఈ శ్రీవేంకటేశ్వర వ్రతం చదువుతున్న వారందరికి ఎన్నో గొప్ప అనుభూతులు కలుగుతున్నాయంటే, ఆ కథలు, ఆ కథలలోని అక్షరాలకు ఎంత శక్తి ఉందో అర్థమవుతుంది. ఇదంతా ఆ దివ్యశక్తి అనుగ్రహం తప్ప మరొకటి కాదు.

సాక్షాత్తు ఆ శ్రీనివాసుని అనుగ్రహంతో 2005 లో నేను రాసిన శ్రీవేంకటేశ్వర వ్రత కల్పం ఎంతో మంది జీవితాలలో ఎన్నో అద్భుతాలు చేస్తోంది. దాదాపు ప్రతీరోజు నాకు ప్రపంచంలోనే ఎక్కడెక్కడినుంచో ఈ శ్రీవేంకటేశ్వర వ్రత కల్పం చదవడం మొదలు పెట్టగానే వారి జీవితాలలో జరిగిన అనుభూతులను నాకు చెప్తుంటారు. ఆరోగ్యం బాగుపడిందనో, ఉద్యోగం వచ్చిందనో, వివాహం కుదిరిందనో, సంతానం కలిగిందనో ఇలా శ్రీస్వామివారి వ్రతం మొదలు పెట్టగానే తాము అనుకున్నవన్నీ తీరుతాయని ఎంతో సంతోషంగా చెప్తుంటారు. ఈ వ్రతం రెండు విధాలుగా చేసుకొనవచ్చును. మొదటిది శ్రీసత్యనారాయణ వ్రతం మాదిరిగా కలశ స్థాపనతో కూడి చెయ్యాలి. రెండవ పద్ధతిలో కేవలం ఆ వ్రతంలోని ఐదు కథలను చదివి తమకు తోచినది నైవేద్యం పెడితే ఆ వ్రతం చేసిన ఫలితం దక్కుతుంది. రెండవ పద్ధతి చాలా తేలికైనది కాబట్టి ఈరోజు ప్రపంచవ్యాప్తంగా కొన్ని కోట్లాది భక్తులు ప్రతీ శనివారం ఈ రెండవ పద్ధతిలో ఐదు కథలను చదివి తమకు తోచిన పళ్ళో లేదా ఇంత చక్కెరనో శ్రీస్వామివారికి నివేదిస్తున్నారు. ఈ మధ్య ఎందరో చెపుతున్న దాన్నిబట్టి చాలామంది భక్తులు ఈ వ్రతకథలు ప్రతిరోజు కూడా చదువుతున్నారని తెలిసింది. దీని వలన వారికి అన్నీ శుభప్రదంగా జరుగుతున్నాయని ఎంతో మనశ్శాంతి లభిస్తుందని చెపుతున్నారు.

అసలు ఈ పుస్తకం వారి వద్దకు రావడమే ఎంతో ఆశ్చర్యకరంగా జరిగిందని చెప్తుంటారు. ఈ పుస్తకం దొరకడమే వారికి శ్రీనివాసుని అనుగ్రహంగా భావిస్తారు. ఈ పుస్తకం ఎక్కడ అమ్మకానికి ఉండదు కాబట్టి దొరికిన వారికి ఇది ఎంతో అపురూపంగా ఉంటోంది. కొంత మందికి తెలిసిన స్నేహితుల ద్వారా లభిస్తే మరి కొంతమందికి ఏ వివాహానికో వెళ్ళినప్పుడు అక్కడ దొరకడం జరుగుతుంది. ఇంకా విశేషం ఏమిటంటే కొన్ని సందర్భాలలో సాక్షాత్తు ఆ శ్రీనివాసుడే ఈ శ్రీవేంకటేశ్వర వ్రత కల్పం వారికిచ్చారని చెపుతుంటారు. అది విని నాకెంతో సంతోషం కలుగుతుంది. ఇంతకు మించిన భాగ్యం ఏముంటుంది?.

ఒక నాలుగు సంవత్సరాల క్రితం మద్రాసు నుంచి ఒక పెద్దావిడ ఫోన్ చేసారు. తనకు శ్రీవేంకటేశ్వర వ్రత కల్పం అంటే ఎంతో ఇష్టమని ప్రతిరోజు ఆ పుస్తకంలోని ఐదు కథలు ఎంతో భక్తితో చదువుకుంటానని అన్నారు. ఎప్పుడైనా హైదరాబాద్ వచ్చినప్పుడు మిమ్మల్ని కలవవచ్చా అని అన్నారు. అయ్యో! సంతోషంగానమ్మా! అని అన్నాను. వారి భర్త ఒక ప్రభుత్వరంగ సంస్థలో పెద్ద ఉద్యోగం చేసి రిటైర్ అయ్యారు. ఆయన ఎంతో నిష్టాగరిష్ఠుడు. ఆయనకి వేదశాస్త్రాలమీద ఎంతో పట్టుఉంది. అటువంటి కుటుంబానికి నేను రాసిన ఈ శ్రీవేంకటేశ్వర వ్రతకల్పం ఎంతో సంతోషం కలుగజేయడం నాకెంతో సంతోషాన్నిచ్చింది.

అటు తరువాత కొన్ని రోజులకు ఒక రోజు ఉదయం ఆయన ఫోన్ చేసి విశ్వపతి గారూ! మేము మా అమ్మాయి దగ్గరకి కెనడా వెళ్ళి తిరుగు ప్రయాణంలో హైదరాబాద్‌లో ఉన్న మరొక అమ్మాయి ఇంట్లో ప్రొద్దున్నే దిగాము. మళ్ళీ రేపు ఉదయం మద్రాసు వెళ్ళిపోతాము. ఒక్కసారి సాయంత్రం మీ ఇంటికి రావావలనుకుంటున్నాము అని అన్నారు. అయ్యో తప్పకుండానండి అని నేను అన్నాను. ఆరోజు సాయంత్రమే ఆ భార్యాభర్తలిద్దరూ వారి కూతుర్ని వెంటబెట్టుకొని మా ఇంటికి వచ్చారు. ఆరోజు పెద్ద వర్షం. అసలే వీరు ఎంతో దూర ప్రయాణం చేసి ప్రొద్దున్నే వచ్చారు. ఇద్దరికి 80 సంవత్సరాల వయస్సు ఉంటుంది. అంత వర్షంలో ఎందుకు వచ్చారమ్మా? అని అన్నాను. అప్పుడు ఆవిడ లేదండీ విశ్వపతిగారూ! మిమ్మల్ని ఎలాగైనా చూడాలని వచ్చాము అని అన్నారు. అప్పుడు నేను వారిని ఈ శ్రీవేంకటేశ్వర వ్రతకల్పం మీకు ఎలా వచ్చిందమ్మా అని అడిగాను.

దానికి ఆవిడ చిరునవ్వుతో ఇలా చెప్పారు. విశ్వపతిగారూ! నాకు రోజు స్నానం చేసి పూజ చేసుకుని శ్రీమద్భాగవతంలో కొన్ని పేజీలు చదవడం అలవాటు. ఇలా ప్రతి రోజు శ్రీమద్భాగవతంలో ఏవో నాలుగు పేజీలు చదువుతుంటాను. ఒకనాడు పూజ చేసుకుంటుండగా నాకు అనిపించింది. ద్వాపర యుగంలోని శ్రీకృష్ణులవారే కలియుగంలో శ్రీవేంకటేశ్వర స్వామి కదా! శ్రీవేంకటేశ్వర స్వామివారికి నిత్యం చదువుకునే ఏదైనా పూజా విధానం ఉంటే బాగుంటుంది కదా అని నా మనస్సుకి తోచింది. అప్పటినుంచి ఒక వారం రోజులపాటు ఆ శ్రీనివాసుని ఏదైనా నీ పూజా విధానం అనుగ్రహించు స్వామీ! అని వేడుకున్నాను. వారం పూర్తికాగానే యధావిధిగా ఆ రోజు ఉదయం పూజ చేసుకుని నా శ్రీమద్భాగవత పుస్తకం చదవడానికి చేతిలోకి తీసుకున్నాను. కొన్ని పేజీలు చదువుదామని పుస్తకాన్ని

తెరచిన నాకు ఆ పుస్తకం మధ్యలో శ్రీవేంకటేశ్వర వ్రతకల్పం పుస్తకం కనబడింది. నేను ఆశ్చర్యపోయాను. నా కళ్ళు ఆనందంతో చెమర్చాయి. మా ఇంట్లో ఉండేది మేమిద్దరమే. ఆ వారంరోజులు ఇంటికి ఎవ్వరం రాలేదు. మా పూజగదిలోకి మేమిద్దరం తప్ప మరొకరు రారు. మా వారిని పిలిచి ఈ పుస్తకం చూపించి మీరేమైనా ఈ పుస్తకం ఇక్కడ పెట్టారా? అని అడిగాను. అందుకు ఆయన అసలు ఆ పుస్తకం ఇప్పటిదాకా నేను చూడనేలేదు అని అన్నారు.

అప్పుడు నాకు అర్థమయ్యింది. పూజా విధానం కోసం నా ఆర్తి గ్రహించి సాక్షాత్తు శ్రీస్వామివారే ఈ శ్రీవేంకటేశ్వర వ్రతకల్పం నాకు అనుగ్రహించారని అర్థమయ్యింది. ఈ పుస్తకం ప్రతిరోజు నేను చదువుకుంటాను. ఎక్కడకి వెళ్ళినా నాతో పాటు తీసుకెళ్తాను. సాక్షాత్తు శ్రీనివాసుడే అనుగ్రహించిన ఈ పుస్తకం నాకు ప్రాణ ప్రదం. ఎప్పుడూ నా హేండ్‌బ్యాగ్‌లోనే ఉంచుకుంటాను. అని చెప్పి ఆవిడ హేండ్‌బ్యాగ్‌లోనుంచి శ్రీవేంకటేశ్వర వ్రత కల్పం పుస్తకం నాకు ఇచ్చారు. నేను కనులకు అద్దుకొని వారికి తిరిగి ఇచ్చాను. నేను రాసిన వ్రతకల్పం శ్రీస్వామివారికి ఇంత ప్రియమైనదిగా తెలుసుకొని నాకెంతో ఆనందం కలిగింది. ఈ జన్మకు ఇంతకుమించి ఏం కావాలి?

ఇటువంటిదే మరొక అద్భుత సంఘటన వివరిస్తాను....కొన్ని రోజుల క్రితం ఒకరోజు ఉదయం 10 గంటల సమయంలో కరీంనగర్ నుంచి పద్మజ అని ఒకావిడ ఫోన్ చేసారు. వారి మాటల్లోనే చదవండి. " విశ్వపతి గారూ! ఒక సంవత్సరంగా మీకు ఫోన్ చేద్దామనుకుంటున్నాను. కానీ పెద్దవారితో మాట్లాడొచ్చో లేదో అని తటపటాయించాను. కానీ మీకు రాసిన శ్రీవేంకటేశ్వర వ్రత కల్పం వలన ఎంతో లబ్ధి పొంది మీకు చెప్పకపోవడం భావ్యం కాదనిపించింది. మా వారు చిన్న ఉద్యోగం చేసుకుంటున్నారు. ఆర్థికంగా ఎన్నో కష్టాల్లో ఉన్నాము. పెళ్లయి ఆరేళ్ళయినా ఇంకా పిల్లలు లేరు. మా కులదైవం శ్రీవేంకటేశ్వర స్వామి వారు. రోజూ ఆ స్వామి వారికి నమస్కారం పెట్టుకొనేదాన్ని. ఇదంతా రెండు సంవత్సరాలు క్రిందటి మాట.

అలా కష్టాల్లో ఉంటూ స్వామి వారిని తల్చుకుంటూ ఉండేవాళ్ళము. మా తాతగారు ఇక్కడి ప్రాంతాల్లో పేరున్న జ్యోతిష్యులు. 2003 లో కాలం చేసారు. వారు ఎప్పుడో 1920 నుంచి సేకరించిన పంచాగాలన్నీ ఒక పాత రేకుపెట్టెలో ఉన్నాయి.

మాకెవ్వరికీ జ్యోతిష్యం రాకపోయినా ఎందుకో ఆ పాత పెట్టెని పారెయ్యబుద్ధికాలేదు. ఒక మూల అలా ఉండేది. తాతగారు మరణించిన తర్వాత ఆ పెట్టె జోలికి పోలేదు. ఆ పెట్టెపైన పాత బట్టల మూటలూ అవీ ఉంచేవాళ్ళం.

ఇలా ఉండగా ఒక రోజు మా ఇంటికి జగిత్యాల దగ్గర ఒక పల్లెటూరు నుంచి ఒక పెద్దాయన వచ్చారు. నుదుట శ్రీవైష్ణవ నామంతో ఎంతో తేజస్సుతో ఉన్నారు. వయస్సు ఎనభై పైనే ఉండొచ్చు అనిపించింది. నాతో ఇలా అన్నారు! అమా! మీ తాతగారు నాకెంతో ఆప్తులు. నాకిప్పుడు 82 ఏళ్ళు. 1935లో పుట్టాను. నాకు అప్పటి పంచాంగం పని పడింది. నా దగ్గర ఉన్నది ఎక్కడో పోయింది. మీ తాతగారి పెట్టె మీ దగ్గర ఉంటే కొంచెం ఆ పాత పంచాంగం చూసి ఇస్తారేమోనని వచ్చాను. కొన్ని వివరాలు చూసి ఇచ్చేస్తాను అన్నారు. అయ్యో దానిదేముంది స్వామీ, వారు 2003 లో కాలంచేసిన తర్వాత నేనెప్పుడూ వారి పెట్టె తెరవలేదు. లోపల పుస్తకాలు ఎలా ఉన్నాయో ఏమో చూస్తాను అని అన్నాను.

మెల్లగా ఆ పెట్టెపై ఉన్న బట్టలు మూటలు తీసి ప్రక్కన పెట్టాను. పెట్టెని దుమ్ము దులిపి తెరచి చూసాను... అన్నీ పాత పంచాంగాలే... అన్నీ వరుసగా ఉన్నాయి... కాసేపు వెతకగానే 1935వ పంచాంగం దొరికింది... అయితే ఆశ్చర్యంగా ఆ పంచాంగం క్రింద అంటే 1934 పంచాంగానికి, 1935 పంచాంగానికి మధ్య శ్రీ వేంకటేశ్వర వ్రతకల్పం అనే పుస్తకం కనబడింది. ఈ పుస్తకం ఇంతకుముందు ఎప్పుడూ చూడలేదే అని ఆశ్చర్యపోతూ కళ్ళకు అద్దుకొని తీసుకున్నాను. 1935వ సంవత్సరం పంచాంగం ఆ వచ్చినవారికి ఇచ్చాను... ఆయన ఒక పావుగంట అటూ ఇటూ తిరగేసి నాకు తిరిగి ఇచ్చి వెళ్లిపోయారు... తరువాత శ్రీవేంకటేశ్వర వ్రతకల్పం పుస్తకం వివరంగా చూసాను... విధానం చాలా తేలికగా ఉంది.

తాతగారికి ఎవరిచ్చారో ఏమో? ఏదైతేనేం? ఆ స్వామివారి వ్రతపుస్తకం దొరకడం నా అదృష్టంగా భావించాను. ఆరోజే వ్రతం చేయడం మొదలుపెట్టాను... ప్రతీ శనివారం తప్పకుండా చదివేదాన్ని... మూడు నెలలు చదవగానే ఎంతో ఫలితం కలిగింది. మా వారికి ఉద్యోగంలో జీతం పెరిగింది... నేను గర్భవతినయ్యాను... చక్కటి పిల్లవాడు పుట్టాడు... ఒకరోజు అసలు ఈ పుస్తకం ఎవరు రాసారా, ఎప్పటిదా అని చూసాను అంతే! నా ఒళ్లు జల్లుమంది! ఈ పుస్తకం ప్రథమ ముద్రణ 2005 అని

ఉంది! కాని మా తాతగారేమో 2003 లోనే కాలం చేసారు! వారి పెట్టె ఇన్ని సంవత్సరాలు ఎవ్వరూ తెరువలేదు! అప్పుడు అర్థమయ్యింది! ఆరోజు పంచాంగ కోసం వచ్చిన ఆ పెద్దాయన సాక్షాత్తు శ్రీనివాసుడే! పంచాంగం కోసం అడిగి నాకు ఆ పుస్తకం దొరికేలా చేశారు. ఆ పుస్తకం కూడా శ్రీస్వామివారే అనుగ్రహించారు. లేకపోతే 2005 లో రాసిన శ్రీవేంకటేశ్వర వ్రతకల్పం 2003లోనే ఆయనదగ్గర ఉండడమేమిటి? ఇది సాక్షాత్తు ఆ శ్రీనివాసుడే ప్రసాదించిన పుస్తకం. ఈ పుస్తకం నాకు ఎంతో అపురూపం... అందులో మీ ఫోన్ నెంబరు చూసాను... ఇన్నాళ్ళుగా ఆలోచించి ఇప్పుడు మీకు ఫోన్ చేస్తున్నాను... శ్రీనివాసునికి శతకోటి నమస్కారాలు... మిమ్మల్ని ఎప్పటికీ మర్చిపోను... ఉంటాను స్వామి... అని పద్మజగారు నాతో అన్నారు."

పద్మజగారు ఆ రోజు చెప్పిన ఈ విషయాలు విని నా శరీరం ఆనందంతో పులకించింది. సాక్షాత్తు శ్రీస్వామివారే ఈ పుస్తకాన్ని అనుగ్రహించారంటే ఆ స్వామికి శ్రీవేంకటేశ్వర వ్రతకల్పం ఎంత ఇష్టమో అర్థమయ్యింది. నా జన్మ తరించింది.

ఇలా నేను శ్రీవేంకటేశ్వర వ్రత కల్పమే కాకుండా, నేను రాసిన ప్రతీ పుస్తకం రాస్తున్నప్పుడు నాకెన్నో అనుభూతులు పొందాను. సాక్షాత్తు ఆయా దేవతలే ప్రత్యక్షమై నాకు ఆయా పుస్తకాలను అనుగ్రహించడం జరిగింది. అలాగే ప్రతీ పుస్తకం ఎందరి జీవితాలలోనో ఎంతో మంచి మార్పు తీసుకువచ్చింది. ఒకొక్కరికి ఒకొక్క దేవతపై నమ్మకం ఉంటుంది కదా! వారు నమ్ముకున్న దేవత పుస్తకం చదివినప్పుడు వారికి జరిగిన అనుభూతులు నాకు ఫోన్ చేసి చెప్తుంటారు. ఇలా ఈ పుస్తకాలన్నీ ఎందరో భక్తుల జీవితాలలో ఎంతో మంచి మార్పును తీసుకువచ్చి వీరందరు శుభప్రదంగా జీవిస్తున్నారు. ఇంతే కాక ఎందరో పీఠాధిపతులు, పంచాంగ కర్తలు సైతం వారి నిత్యానుష్ఠానంలో ఈ పుస్తకాలే చదువుతుంటామని చెప్పడం నాకెంతో సంతోషం కలుగజేస్తుంది.

నేను రాసిన శ్రీరామరక్షా వ్రతం పుస్తకం గురించి ఒక విశేషం... నేను ఏ పుస్తకం రాస్తున్నా కూడా అది అయ్యేంతవరకూ సాధారణంగా ఎవరికీ చెప్పను... నా భార్య రుక్మిణి కూడా నన్ను ఏమి రాస్తున్నారని ఎప్పుడూ అడగదు... నేను చెప్పే వరకూ అడగదు... అవి నేను శ్రీరామరక్షా వ్రతం రాస్తున్న రోజులు... అంత క్రితం సంవత్సరం నేను ఆనంద ఆంజనేయం అని హనుమంతుల వారి వ్రత పుస్తకం రాసాను. అది ఎందరికో నచ్చింది... ఒక రోజు వరంగల్ నుంచి ఒక ఆలయ

అర్చకులవారు ఫోన్ చేసి ఇలా అన్నారు... విశ్వపతి గారూ మీరు రాసిన హనుమంతుల వారి వ్రతం మా గురువుగారు తొంభై సంవత్సరాల మహానుభావులు చూడడం తటస్థించింది... వారు వచ్చే హనుమాన్ జయంతి రోజున 108 మందికి హనుమత్ మూల మంత్రం ఉపదేశిస్తానన్నారు. అయితే మంత్రం ఉపదేశించిన ప్రతీ ఒక్కరికీ మీ ఆనంద ఆంజనేయం ఇస్తారట... ఆ వ్రతం చేస్తున్న చోట సాక్షాత్తూ శ్రీహనుమంతుల వారే సూక్ష్మరూపంలో ఉంటారని మా గురువుగారు అంటున్నారు. కాస్త మాకు 108 పుస్తకాలు పంపించగలరా అని అన్నారు... ఇంతకు మించిన భాగ్యం ఏముంటుంది?... మీ గురువుగారికి నా నమస్కారాలు చెప్పండి అని చెప్పి దాదాపు 200 శ్రీ ఆనంద ఆంజనేయం పుస్తకాలు పంపాను.

ఇది జరిగి సంవత్సరం కావస్తోంది... ఈ రోజు కూర్చుని శ్రీరామరక్షా వ్రతం రాస్తున్నాను... ఇంతలో నా ఫోన్ మోగింది... అవతల నుంచి వరంగల్ అర్చకులవారు మాట్లాడుతున్నారు... అయ్యా విశ్వపతి గారూ నమస్కారం... మా గురువుగారు ఇప్పుడే ఫోన్ చేశారు... ఆనంద ఆంజనేయం రాసిన వారిని ఒక్క విషయం కనుక్కోండి... శ్రీరామరక్షా వ్రతం ఎంతవరకు వచ్చిందో... అందుకే మీకు ఫోన్ చేసాను అని అన్నారు. ఒక్క క్షణం నా నోట మాట రాలేదు... నేను శ్రీరామరక్షా వ్రతం రాస్తున్నట్లు నాకు తప్ప ఈ భూమండలం మీద ఎవ్వరికీ తెలియదు... ఆ మహానుభావునికి తెలిసింది... నేను తేరుకుని ఇలా అన్నాను... శ్రీరామరక్షా వ్రతమే రాస్తున్నానని ఆ మహానుభావుల వారికి చెప్పండి అని అన్నాను. అంతా శ్రీరాముల వారి అనుగ్రహం తప్ప మరొకటి కాదు... మన పుణ్యభూమిలో ఎంతటి మహానుభావులు ఉన్నారో చూసారా!.

అసలు శ్రీరామరక్షా వ్రతం రాయడమే ఒక అద్భుతం... ఒక నాటి మధ్యాహ్నం వేళ సాక్షాత్తూ శ్రీరామచంద్రుల వారూ, శ్రీహనుమంతుల వారూ దర్శనమిచ్చి అనుగ్రహించటంతో రాయగలిగాను... శ్రీ హనుమత్‌లక్ష్మణ సమేత శ్రీసీతారామచంద్ర అనుగ్రహ ప్రాప్తిరస్తు...

ఇలాగే నేను రాసిన మరొక పుస్తకం శ్రీలక్ష్మీనరసింహ వ్రతం. ఈ పుస్తకం కూడా ఎంతో మందికి అద్భుతాలు చేస్తున్నది. ఒకనాడు నాకు ఒకావిడ అపోలో హాస్పటల్ నుంచి ఫోన్ చేసారు... క్రిందటి నెలలో ఆవిడ భర్త విదేశాల నుంచి తిరిగివస్తూ హాంకాంగ్‌లో ఘోరమైన కారు ప్రమాదానికి లోనయ్యారు... ప్రమాద

తీవ్రతకు కాలర్‌బోన్ ఫ్రాక్చరై మెడవెనుక నరాలు చిట్లి పూర్తిగా పక్షవాతం వచ్చింది. ఈవిడ హాంకాంగ్ వెళ్ళి భర్తను విమానంలో మూడు సీట్లు బుక్ చేసుకొని హైదరాబాద్ తీసుకువచ్చారు. ఇక్కడ డాక్టర్లు ఆయన పరిస్థితి చాలా సీరియస్‌గా ఉందని ఆపరేషన్ చేయాలని, కాని ప్రస్తుత పరిస్థితులలో ఆపరేషన్ చేయడం కష్టమని అన్నారు... భార్య కన్నీళ్ళ పర్యంతం అయింది. భర్తని కేవలం 45 సం॥లు వయస్సువాడిని ఆ పరిస్థితులలో చూడలేకపోయింది... ఎవ్వరికి అటువంటి కష్టం రాకూడదు అనుకుంది...

ఇలా ఉండగా ఒకరోజు ప్రక్క బెడ్‌మీద ఉన్న పేషెంట్ ఒకరు నేను రాసిన శ్రీలక్ష్మీనరసింహ వ్రత పుస్తకం చదువుకుంటూ కనబడ్డారు. ఈవిడతో ఆమె అమ్మా! మీ వారి పరిస్థితి చూస్తుంటే ఎంతో బాధగా ఉంది. ఈ పుస్తకం ఎంతో మహిమగలది మీరు చదవండి. మీవారు తప్పక కోలుకుంటారు అని అన్నారు. నేను ఆవిడ దగ్గర తీసుకుని ఆ క్షణాన్నే చదివాను. అలా నాలుగు రోజులు మూడుపూటలా మా వారి బెడ్ ప్రక్కనే కూర్చొని వారికి శ్రీలక్ష్మీనరసింహ వ్రతంలోని కథలన్నీ చదివి వినిపించేదాన్ని విశ్వపతి గారూ! అయిదవరోజు ఉదయం డాక్టర్లు వచ్చారు అమ్మా! ఒక అద్భుతం... నిన్న మీవారికి MRI చేసాము కదా! ఆశ్చర్యంగా ఎన్నో మార్పులు కనబడ్డాయి ఇక ఆపరేషన్ కూడా అవసరం లేదు. ఒక వారంలో ఇంకా మార్పులు వస్తాయి అని అన్నారు. నా కళ్ళు నేను నమ్మలేకపోయాను. అంతా మీరు రాసిన శ్రీలక్ష్మీనరసింహ వ్రతం మహిమ.

ఆ తరువాత పదిరోజులకు ఇంటికి వచ్చాము విశ్వపతిగారూ! ఇప్పుడు చాలా కోలుకున్నారు. అంతా శ్రీలక్ష్మీనరసింహ స్వామివారి అనుగ్రహం. నేను కొన్ని రోజులలో మీ వద్దకు వచ్చి 200 కాపీలు తీసుకొని ఇక్కడ హాస్పటల్‌లో అందరికి ఇస్తాను. మిమ్మల్ని జీవితంలో మర్చిపోను అని అన్నారు. ఇలా నాకు ఎంతో మంది ఈ పుస్తకాలు చదవిన తరువాత వారి జీవితాలలో జరిగిన ఎన్నో అద్భుతాలు చెప్తుంటారు. ఎప్పుడైతే మనం నమ్మిన దేవతపై పూర్తి విశ్వాసం ఉంచి ఎంతో భక్తితో ఏ పుస్తకం చదివినా తప్పక ఫలితం ఉంటుంది. ఆ దేవత మనల్ని తప్పక అనుగ్రహించి, మన కష్టాలనుంచి మనల్ని బయట పడవేస్తారు.

ఒక 16 సం॥లు క్రితం నేను ఒకసారి ధ్యానంలోకి వెళ్ళినపుడు కొన్ని అద్భుత గ్రహమండలాలలోకి వెళ్ళాను. అక్కడ ఎందరో దివ్యపురుషులు అద్భుతమైన తేజస్సుతో ప్రకాశిస్తూ కనబడ్డారు. అప్పుడు నేను పూర్వ జన్మలలో ఎక్కడెక్కడ ఏ

రూపాలలో జన్మించానో అర్థమయింది. ఈ జన్మ ఎందుకు కలిగిందో ఈ జన్మలో చేయవలసిన పనులు తెలిసాయి. ఆ గ్రహమండలాలలో దివ్య పురుషులందరూ ఏ రూపం లేకుండా కేవలం ఎంతో తేజస్సుతో ప్రకాశిస్తున్న కాంతి బింబాలుగా మాత్రమే దర్శనమిస్తున్నారు. అక్కడ ఉన్నవన్నీ ఆ కాంతి బింబాలే !

అటుతరువాత ధ్యానంలో ఉన్నప్పుడు ఎన్నో సార్లు ఆ గ్రహమండలాలలోనికి వెళ్ళాను. వెళ్ళినప్పుడల్లా ఎన్నో అద్భుత విషయాలు తెలియసాగాయి. ఈ విశ్వం యొక్క రహస్యాలెన్నో తెలిసాయి. ఈ దేవతలు, మానవులు, పశుపక్ష్యాదులు, చెట్లు, చేమలు, ఇలా సమస్త సృష్టిలోని ప్రతి చలనం ఉన్నది, చలనం లేనిది అయిన వాటన్నింటి మూలకారణం తెలిసింది.

ఇప్పటిదాకా ఈ విధంగా ఇరవైనాలుగు మానవ జన్మలలో జన్మించానని గ్రహించాను. ఈ ఇరవైనాలుగు జన్మలలో నేను ఎక్కడెక్కడ జన్మించానో ఏ ఏ కార్యాలు చేసానో తెలిసింది. ఈ జన్మలలో ఈ భూమిపై వివిధ ప్రదేశాలలో జన్మించడం జరిగింది. ఒకొక్క జన్మలో కొన్ని కొన్ని ప్రత్యేక కార్యాలు చేస్తూ జీవించాను. ఆ విధంగా నాలుగు జన్మల క్రితం హిమాలయ పరిసర ప్రాంతాలలో నేను జన్మించి ఆ జన్మలో చాలా కాలం తపస్సు చేసాను. అప్పుడక్కడ ఒక పెద్ద ఆశ్రమం ఉండేది. ఆ ఆశ్రమానికి 108 మంది ఎంతో పూర్వ జన్మ పుణ్యఫలం చేత కొంతమంది ఎక్కడెక్కడో దూర ప్రదేశాలనుంచి చేరుతున్నారు. వీరందరు ఒక్కొక్కరు ఒక్కొక్క వయస్సులో ఆ ఆశ్రమానికి చాలా విచిత్రంగా చేరుకున్నారు.

ఆ జన్మలో నేనున్న హిమాలయాశ్రమం ఎంతో అద్భుతంగా ఉండేది. అక్కడ ప్రకృతి ఎంతో సౌందర్యంతో అలరారుతుండేది. మాటలలో వర్ణించ వీలులేనంత అందంగా ఉండేది. అక్కడకు చేరుకున్న 108 మందీ రోజూ సాధనలో ఉండేవారు. రాత్రి వేళ ఆకాశంలో దేవతలు తేజోస్వరూపాలతో దర్శనమిచ్చేవారు. అలాగే ఎందరో దేవతలు దివ్యరూపాలలో ఆ ఆశ్రమంలో తిరుగుతుండేవారు. ఎందరో మహర్షులు కూడా అప్పుడప్పుడు ఈ ఆశ్రమానికి వచ్చేవారు. ఇక్కడకి వచ్చిన ఆ 108 మంది ఎన్నో జన్మలలో ఎంతో పుణ్యం చేసుకున్నవారు. ఎంతో సంస్కారవంతమైన జీవితం గడిపిన వారు. ఆ ఆశ్రమం మధ్యలో అద్భుతమైన కొలను ఉండేది. అందులో హంసలు విహరిస్తుండేవి. ఆశ్రమంలోని చెట్లపై ఎన్నో జాతుల పక్షులు చెవులకు ఇంపైన రకరకాల కూతలు కూస్తుండేవి.

వీరిలో చాలామంది భారతదేశంలోని నలుమూలల నుండి కొంతకాలం సామాన్య జీవితం సాగించి తరువాత వారి వారి పూర్వజన్మ పుణ్యఫలం చేత ఈ ఆశ్రమానికి చేరుకోవడం జరిగింది. ఆ ఆశ్రమం కూడా హిమాలయాలలో చాలా లోపల ఉండి సామాన్య మానవులు రావడానికి ఎంతో కష్టతరంగా ఉండేది. అక్కడికి నిత్యం అనేకమంది సిద్ధులు, యోగులు తమ దివ్య శరీరాలతో వచ్చి వెళుతుండేవారు. అందువలన ఆ ఆశ్రమం అంతా ఎప్పుడూ ఎంతో ప్రశాంతమైన వాతావరణంతో నిండి ఉండేది.

ఇక్కడకు చేరుకున్నవారందరు ఇక్కడ ఉన్నంతకాలం దైవాన్ని తెలుసుకొనడానికి ప్రయత్నిస్తూ ఎంతో ధార్మిక జీవితం గడిపారు. కొంతమంది అక్కడ ఉన్నంతకాలం పూర్తి మౌన జీవితం గడిపారు. ఇలా వచ్చినవారు కొందరు ఈ ఆశ్రమంలో పది సంవత్సరాలు, కొందరు ఇరవై సంవత్సరాలు, కొందరు నలభై సంవత్సరాలు, కొందరు అరవై సంవత్సరాలు ఆ ఆశ్రమంలో గడిపారు. అయితే వీరందరు అంతకుముందు కొన్ని వేల జన్మలలో జన్మించి అతి సామాన్య జీవితం జీవించి అనేక పుణ్య, పాపకార్యాలు చేయడం వలన ఇంకా కొన్ని జన్మలలో పుట్టవలసి వుంది. అయితే ఈ హిమాలయ ప్రాంతంలో ఉన్న సమయంలో వీరికి కలిగిన దేవతానుగ్రహం వలన, మహాపురుషుల దర్శనం వలన ఇకముందు వీరికి ఎక్కువ జన్మలు ఉండవు.

వీరు అనేక జన్మలలో చేసిన ప్రారబ్ధకర్మ ఇంకా కొద్ది జన్మలలోనే తీరిపోనుంది. అందుకే వీరిలో చాలామంది ప్రస్తుత జన్మలో అనేక కష్టాలకు లోనవుతున్నారు. ఇంకా ముందు జన్మలలో కూడా వీరు అనేక కష్టాలను అనుభవించవలసి వస్తుంది. అయితే వీరిలో చాలా మందికి ఎక్కువ జన్మలు ఉండవు. కొన్ని జన్మలకే జన్మరాహిత్యం కలుగుతుంది. అప్పటి ఆ 108 మంది తిరిగి ఈ జన్మలో నన్ను రకరకాల పరిస్థితులలో రకరకాల సమయాలలో కలుసుకుంటున్నారు. కొందరు నా తల్లిదండ్రులుగా, అత్తమామలుగా, నా అన్నదమ్ములుగా, భార్య పిల్లలుగా జన్మిస్తే మరికొందరు ఏ బంధం లేకుండా భారత దేశంలోని ఎక్కడో దూర ప్రదేశాలలోను, విదేశాలలోను, వివిధ మతాలలో, వివిధ కులాలలో, పురుషులగాను, స్త్రీలుగాను జన్మించి తిరిగి నన్ను కలుసుకుంటున్నారు. ఇలా ఈ జన్మలో అప్పటి హిమాలయపు ఆశ్రమంలో ఉన్న 108 మంది తిరిగి నన్ను కలుసుకుంటారు.

ఎంతో అద్భుతమైన దివ్య జ్ఞాన సంపన్నులు, అద్భుత శక్తి సంపన్నులు భారతదేశంలో హిమాలయ పర్వత ప్రాంతాలలో కొన్ని లక్షల సంవత్సరాలుగా ఉన్నారు. అక్కడ అనేక దివ్య ఆశ్రమాలు ఉన్నాయి. ఎన్నో గొప్ప గుహలు కూడా ఉన్నాయి. ఆ గుహలలో ఎన్నో వేల సంవత్సరాలుగా తపస్సు చేసుకుంటున్న మహాపురుషులు ఉన్నారు. ఇవి దర్శించడం సామాన్య మానవులకు దాదాపు దుర్లభం అనే చెప్పాలి. ఈ ఆశ్రమాలలో కొన్ని వేల సంవత్సరాలుగా తపస్సు చేస్తున్న అనేక మంది మహర్షులు ఉన్నారు. అలా అక్కడ ఉన్న అనేక ఆశ్రమాలలో సిద్ధులు, యోగులు కూడా ఉన్నారు. వీరు కేవలం లోక కళ్యాణం కోసం వేల సంవత్సరాలుగా తపస్సు చేస్తున్నారు. వీరు అప్పుడప్పుడు భారతదేశంలోని మహాపుణ్యక్షేత్రాలకు, ఇతర దేశాలలోని పవిత్ర ప్రదేశాలకు తమ దివ్య శరీరాలతో వెళ్ళి వస్తుంటారు. వీరిలో కొందరు అప్పుడప్పుడు కొన్ని ప్రత్యేక కార్యాలు నిర్వర్తించటం కోసం మానవజన్మ ఎత్తుతారు. ఇటువంటి వారు ప్రస్తుతకాలంలో కూడా ఈ భూమిపై అక్కడక్కడ నివసిస్తున్నారు.

మేమందరం నిత్యం ఒకరితో ఒకరు అనుసంధానమై ఉంటాము. ఒకరితో ఒకరు ఎప్పుడూ సంభాషిస్తూ ఉంటాము. అయితే ఈ సంభాషణ ఏ పరికరానికి అందని దివ్య తరంగాల ద్వారా జరుగుతుంది. మా అందరికి ఒకరినుంచి ఒకరికి సందేశాలు వస్తుంటాయి. వీరిలో కొందరు బయట ప్రపంచానికి తెలిసిన పీఠాధిపతులు, గొప్ప ప్రవచనకారులు ఉన్నారు. అయితే వీరి చుట్టూ ఉన్న చాలామందికి వీరు కేవలం పీఠాధిపతులుగానో, గొప్ప ప్రవచనకారులుగానో తెలుసు తప్ప వీరికి ఇంతశక్తి ఉన్నదని, వారు వేరే గ్రహమండలాలనుంచి వచ్చినవారని, కొన్ని పుణ్యకార్యాల నిమిత్తం ఈ భూమిమీద జన్మించారని తెలియదు.

నేను ఇప్పటిదాకా జన్మించిన 24 జన్మలలో ఒక జన్మలో కాశీవిశ్వేశ్వర ఆలయంలో సన్నాయి వాద్యకారుడిగాను, మరొక జన్మలో మధురలో శ్రీకృష్ణ తత్వాన్ని ప్రజలకు చెప్పిన ఒక గురువుగాను, మరొక జన్మలో శ్రీవైష్ణవ తత్వాన్ని దక్షిణభారతంలో వ్యాపింపచేసిన ఆచార్యులు గాను, మరొక జన్మలో శ్రీపరమేశ్వర తత్వాన్ని ఎంతో తేలికభాషలో ప్రపంచానికి అందించిన ఆచార్యుడిగాను, మరొక జన్మలో కర్ణాటక రాష్ట్రంలో ఒక పీఠాధిపతిగాను జన్మించినట్లు గ్రహించాను. ఇలా గత 24 జన్మలలో నేనెక్కడెక్కడ జన్మించింది, ఎన్ని సంవత్సరాలు జీవించింది, ఎక్కెడెక్కడ తిరిగింది, ఏఏ పనులు చేసింది అన్నీ అర్థమయ్యాయి. అలాగే ఆ

జన్మలలో నన్ను కలుసుకున్న వారిలో చాలామంది ఈ జన్మలో తిరిగి నన్ను కలుసుకోవడం గ్రహిస్తున్నాను.

ప్రతీ వ్యక్తి ఈ సృష్టి మొదటినుంచి రకరకాల జన్మలలో జన్మిస్తూ వస్తున్నారు. అయితే మరణించిన ప్రతీ వ్యక్తి వెంటనే మరొక జన్మ తీసుకుంటారని ఎక్కడా లేదు. వారి వారి కర్మఫలాన్ని బట్టి  కొంతకాలం తరువాత వేరే దేహంతో జన్మించడం జరుగుతుంది. ఇలా ప్రతీ జీవి కొన్ని లక్షల జన్మలలో జీవిస్తూ ఎన్నో పుణ్య, పాప కర్మలను చేస్తూ ఆ కర్మఫలాన్ని అనుభవించడానికే తిరిగి తిరిగి జన్మిస్తూ ఈ జనన మరణ చక్రంలో పడి కొట్టుకుంటాడు.

మరో విశేషమేమిటంటే కొన్ని జన్మలలో పాపాలు చేసిన మానవులు, తరువాత కొన్ని జన్మలు పశు పక్ష్యాదులుగా జన్మించి అనేక కష్టాలు పడి, ఆ ప్రారబ్ధకర్మ కొంతమటుకు ఆ విధంగా తిరిన తరువాత తిరిగి మానవులుగా జన్మిస్తారు. ఇలా నా వద్దకు వచ్చిన కొందరు వారి పూర్వజన్మలలో జంతువులుగాను, పక్షులుగాను జన్మించి వారి ప్రారబ్ధకర్మ కొంత అనుభవించి ఈ జన్మలో తిరిగి మానవులుగా జన్మించినవారిని నేను చూసాను. మానవ జన్మలో మనం చేసిన పాపాలు మానవదేహంతోనే పుట్టి మాత్రమే కాక, పశువులుగాను, పక్షులుగాను, జలచరాలుగాను, క్రిమికీటకాదులుగాను కూడా జన్మించి కర్మఫలం అనుభవించవలసివస్తుంది. అందుకే ఒకొక్కసారి ఇటువంటి జీవులు వాటి పూర్వజన్మ వాసనలు వాటి ఆత్మను పట్టుకుని తాము పూర్వజన్మలో నివశించిన ప్రదేశం దగ్గరే తిరగడం చూస్తుంటాము.

అయితే కొందరు మహాపురుషులు మాత్రం ఎప్పుడూ ఈ సృష్టికి మూలకారణమైన దివ్యశక్తిలో లీనమైఉండి కొన్ని వేల సంత్సరాలకో, కొన్ని వందల సంవత్సరాలకో ఈ భూమిపై మానవ రూపంలో అవతరించి తాము నిర్దేశించుకున్న కార్యం పూర్తిచేసి తిరిగి ఆ మహాశక్తిలోనికి వెళ్ళిపోతారు. మళ్ళీ ఎన్నో వందల సంవత్సరాలకో భూమిమీద ఏదో ప్రత్యేక కార్యక్రమం నిర్వర్తించడానికి జన్మిస్తారు. మనకు తెలిసిన ఎందరో మహాపురుషులు ఇటువంటి వారే! ఆ దివ్యశక్తిలో లీనమైఉంటూ కొన్ని వందల సంవత్సరాలకు ఒకసారి ఈ భూమిపై ఏదో ప్రదేశంలో ఏదో కుటుంబంలో జన్మించి ఈ మానవాళికి ఉపయోగపడే కార్యాలను చేసి తిరిగి ఆ దివ్యశక్తిలోనికి వెళ్ళిపోతారు.

నేను గత జన్మలలో అనేక ప్రదేశాలలో జన్మించినప్పుడు నన్ను ఎందరో కలిసారు. నాలుగు జన్మల క్రితం నేను హిమాలయాశ్రమంలో ఉన్నప్పుడు నన్ను కలిసిన 108 మందే కాక ఇంకా నన్ను మిగిలిన జన్మలలో కలుసుకున్నవారు కూడా కొందరు ఈ జన్మలో నన్ను తిరిగి కలిసారు. వీరిలో కొందరు ఇప్పటికే ఎన్నో ఉత్తమజన్మలలో జన్మించి, రాబోయే జన్మలలో ఎంతో గొప్పవారిగా జన్మిస్తారు. లోకకళ్యాణార్థం గొప్ప పనులు చేస్తారు. ముందు చెప్పినట్లుగా నేను నాలుగు జన్మల క్రితం హిమాలయాశ్రమంలో ఉన్నప్పుడు కలిసిన 108 మంది ఈ జన్మలో తిరిగి నన్ను కలుస్తున్నారు.

వీరందరూ కూడా ఈ జన్మలో ఎక్కెడెక్కడో జన్మించి తిరిగి నన్ను కలుస్తున్నారు. ఇలా నన్ను పూర్వజన్మల బంధంతో తిరిగి ఈ జన్మలో కలిసినవారు కొందరు కుటుంబ సభ్యులుగాను, కొందరు బంధువులుగాను, కొందరు చిన్ననాటి స్నేహితులుగాను, మరికొందరు కాలేజీ స్నేహితులుగాను, కొందరు ఉద్యోగంలో తోటి ఉద్యోగులుగాను, మరికొందరు నా వద్దకు సలహాలకోసం వచ్చేవారిగాను, మరికొందరు ఏ ప్రత్యేక కారణం లేకుండా నన్ను కలుస్తున్నవారిగాను గ్రహించాను.

అయితే వీరందరూ ఈ జన్మలో నన్ను కలిసే తీరు, నావద్దకు వచ్చే తీరు అద్భుతంగా ఉంటుంది. వీరందరు ఇప్పటిదాకా ఎక్కడెక్కడో రకరకాల జీవితాలు గడుపుతూ ఈ జన్మలో నన్ను కలవవలసిన సమయం రాగానే అద్భుత రీతిలో కలుస్తున్నారు. ప్రతి మనిషి జీవితంలో అతడిని కలిసే వారందరు కూడా ఇలా ఏదో పూర్వజన్మ బంధం ఉండడం వలననే కలవడం జరుగుతుంది. సామాన్య మానవులకు ఈ పూర్వజన్మ బంధాలు అర్థం చేసుకొనడం కష్టం. ధ్యానంలో ఉన్నత స్థితికి చేరుకున్నప్పుడు ఈ 108 మంది ఎవరన్న విషయం నాకు తెలియడం చేత ఇప్పుడు వివరంగా మీ అందరికి చెప్తున్నాను. అలా ధ్యానంలో ఉన్నప్పుడు వీరందరు ఇంతకు ముందు ఏ జన్మలలో ఎక్కడ ఉన్నారు? ఎలా జీవించారు? ప్రస్తుత జన్మ వీరికి ఎలా గడుస్తున్నది? ఇంకా ఎన్ని జన్మలు ఉన్నాయి? ఆ జన్మలలో వీరు ఎక్కడెక్కడ జన్మించబోతున్నారు? ఇటువంటి విశేషాలెన్నో నా కంటి ముందు గోచరించాయి.

నేను ఒక జన్మలో ఉత్తరప్రదేశ్‌లో జన్మించినపుడు ఒక రోజు ఇంటి బయట ఆడుకొంటుండగా ఒక సాధువు కనిపించాడు. అతను ఎంతో తేజస్సుతో

ప్రకాశిస్తున్నాడు. అంతే! ఒక్కసారిగా నేను ఆ జన్మలో చేయవలసినవన్నీ గుర్తువచ్చాయి. ఆ సాధువు వెంట వెళ్ళిపోయాను. ఆ సాధువు నన్ను అలా కొన్ని రోజులు నడిపించి ఒకనాటి రాత్రి ఒక అరణ్యంలో చెట్టుక్రింద ఇద్దరం పడుకున్నాం. ఆశ్చర్యం ఏమిటంటే ఆ సాధువు నాతో అస్సలు ఏమీ మాట్లాడలేదు. కాని అతని నుండి కొన్ని దివ్యతరంగాలు నాలో ప్రవేశించి నా కర్తవ్యాన్ని గుర్తుచేశాయి. అక్కడితో మా ఇద్దరికి ముందు చేయవలసిన మహత్కార్యాలు అర్థమయ్యాయి. అంతే! ఆ సాధువుతో కలసి ప్రయాణం చేశాను. ఏ ఆహారము తీసుకోకుండా కొన్ని రోజులు అలా ప్రయాణించాము. అప్పుడప్పుడు దారి ప్రక్కన ఉండే కొలనులలో నీరు త్రాగేవాళ్ళము. ఇంతకుముందు చెప్పినట్టుగా మేమిద్దరం ఒకరితో ఒకరు ఒక్క మాట కూడా మాట్లాడుకోలేదు. కాని మా ఇద్దరి ఆత్మలు ఒకటితో ఒకటి పూర్తి అనుసంధానమై ఉన్నాయి. ఇంకా నోటితో మాట్లాడవలసిన పని ఏముంది ?

ఇలా ఇద్దరం కలిసి అరణ్యాలగుండా ప్రయాణం చేసి ఒకనాటి రాత్రి ఒక పెద్ద చెట్టు క్రింద పడుకున్నాం. మా చుట్టూ ఎన్నో క్రూర జంతువులు తిరుగుతున్నాయి. మా ప్రక్కనుంచే పులులు, సింహాలు వెళ్ళాయి. ఏనుగుల మంద వెళ్ళింది. పెద్ద పెద్ద త్రాచుపాములు ప్రాకుతూ వెళ్ళాయి. కాని ఏ ఒక్కటి మమ్మల్ని ఏమీ చేయలేదు. ఎందుకంటే మేము అసలు వాటికి కనిపించలేదు. మేము అక్కడ ఉన్నట్లే వాటికి తెలియలేదు. హిమాలయ ప్రాంతాలలో అనేక అరణ్యాలలో తపస్సు చేసుకుంటున్న మహానుభావులు ఉన్నచోట ఏ జంతువులకు ఈ మహర్షులు ఎవ్వరూ కూడా కనబడరు.

ఆ రాత్రి అక్కడ పడుకొన్న నేను నిద్ర లేచే సరికి హిమాలయ ప్రాంతాలలో ఉన్నాను. చుట్టూ హిమంతో నిండిఉన్న పర్వతాలు, బ్రహ్మాండమైన ప్రకృతి, ఎంతో ప్రశాంత వాతావరణం. నాతో అప్పటిదాకా ఉన్న సాధువు మాయమయ్యాడు. ఇదే నిర్దేశించబడింది కూడా! ఆ సాధువు కూడా వేరే గ్రహమండలం నుంచి భూమిపైకి వచ్చిన ఒక దివ్యశక్తి. ఆ శక్తి నన్ను ఇక్కడికి చేర్చి తను మరోచోటికి వెళ్ళిపోయాడు.

అయితే ఆ దివ్యపురుషుడితో నేను ఇప్పటికి అనుసంధానింపబడే ఉన్నాను. ఇలా మేమిద్దరమే కాదు... ఎన్నో దివ్యశక్తులు రకరకాల కాలాలలో ఉన్నప్పటికి నిత్యం ఒకరి ఆత్మ మరొకరి ఆత్మతో అనుసంధానింపబడి ఉంటుంది. ఈ దివ్యశక్తులన్నీ నిత్యం ఈ సృష్టి మొత్తానికి, తమలోని శక్తికి కారణభూతమైన మహాశక్తితో అనుసంధానింపబడి నిత్యం ఆనందంలో ఉంటాయి.

అరుణాచలంలోని శ్రీ రమణ మహర్షి నిత్యం ఆనందంగా ఉండడానికి కారణం ఇదే! వారి శరీరానికి ఎంతో తీవ్ర అనారోగ్యం కలిగినాకూడా వారెప్పుడూ వారి భౌతిక శరీరం గురించి ఆలోచించక ఎప్పుడూ ఆనందంగా ఉండేవారు. వారు అప్పుడు హిమాలయాలలో ఉన్న సిద్ధులతోను, ఈ భూమిపై అనేక రూపాలలో జన్మించిన దివ్యశక్తులతోను నిత్యం అనుసంధానింపబడి ఉండేవారు. వారు అంత శక్తిమంతులు కాబట్టే వారి వద్ద ఉన్నప్పుడు మానవులకు, జంతువులకు ఎంతో ఆనందం కలిగేది. ఇటువంటి మహాపురుషుల యొక్క దివ్య ఆత్మ యొక్క అద్భుత తరంగాలు చుట్టూ వ్యాపింపబడి ఉండి ఉండటం వలన వారి వద్ద ఉన్నవారికి ఎంతో ఆనందంగా ఉంటుంది. వారి కష్టాలన్నీ వారు మర్చిపోతారు.

వారి సమీపంలో కొన్ని రోజులు గడిపిన వారికి జీవితంలో ఎంతో మార్పువస్తుంది. ఎటువంటి కష్టాలైన ఎదుర్కొనే శక్తి కలుగుతుంది. ఎన్నో అద్భుత విషయాలు వీరికి తెలుస్తాయి. కష్టసుఖాలను సమానంగా స్వీకరించగలిగే శక్తి వస్తుంది. అసలు మనకు ఎన్నో జన్మల పుణ్య ఫలం ఉంటే గాని ఇటువంటి మహానుభావుల వద్దకు వెళ్ళలేము.

అటువంటి మహాపురుషులు ఏ ప్రదేశంలో ఉంటారో ఆ ప్రదేశమంతా ఎంతో శక్తివంతంగా ఉంటుంది. ఆ దివ్యాత్మలు తమ భౌతిక శరీరాలు విడిచిపెట్టి కొన్ని వేల సంవత్సరాలైనా ఆ గొప్ప ఆత్మ సంచరించిన ప్రదేశం కాబట్టి అక్కడ ఇప్పటికి ఎంతో ఆనందం తాండవిస్తుంటుంది. అక్కడకి వచ్చినవారికి మనసంతా ఎంతో ప్రశాంతంగా అనిపిస్తుంది. సాధకులకు అక్కడ ధ్యానం చేస్తే ఇప్పటికి ధ్యానంలో ఆ మహనీయుల దర్శన భాగ్యం లభిస్తుంది.

ఇక మళ్ళీ హిమాలయ ఆశ్రమ విషయానికి వద్దాం. అక్కడకు చేరిన నేను తపస్సు చేసుకోసాగాను. అలా నిద్రాహారాలు లేకుండా 8 సం॥లు తపస్సు చేశాను. తపస్సు అంటే ఏకాగ్రతతో ఒకే ఆసనం మీద కూర్చొని పగలు, రాత్రి కదలక కాలంతో సంబంధం లేకుండా కేవలం ఈ సృష్టి మొత్తానికి కారణభూతమైన దివ్యశక్తితో అనుంధానింపబడి ఉండడం. అలా 8 సం॥లు గడిపాను. అప్పటికి నా వయస్సు 16 సం॥లు. ఒకనాడు కనులు తెరచి ఇక ఆ జన్మలో చేయవలసిన పనులు గురించి ఆలోచించాను. అంతా అర్థమయ్యింది... మానవులకు జీవిత పరమార్థం చెప్పాలి అయితే ఈ జీవిత పరమార్థం ఎందరికి అర్థమవుతుంది? ఎవరికి అది ప్రాప్తమో వారే నా వద్దకు వస్తారు. అనేక వేల జన్మలలో జన్మించి గత కొన్ని

జన్మలనుంచి ఉత్తమ సంస్కారంతో జీవించిన 108 మంది ఆ జన్మలో నా ఆశ్రమానికి వస్తారని అర్థమయ్యింది. ఒక వ్యక్తికి ఎన్నో జన్మల తర్వాతగాని ఎంతో గట్టి ప్రయత్నంతో గాని ఉత్తమ సంస్కారం అలవాటు పడదు. అనేక జన్మల ప్రయత్నం ద్వారానే అది సాధ్యమౌతుంది.

ప్రతి మనిషి తమ జీవితంలో ఎన్నో కష్టాలు పడుతుంటాడు. ఆ కష్టాల ఉపశమనం కోసం ఏ దైవాన్నో, ఏ గురువునో ఆశ్రయిస్తాడు. అతడి ప్రారబ్ధ కర్మ ప్రకారం అతడికి కొంచెం ఉపశమనం కలుగుతుంది. అయితే అతడు అక్కడితో తృప్తి పడి వెళ్ళిపోతాడు. అంతే తప్ప ఆధ్యాత్మికతలో మరింత ముందుకి వెళ్ళడానికి ప్రయత్నించడు. తన సమస్య తీరింది చాలు అని తలుస్తాడు.

అలా కొన్ని వేల జన్మల తరువాత అతడికి కేవలం కష్టసమయాలలోనే కాకుండా అన్నివేళలా భగవంతుని ఆశ్రయించాలనే కోరిక కలుగుతుంది. అలా కొన్ని జన్మలు గట్టి సంకల్పంతో ఆ పురుషోత్తమునే ఆశ్రయించే వారికి జన్మజన్మల బంధం తొలగిపోతుంది. ఇలా ఎన్నో ఉత్తమ జన్మలలో జన్మించిన తరువాత వారికి జన్మరాహిత్యం కలుగుతుంది. వీరు అప్పుడు ఆ పరబ్రహ్మమూర్తిలో ఐక్యమవుతారు.

ఇలా ఎన్నో జన్మల తరువాత ఎంతో సంస్కారం లభించి, సాధనలో ఇంకా ముందుకు వెళ్ళాలనేఉద్దేశంతో, ఈ సృష్టి రహస్యాలు తెలుసుకోవాలనే ఆసక్తితో కొందరు నేనున్న హిమాలయ దివ్యాశ్రమానికి చేరుకున్నారు. వీరందరు ఒకొక్కళ్ళుగా ఒకొక్క ప్రాంతం నుంచి ఆ దివ్యాశ్రమానికి వచ్చేవారు. వారందరికి ఈ ఆశ్రమం ఉన్నదన్న విషయం తెలియదు. హిమాలయాలలో గొప్ప యోగులు, సిద్ధులు ఉన్నారని మాత్రమే విని ఉన్నారు. అలాగే హిమాలయాలలో సామాన్య మానవులు దర్శించడానికి వీలుకాని సిద్ధాశ్రమం ఉందని అందరికి తెలుసు. అయితే ఇంకా కొన్ని ఆశ్రమాలు కూడా ఉన్నాయని చాలా మందికి తెలియదు.

నేనున్న దివ్యాశ్రమం ఎంతో శక్తితో కూడినదై ఉండేది. అక్కడ అద్భుతమైన దివ్య తరంగాలు ప్రసరిస్తూ ఉండేవి. ఈ ఆశ్రమానికి వచ్చిన ప్రతి ఒక్కరు కూడా ఎన్నో జన్మలలో అనేక కష్టాలు పడి ఎన్నో జన్మలు భగవంతుడి గురించి తెలుసుకొందామని ప్రయత్నించి, అన్ని వేల జన్మల జిజ్ఞాస సాధన ఫలితంగా ఈ రోజు ఇక్కడకి చేరుకోగలిగారు. వీరిలో కొంతమంది కొన్ని వందల జన్మలనుంచి మరికొంతమంది కొన్ని వేల జన్మలనుంచి భగవంతుని దర్శనం కోసం సాధన చేస్తున్నారు.

ఇలా ఒక్కొక్క ఆత్మ అనేక రూపాలు ధరిస్తూ ఒక్కొక్క జన్మలో ఒక్కొక్క జీవిగా జన్మిస్తూ, ఆధ్యాత్మిక పరిణతి చెందుతూ చివరకు ఇక జన్మరాహిత్యానికి దగ్గరయ్యే సరికి నా ఆశ్రమానికి చేరుకున్నారు. అక్కడకు వచ్చిన ప్రతి ఒక్కరిలోను నాకిది స్పష్టంగా కనబడింది. ఇక వీరందరికి ఎక్కువ జన్మలు ఉండవని అర్థమయ్యింది. కొందరికి 5, మరికొందరికి 10, మరికొందరికి 40, మరికొందరికి 50... అంతే తప్ప వీరెవ్వరికి ఇక వేల వేల జన్మలు ఉండవు. ఆ జన్మలో ఆ హిమాలయ ప్రాంతంలో నేన్ను దివ్యాశ్రమంలో నా వద్దకు వచ్చిన 108 మంది ఇంక త్వరలోనే ఆ మహాశక్తితో లీనమైపోయే సమయం వచ్చింది.

అయితే వీరందరు ప్రస్తుత జన్మలో సామాన్యజీవితం గడుపుతున్నారు. ఈర్ష్య, అసూయ, కామ, క్రోద లోభాలతో సాధారణ జీవితం గడుపుతున్న వీరు తమకు ఇంకా కొన్ని జన్మలలోనే జన్మరాహిత్యం కలుగనున్నదంటే నమ్మకపోవచ్చును. ప్రస్తుత జన్మలో వీరి జీవితాలు గడుస్తున్న తీరునుబట్టి వీరికి ఇది ఏమాత్రం నమ్మశక్యం కానిదిగా అనిపించవచ్చును. కాని ఇది ముమ్మాటికి నిజం. వీరు వచ్చే జన్మలలో ఎంతో ఉన్నత సంస్కారాలతో జీవిస్తారు. స్థితప్రజ్ఞులుగా జీవించి కొన్ని జన్మల తరువాత తప్పక జన్మరాహిత్యం పొందుతారు.

ఈ సృష్టి అనాదిగా 84 లక్షల జీవరాశులు జన్మించి ఒక జన్మ తరువాత మరో జన్మ ఎత్తుతూ ఎన్నో బిలియన్ల జీవులుగా ఇప్పటికి జన్మించడం, మరణించడం జరిగింది. ఇలా అనేక జన్మలెత్తుతున్నప్పుడు వీరందరికి అనేకమంది వ్యక్తులతో సంబంధ బాంధవ్యాలు ఏర్పడతాయి. ఎన్నో పరిచయాలు కలుగుతాయి. వీటిలో కొన్ని ఋణానుబంధాలుగా మారి తరువాత ఎన్నో జన్మల దాకా విడిపోకుండా ఉంటాయి. ఇలా ఎంతో మందికి ఎన్నో అనుభవాలు జరుగుతుంటాయి. నాకు జరిగిన నా అనుభవాలు ఇక్కడ రాస్తున్నాను. ఇంతకంటే ఎంతో అద్భుతమైన అనుభవాలు జరుగుతున్న, ఎంతో గొప్ప మహనీయులు ప్రస్తుత కాలంలో కూడా ఉన్నారు. ప్రతి మనిషి జీవితంలోను పూర్వజన్మ వాసనలు తప్పక ఉంటూ ఆ మనిషికి తెలియకుండా గత జన్మలలో కలిసిన వారిని మరల కొందరిని వేరే ప్రదేశాలలో కలవడం, ఋణాలు తీర్చుకొనడం జరుగుతుంది.

అయితే ఇవన్నీ మన ఈ భౌతిక స్థితికి, మన మనస్సుకు అర్థం కావు. కాని లోపల ఉన్న ఆత్మకి తెలుస్తుంది. ఒక వ్యక్తి మరణించినప్పటికి, అతని ఆత్మ తరువాత

జన్మలో వేరే రూపం తీసుకున్నప్పుడు ఆ జీవి అంతకు ముందు జన్మకి సంబంధించిన విశేషాలన్నీ మరచిపోతాడు. కాని ఆత్మకి మాత్రం ఆ విషయాలన్నీ గుర్తుంటాయి. మన అంతరాత్మ ప్రతి క్షణం మనకి ఎన్నో విషయాలు చెప్పడానికి ప్రయత్నిస్తుంటుంది. కాని మన మనస్సు ఆ విషయాలు అర్థం చేసుకోదు. అస్సలు వినదు. ఇంకా చెప్పాలంటే చాలా మందికి వారి ఆత్మ వారికి ఇస్తున్న సందేశాలు తెలియవుకూడా. ఎవరో కొద్దిమంది మాత్రమే ఆ సందేశాలు గ్రహించగలుగుతారు. ఆ కొద్దిమందిలో తిరిగి అతి కొద్ది మంది మాత్రమే ఆ ఆత్మ చెప్పినవి అనుసరిస్తారు. ఆ విధంగా నిత్యజీవితంలో నడుచుకుంటారు. వారే ఈ ప్రపంచంలో మహానుభావులుగా స్తుతించబడుతున్నారు.

నేను హిమాలయ ప్రాంతాలలో ఆ దివ్యాశ్రమంలో ఉన్నప్పుడు నన్ను కలిసిన 108 మంది ఒక్కొక్కరు ఎక్కడెక్కడినుంచే ఈ ఆశ్రమానికి రావడం జరిగింది. వీరందరు ఈ ఆశ్రమానికి వచ్చిన రీతులు ఎంతో ఆశ్చర్యకరంగా ఉంటాయి. ఒకనాడు కిషన్ యాదవ్ అనే పేరుగల దాదాపు నలభై సంవత్సరాలు వయస్సు గల వ్యక్తి దివ్యాశ్రమానికి వచ్చాడు. అతడు ఆ జన్మలో ఇప్పటి ఉత్తర ప్రదేశ్‌లోని లక్నో దగ్గర గ్రామంలో జన్మించాడు. అతడికి చిన్నప్పటినుంచి ఎంతో దైవ భక్తి అలవడింది. తండ్రి నుంచి వంశపారంపర్యంగా వచ్చిన వ్యాపారాలు చూసుకునేవాడు. కిషన్‌కు నలుగురు అన్నదమ్ములు ఉండేవారు. ఇతను వీరిలో మూడవవాడు.

అన్నదమ్ములందరికంటే కిషన్ ఎప్పుడూ ఊరిలో వారందరికి ఎంతో సహాయపడుతుండేవాడు. అతడు ఎంతో సున్నిత మనస్సు కలవాడై ఎవరికి ఏ అవసరం వచ్చిన వెళ్ళి వెంటనే ఆదుకునేవాడు. పగలు రాత్రి అని ఆలోచించక ఎవరి ద్వారా ఏ విషయం తెలిసిన వారి వద్దకు వెళ్ళి వారికి తనకు వీలున్నంత సహాయం చేసి వచ్చేవాడు. ఇది మిగిలిన అన్నదమ్ములకు అంతగా నచ్చేది కాదు. ఇతడి భార్యకూడా చాలా గయ్యాళి. భర్తకు ఏ విషయంలోను సహకరించేది కాదు. ఎప్పుడూ కిషన్‌ను ఎన్నో విధాల విసుక్కుంటుండేది. ప్రతి చిన్న విషయానికి ఎన్నో మాటలు అనేది.

అయితే కిషన్ అన్నింటికి సౌమ్యంగా చిరునవ్వుతో సమాధానం చేప్పేవాడు. తాను ఇంత గట్టిగా అరుస్తున్నా కూడా భర్త చిరునవ్వుతో ఉండడం భార్యకు నచ్చేది కాదు. అతడితో ఎంత గొడవ పెట్టుకుందామని చూసినా అతడు ఏ

మాత్రం సమాధానం చెప్పక పోవడం ఆమెకు మరింత కోపం వచ్చేది. కిషన్ మాత్రం ఎప్పుడూ విసుగు తెచ్చుకోకుండా తన పనులు తను చేసుకుపోతుండేవాడు.

ఆ ఊరిలో ఒక శ్రీకృష్ణ మందిరం ఉండేది. ఆ శ్రీకృష్ణ మందిరంలో గోపాలాచార్యులు అనే పూజారి ఉండేవాడు. అతడి కుమార్తె రాధకు శ్రీకృష్ణుడు అంటే ఎంతో భక్తి. ఎంతగా అంటే ఆ శ్రీకృష్ణుడే తన భర్త అని నమ్మేది. తల్లి తండ్రులు ఎంత చెప్పినా వివాహం కూడా చేసుకోలేదు. కిషన్ అప్పుడప్పుడు ఊర్లో జరిగే ఉత్సవాలలో పాల్గొనేవాడు. అతడు మంచి మనస్సున్నవాడు కావడం చేత రాధను చూసి ఎంతో బాధ పడేవాడు. ఆమెకు గల కృష్ణ భక్తికి ఎంతో ఆనందం, మళ్ళీ వివాహం కాకుండా ఒంటరిగా ఉండిపోయిందే అన్న ఆలోచన ఉండేది. అయితే ఈ ఆలోచనలు మనస్సులోనే ఉంచుకొని బయటకు కనబడకుండా తన పని తాను చేసుకుపోయేవాడు.

అటు తరువాత కొన్ని రోజులకు ఒకనాడు అతనికి హిమాలయాలు దర్శించాలన్న కోరిక కలిగింది. అన్నదమ్ములకీ, భార్యకీ ఈ సంగతి చెప్తే ఒప్పుకోరు అని కిషన్‌కి తెలుసు. తండ్రికూడా ఒప్పుకోకపోవచ్చు. ఈ వ్యాపారం వదిలి ఎలా వెళ్ళిపోతావు అని అంటాడు. తనకేమో ఒక రెండు సంవత్సరాలు హిమాలయాలలో గడపాలని ఎంతో గాఢమైన కోరిక ఉంది. కిషన్ అటు ఇటు తేల్చుకోలేకపోయేవాడు. అతడికి పిల్లలు కూడా లేరు. ఎప్పుడూ వ్యాపారం, భగవంతుడి మీద ఆలోచన తప్ప వేరొకటి మనస్సులో లేదు.

కిషన్ జీవితం ఇలా గడచిపోతుంది. ఒకనాడు కిషన్ తండ్రికి, భార్యకు ఒక వారం రోజులు తీర్థయాత్రకు వెళ్ళివస్తానని గట్టిగా చెప్పి ఇంట్లోనుండి బయలుదేరి కొన్ని రోజులు ఎన్నో గ్రామాలగుండా, అడవులగుండా ప్రయాణంచేసి హిమాలయ ప్రాంతాలకు వచ్చి ఎందరో సాధువులను, యోగులను కలుస్తూ చివరికి ఒకనాడు నా దివ్యాశ్రమానికి చేరుకున్నాడు.

నా ఆశ్రమానికి చేరుకున్నతనికి ఒక అద్భుతమైన ఆనందం కలిగింది. ఒక వారం రోజులు ఉండి తిరిగి తన ఊరు వెళ్ళిపోదామని తలచిన కిషన్ నెల రోజులు అక్కడే ఉండిపోయాడు. నేను చెప్పే దైవ సంబంధమైన విశేషాలు వింటూ ఆ ఆశ్రమంలో తిరుగుతూ ఉండేవాడు. అలా కొన్ని సంవత్సరాలు అక్కడ ఆశ్రమంలోనే నా వద్ద ఉండిపోయాడు. ఈ లోపల ఇంకా కొంతమంది వచ్చి ఆ ఆశ్రమంలో చేరారు.

అక్కడ ఊరిలో కిషన్ తండ్రి కిషన్ కోసం చుట్టుప్రక్కల ఊళ్ళలో వెతికించి ఎక్కడా కనబడకపోయేటప్పటికి ఏ సాధువులతోనో వెళ్ళిపోయిఉంటాడని అనుకున్నాడు. ఆ ఊరిలోని శ్రీకృష్ణ మందిరం పూజారి శ్రీ గోపాలాచార్యులకు కూడా కాలక్రమంలో మరణించాడు. అతడి కూతురు రాధ ఒంటరిదయ్యింది. ఒకనాడు రాధ ఒక సాధువుల బృందంతో కలిసి భజనలు చేస్తూ, ఊరూరా తిరుగుతూ హిమాలయాల వద్దకు వచ్చి, ఆ బృందం నుండి విడిపోయి అటు ఇటు తిరుగుతూ నా ఆశ్రమానికి చేరుకుంది. అక్కడ అప్పటికే ఉన్న వారి ఊరి వాడు అయిన కిషన్ ను చూసి గుర్తుపట్టింది. రాధ కూడా ఎప్పుడూ భజనలు చేస్తూ అక్కడ తోటి వారితో భక్తి సంబంధ విషయాలను మాట్లాడుతూ ఉండేది. అటు తరువాత కొంత కాలానికి వారిద్దరు గతించారు.

ఆ తరువాత జన్మలో కిషన్ దక్షిణభారతదేశంలోని మధురైలో ఒక సాంప్రదాయ బ్రాహ్మణ కుటుంబంలో జన్మించాడు. అనేక శాస్త్రాలు నేర్చుకున్నాడు. ఈ జన్మలో వివాహం చేసుకోలేదు. అలాగే బ్రహ్మచారిగా ఉండిపోయాడు. వేదాల సారం ఎంతో తెలుసుకున్నాడు. అటు తరువాత జన్మలో కిషన్ మారిషస్ దేశంలో జన్మించాడు. అక్కడ ఒక హిందు కుటుంబంలో జన్మించి కాలేజీలో టీచరు ఉద్యోగం చేసాడు. గత జన్మల బంధం కారణంగా ఎన్నో సార్లు భారతదేశం వచ్చాడు. హిమాలయంలోని మానస సరోవరం కూడా వచ్చాడు. అప్పుడు అతనికి అక్కడ సాక్షాత్తు శ్రీకృష్ణ భగవానుల వారు ఒక వృద్ధ సాధువు రూపంలో వచ్చి దర్శనమిచ్చారు.

అటు తరువాత ప్రస్తుత జన్మలో సూర్య అనే పేరుతో హైదరాబాదులోనే జన్మించాడు. కిషన్‌గా జన్మించినప్పుడు కలిసిన రాధ ఈ జన్మలో ఇతడికి భార్య అయ్యింది. ఆ జన్మలో రాధపైగల అభిమానం తన ఆత్మను ఎంతో గట్టిగా పట్టుకొని ఈ జన్మలో ఆమె వేరే కులంలో జన్మించినప్పటికి వీరిద్దరికి వివాహ బంధం ఏర్పడింది. రాధకి కూడా ఈ జన్మలో ఒకసారి ఒక గొప్ప పుణ్యక్షేత్రానికి వెళ్లినప్పుడు సాక్షాత్తు శ్రీఆంజనేయ స్వామి వారే ఒక అపరిచిత భక్తుని రూపంలో దర్శనమిచ్చారు.

నేను హైదరాబాద్‌లో సమీర్‌కుమార్ రెడ్డి అనే అతనికి దాదాపు 15 సం॥లు క్రితం అతని వ్యాపారానికి లోగో చేసాను. ఆ వ్యాపారంలో అతను ఎంతో అభివృద్ధి పొందాడు. అతనికి సూర్య ఎంతో ఆప్తమిత్రుడు. కాని ఎప్పుడూ నాగురించి

సూర్య వద్ద ప్రస్తావన తీసుకురాలేదు. ఒక ఐదు సంవత్సరాల క్రితం అనుకోకుండా వీరిద్దరి మాటల్లో ఒక క్రొత్త వ్యాపారం గురించి ఆలోచిస్తుండగా సమీర్ సూర్యకు నా గురించి చెప్పాడు. నా పేరు చెప్పగానే సూర్య ఎంతో ఆకర్షితుడయ్యాడు. అతని ఆత్మకి నాలుగు జన్మల క్రితం నాతో ఉన్న దివ్యాశ్రమపు బంధం తెలిసింది. అంతే ఆ మర్నాడే సూర్య నన్ను వచ్చి కలిసాడు. అతడి వ్యాపారాలెన్నిటికో నేను పేర్లు నిర్ణయించి లోగోలు చేసాను. ఇతడు, ఇతడి భార్య ఎంతో ఉత్తములు. వీరికి ఇంకా కొన్ని జన్మలు మాత్రమే ఉన్నాయి. ఈ జన్మలన్నింటిలో సూర్య సమాజానికి ఉపయోగపడే ఎన్నో గొప్ప పనులను చేస్తాడు. ఈ విధంగా గత జన్మలనాటి హిమాలయ దివ్యాశ్రమపు బంధంతో అప్పటి కిషన్ ఈ జన్మలో సూర్య రూపంలో వచ్చి నన్ను కలవడం జరిగింది.

ఒకనాడు నా హిమాలయాశ్రమానికి విమలానందుడనే అతడు కాశ్మీరు నుంచి వచ్చాడు. విమలానందుడు కాశ్మీరులో మహాపండితుడు. అయితే పూర్వ జన్మల పాపకార్యాల ఫలితంగా తాను సంపాదించినదంతా కోల్పోయాడు. నడివయస్సులోనే భార్య మరణించింది. పిల్లలు తండ్రిని వదిలి ఎటో వెళ్ళిపోయారు. అంత గొప్ప పండితుడు కూడా చివరికి డెబ్భైసంవత్సరాలు వచ్చే సరికి మతి స్థిమితం కోల్పోయాడు. అదికూడా అతడి పూర్వజన్మల పాపఫలితమే! అంతకు ముందు జన్మలలో అతడు బ్రిటీష్ సైన్యంలో ఒక అధికారి. తన దుర్మార్గపు పనులతో ఎంతో మందిని పొట్టనపెట్టుకున్నాడు.

ఆ జన్మలో అతడు క్రిష్టియన్ అయినప్పటికి తన 56 వ యేట హిమాలయాలపై అతడి దృష్టి పడింది. తన ఆధీనంలో ఉన్న హిందూ దేశపు రాష్ట్రంలో ఒక ప్రఖ్యాత శివాలయం ఉండేది. అతడిని ఎందుకో ఆ శివాలయం ఎంతగానో ఆకర్షించింది. అప్పటి నుంచి క్రీస్తు మతస్థుడైనప్పటికి ప్రతి రోజు ఆ శివాలయానికి వచ్చి ఆలయం బయటే నిలబడి ఆ స్వామికి నమస్కరించుకొని వెళ్ళేవాడు. ఆ జన్మలో మిలటరీ ఆఫీసర్ గా ఎంతో పాపం మూటకట్టుకున్నప్పటికి ప్రతిరోజు శివాలయ దర్శన పుణ్యఫలం కొద్ది తరువాతి జన్మలో గొప్ప పండితుడయ్యాడు. కాశ్మీరులోని శృంగేరి మఠంలో గొప్ప పండితుడిగా పేరు తెచ్చుకున్నాడు. అయితే తాను చేసిన కొన్ని పాపపు పనుల వలన భార్యను

పోగొట్టుకొని పిల్లల నుండి దూరమై మతి చలించి దేశాటన చేస్తూ హిమాలయ ప్రాంతాల వద్దకు వచ్చాడు.

అలా హిమాలయ ప్రాంతాలలో అనేకమంది సాధువులను దర్శిస్తూ నా దివ్యాశ్రమానికి వచ్చాడు. అక్కడకు రాగానే ఆ ఆశ్రమంలో ఉన్న దివ్య తరంగాల ప్రభావం వలన అతనికి పూర్తి ఆరోగ్యం చేకూరింది. అప్పుడు అతడు తిరిగి తన భక్తిపరంపరలోనికి వెళ్ళి చివరి వరకు ఆ ఆశ్రమంలోనే ఉండి తనకు తెలిసిన వేద శాస్త్ర విషయాలను తోటివారికి చెప్తూ రోజు భగవంతుని గురించి ఇంకా తెలుసుకుంటూ చివరి వరకు ఆ ఆశ్రమంలోనే జీవించాడు.

అటు తరువాత జన్మలో అతడు అమెరికాలోని కాలిఫోర్నియా రాష్ట్రంలో ఒక క్రిష్టియన్ కుటుంబంలో మహిళగా జన్మించాడు. నలుగురితోను ఎంతో మంచిగా ఉంటూ ఎన్నో మంచి పనులు చేశాడు. తరువాత జన్మలో ఇతడు మహారాష్ట్ర ప్రాంతంలో జన్మించాడు. ఆ తరువాత జన్మలో ఇతడు ఒక గొప్ప వైష్ణవ పూజారిగా జన్మించి తిరుపతిలోని గోవిందరాజ స్వామి ఆలయంలో అర్చకుడిగా స్వామిని సేవించుకున్నాడు.

ప్రస్తుత జన్మలో అతడు విజయవాడ సమీపంలో గాంధీబాబు అనే పేరుతో జన్మించాడు. అతి సామాన్య కుటుంబంలో పుట్టినప్పటికి పూర్వజన్మల వాసనలు వలన శ్రీమన్నారాయణుల వారి వైపు ఎంతో ఆకర్షితుడయ్యాడు. అతనికి కొన్ని సంవత్సరాల క్రితం ఒకసారి ఎవరిద్వారానో నేను వ్రాసిన శ్రీవేంకటేశ్వర వ్రత కల్పం అందింది. ఆ పుస్తకంతో అతనికి ఈ జన్మలో ఎన్నో మార్పులు వచ్చాయి. శ్రీ వేంకటేశ్వర స్వామి పై విపరీతమైన గురి ఏర్పడింది. శ్రీ వేంకటేశ్వర స్వామివారి వ్రతాన్ని ఎంతో మందికి చేరవేయాలనుకుని గట్టిగా సంకల్పించుకున్నాడు.

నేను అతనికి ఇన్ని సంవత్సరాలుగా దాదాపు ప్రతి రెండు నెలలకు రెండు మూడు వందల పుస్తకాలు పంపిస్తున్నాను. అతడు ఆ పుస్తకాలు తీసుకుని ఎందరికో పంచుతున్నాడు. ఎన్నో ఆలయాలకు వెళ్ళి అక్కడకు వచ్చే భక్తులకు ఇచ్చి ఈ వ్రతం చేయమని గట్టిగా చెప్తాడు. ఇలా ఉంటుండగా దురదృష్టవశాత్తు ఆతని అల్లుడికి లివర్ సంబంధ జబ్బు వచ్చింది. కాని ఆ స్వామినే నమ్ముకొని ఉండటం చేత ఒకరోజు అతడు ఒక పెద్ద డాక్టర్ దృష్టిలోపడి మరునాడే ఆపరేషన్ జరిగి కోలుకున్నాడు. ఎప్పుడూ నా పుస్తకాలు తనతో పాటే ఉంచుకునే అతను ఆ హాస్పటల్లో ఉన్న రోజుల్లో అక్కడ ఉన్న మిగిలిన రోగులకు ఈ పుస్తకాలు ఇచ్చేవాడు.

దురదృష్టవశాత్తు ఆ తరువాత సంవత్సరం అతడి భార్య కేన్సర్‌తో మరణించింది. అది గాంధీబాబుని ఎంతో కృంగదీసింది. అయితే తాను నమ్మిన శ్రీ వేంకటేశ్వరస్వామివారిని ఎప్పటికి వదలక ఎప్పుడూ ఎన్నో ఆలయాలు దర్శిస్తూ వీలున్నప్పుడల్లా తిరుపతి వెళ్తూ కొద్దినెలల లోనే భార్యను కోల్పోయిన బాధనుండి బయటపడ్డాడు. ఇతడు పూర్వజన్మ పాప ఫలాలన్నింటిని ఇప్పుడు తీర్చుకుంటున్నాడు. ఇతడు వచ్చే జన్మలో గొప్ప పండితుడిగా జన్మిస్తాడు. ఇంకా కొన్ని జన్మల తరువాత ఆ పరబ్రహ్మమూర్తిలో ఏకమవుతాడు. అప్పటి హిమాలయపు దివ్యాశ్రమ బంధం వలన ఎక్కడో విజయవాడ దగ్గర చిన్న పల్లెటూరిలో జన్మించినప్పటికి నన్ను కలసి ఎంతో ఆప్తుడయ్యాడు. ఈ జన్మంతా పుస్తకాలు నలుగురికి పంచుతూ శ్రీ వేంకట తత్వాన్ని ఎంతో మంది దగ్గరకి తీసుకెళ్తూ తన జీవితం సార్థకం చేసుకుంటున్నాడు.

ఆ హిమాలయపు ఆశ్రమంలో రామకృష్ణులని ఇద్దరు స్నేహితులుండేవారు. రాముడు పెద్దవాడు. వీరిద్దరు ఎంతో సఖ్యంగా మెలుగుతూ తోటి వారికి ఎంతో సహాయం చేస్తుండేవారు. రాముడు తరువాత రెండు జన్మలలో ఒకసారి ఉత్తరప్రదేశ్‌లో ఒక ముస్లింగాను, తరువాత మద్రాసు దగ్గర చిన్న పల్లెటూరిలో ఒక హిందూ కుటుంబంలో జన్మించాడు. అటు తరువాత జన్మలో రాముడు తిరిగి ఉత్తరప్రదేశ్‌లో చిన్న పల్లెటూరులో ఒక వ్యాపారి కుటుంబంలో రామనాథ్ అనే పేరుతో జన్మించి బాగా చదువుకున్నాడు. ఎంతో దయాగుణం కలిగి ఉండేవాడు. ఒకసారి ఏదో వ్యాపార నిమిత్తం ఢిల్లీ వచ్చాడు. అక్కడ ఉన్న ఒక గొప్ప వైష్ణవ ఆలయం పట్ల ఎంతో ఆకర్షితుడయ్యాడు. రామనాథ్‌కి ఆ జన్మలో సత్యదేవుడనే ఆప్తమిత్రుడు ఉండేవాడు. ఇద్దరు ఎప్పుడూ కలిసి మెలిసి ఉండేవారు. ఒకరు అంటే మరొకరికి ఎంతో ప్రేమ అభిమానం ఉండేవి.

ఇటువంటి అనుబంధాలు తరువాత జన్మలలో కూడా కొనసాగుతుంటాయి. వారిద్దరు ఎంతటి స్నేహితులంటే చివరికి రామనాథ్ మరణించిన కొన్ని రోజులకే సత్యదేవ్ కూడా మరణించాడు. సత్యదేవ్ కూడా అంతకు ముందు జన్మలలో ఒకసారి నా ఆశ్రమంలోనే కొంతకాలం ఉన్నాడు. ఆ బంధమే వీరిద్దరిని క్రిందటి జన్మలో ప్రాణ స్నేహితులుగా చేసింది. ప్రస్తుత జన్మలో అప్పటి రామనాథ్ నా తమ్ముడు శ్రీనివాస్ గా జన్మించాడు. సత్యదేవ్ అతడి భార్య శ్రీదేవి గా జన్మించింది. చివరికి ఈ జన్మలో వీరిద్దరికి ఈ విధంగా తిరిగి నాతో బంధం ఏర్పడింది.

రామ్‌నాథ్‌కు ఒక పుణ్యక్షేత్రానికి వెళ్ళినప్పుడు సాక్షాత్తు శ్రీదత్తాత్రేయులవారు ఒక సిద్ధుని రూపంలో దర్శనమిచ్చారు. అలాగే అతడి స్నేహితుడు సత్యదేవ్ ఒకసారి ప్రముఖ పుణ్యక్షేత్రమైన షిరిడి వెళ్ళినప్పుడు సాక్షాత్తు శ్రీసాయినాథుడే అతనికి ఒక మహారాష్ట్ర సాధువు రూపంలో దర్శనమిచ్చారు. ముందు ముందు ఎన్నో ఉత్తమ జన్మలు లభిస్తాయని చెప్పారు. ముందు జన్మలలో ఎంతో సంస్కారంతో జీవిస్తావని చెప్పారు. అంతేకాక నువ్వు ముందు జన్మలలో ఎన్నోసార్లు ఇక్కడకు వస్తావని అన్నాడు. ముందు జన్మలలో నీ జీవితం శుభప్రదంగా జరుగుతుందని దీవించి వెళ్ళిపోయాడు.

ఇలా ఈ జన్మలో నన్ను కలిసిన ఎంతో మంది పూర్వ జన్మలలో నాతో ఏదో ఒక బంధం కలిగిన వారేనని గ్రహించాను. అది కూడా అప్పటి హిమాలయ దివ్యాశ్రమంలో ఉన్న 108 మంది ఈ జన్మలో నన్ను తప్పక కలుస్తున్నారు. కొంతమంది నా కుటుంబ సభ్యులుగా జన్మిస్తే మరికొంతమంది స్నేహితులుగా జన్మించారు. మరికొందరు ఎక్కడెక్కడో వేరే రాష్ట్రాలలో వేరే దేశాలలో జన్మించి ఎంతో విచిత్ర రీతిలో నన్ను కలుస్తున్నారు.

ఇలా ఈ జన్మలో కలిసిన అప్పటి దివ్యాశ్రమపు వారిలో ఉన్న ఇద్దరు ఈ జన్మలో మధు, ఉత్తమ దేవి దంపతులు. వీరిద్దరు కూడా నాతో ఆ జన్మలో హిమాలయ దివ్యాశ్రమంలో ఉన్నవారే! ఆ జన్మలో ఇద్దరు పురుషులే! వీరిద్దరి బంధం చాలా విచిత్రమైనది. హిమాలయాశ్రమంలో ఉన్న తరువాత జన్మలో మధు మహారాష్ట్రలోను, ఉత్తమదేవి రాజస్థాన్ లోను జన్మించింది. ఆ జన్మలో మధు ఎంతో గొప్ప శివభక్తుడు, అనేక శివాలయాలు కట్టించాడు.

ఆ తరువాత జన్మలో మధు గొప్ప విష్ణుభక్తుడు. ఎప్పుడూ శ్రీమన్నారాయణల వారి నామస్మరణలో ఉంటూ ఎన్నో గొప్ప దైవకార్యాలు చేసాడు. ఎందరికో శ్రీ మహావిష్ణువు యొక్క లీలలను విశేషంగా చెప్పేవాడు. ఎందరో సామాన్యులను భక్తిమార్గం వైపు నడిపించాడు.

అటు తరువాత జన్మలో మధు తమిళనాడులోని ఒక నాస్తిక కుటుంబంలో జన్మించాడు. భగవంతునిపై ఏ మాత్రం నమ్మకం ఉండేది కాదు. అయితే ఎంతో గొప్ప సమాజ సేవ చేసేవాడు. మానవ సేవ కంటే మాధవ సేవ ముఖ్యమని తోటి వారందరికి చెప్పేవాడు. తాను కూడా అదే ఆచరించేవాడు.

ఎప్పుడు ఎవరికి ఏ అవసరమొచ్చినా తాను ముందుండి ఎంతో సహాయం చేసేవాడు. అయితే దేవాలయాలకు మాత్రం ఎప్పుడూ ధన సహాయం చేసేవాడు కాదు. కాని ఎన్నో అనాధాశ్రమాలకు, వృద్ధాశ్రమాలకు ఎంతో సహాయం చేసేవాడు. బీదవారి పిల్లలను తన డబ్బుతో చదివించేవాడు. తన ఇంట్లో పని చేసేవారికి ఏదైనా అనారోగ్యం కలిగితే తానే డాక్టర్ దగ్గరకి తీసుకెళ్ళి ఖర్చంతా తనే భరించేవాడు. ఇటువంటి సేవతో తాను ఎంతో ఆనందం పొందేవాడు.

ఇక ఇప్పటి జన్మలో అతని భార్య అయిన ఉత్తమ హిమాలయపు ఆశ్రమ జన్మ తరువాత రాజస్థాన్‌లో ఒక పెద్ద రాజకుటుంబంలో జన్మించింది. ఆ రాజు ఎంతో దైవ భక్తి కలవాడై ఎప్పుడూ రాజాస్థానానికి సాధువులు, యోగులు వస్తూండేవారు. రాకుమార్తె ఆ యోగులను, సాధువులను ఎంతో భక్తితో సేవించేది. ఆమె అడిగే ప్రశ్నలకు వారు ఎంతో ఆశ్చర్యపోయేవారు.

రాజ కుటుంబంలో పుట్టి ఉండటం చేత ఆమెను బయట పాఠశాలకు పంపకుండా ఇంటిలోనే గురువుల వద్ద విద్య చెప్పించాడు. పెద్దగా చదువుకోనప్పటికి ఆమెకు ఎంతో జ్ఞానం అబ్బింది. ఎవరైనా ఆచార్య పురుషులు వస్తే తాను ఎన్నో గొప్ప ఆధ్యాత్మిక విషయాలు వారిని అడిగేది. ఇంత గొప్ప ప్రశ్నలు ఎలా అడుగుతున్నావని అందరూ అనేవారు. ఎంతో ఆశ్చర్యపోయేవారు. విశేషమేమంటే ఒక జన్మలో మనం సంపాదించిన ఆధ్యాత్మిక జ్ఞానం ఎక్కడకిపోదు. ఎన్ని జన్మలకైనా అది మన ఆత్మని పట్టుకుని ఉంటుంది.

ఒక ఇంజనీరింగ్ శాస్త్రాన్నో, న్యాయ శాస్త్రాన్నో చదివితే ఆ జ్ఞానం అంతా ఆ జన్మతోనే పోతుంది. అప్పుడు నేర్చుకున్నవన్నీ ఆ జన్మకే పరిమితం అవుతాయి. మరో జన్మలో ఆ ఫార్ములాలేవీ గుర్తుండవు కదా! ఆ చట్టవిషయాలు ఏమీ గుర్తుండవు కదా! కాని ఆధ్యాత్మిక జ్ఞానం అలాకాదు. ఎప్పుడైతే మనం పూర్తి లీనమై ఏ పురాణాన్నో, ఏ ఉపనిషత్తునో ఎంతో శ్రద్ధతో చదువుతామో, అది మనస్సుతో పాటు మన ఆత్మను కూడా గట్టిగా పట్టుకుంటుంది.

ఇక్కడ ఒక విశేషం గమనించాలి. ఇలా ఆధ్యాత్మిక గ్రంథాలు ఏమైనా చదివేటప్పుడు భగవంతునే తలుస్తూ పూర్తి ఏకాగ్రతతో చదివితే ఆ విషయాలు మన ఆత్మను మరింత గట్టిగా పట్టుకుంటాయి. అలా ఆత్మకు దగ్గరైన ఆ జ్ఞానం అంతా ఎన్ని జన్మలకీ పోదు. అందుకనే ఒకొక్కప్పుడు మనం ఎంతో చిన్న వయస్సులోనే

గొప్ప వేదాంతపరమైన విషయాలు మాట్లాడేవారిని చూస్తుంటాము. వారు ఈ జన్మలో ఏ పురాణాలు, ఉపనిషత్తులు అప్పటిదాకా చదవకపోయినా ఎన్నో పురాణాలలోని, ఎన్నో ఉపనిషత్తులలోని శ్లోకాలను, ఎంతో చక్కగా వివరిస్తారు. దీనికి కారణం అవి వీరు ముందు జన్మలలో ఎంతో శ్రద్ధతో చదివి ఉండటమే.

కేవలం చదవటమే కాకుండా నిత్య జీవితం కూడా ఎంతో సంస్కారవంతంగా జీవిస్తే అటువంటి ఆత్మల విషయంలో ఇది ఇంకా ఎక్కువగా కనిపిస్తుంది. అటువంటి వారినే సామాన్య ప్రజలు మహాపురుషులుగా కొలుస్తారు. ఇటువంటి కొంతమందిని రకరకాల పేర్లతో పిలిచి విపరీతంగా ఆరాధిస్తారు. అయితే ఇక్కడ ఒక సమస్య ఉంది. వీరిలో కొంతమంది వ్యక్తి ఆరాధనను మొదట్లో ఎంతో సంతోషంగా స్వీకరించి తరువాతి కాలంలో వారి ఆధ్యాత్మికతను, తమ దైవత్వాన్ని పూర్తిగా పోగొట్టుకొని సామాన్య మానవుని స్థాయికి చేరుకుంటారు.

క్రిందటి జన్మలో నేను ఇలా ఒకరిని చాలా దగ్గరగా గమనించాను. అతనికి కొన్ని జన్మలనుండి ఎంతో గొప్ప ఆధ్యాత్మిక సంపద లభించింది. వేంకటశాస్త్రి అనే పేరుతో తూర్పుగోదావరి జిల్లాలో సుమారు 1840 వ సం॥ ఆ ప్రాంతంలో జన్మించాడు. 12 సం॥ల కే వేదాలలోని గొప్ప విషయాలను చెప్పగలిగేవాడు. ఇతడు అంతకు ముందు జన్మలో కాశీలో మహాపండితుడు. ఇంకా ముందు జన్మలో కేరళ దేశంలోని శ్రీ పద్మనాభ స్వామి ఆలయంలో అర్చకుడిగా ఉండేవాడు. ఇలా ఆ రెండు జన్మలలో గొప్ప జ్ఞాన సంపద కలిగిఉంది. అయితే అతడికి కాశీలో పండితుడిగా ఉన్నప్పుడు సమాజంలోని అందరు తనను గౌరవించడంతో కొంత అహంకారం కలిగింది. అయినా అతడు గొప్ప పండితుడు అవ్వడం చేత అతని వద్ద ఏమి అనడానికి ఎవరూ సాహసించేవారు కాదు.

అమలాపురంలో వేంకటశాస్త్రిగా జన్మించిన ఇతడు పూర్వజన్మ జ్ఞానం వలన ఎంతో పాండిత్యం సంపాదించి ఎన్నో గొప్ప విషయాలు మాట్లాడగలిగేవాడు. అంతేకాదు తనవద్దకు వచ్చిన వారి భూత భవిష్యత్తు విషయాలను ఖచ్చితంగా చెప్పేవాడు. ఇలా కొన్ని సంవత్సరాలు గడవడంతో అతని చుట్టూ పెద్ద శిష్యగణం ఏర్పడింది. అతనిని ఒక మహిమాన్విత వ్యక్తిగా ఆరాధించడం మొదలు పెట్టారు. రోజు ఎంతో మంది వచ్చి అతని వద్ద కూర్చొని భజనలు చేసేవారు. ఇదంతా వేంకటశాస్త్రికి ఆనందంగా ఉండేది.

కొంతకాలానికి భజనలు, సన్మానాలు ఎక్కువయ్యాయి. ఆ ఊరిలో గల పెద్ద భూస్వామి ఈయనకి ఒక ఆశ్రమం కట్టించాడు. శిష్యులందరూ కలిసి వేంకటశాస్త్రి పేరు కూడా మార్చి అతడిని ఒక స్వామీజీ అనే పేరుతో పిలవసాగారు. ఇవన్నీ వేంకటశాస్త్రికి చాలా సంతోషంగా ఉండేది.

అయితే అతని అంతరాత్మకు ఇవి నచ్చలేదు. అక్కడితో అతడికున్న ఆధ్యాత్మిక జ్ఞానం తగ్గసాగింది. ఈ విషయం అతడికి నెమ్మదిగా తెలియసాగింది. కాని ఇప్పుడు ఏమీ తన స్వాధీనంలో లేవు. తాను భక్తుల మధ్య పూర్తిగా చిక్కుకుపోయాడు. ఒకనాడు తాను తన ఆశ్రమంలో ధ్యానం చేస్తుండగా తన పూర్వజన్మలు గుర్తుకు వచ్చాయి. కాశీలో పండితుడిగా ఉన్నప్పుడు తనకు కలిగిన అహంకారమే తన ఈ పతనానికి కారణం అని గ్రహించాడు. కానీ అప్పటికే చేయదాటిపోయింది. ఇలా బాధపడుతూ కొన్ని రోజులకు తనువు సాధించాడు. మళ్ళీ అంతటి జ్ఞాన సంపద రావాలంటే ఎన్ని వేల జన్మలలో జన్మించాలో కదా !

ఇక మళ్ళీ మనం ఉత్తమ విషయానికి వద్దాం. ఉత్తమదేవి రెండు జన్మల క్రిందట మహారాజ కుటుంబంలో రాకుమార్తెగా జన్మించి ఎంతో ఉత్తమ ఆధ్యాత్మిక భావాలు కలిగివుండేది అని తెలుసుకున్నాం కదా ! ఆ జన్మలో రాజుగారి తోటలో ఎన్నో రామచిలకలు ఉండేవి. రాకుమార్తె నిత్యం ఆ రామచిలకలతో కాలక్షేపం చేసేది. అవంటే తనకి ఎంతో ప్రాణం. ఎప్పుడూ వాటినే చూస్తూ గడిపేది. ఆ చిలకలపై ఎంతో మమకారం పెంచుకుంది. ఎంతగా అంటే ఉదయం లేచినప్పటినుంచి వాటితోనే ఆటపాటలు. వాటికి చిన్న చిన్న మాటలు కూడా నేర్పించింది. కొన్నింటికి రామనామం కూడా నేర్పించింది.

ఆ చిలకలన్నీ ఉత్తమను చూడగానే రామ రామ అని పలికేవి. అది విని తానెంతో మురిసిపోయేది. ఈ చిలకల జీవితం ఎంతో హాయి కదా! ఏ బంధాలు ఉండవు కదా! ఏ ఆలోచనలు ఉండవు కదా! నిత్యం హాయిగా దొరికిన పండ్లను తింటూ సుఖంగా బ్రతుకుతూ ఉంటాయి. ఒక రోజు తనువు చాలిస్తాయి. ఈ మానవులకి లాగా ఈ ఈర్ష్య, అసూయ, కోపం, అహంకారం ఇవేమీ ఉండవుకదా! ఎప్పుడూ చక్కగా పచ్చని చెట్లపై విహరిస్తూ ఆనందంగా గడుపుతుంటాయి కదా!అని ఆ రాకుమారి ఎప్పుడూ తలుస్తూ ఉండేది.

మళ్ళీ మన రాకుమార్తె వద్దకు వద్దాం. ఉత్తమ తరువాత జన్మలో తిరుమల ఆలయంలో ఒక అర్చకునిగా జన్మించింది. శ్రీ కృష్ణమాచార్యులు అనే పేరుతో జన్మించిన ఉత్తమ ఎప్పుడూ శ్రీ వేంకటేశ్వర స్వామి వారి సేవలోనే ఉండేది. ఆచార్యుల వారు శ్రీనివాసుని ప్రతి సేవలోను పాల్గొంటూ ఎంతో పరవశించేవాడు. తిరుమల కొండమీద గల పూలతోటల నుంచి అద్భుతమైన పూలు తీసుకొచ్చి శ్రీ స్వామివారిని రకరకాల విధాలుగా అలంకరించి మురిసిపోయేవాడు. ఆ జన్మలో శ్రీ కృష్ణమాచార్యుల వారితో శ్రీ స్వామివారు అప్పుడప్పుడు మాట్లాడుతుండేవారు కూడా! నిజంగానే కొన్ని వందల సంవత్సరాల క్రితం వరకు తిరుమల శ్రీనివాసుడు తనను పూర్తిగా నమ్మిన భక్తులతో మాట్లాడేవాడు కూడా... ఉత్తమకు ఆ విధంగా ఆ జన్మలో తిరుమల శ్రీనివాసునితో ఎంతో దివ్య బంధం ఏర్పడింది.

మనం ఎప్పుడైతే ఏ మనిషిమీదైనా, ఏ ప్రదేశంమీదైనా, ఏ జంతువుమీదైనా, ఏ పక్షిమీదైనా ఎక్కువ మమకారం పెంచుకుంటామో వచ్చే జన్మలలో మనం ఏదో ఒక జన్మలలో మనం ఏదో విధంగా వాటితో ఏదో సంబంధం ఉండేలా జన్మిస్తాం. నాకు తెలిసిన కృష్ణారావు అనే ఒకరు తాను నివసించిన అమలాపురం అనే ఊరిపై విపరీతమైన మమకారాన్ని ఏర్పరచుకున్నారు. పుట్టినప్పటినుంచి డెబ్బై సంవత్సరాలు ఆ ఊరిలోనే జీవించారు. అయితే తప్పనిసరి పరిస్థితులలో చివరి ఐదు సంవత్సరాలు హైదరాబాద్ లో తన కొడుకు దగ్గర జీవించారు. ప్రతీ రోజు అమలాపురం గురించే ఆలోచించేవారు. ఎప్పుడూ తిరిగి వెళ్ళాలని అనుకునేవారు గాని తన అనారోగ్యం వలన అక్కడకి వెళ్ళడం కుదరదని తెలుసుకొని బాధ పడేవాడు. కొన్ని రోజులకు అతని జన్మ పూర్తి అయింది. ఆ ఊరిపై గల మమకారంతో కృష్ణారావు ఆ తరువాత జన్మలో మళ్ళీ అమలాపురంలోని వేరే కుటుంబంలో జన్మించారు. తరువాత జన్మలో ఉత్తమ ఒక గొప్ప అవధూతగా జన్మించింది. నెల్లూరు జిల్లాలో ఒక పల్లెటూరులో ఒక వ్యవసాయ కుటుంబంలో రామయ్య అనే పేరుతో జన్మించి చిన్నప్పటినుంచే ఎన్నో ఉత్తమ గుణాలు అలవాటు చేసుకుంది. రామయ్య చిన్నప్పటినుంచి సాధువులతోను, యోగులతోను తిరుగుతూ ఎంతో జ్ఞానాన్ని సంపాదించుకున్నాడు. పూర్వజన్మ సంస్కారం వలన రామయ్యకు ఉపనిషత్తుల సారాంశం అంతా ఎంతో తేలికగా ఒంటపట్టింది.

క్రిందటి జన్మలో రామయ్య అనే అవధూతగా జీవించి, ఈ జన్మలో ఉత్తమ అనేపేరుతో కడపజిల్లాలో జన్మించింది. జన్మజన్మల పుణ్యఫలం వలన

చిన్నప్పటినుంచి మంచి ఆలోచనతో, ఎంతో మంచి మనస్సుతో ఉండేది. ఆమెకు యుక్త వయస్సు రాగానే డా॥ మధుతో వివాహం జరిగింది. మధు కూడా ఎంతో సౌమ్యుడు. తన చుట్టూ ఉన్నవారికి ఎప్పుడూ అన్ని విధాలా సహాయం చేస్తుంటాడు. వారిక ఏ అవసరమొచ్చినా చూసుకుంటాడు.

అయితే ఈ జన్మలో అతనికి భగవంతుడిమీద అంతగా నమ్మకం లేనప్పటికి ఈ సృష్టి మొత్తాన్ని ఏదో ఒక దివ్యశక్తి నడుపుతోందని నమ్ముతుంటాడు. యజ్ఞాలు, యాగాలు, పూజలు, పునస్కారాలు మధుకు అంతగా ఇష్టం ఉండవు. ఎప్పుడూ సమాజసేవ చేయాలని తాపత్రయపడుతుంటాడు. వీరిద్దరి జీవితం ఇలా గడుస్తుండగా ఆనాటి హిమాలయ దివ్యాశ్రమపు బంధంతో ఈ జన్మలో నన్ను కలిసే సమయం వచ్చింది. అయితే ఈ మహానగరంలో వారెక్కడ ? నేనెక్కడ ? కాని ఆ బంధం వలన తిరిగి వారు అనుకోని రీతిలో ఒక నాలుగు సంవత్సరాల క్రితం నన్ను కలవడం జరిగింది. అప్పటినుంచి ఆ దంపతులిద్దరు మా కుటుంబానికి ఎంతో ఆప్తులయ్యారు.

నాకు చిన్నప్పటినుంచి అప్పుడప్పుడు పంటినొప్పి వస్తుంటుంది. నేను నా ఆరోగ్యం గురించి పెద్దగా లెక్కచేయను. ఆ నొప్పి వచ్చినప్పుడు ఏదో ఒక ట్యాబ్లెట్ వేసుకోవడం, నాలుగు రోజులు నొప్పి భరించడం, తరువాత తగ్గిపోవడం, ఇలా అనేక సార్లు జరుగుతూనే ఉంటుంది. పంటినొప్పి వచ్చినప్పుడల్లా అందరూ నన్ను ఏదైనా డాక్టర్ దగ్గరకి వెళ్ళమని గట్టిగా చెప్పేవారు. కాని ఎప్పుడూ ఏ డాక్టర్ వద్దకు వెళ్ళేవాణ్ని కాదు. నేనంటే ఎంతో అభిమానం కలిగిన ఎందరో డాక్టర్ల్ ఉన్నారు. వారిలో పంటి డాక్టర్లు కూడా ఉన్నారు. కాని ఎప్పుడో తప్ప అంతగా వెళ్ళేవాణ్ని కాదు. ఇలా జరుగుతుండగా ఒకసారి పంటినొప్పి బాగా వచ్చింది.

అప్పుడు నేను నా పుస్తకం ఒకటి టైపింగ్ చేయిస్తున్నాను. నా పుస్తకాలన్ని జగదీష్ టైపింగ్ చేస్తుంటాడు. నేను సాధారణంగా ఉదయం వేళల్లో డిక్టేట్ చేయడానికి ఇష్టపడతాను. అప్పుడు ప్రకృతి కూడా ప్రశాంతంగా ఉంటుంది.

అలా టైప్ చేస్తున్నప్పుడు ఒక రోజు జగదీష్ నా పంటి నొప్పి బాధ చూసి సార్! నాకు తెలిసిన మంచి డాక్టర్ ఉన్నాడు, సాయంత్రం నేను వచ్చి మిమ్మల్ని ఆయనదగ్గరకి తీసుకువెళతానన్నాడు. కాని నేను ఆరోజు కాదని, రేపని మళ్ళీ తరువాత మరో రెండురోజులకని, ఇలా కాలక్షేపం చేస్తూ వచ్చాను. నొప్పి ఏ మాత్రం

తగ్గలేదు. జగదీష్ కూడా గట్టిగా వత్తిడి చేసేవాడు. ఇక తప్పక సరే అన్నాను. ఆ రోజు సాయంత్రం నన్ను తీసుకొని డాక్టర్ మధు వద్దకు తీసుకెళ్ళి పరిచయం చేసాడు. అప్పుడు మధు నా పళ్ళు పరీక్షించి రెండు నెలలు వారానికి ఒకసారి వస్తే ఇంకెప్పటికి నొప్పి రాకుండా పూర్తిగా నయం చేయవచ్చని అన్నాడు. వారానికి ఒకటి రెండు సార్లు మీకు వీలున్న రోజుల్లో రండి సార్ అన్నాడు. నేను అలాగే అన్నాను.

సాధారణంగా నేను ఎవరినైనా క్రొత్తవారిని కలిసేటప్పుడు నాతో పాటు నేను వ్రాసిన పుస్తకాలు తీసుకువెళ్ళడం అలవాటు. ఆ రోజుకూడా అలాగే తీసుకెళ్లి మధుకి కూడా ఇచ్చాను. మధు ఒక చిరునవ్వు నవ్వి నేను భక్తి పుస్తకాలు అంతగా చదవను సార్! మా ఆవిడకి ఎంతో భక్తి ఎక్కువ తనకి ఇవన్నీ చాలా ఇష్టం తనకిస్తాను అన్నాడు. ఆ తరువాత రెండురోజులకి మళ్ళీ క్లినిక్‌కి వెళ్ళాను. రూట్‌కెనాల్ చేసి మళ్ళీ వారం రోజుల్లో రమ్మన్నాడు. అలా ఒక రెండు నెలలు వస్తే సరిపోతుందన్నాడు.

కాని నేను ఆరోజు వెళ్ళినవాణ్ని ఇంకా ఈ రోజుదాకా మళ్ళీ ఆ క్లినిక్ ముఖం చూడలేదు . రెండు నెలలు రమ్మంటే కేవలం రెండుసార్లు వెళ్ళాను. ఇది జరిగి నాలుగు సంవత్సరాలు కావస్తుంది. మధ్యలో అప్పుడప్పుడు పంటి నొప్పి వచ్చినా నేనెప్పుడు మధు దగ్గరకి గాని, వేరే ఏ డాక్టర్ దగ్గరకి గాని వెళ్ళలేదు. ఆరోజు మధుకి నేనిచ్చిన పుస్తకాలు ఇంటికి తీసుకెళ్ళి తన భార్య ఉత్తమదేవికి ఇచ్చాడు. ఉత్తమ అవి చదివి ఎంతో ఆనందపడింది. కాకతాళీయంగా ఈ పుస్తకాలు తన వద్దకు చేరినందుకు ఎంతో సంతోషపడింది. వాటిలో నేనింకా పుస్తకాలు వ్రాసానని చూసి ఒకరోజు నాకు ఫోన్‌చేసి ఇంటికి వస్తానని అన్నది.

ఒకరోజు అలాగే ఇంటికి వచ్చి ఒక గంట కూర్చొని నా మిగిలిన పుస్తకాలు కూడా తీసుకొని వెళ్ళింది. ఆ పుస్తకాలు అన్నీ చదివి ఎంతో సంతోషపడింది. ఇంక ఉత్తమ అప్పటినుంచి అప్పుడప్పుడూ మా ఇంటికి వస్తుండేది. ఇప్పుడు మా కుటుంబంలో ఒకరిగా అయింది. నన్ను రుక్మిణిని అంకుల్, ఆంటీ అంటూ ఎంతో ఆప్యాయంగా పిలుస్తుంది. నేనెప్పుడు ఏ డాక్టర్ దగ్గరకీ వెళ్ళని వాడిని మధు దగ్గరకి వెళ్ళడమేమిటి? అదీ ఎంతో దూరంలో ఉన్న మధు క్లినిక్‌కి వెళ్ళడం ఏమిటి? ఆ రోజు నేను పుస్తకాలు అతనికి ఇవ్వడమేమిటి? ఆ పుస్తకాలు తాను ఉత్తమకి ఇవ్వడమేమిటి? ఇదంతా అప్పటి హిమాలయ ఆశ్రమపు బంధమే తిరిగి వీరద్దరూ ఈ జన్మలో ఇలా నన్ను కలిసేలా చేసింది.

నా దగ్గరకి ఎంతో మంది సలహాలకు, లోగో డిజైన్‌లకు వస్తుంటారు. అలాగే నా పుస్తకాల కోసం వస్తుంటారు. నేనిప్పటికి 25 పుస్తకాలు వ్రాయడం జరిగింది. ఇవన్నీ కోరిన వారందరికి ఉచితంగా ఇస్తున్నాను. ఇలా వచ్చినవారిలో కొందరు ఎంతో ఆప్తులయ్యారు. అలా ఆప్తులయినవారిలో కొంతమంది మా కుటుంబానికి అతి దగ్గరగా వచ్చారు. వీరిలో మధు, ఉత్తమ దంపతులు ఒకరు. ఉత్తమకి నేను వ్రాసిన శ్రీ వేంకటేశ్వర వ్రతకల్పం అంటే ఎంతో ఇష్టం ఈ పుస్తకం ఇప్పుడు 12 భాషలలోకి అనువదించబడింది. ప్రపంచం అంతా కొన్ని కోట్ల మంది భక్తులు ప్రతీ శనివారం ఈ పుస్తకంలోని కథలు చదువుతున్నారు. ఈ పుస్తకం ఎన్నో లక్షల మంది జీవితాలలో ఎంతో మంచి మార్పు తెచ్చింది. ఎందరో ఎన్నో సమస్యల నుంచి బయట పడ్డారు. కేవలం చదివినంతమాత్రానే వారి జీవితాలలో ఎన్నో అద్భుతాలు జరుగుతున్నాయి.

దాదాపు ప్రతీరోజు ప్రపంచంలో ఎక్కడో ఒకచోటినుండి ఫోన్ చేసి ఈ వ్రతకల్పం వారికి ఎంత ఉపయోగపడిందో చెప్తుంటారు. ఉత్తమ ఇవన్నీ తెలుసుకొని ఈ పుస్తకం ఇంకా చాలామందికి వెళ్ళాలని ఎంతో తాపత్రేయపడేది. నేను ప్రతీ ఆరు నెలలకి ఈ ఒక్క పుస్తకాన్నే 10,000 కాపీలు ప్రింట్ చేస్తుంటాను. కొంతమంది వారి పిల్లల వివాహాలలో, గృహప్రవేశాలలో, ఇలాంటి శుభసందర్భాలలో తమ బంధుమిత్రులకు పంచుకొనడానికి రెండు మూడు వందల పుస్తకాలు తీసుకెళ్తుంటారు. వారికి ఈ పుస్తకం రావడం కూడా ఎంతో విచిత్రంగా వచ్చిందని అది తమ అదృష్టంగా భావిస్తున్నామని అంటారు. ఇంకో పదిమంది దీనివలన బాగుపడాలని అనుకొని వారికి తెలిసిన వారందరకి ఇవ్వడానికి తీసుకొని వెళ్తారు. నేను ఎవరు ఎన్ని పుస్తకాలు అడిగినా పూర్తి ఉచితంగా ఇస్తున్నాను.

ఈ పుస్తకాలన్నీ ప్రింట్ చేసి నలుగురికి ఇవ్వడం నేను ఒక యజ్ఞంలా భావిస్తున్నాను. ఈ యజ్ఞానికి నా మిత్రులెందరో సహాయం చేస్తున్నారు. అదీ ఆ స్వామివారు ఎవరెవరిచేత చేయించుకోవాలనుకుంటారో వారినే ఈ యజ్ఞంలో భాగస్వామ్యులుగా చేస్తున్నారు. నా వద్దకు లోగో డిజైన్ కోసం వచ్చేవారిలో అతి సామాన్యులు ఉంటారు, పెద్ద పెద్ద కోటీశ్వరులు ఉంటారు. నేను ఒక చిన్న మెడికల్ హాల్‌కి లోగో చేసాను, ఒక 500 కోట్ల కార్పోరేట్ ఆసుపత్రికి లోగో చేసాను. నా దృష్టిలో ఇద్దరు సమానమే! ఇలా నా వద్దకు వచ్చినవారిలో కొంతమంది ఎంతో ఆప్తులయ్యారని ఇందాక చెప్పాను కదా ! వీరిలో అప్పుడప్పుడు ఎవరో ఒకరు మేము

ఒక 500 కాపీలకో లేదా ఒక 1000 కాపీలకో సహాయం చేస్తామని ఆ భాగ్యం మాకిమ్మని అంటుంటారు. ఈ 15 సంవత్సరాలలో ఎవరో నలుగురు, ఐదుగురు మాత్రం 10,000 కాపీలు తామే ప్రింట్ చేయించారు.

ఒకరోజు ఉత్తమ మా ఇంటికి వచ్చినప్పుడు అప్పటికి వైకుంఠ ఏకాదశి ఒక వారం రోజుల్లో ఉంది. ఆ సంవత్సరం వైకుంఠ ఏకాదశినాడే ఉచితంగా పుస్తకాలు పంచడం కోసం 20,000 కాపీలు ప్రింట్ చేయడం జరిగింది. నేను ఉత్తమతో క్రిందటి సంవత్సరం వైకుంఠ ఏకాదశికి 10,000 అనేక గుళ్ళలో పంచామని అవి ఏమాత్రం సరిపోలేదని అందుకని ఈ సారి కొందరు స్నేహితుల సహాయంతో ఆ ఒక్కరోజు పంచడానికే 20,000 కాపీలు ప్రింట్ చేసామని అన్నాను.

నా దగ్గరకి వచ్చే కొందరు శ్రీ స్వామివారి భక్తులు వైకుంఠ ఏకాదశికి వారంరోజుల ముందే వచ్చి ఒక్కొక్కరు ఒక 1000 కాపీలు తీసుకొని ఆ రోజు ఏ ఏ ఆలయాలలో పంచాలో ఒక ప్రణాళిక చేసుకుంటారు. ప్రతీ సంవత్సరం వీరు చెప్పే విషయేమిటంటే వారు తీసుకెళ్ళిన 1000 కాపీలు కేవలం పది నిమిషాలలో అయిపోయాయని, తీసుకున్న ప్రతీ భక్తుడు ఎంతో సంతోషపడ్డారని, కొందరైతే ఈ పుస్తకం కోసం ఎన్నో సంవత్సరాలనుంచి చూస్తున్నామని ఈ రోజు దొరకడం మా భాగ్యం అన్నారని చెప్తుంటారు.

ఆరోజు ఉత్తమ ఇదంతా చూసింది. ఎంతో సంతోషపడింది. మీ శ్రీవేంకటేశ్వర వ్రత కల్పం ఎంతమంది జీవితాలలో వెలుగులు నింపుతోంది అంకుల్ ! నాకు ఇప్పుడే ఒక ఆలోచన వచ్చింది. నేను వచ్చే వైకుంఠ ఏకాదశి లోపల ఈ సంవత్సర కాలంలో ఒక లక్ష శ్రీవేంకటేశ్వర వ్రతకల్పం పుస్తకాలు ప్రింట్ చేయించి ఇస్తాను అంకుల్ అన్నది. అది విన్న నేను ఎంతో ఆశ్చర్యపోయాను. ఉత్తమా! అది ఎంత ఖర్చుతో కూడుకున్నదో నీకు తెలుసా? అన్నాను.

లేదు అంకుల్ ఎలాగైనా నేను చేయిస్తాను చూడండి! అందరూ ఎంత సంతోషపడుతున్నారో! ఇంతమంది జీవితాలు బాగుపడుతుంటే అంతకన్నా మనకు సంతోషం ఏముంటుంది అంకుల్ ? మనం ఎన్నింటికి ఎంత ఖర్చుపెట్టడంలేదు? ఇలా ఒక హోటల్‌కి వెళితే ఒక 1000 రూపాయలు ఖర్చుపెట్టడం లేదా ! ఆ 1000 రూపాయలకి మనకి 100 పుస్తకాలు వస్తాయి కదా ! నాకు ఆ శ్రీనివాసుడే ఏదో దారి చూపిస్తాడు. అప్పో సొప్పో చేసి ఈ సంవత్సరంలో తప్పకుండా ఒక లక్ష వ్రతకల్ప పుస్తకాలు నేనే ప్రింట్ చేయిస్తానన్నది.

నాకు పిల్లల బట్టలు కుట్టడం తెలుసు. ఒక పదిమందికి బట్టలు కుట్టి ఇంకా కష్టపడి లేదా లోను తీసుకొని ఆ డబ్బులు ఈ పుస్తకాల ప్రింటింగ్ కి వాడతాను. కాని ఎట్లాగైనా వచ్చే వైకుంఠ ఏకాదశిలోపు ఒక లక్ష పుస్తకాలు ప్రింట్ చేయిస్తానన్నది. నేను ఇదంత సామాన్యం కాదు తల్లీ! మళ్లీ ఒకసారి ఆలోచించు అన్నాను. దానికి ఉత్తమ లేదంకుల్ తప్పకుండా చేస్తాను. నేను మంచి పని చేస్తానంటే మధు ఏమాత్రం వద్దనడు. తనకి భగవంతుడిపై నమ్మకం లేకపోయినా ఎంతో మంది జీవితాలు బాగుపడే ఈ పుస్తకం ఇన్ని కాపీలు ప్రింట్ చేస్తానంటే తాను ఏమీ అనడు. ఇంకా సంతోషిస్తాడు కూడా అంది. ఉత్తమ దేవి అప్పుడప్పుడు ఇలా డ్రెస్‌లు డిజైన్ చేసి తెలిసిన వారికి ఇస్తుంటుంది. ఒక్కొసారి కొంతమంది ఆమెకి ముందుగా ఆర్డర్స్ ఇచ్చి చేయించుకుంటారు. ఏదో 5000/-, 10,000/- వస్తాయి కాని లక్ష కాపీలు అంటే దాదాపు 8 లక్షల రూపాయలు ఖర్చు ! సామాన్యం కాదు కదా ! అన్నాను.

ఉత్తమ ఏంచేసిందో తెలుసా? తన బట్టల కోసం ఒక బోటిక్ పెట్టి దానికోసం ఒక 5 లక్షల బ్యాంక్‌లోనుకి అప్లై చేసింది. ఎంతో కష్టం మీద లోన్ వచ్చింది. ఆ 5 లక్షలు డైరెక్ట్‌గా నా పుస్తకాలు ప్రింట్ చేసే సత్యనారాయణగార్కి ఇచ్చి ప్రతి నెల 10,000 కాపీలు ప్రింట్ చేసి మా ఇంటికి పంపమని చెప్పింది. లోన్‌కి అప్లై చేసినా తనకి వెంటనే లోన్ రాలేదు. అది చాలా కష్టమైంది. ఇంటికి వచ్చి చూసిన బ్యాంక్ మేనేజర్ అసలు ఇక్కడ ఏమీ లేదు కదమ్మా? 5 లక్షల లోన్ ఎలా ఇస్తానన్నారు.

అప్పటికే నాకు చెప్పి 2 నెలలు అయింది. పుస్తకాలు ప్రింటింగ్ ఆలస్యమైపోతుందని స్నేహితులు దగ్గర అప్పు తీసుకొని ప్రింటింగ్‌కి ఇచ్చింది. ఇంతలో బ్యాంక్ మేనేజర్ మారిపోయాడు. లోన్ అప్లికేషన్ విషయమంతా మళ్ళీ మొదటికి వచ్చింది. చివరికి ఆ లోన్ 5 లక్షలు శాంక్షన్ అయింది.

ఈ రోజుల్లో ఇలా ఎంతమంది చేస్తారు? కేవలం ఇదంతా ఆ భగవత్ప్రేరణ తప్ప మరొకటి కాదు. ఆ శ్రీనివాసుడు ఉత్తమ చేత ఈ పని చేయించుకోవాలనుకొన్నాడు కాబట్టే ఉత్తమకి ఆ అదృష్టం ఇచ్చాడు.

ఇలా 4 నెలలు అవగానే దురదృష్టవశాత్తు ఉత్తమ అమ్మగారు చనిపోయారు. ఉత్తమ తన తల్లిదండ్రులకు ఒక్కతే సంతానం. ఉత్తమ తల్లి ఒక సంవత్సరం నుంచి హైదరాబాద్‌లోనే ఉండి ట్రీట్‌మెంట్ తీసుకున్నారు. ఇంతలో

దసరా పండుగ వచ్చింది. పండుగ రోజుల్లో తమ పల్లెటూరులోనే ఉంటామని ఉత్తమ తల్లిదండ్రులు ఇద్దరు ఆ ఊరు వెళ్లారు. ఉత్తమ కూడా ఊరు వెళ్ళింది. దురదృష్టవశాత్తు అక్కడ ఒకరోజు వాళ్ళ నాన్నగారు బాత్‌రూంలో జారిపడి చాలా సీరియస్ అయింది. అప్పటికప్పుడు ఆయనను అంబులెన్స్‌లో హైదరబాద్ తీసుకొచ్చారు.

ఉత్తమ కూడా తండ్రితో అంబులెన్స్‌లో హైదరబాద్ వచ్చింది. వాళ్ల అమ్మగారు కూడా హైదరబాద్ వచ్చారు. ఉత్తమ తండ్రిని ఒక హాస్పటల్‌లో అడ్మిట్ చేశారు. ఆయనది మంచంమీదనుంచి లేవలేని పరిస్థితి. ఆయన వయస్సు 75 సం॥లు పైనే ఉంటుంది. ఆపరేషన్ చేయాలని డాక్టర్లు చెప్పారు. ఈ వయస్సులో ఆపరేషన్ చేస్తే తట్టుకుంటారో లేదో అని డాక్టర్ల్ జంకుతున్నారు. చేసినా ప్రమాదమే చేయకపోయినా ప్రమాదమే అన్నట్లు ఉంది. ఆయనను ఐ.సి.యు లో ఉంచారు.

ఇంతలో దురదృష్టవశాత్తు ఉత్తమ అమ్మగారి పరిస్థితి విషమించటంతో ఆవిడను కూడా అదే ఐ.సి.యులో ఉంచారు. అప్పుడు ఉత్తమ మనః పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించుకోండి. ఇటువంటి పరిస్థితులలో ఉండి కూడా మధ్య మధ్యలో ప్రింటర్ సత్యనారాయణ గారికి ఫోన్ చేసి శ్రీవేంకటేశ్వర వ్రతకల్పం ప్రింటింగ్ ఎంత వరకు వచ్చిందని అడుగుతుండేది. డాక్టర్లుతండ్రికి ఆపరేషన్ చేయాలా వద్దా అని సతమతమౌతూ చివరికి ఒకరోజు చెయ్యక తప్పదని నిశ్చయించుకొని ఆపరేషన్ చేశారు. ఉత్తమ ఆపరేషన్ ముందుకూడా నన్ను అడిగింది. మీరు ఎలా అంటే అలా చేస్తాం అంకుల్ అంది. ఆపరేషన్ చేయించకపోతే ఆయన పరిస్థితి ఇంకా క్షీణిస్తుందని తలచి ఆయన ఆపరేషన్‌కు తట్టుకుంటారని, డాక్టర్ల్ ను చేయమని చెప్పమని అని ఉత్తమతో అన్నాను.

వారు ఆ తరువాత రోజే ఆపరేషన్ చేశారు. ఆ శ్రీనివాసుడి దయవల్ల ఆపరేషన్ విజయవంతం అయింది. ఆపరేషన్ జరిగి రెండు రోజులయ్యింది. ఉత్తమ హమ్మయ్య అనుకొనేంతలోపల మరొక దుర్వార్త వినాల్సివచ్చింది. దురదృష్టవశాత్తు ఉత్తమ తల్లికి ఆరోజు ఆరోగ్యం చాలా విషమించి ఆమె మరణించింది. డాక్టర్లు ఉత్తమతో తల్లి మరణించిన విషయాన్ని తండ్రికి ఏమాత్రం తెలియచెప్పకూడదని తెలిస్తే ఆయనకి కూడా ప్రమాదకరమని అన్నారు. అక్కడితో భార్య అదే ఐ.సి.యులో మరో బెడ్ మీద కాలంచేసిన భర్తకు చెప్పకుండా, ఆమె భౌతిక శరీరాన్ని తీసుకొని మధు, ఉత్తమ వాళ్ళ ఊరు వెళ్ళి అక్కడే అంత్యక్రియలు చేశారు.

ఉత్తమ వెంటనే తిరిగి హైదరాబాద్ వచ్చి తండ్రిని చూసుకోసాగింది. ఒక ప్రక్క తల్లి మరణించిన విషయం తండ్రికి తెలియనీయకుండా ఆమె మనస్సులో ఎంత క్షోభ పడి ఉంటుందో ఊహించుకోండి ! తండ్రి అడిగిన ప్రతీసారి ఆ విషయం దాటవేస్తూ తల్లి ఊరు వెళ్ళిందని చెప్తూ రెండు నెలలు గడిపింది. ఇంతటి కష్ట పరిస్థితులలోను వేంకటేశ్వర వ్రతకల్పం పుస్తకాలు ప్రింటింగ్ చూస్తూ నాతో అనేది. అంకుల్ భగవంతుని పని భగవంతునిదే, లౌకిక విషయాలు లౌకికమే, దేనిదారి దానిదే !

పుట్టినప్పుడు మనకి తల్లిదండ్రులు ఆ సమయంలో ఏదో పేరు నిర్ణయిస్తారు. తరువాత మనం ఏం చదువుతామో ఆ సంస్కారం ఎలా రూపుదిద్దుకుంటుందో అప్పుడు వారికి తెలియదు కదా! పుట్టినప్పుడు తల్లి దండ్రులు పెట్టిన పేరును ఎంతో సార్థకం చేసుకున్న ఉత్తమ ఎంతో గొప్ప ధన్యురాలు.

ఇంతలో ఒకరోజు తన తండ్రికి తల్లి లేదన్న విషయం చెప్పింది. ఆయన ఎంతో బాధపడ్డాడు. కొద్దిరోజులకే ఆయనకూడా మరణించాడు. ఆ తరువాత కొద్ది నెలలకే ఉత్తమ మామగారు కూడా మరణించారు. ఇవన్నీ కూడా తాను స్వామివారికి చేస్తానన్న ఆ లక్ష పుస్తకాల ప్రింటింగ్ సంవత్సర కాలంలోనే జరిగాయి. ఈ సంవత్సరంలో తనకి ఇన్ని కష్టాలు ఎదురైన తాను అనుకున్న పని మాత్రం గట్టిగా పట్టుకొని వైకుంఠ ఏకాదశి వచ్చేనాటికి తను సంకల్పించిన లక్ష పుస్తకాల ప్రింటింగ్ పూర్తి చేసింది. ఆ లక్ష పుస్తకాలు ప్రజల్లోకి వెళ్ళిపోయాయి కూడా! ఎన్నో లక్షల మంది జీవితాలు బాగుపడ్డాయి. బయటకు వెళ్ళిన ప్రతీపుస్తకం కనీసం నూరు సార్లు జిరాక్స్ తీయబడుతుంది. ఎందుకంటే ఈ పుస్తకం బయట ఎక్కడా దొరకదు కాబట్టి ప్రతి వారికి ఈ శ్రీ వేంకటేశ్వర వ్రతకల్పం ఎంతో అపురూపం.

ఉత్తమకి జన్మ జన్మల పుణ్య ఫలంగా ఇంత గొప్ప సంస్కారం అబ్బింది. మధు, ఉత్తమలు ఎన్నో జన్మలనుంచి ఎన్నో గొప్ప పనులు చేస్తూ ధర్మపథంలో జీవించడం చేత వారి కర్మ క్షయమై వారిక ఆ దివ్యశక్తిలో త్వరలోనే కలిసే సమయం వచ్చింది. వీరిద్దరికి ఇంకా కొన్ని జన్మలు మాత్రమే ఉన్నాయి. పూర్వజన్మలలో చేసిన కర్మఫలం పూర్తిగా అనుభవించడానికై వీరిద్దరు ఈ జన్మలో ఇన్ని కష్టాలు పడ్డారు. ఇంకా కొన్ని జన్మల తర్వాత వీరిద్దరు మోక్షానికి చేరువవుతారు. ఇక జన్మలు లేకుండా ఆ దివ్యశక్తిలో ఐక్యమౌతారు.

ప్రతి మానవుడు అనేక కోట్ల జన్మలెత్తుతూ ఈ జనన మరణ చక్రంలో చిక్కుకొని బయటపడకుండా ఉంటాడు. మనం ప్రతి జన్మలోను ఆ భగవంతుడు మనకిచ్చిన వివేకాన్ని వినియోగించుకొని మనల్ని మనం సంస్కరించుకొంటూ ముక్తిపథం వైపు పయనించాలి. ఇన్ని కోట్ల జన్మలెత్తే మనం అనేక మతాల్లో, అనేక కులాల్లో జన్మిస్తుంటాము. ఒక్కో జన్మలో ఒక్కో దేశంలో, ఒక్కో మతంలో జన్మిస్తాము. మనం వరుసగా అన్ని జన్మలలోను ఒకే మతంలోను ఒకే కులంలోను జన్మిస్తామని అనుకోకూడదు.

నాకు తెలిసిన ఒక గొప్ప హిందు ప్రవచన ఆచార్యుడు ఉండేవాడు. అతడు అంతకుముందు రెండు జన్మలలో ఒకసారి ఉత్తర భారతదేశంలోను, మరొకసారి దక్షిణ భారతదేశంలోను నివసించాడు. ఉత్తర భారతదేశంలో జన్మించినప్పుడు ఒక యాదవ కుటుంబంలో జన్మించి ఎంతో కష్టపడి చదివి ఆర్థికశాస్త్రంలో డాక్టరేట్ తీసుకొని ఒక ప్రముఖ యూనివర్సిటీలో ప్రొఫెసర్ గా పనిచేసాడు. అయితే ఆయనకు భారతీయ వేద శాస్త్రాలమీద ఎంతో మక్కువ ఉండేది. ఆ కారణంగా ఆయన ఎన్నో గ్రంథాలు చదివాడు, ఎంతో జ్ఞానం సంపాదించాడు.

భారతీయ సాంప్రదాయ విద్యలపై అంత మక్కువ ఉండడంతో తరువాత జన్మలో అతడు దక్షిణ భారతదేశంలో ఒక ప్రముఖ వైష్ణవ క్షేత్రంలో అర్చకునిగా జన్మించాడు. అప్పుడతడు ఆధ్యాత్మికంగా ఇంకా ఉన్నతస్థాయికి ఎదిగాడు. అటుతరువాత జన్మలో అతడు ఆంధ్రప్రదేశ్‌లోని ఒక బ్రాహ్మణ కుటుంబంలో పుట్టి ఎన్నో వేదాలు, శాస్త్రాలు చదవి గొప్ప ప్రవచనకారుడయ్యాడు. అప్పుడు ఎన్నో సార్లు ప్రవచనాలకై అమెరికాదేశం వెళ్ళాడు. అక్కడ ఎన్నో నగరాలలో ఆధ్యాత్మిక ఉపన్యాసాలు ఇచ్చేవాడు.

అతడికి ఎంతో జ్ఞాన సంపద ఉన్నప్పటికి అతణ్ణి అమెరికా దేశంలోని అనేక విశేషాలు అతణ్ణి ఎంతగానో ఆకర్షించాయి. అక్కడ అతడి ప్రవచనాలు విన్న ఎంతోమంది అతనిని ఎన్నో విధాల పొగిడేవారు, ఎన్నో నగరాలలో ఎన్నో సత్కారాలు చేశారు. ఇదంతా అతనిలో కొంచెం అహంకారం కలిగేలా చేసింది. ఎంతటి వారినైనా ఈ అహంకారమే కదా అథోపాతాళానికి తోసివేసేది!.

ఇతడు తరువాత జన్మలో న్యూయార్క్ నగరంలో ఒక క్రైస్తవ కుటుంబలో జన్మించాడు. క్రైస్తవ మతంలో జన్మించినప్పటికి పూర్వజన్మ వాసనలచేత అతడు తన

యూనివర్సిటీ చదువులలో హిందుత్వం సబ్జెక్ట్ తీసుకున్నాడు. ఇంతకుముందు చెప్పుకొన్నట్టుగా ఆధ్యాత్మిక జ్ఞానం ఆత్మని జన్మజన్మల వరకు పట్టుకొని ఉండటం చేత ఇతడు హిందుత్వంపై పి.హెచ్.డి. తీసుకున్నాడు. అమెరికాలో ఒక పెద్ద యూనివర్సిటీలో ఒక సంస్థకు డైరెక్టర్ అయ్యాడు. హిందుత్వం మీద ఎన్నో పరిశోధనలు చేసాడు అమెరికా దేశంపై క్రిందటి జన్మలో ఎంతో వ్యామోహం ఉండటం చేత ఇలా అమెరికాలో జన్మించాడు. కాని జన్మ జన్మలనుంచి హైందవ మత సంబంధం ఉండటం చేత ఒక ప్రక్క ఆదివారాలు చర్చిలలో క్రీస్తుమతం గురించి ఉపన్యాసాలు ఇస్తూ మరొప్రక్క హిందూ శాస్త్రాలపై ఎంతో పరిశోధనలు చేసి, ఎంతో గొప్ప పేరు తెచ్చుకొని, తన జీవితం సుసంపన్నం చేసుకున్నాడు.

మనందరిని పూర్వజన్మ వాసనలు ఇలా వెంటాడుతుంటాయి. ఆ ప్రదేశాలు, ఆ మనుషుల దగ్గరకి తీసుకెళ్తూ ఉంటాయి. మనం ఏ మాత్రం ప్రయత్నం చేయకుండా, మనకి అసలు తెలియకుండా ఆ ప్రదేశాల వైపు, ఆ వ్యక్తులవైపు మనం ఆకర్షితులమౌతాం. ఒకోసారి మనకు మనం ఇలా ఎందుకు చేస్తున్నామో మనకి ఏమాత్రం అర్థంకాదు. ఇదంతా పూర్వజన్మ కర్మల, వాసనల పర్యవసానంగా మనం గుర్తించాలి.

అప్పటి జన్మలో హిమాలయాశ్రమంలో నాతో ఉన్న 108 మంది తరువాత కొన్ని జన్మలు ఎత్తి తిరిగి ఈ జన్మలో ఏదో రూపంలో నన్ను కలుసుకొంటున్నారు. నా తల్లిదండ్రులు, నా అత్తమామలు, నా అన్నదమ్ములు, నా అన్నదమ్ముల భార్యలు, నా పిల్లలు, వారి భర్తలు, వారి భార్యలు, వారి సంతానం, నా బంధువులలో కొందరు ఆజన్మలో నన్ను ఆ హిమాలయాశ్రమంలో కలిసినవారేనని గ్రహించాను. వీరందరు ఆ ఆశ్రమంలో నన్ను కలిసిన తర్వాత జన్మలలో వేరు వేరు దేశాలలో, వేరు వేరు మతాలలో, జన్మించి రకరకాల విధంగా జీవించి, ఎన్నో కష్టసుఖాలు అనుభవించి ఇప్పుడు ఈ జీవితంలో మళ్ళీ నన్ను కలుసుకున్నారు. వీరందరు నాతో ప్రత్యక్షంగా సంబంధం ఉన్నవారయ్యారు. మిగిలిన వారందరు ఎక్కడెక్కడి నుంచో ఆ ఆశ్రమానికి వచ్చి తరువాత జన్మలలో రకరకాల ప్రదేశాలలో వేరు వేరు కుటుంబాలలో జన్మించి ఈ జన్మలో ఆశ్చర్యకర రీతులలో నన్ను కలవడం గాని, నాతో ప్రత్యక్షంగా కలవడం గాని, ఫోన్ ద్వారా పరిచయం అవ్వడం గాని జరిగింది. అప్పటి హిమాలయ దివ్యాశ్రమంలో కలిసివున్నప్పటి గాఢ బంధం కారణంగా తిరిగి నన్ను ఈ జన్మలో కలుసుకున్నారు.

పూర్వజన్మల బంధాలు ఎంత విశేషంగా ఉంటాయో అని తెలియడానికి మరొక్క అద్భుత సంఘటన...అది 1987 సం॥ అప్పుడు నేను ఆల్విన్ కంపెనీలో ఇంజనీర్ గా ఉద్యోగం చేస్తూండేవాడిని. హాబీగా ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌లో మొదటిపేజీలో కార్టూన్ కాలమ్ వేసేవాణ్ని. అప్పటికింకా టి.వి. రాకపోవడంతో అందరూ పేపర్లు ఉత్సాహంగా చదువుతూండేవారు. అందున పేపరు వచ్చిందంటే ముందుగా మొదటి పేజీలో క్రింద ఉన్న కార్టూన్ చూసేవారు. ఇండియన్ ఎక్స్‌ప్రెస్ రామ్‌నాథ్ గోయంకా ఆధ్వర్యంలో అరుణ్ శౌరీ చీఫ్ ఎడిటర్‌గా ఎంతో దూసుకుపోతున్న రోజులవి. ఒకరోజు నాకు పంటి నొప్పి వస్తే ఆ రోజుల్లో ప్రముఖ దంత వైద్యుడు అయిన డాక్టర్ రామ్మూర్తి గారి వద్దకు వెళ్ళాను. వెయిటింగ్ రూంలో కూర్చొని ఉన్నాను. ఇంతలో ఒక పెద్దాయన వచ్చి నా ప్రక్కన ఉన్న గాద్రేజ్ కుర్చీలో కూర్చొని ఉన్నారు. ఆరోజుల్లో అన్ని చోట్ల అవే కదా ! గాద్రేజ్ కుర్చీలే ఉండేవి కదా !

నా ప్రక్కన కూర్చున్న వారు వయసులో పెద్దవారు. కాని పర్సనాలిటీలో చిన్నగా ఉన్నారు. పేషెంట్స్ ఎక్కువ మంది ఉండటంతో ఆ రోజు మా వంతు వచ్చేసరికి ఆలస్యమయ్యేలా ఉంది. ప్రక్కన కూర్చున్న ఆయన ఎంతకీ మాట్లాడడం లేదు. అప్పుడప్పుడు నా వంక చూసి చిరునవ్వు నవ్వుతున్నారు. ఇంక ఉండబట్టలేక నన్ను నేను పరిచయం చేసుకొని మీరు ఏమిచేస్తుంటారు అని అడిగాను. అందుకు ఆయన మళ్ళీ చిరునవ్వుతో నాపేరు వి.కె.రావు అండీ! నేను ఐ.సి.యస్. రిటైర్ అయ్యాను అన్నారు. అమ్మో మీరు ఐ.సి.యస్సా? ఎంత సౌమ్యంగా ఉన్నారో అనుకున్నాను. కాస్త నా గొప్ప చెప్పుకుందామనుకొని నా పేరు తిమ్మరాజు విశ్వపతి రామకృష్ణమూర్తి అండీ! ఆర్.ఇ.సి. వరంగల్ లో యం.టెక్. చదివి ఆల్విన్ లో ఉద్యోగం చేస్తున్నానండి అని చెప్పాను. ఇంజనీరా అదీ ఆర్.ఇ.సి.లో చదివారా అని సంతోషంగా అన్నారు. నేను మరో రెండు అడుగులు ముందుకు వేసి మా అమ్మగారు వాళ్ళు భోగరాజు వారు అండీ! నా భార్య వాళ్ళది తెనాలి, వాళ్ళ ఇంటిపేరు వల్లూరు అని అన్నాను. అప్పుడు ఆయన అలాగా! నా ఇంటిపేరు కూడా వల్లూరే! నా పూర్తిపేరు వల్లూరు కామేశ్వరరావు అని అన్నారు. అప్పుడు నేను ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌లో ఫ్రంట్‌పేజ్ కార్టూన్స్ వేస్తుంటానని వారికి చెప్పాను. ఆయన ఎంతో సంతోషపడి అలాగా! రోజు మీ కార్టూన్ చూస్తూంటాను. ఎంతో బాగుంటాయి నాకు మీ కార్టూన్స్ ఎంతో ఇష్టం అని అన్నారు. ఇంతలో ఆయనకు డాక్టర్ దగ్గర నుంచి పిలుపు రావడంతో లోపలకి వెళ్ళారు.

ఇది జరిగి 31 సం॥లు అయింది... నేను మళ్ళీ ఆయన్ని ఎప్పుడూ కలవలేదు. కొన్నాళ్ళక్రితం మురళికృష్ణ గారు అనే ఒకాయన ఫోన్ చేసి నా పుస్తకాల కోసం వస్తాను అని అన్నారు. అలాగే రమ్మన్నాను. ఆ మర్నాడు ఉదయాన్నే వచ్చారు. వచ్చి నాతో ఇలా అన్నారు. సార్ ! మీరు ఎవరో నిన్నటిదాకా నాకు తెలియదు. నాకు పుస్తకాలు ఎంతో ఇష్టం. ప్రతి ఆదివారం అబిడ్స్‌లో పాత పుస్తకాలు కొంటూ ఉంటాను. నిన్న బైక్ మీద లక్డికపూల్ మీదుగా వెళ్తుంటే రోడ్డు ప్రక్కన పాత పుస్తకాలు పెట్టి అమ్ముతుండడం చూసాను. ఇక్కడ ఎప్పుడూ చూడలేదే అని అనుకొంటూ బైక్ వెనక్కి తీసుకు వచ్చి ఆ పుస్తకాలు చూసాను. ఏవీ పెద్ద గొప్పగా అనిపించలేదు. తిరిగి బైక్ ఎక్కబోతుండగా వెనకాల గోడకు ఆనించి ఉన్న మధుర పథం అనే పుస్తకం కనబడింది. ఆ పుస్తకం నన్ను ఎంతో ఆకర్షించింది. దాని వెనుక రూ. 125/- అనే స్టిక్కరు ఉన్నది. ఆ పుస్తకం వెంటనే కొనుక్కొని అక్కడినుంచి బయలుదేరాను.

ఇంటికి వచ్చి పుస్తకం తెరవగానే మొదటి పేజీలో రచయిత పెన్నుతో వ్రాసిన ‘ శ్రీలక్ష్మీశ్రీనివాస కటాక్ష సిద్ధిరస్తు! ’ అని కనిపించింది. ఎవరికో మీరు ఆప్యాయంగా వ్రాసి ఇచ్చారన్నమాట ! నా అదృష్టం కొద్ది నాకు దొరికింది! అలా ఆ పుస్తకం చదవగానే మీ గురించి ఎన్నో విశేషాలు తెలిసాయి. మీరు వ్రాసిన పుస్తకాలు గురించి తెలిసింది. ఇది నా పూర్వజన్మ పుణ్యఫలం. దయచేసి మీ పుస్తకాలు ఇస్తారా అని అన్నారు. తప్పకుండా మురళీకృష్ణ గారు అని నా పుస్తకాలు అన్నీ ఇచ్చాను. కళ్ళకద్దుకొని తీసుకున్నారు. అప్పుడు ఆయన మీరు ఒకసారి మా ఇంటికి వస్తే సంతోషిస్తానండి అని అన్నారు.

నన్ను ఎందరో వాళ్ళ ఇళ్లకి రమ్మని ఎంతో ఆప్యాయంగా పిలుస్తుంటారు. కానీ నాకు బయటకి వెళ్ళడం ఇష్టం ఉండదు. ఇన్ని సంవత్సరాలుగా నా వద్దకు వచ్చి సన్నిహితులైన ఎందరో ఎంతో అభిమానంతో వాళ్ళ ఇళ్ళకి ఒకసారైనా రమ్మని ఎంతో ఆప్యాయంగా అడుగుతారు. కానీ నాకు ఎందుకో ఈ వ్యక్తి ఆరాధన అంత ఇష్టం ఉండదు. గడచిన 15 సం॥లలో నేను బహుశా 5 లేక 6 గురి ఇళ్ళకు మాత్రమే వెళ్ళి ఉంటాను. ఒకొక్కసారి మనస్సులో బాధ అనిపిస్తుంది. కానీ వాళ్ళందరి ఇళ్లకి వెళ్ళడం, వారందరు పొగడడం నాకసలు ఇష్టం ఉండదు.

మీ ఇళ్లు ఎక్కడ మురళీకృష్ణ గారు అని మాటవరసకు అడిగాను. మా ఇల్లు శ్రీనగర్ కాలనీలో సార్ ! సీనియర్ ఐ.సి.యస్. వి.కె.రావుగారి ఇంటి ప్రక్క ఇల్లే!

అని అన్నారు. అది విన్న నా ఒళ్ళు ఝుల్లుమంది. నేను ఎంతో ఆశ్చర్యపోతూ అయితే నాకు ఒక సహాయం చేసి పెడతారా అని అడిగాను. ఆయన అయ్యో అంతకంటే భాగ్యం ఏముంటుంది సార్ చెప్పండి అని అన్నారు. నేను మురళీకృష్ణ గారికి నా శ్రీవారి దర్శనం పుస్తకం, కార్టూన్స్ పుస్తకం ఇచ్చి అవి వి.కె.రావు గారికి అందజేయమన్నాను. పుస్తకాలు ఇచ్చినప్పుడు వీలుంటే ఆ పెద్దాయనతో ఒక ఫొటో దిగి వాట్సాప్‌లో పంపమన్నాను. ఓ అలాగే అని అన్నారు.

మరుసటిరోజు నాకు మురళీకృష్ణగారు ఫోన్ చేసారు. విశ్వపతిగారూ మీరు చెప్పినట్లే వి.కె. రావుగారికి మీ పుస్తకాలిచ్చాను. ఆయనెంతో సంతోషపడ్డారు. వారు జ్వరంతో మంచంమీద పడుకొని ఉన్నారు. చేతులు ముందుకు చాపి మీ పుస్తకాలు రెండు తీసుకున్నారు అయితే మీరు ఫొటో పంపమన్నారు కదా ! నాదగ్గర ఉన్నది మామూలు ఫోన్! దీంట్లో కెమెరా కూడా లేదు. ఎలామరి అనుకొని వెంటనే రోడ్డుమీదకు వచ్చాను. ఎవరో పిల్లవాడు స్కూటర్ మీద ఆ వీధిలో వెళ్తున్నాడు. ఒక్కసారి అతణ్ని ఆగమని బాబూ నీ దగ్గర వాట్సప్ ఫోన్ ఉందా అని అడిగాను...ఆ పిల్లవాడు ఉంది అని అన్నాడు. బాబ్బాబు చిన్న సహాయం చేస్తావా? నీ ఫోన్‌తో ఒక ఫొటో తీసి ఒక సార్ కి పంపుతావా? అని ప్రాదేయపడ్డాను నా అదృష్టం కొద్ది అతను ఒప్పుకున్నాడు. అతణ్ని వెంటనే లోపలకి పిలిచి వి.కె.రావు గారికి పుస్తకాలు ఇస్తున్నట్లు ఫొటో తీయించుకున్నాను. ఆ పిల్లాడి ఫోన్ నుంచి మీకు ఫొటో పంపించాను అని అన్నారు.

అప్పుడు నేను మురళీకృష్ణ గారూ మీకు ఎంతో కృతజ్ఞుణ్ని అని అన్నాను. దాందేముందు విశ్వపతిగారూ! మీ పుస్తకాలు, మీ వంటి వారి పరిచయం అవ్వడం నా అదృష్టం అని అన్నారు. నా కార్టూన్స్ ఎంతో ఇష్టపడే వి.కె. రావుగారికి నా కార్టూన్ కలెక్షన్ బుక్ చేరడం నాకు ఎంతో సంతోషం కలిగించింది. ఇది జరిగి ఒక రెండు మూడు రోజులయింది. ఉదయాన్నే పేపరులో కనబడిన వార్త నన్ను షాక్‌లో పడవేసింది. అదేమిటంటే మాజీ ఐ.సి.యస్ అధికారి వి.కె.రావుగారు ఇకలేరు అన్నది. ఒక్కసారిగా నా బ్రెయిన్ స్థంభించింది! ఆయన వయస్సు 104 సంవత్సరాలు! బ్రిటీష్ కాలంనాటి చివరి ఐ.సి.యస్. ఆఫీసర్ ఆయనే! 1914 వ సం॥లో పుట్టిన ఈయన 1937 లో అప్పటి ఐ.సి.యస్. లో చేరారు. ఎన్నో గొప్ప పదవులు నిర్వహించి వీరు ఆంధ్రప్రదేశ్ చీఫ్ సెక్రటరీగా పనిచేశారు. మాజీ రాష్ట్రపతి శ్రీ నీలం సంజీవరెడ్డిగారి దగ్గర ప్రిన్సిపల్ సెక్రటరీగా కూడా చేశారు. అంతటి గొప్ప

వ్యక్తి వద్దకు ఎటువంటి ఆశ్చర్యకరమైన పరిస్థితులలో నా పుస్తకాలు చేరాయో చూడండి.

నా పుస్తకాలు రోడ్డు మీద మురళీకృష్ణ గారికి దొరకడం ఏమిటి ! అందునా కేవలం 1000 కాపీలు మాత్రమే అదీ నా సన్నిహితులకు ఇద్దామని ఆశీర్వచనంతో రాసిన మధురపథం పుస్తకం రోడ్డుమీదకి రావడం... అది ఈ మురళీకృష్ణగారికి దొరకడం...ఆయన రావుగారి ప్రక్క ఇంట్లోనే ఉండడం...ఎవరో అపరిచిత కుర్రవాడి సెల్‌ఫోన్‌లో ఫొటో తీయడం... భగవంతుడి లీలలు, పూర్వజన్మ బంధాలు ఎలా ఉంటాయో చూడండి.! శ్రీ వేంకటేశ్వర స్వామి లీలా విశేషాలతో ఉన్న శ్రీవారి దర్శనం, కార్టూన్స్ పుస్తకం వారు కాలంచేసే ముందు వారికి చేరడం భగవంతుడి లీలా విశేషం కాక మరేమిటి!

మురళీకృష్ణగారు ఆ రోజు ఆ రోడ్డులో వెళ్ళకపోయినా, అక్కడ నా పుస్తకం పైన మరో నాలుగు పుస్తకాలు ఉండి అది కనబడక పోయినా, ఇవన్నీ జరిగినా కూడా ఈయన వి.కె.రావు గారి ఇంటిప్రక్కన కాకుండా, ఇంత మహానగరంలో మరొక చోట ఉన్నా, శ్రీ రావుగారికి నా పుస్తకాలు చేరేవి కాదు కదా! దీన్నే ఇంగ్లీష్‌లో అంటారు గాడ్స్ గ్రాండ్ డిజైన్ ఆఫ్ థింగ్స్ అంటారు...శ్రీ రావుగారు కూడా ఆ జన్మలో హిమాలయాశ్రమంలో నన్ను కలసినవారే! అప్పటి బంధం వలననే ఇంతటి విచిత్రకర పరిస్థితులలో వారిని కలవడం చివరి రోజుల్లో వారి వద్దకు నా పుస్తకాలు చేరడం జరగింది.

మళ్ళీ మనం హిమాలయాశ్రమం దగ్గరకు వద్దాం. ఈ విధంగా నాతోపాటు అప్పుడు ఉన్న 108 మందితో పాటు ఆ దివ్యాశ్రమానికి కొందరు సిద్ధులు, యోగులు కూడా కలిసి వచ్చేవారు. వారు హిమాలయాలలో సంచరిస్తూ అదృశ్య రూపంలో వచ్చి నన్ను కలిసేవారు. ఆ జన్మలో నేను అక్కడ ద్వాపరయుగంలోని మహర్షులను కూడా చూసాను. నా ఆశ్రమానికి కూడా వారు కొందరు రావడం కూడా జరిగింది. వారు 18 నుంచి 24 అడుగుల ఎత్తు ఉండేవారు. ఎంతో తేజస్సుతో ప్రకాశిస్తూ ఒక్కొక్కరు ఒక్కొక్క దేవతలా ఉండేవారు. వారు కొన్ని వేల సంవత్సరాలుగా దివ్య శరీరాలతో అక్కడ హిమాలయాలలో సంచరిస్తున్నారు.

హిమాలయాలు ఈ భూమి మీద అత్యంత పవిత్ర ప్రదేశం. ఇటువంటి మహర్షుల దర్శనం ఇంకా కొంతమంది సాధకులకు కూడా జరుగుతూ ఉంటుంది. భారతదేశంలో అనేక కాలాలలో నివసించిన, ఇప్పటికి ఉన్న అనేకమంది మహానుభావులకు హిమాలయాలకు వెళ్ళినప్పుడు వీరి దర్శనం లభించింది. మనం సాధనలో ఎంతో ఎత్తుకు ఎదిగితే మనం ఉన్నచోటుకే ఈ మహాపురుషులు వచ్చి దర్శనమిస్తారు. ఇప్పటికీ నేను ఇంటిలోనే ఉండి ధ్యానంలో ఉన్నత స్థాయికి వెళ్ళినప్పుడు హిమాలయ ప్రాంతాలలో కాసేపు గడిపి వస్తాను. అప్పుడక్కడ అనేకమంది మహర్షుల దర్శనం లభిస్తుంది. ఇలా ఎన్నో సార్లు ఈ మహర్షుల దర్శనం కలగడం వారితో సంభాషించడం జరిగేది. ఇలాగే కొన్ని సార్లు అక్కడ దేవతలు కూడా దర్శనమిచ్చేవారు.

ధ్యానంలో హిమాలయాలకు వెళ్ళినప్పుడు నాకు ఎందరో దేవతల దర్శనం లభించింది. కేవలం దర్శనమే కాకుండా వీరి ద్వారా నాకెన్నో దివ్య సందేశాలు కూడా వచ్చాయి. అందువలననే నేను ఇంతమంది దేవతలకు సంబంధించిన అనేక వ్రత పుస్తకాలు రచించడం జరిగింది. ఈ పుస్తకాలన్నీ వారే నాచేత వ్రాయించారు. వాటిలోని ప్రతీ అక్షరం వీరందరు అనుగ్రహించినదే! అందుకే ఈ రోజున ఈ పుస్తకాలన్నీ ప్రపంచం నలుమూలలా వ్యాపించడం, చదివినవారికి అద్భుతాలు జరగడం మనందరం చూస్తున్నాము.

సాక్షాత్తు దేవతలే అనుగ్రహించిన పుస్తకాలు కాబట్టి అవి చదువుతున్నప్పుడు చదువుతున్నవారి శరీరమంతా దివ్య తరంగాలు ప్రసరిస్తున్నాయి. ఆ అక్షరాలకు అంతశక్తి ఉన్నది. ఆ శక్తి చేత అవి చదివినవారికి ఎన్నో శుభాలు జరుగుతున్నాయి. ఎంతో మంది అనారోగ్యం నుంచి బయటపడి చక్కటి ఆరోగ్యం పొందుతున్నారు. వాళ్ళు అనుభవిస్తున్న అనేక కష్టాలనుండి బయటపడుతున్నారు. ఈ పుస్తకాలన్నీ సాక్షాత్తు దేవతలచేతనే ప్రేరేపింపబడడం వలన ఈ పుస్తకాలు చదువుతున్నంతసేపు వారి చుట్టూ గొప్ప కాంతి వలయాలు ఏర్పడి వారు ఎల్లవేళలా రక్షింపబడుతున్నారు.

ఎందరో మహర్షులు ఇప్పటకీ హిమాలయాలలో సంచరిస్తూ కొంతమంది సాధకులకు కనబడుతూనే ఉంటారు. అసలు హిమాలయాలలో ఇప్పటకీ ద్వాపరయుగం నాటి, మహాపురుషులు, మహర్షులు, సిద్ధులు, యోగులు

తిరుగుతుంటారని అప్పుడప్పుడు సాధకులకు దర్శనమిస్తుంటారని చాలామందికి తెలియదు. ఇది సామాన్య మానవులకు అర్థంచేసుకోవడానికి కూడా కష్టం. చాలామందికి ఇది నమ్మశక్యం కూడా కాదు. ఇలా దర్శనం లభించిన వారిలో చాలామంది వేరే ఎవరితోను ఈ విషయాలు చెప్పరు.

ఈ పుస్తకం వ్రాస్తున్నంత కాలం నేను వీరందరితో అనుసంధానమై ఉన్నాను. ఇప్పటివారికే కాక ముందు తరాల వారికి కూడా ఇటువంటి అద్భుత విషయాలు తెలియపరచాలనే ఉద్దేశంతో ఈ పుస్తకం రచిస్తున్నాను. ఎన్నో దివ్యశక్తులు కలిగిన ఇటువంటి మహాపురుషులు ఈ భూమిపై అనేక ప్రదేశాలో, అనేక సమయాలలో ఇంతకు ముందు జీవించారని, ప్రస్తుత కాలంలో కూడా జీవిస్తున్నారని నలుగురికి తెలియచెప్పడమే ఈ పుస్తకం యొక్క ముఖ్య ఉద్దేశ్యం. ఈ విషయాలన్నీ తెలుసుకుంటే ప్రజలందరు ఎంతో ఆనందపడి ముక్తిమార్గం వైపు పయనించగలుగుతారని ఆ మహర్షుల యొక్క నమ్మకం.

హిమాలయ ప్రాంతాలలో ఉండే సిద్ధులు, యోగులు, ఇంతకు ముందు చెప్పినట్లుగా ఈ విశ్వం మొత్తానికి కారణభూతమైన దివ్యశక్తి నిర్దేశించిన కార్యక్రమాలు నిర్వర్తించి తిరిగి హిమాలయాలకు వెళ్ళిపోతారు. గంగానదీ ప్రాంతంలో జన్మించిన ఒక గొప్ప షహనాయి విద్వాంసుడు ఇలా జన్మించిన హిమాలయ సిద్ధుడే! ఇలాగే మరొక సిద్ధుడు ఒక గొప్ప మృదంగ విద్వాంసునిగా జన్మించాడు. మరొక సిద్ధుడు గొప్ప సంగీతకారుడిగా ప్రసిద్ధిపొందారు.

మరొక సిద్ధుడు మహారాష్ట్రలో గొప్ప సంగీతకారుడిగా జన్మించాడు. చిన్నప్పటినుంచే ఎంతో గొప్పగా భగవన్నామ సంకీర్తన చేశారు. వీరందరు భగవంతుని అనేక విధాల సేవిస్తూ వారి వారి కార్యక్రమాలతో సామాన్య మానవులకు కూడా ఎంతో ఆనందం కలిగించి భగవంతునికి చేరువగా తీసుకెళ్తున్నారు. వీరందరు తాము గత జన్మలలో ఎక్కడ ఉన్నాము? ఎక్కడ నుంచి వచ్చాము? అన్న విషయాలు వారికి తెలిసినప్పటికి ఎవరికి చెప్పరు. జీవించినంత కాలం ఒక నిర్దిష్ట గమ్యంతో జీవించి తమ కార్యం పూర్తికాగానే ఆ జన్మ చాలించి తిరిగి హిమాలయ ప్రాంతాలకే వెళ్ళి మళ్ళీ తమ తపస్సులోకి వెళ్ళిపోతారు.

మళ్ళీ నేను నాలుగు జన్మల క్రితం ఉన్న హిమాలయ ఆశ్రమపు దివ్యాశ్రమపు విశేషాలకు వద్దాం. అప్పుడు నన్ను కలిసి నాతో పాటు కొన్ని

సంవత్సరాలు ఆ ఆశ్రమంలో ఉన్న 108 మంది, తరువాత జన్మలలో నన్ను కలిసిన వారు, ఎంతో మంచి నడవడికతో జీవించి ప్రస్తుత జన్మలో ఎంతో విలువలతో జీవిస్తున్నారు. అయితే వీరు ఈ జన్మలో ఎన్నో కష్టాలు, భరించలేని అవమానాలు పడుతున్నారు. వీరిలో చాలామందికి తమ ఉద్యోగంలోను, నిత్యజీవితంలోను అనుకున్నవన్నీ సాఫీగా జరగవు. కొంతమందికి అనుకోని రీతిలో అనారోగ్యం కూడా కలుగుతుంటుంది. వారి భార్య భర్తలకు గాని, సంతానానికి గాని ఎన్నో కష్టాలు కలుగుతుంటాయి. దాని వలన వీరికి మనశ్శాంతి ఉండదు. కారణం ఏమిటంటే వీరి ప్రారబ్ధకర్మ క్షయం అయిపోతుందన్నమాట ! అందుచేత వీరు గత జన్మలలో మూటకట్టుకున్న పాపాన్ని కొన్ని జన్మలనుంచి అనేక కష్టాల రూపంలో అనుభవిస్తూ వస్తున్నారు.

వీరు ఇప్పటినుంచి కొన్ని జన్మలలో ఈ ప్రారబ్ధకర్మ పూర్తిగా అనుభవించి తరువాత కొన్ని ఉత్తమ జన్మలు పొంది ఈ మానవాళికి ఎంతో ఉపయోగపడే కార్యాలు చేస్తారు. వీరిలో కొందరు రాబోయే జన్మలలో గొప్ప ప్రవచన కారులై ఎంతోమంది సామాన్యులను దైవభక్తివైపు నడిపిస్తారు. కొంతమంది మంచి విద్యాలయాలు నెలకొల్పుతారు. మరికొంతమంది ఎంతో గొప్ప సంఘసేవకులౌతారు. మరికొంతమంది ఎంతో ధనవంతులై ఈ సమాజానికి ఉపయోగపడే మంచి పనులు ఎన్నో చేస్తారు.

అందుకనే వీరందరు ఈ జన్మలో పడుతున్న బాధలు గురించి మనశ్శాంతి కోల్పోవద్దు. కొన్ని జన్మల తరువాత ఎన్నో ఉత్తమ జన్మలు లభించి వీరికి జన్మరాహిత్యం కలిగి ఇంక ఆ మహాశక్తిలో లీనమౌతారు. దీంట్లో ఏమాత్రం అనుమానం లేదు. మీ పూర్వజన్మల ప్రారబ్ధకర్మలు అనుభవించడానికే ఈ జన్మలో మీ ఆత్మ ఇలా అనేక కుటుంబాలలో ఈ రూపాలతో జన్మించిందని గ్రహించండి. మీకు జరిగే అవమానాలు, అనారోగ్యాలు అన్నీ ఈ ప్రారబ్ధకర్మ పూర్తిగా తీరుపోవడానికే అని గ్రహించండి. ఇక మీకు కొన్ని జన్మలు మాత్రమే మిగిలిఉన్నాయి. ఈ విషయం గ్రహించి మీరందరు అత్యంత ఆనందంగా ఉండండి.

ఇక్కడ మరో విషయం కూడా చెప్పదలచుకున్నాను. ఇలా ప్రస్తుత జన్మలో ఎంతో కష్టపడుతూ, నిత్యం ఎన్నో అవమానాలకు గురవుతూ ముమ్ముందు కేవలం అతికొద్ది ఉత్తమ జన్మలలో జన్మించి, ఇక జన్మరాహిత్యానికి చేరువ అవుతున్నవారు ఈ

ప్రపంచంలో ఇంకా చాలామంది ఉన్నారు. ఇన్ని వేల సంవత్సరాలుగా ఎంతోమంది మహానుభావులకు భగవద్దర్శనం కలిగింది, జన్మ రాహిత్యం కూడా లభించింది. అలాగే ఇప్పుడు కూడా ఎన్నో దేశాలలో ఎన్నో మతాలలో నివసిస్తున్న కొంతమందికి కూడా త్వరలోనే జన్మరాహిత్యం కలుగుతుంది.

నేను నన్ను పూర్వజన్మలలో కలిసిన అనేక మందిలో కొంతమంది గురించి మాత్రమే ఈ పుస్తకంలో రాస్తున్నాను. వీరే కాక ఇంకా నా బంధువులలోను, నా మిత్రులలోను మరికొందరు కూడా ఇంకా కొన్ని జన్మలతోనే జన్మరాహిత్యాన్ని పొందగలుగుతున్నారని గమనించాను. ఇక్కడ నేను చెప్పే విషయమేమిటంటే ఇలా ఎందరో మంచి మార్గంలో జీవిస్తూ ఇక కొన్ని జన్మలతోనే ఈ జనన మరణ చక్రంలోని బయటపడి జన్మరాహిత్యం పొంది ఆ పరబ్రహ్మమూర్తి లో ఐక్యమవుతారు. ఇటువంటి వారిని కొంతమందిని అప్పుడప్పుడూ నేను కలవడవం కూడా సంభవించింది. వీరిలో కొంతమందికి ఈ విషయం చెప్పడం కూడా జరిగింది. ఇక ముందు  కూడా కొందరు నన్ను కలవబోతున్నారు.

తరతరాలుగా మనం ఎందరో మహానుభావుల్ని చూసాము. వారందరు ఇక జన్మలు లేకుండా ఆ మహాశక్తితో ఐక్యమైపోయారు. వీరిలో కొందరు ఎన్నో వేల మానవ జన్మలు అనుభవించి సత్ప్రవర్తనతో ధర్మపథంలో జీవనం సాగించి చివరకు ఒక మహానీయ పురుషునిగానో, స్త్రీ గానో జన్మించి అటుతరువాత ఆ మహాశక్తిలో ఐక్యమైపోయారు. అందుకే ఇటువంటి మహానుభావులలో చాలామంది చివరి జన్మలో ఎంతో దారిద్రంతో, అనేక కష్టాలు పడుతూ జీవించడం మనం గమనిస్తుంటాము. అంత్యకాలంలో వీరిలో కొందరు అనేక శరీర బాధలతో ఎంతో బాధపడడం కూడా మనం గమనిస్తుంటాము. అయితే వారు ఆ శరీర బాధలన్నిటికి చిరునవ్వుతో ఈ బాధ శరీరానికి గానీ, నా ఆత్మకు కాదు అని చెప్పడం మనం గమనిస్తుంటాము. మనకు ఎన్నో జన్మల పుణ్యఫలం ఉంటే అటువంటి మహనీయుల వద్ద, వారికి దగ్గరగా కొంతకాలమైన గడుపగలుగుతాము. అటువంటి మహానుభావులను జీవితంలో ఒక్కసారి దర్శించినా మన జీవితం కూడా ఎంతో సంస్కారవంతమౌతుంది.

ఈ సృష్టి ప్రారంభం నుంచి అనేక యుగాలు జరిగాయి. కృత యుగం, త్రేతాయుగం, ద్వాపరయుగం, కలియుగం. ఇలా ఈ నాలుగు యుగాలు తిరిగి తిరిగి

వస్తుంటాయి. ఇలా కొన్ని యుగాలు కలిసి మహాయుగం ఏర్పడుతుంది. అయితే చాలామంది భావించేటట్లు ప్రతీ యుగం చివరన ప్రళయం సంభవించదు. ఉదాహరణకు ద్వాపరయుగం అవగానే ప్రళయం వచ్చి భూమండలం అంతా నీట మునిగిపోవడం జరుగలేదు. శ్రీకృష్ణుల వారి నిర్యాణంతో ద్వాపరయుగం పూర్తి అయింది. మరుక్షణమే కలియుగం ప్రారంభం అయింది. అప్పుడే పెద్ద ఉప్పెన వచ్చి ద్వారక మునిగిపోయి సముద్రగర్భంలో కలిసిపోయింది.

అలా సముద్రానికి దగ్గరగా ఉన్న ఎన్నో ప్రాంతాలు నీటమునిగిపోయాయి. అంతే గాని భూమండలం మొత్తం నీటమునగలేదు. మరొక విషయేమిటంటే ద్వాపర యుగం ముగిసినప్పటికి, అప్పటివరకు జీవించిన వ్యక్తులందరు వారి వారి ప్రారబ్ధకర్మలను బట్టి తిరిగి కలియుగంలో అనేక దేశాలలో జన్మించారు. అంతేకాని ద్వారపయుగంలో మరణించినవారందరూ ఆ మహాశక్తితో కలిసిపోయారని అనుకోకూడదు.

మహాభారత యుద్ధంలో మరణించిన సైనికులు, రాజులు, అందరు తరువాత జన్మలలో వారి వారి పూర్వ జన్మ కర్మ ఫలాలను బట్టి కలియుగంలో జన్మించి అనేక వేల జన్మలెత్తుతూ ఇప్పటికి మనమధ్యనే అనేక రూపాలలో తిరుగుతున్నారు. అప్పటి చక్రవర్తులు, రాజులు, పండితులు, సామాన్యులు అందరూ అనేక వేల జన్మలెత్తుతూ తిరిగి అనేక పుణ్య, పాపకర్మాలు చేస్తూ తిరిగి తిరిగి ఈ జనన మరణ చక్రంలోనుంచి బయటకు రాలేకపోతున్నారు. అయితే వీరిలో కొందరికి పూర్వజన్మల వాసనలు పూర్తిగా పోక ఇంకా ఆ గుణాలకు కొంతవరకు కలిగి ఉన్నారు. ఆత్మని గాఢంగా అంటుకున్న కొని గుణాలు ఎన్నో జన్మలకి గాని, ఎంతో తీవ్రప్రయత్నంచేత గాని పోవు.

వారిలో కొందరు మహనీయులు మాత్రం ఈ కలియుగ ప్రారంభం కాగానే కొన్ని జన్మలు మాత్రమే జన్మించి గొప్ప గొప్ప పుణ్యకార్యాలు చేసి తిరిగి ఆ దివ్యశక్తిలో కలిసిపోయారు. ఇక్కడ ఇంతకు ముందు చెప్పినట్టుగా ఒక విషయం గ్రహించాలి. మనం ప్రతీ జన్మలో ఒకే ప్రాంతంలో తిరిగి తిరిగి పుట్టాలని లేదు. ఈ జన్మలో భారతదేశంలో పుడితే మరుజన్మలో ఏ అమెరికాలోనో, రష్యాలోనో, ఆఫ్ఘనిస్తాన్‌లోనో, పాకిస్తాన్‌లోనో ఎక్కడో పుట్టవచ్చు. అంతేకాని మళ్ళీ ఇక్కడే ఇదే మతంలో ఇదే కులంలో జన్మించడం అనేది జరుగదు. ఎక్కడో కొన్ని కోట్లలో ఒకరు

మాత్రమే అలా తిరిగి తరువాత జన్మలో కూడా అదే కుటుంబంలో జన్మించడం జరుగుతుంది. అది కూడా మహాఅయితే ఒక రెండు మూడు జన్మలు మాత్రం ఆ కుటుంబంలో జన్మిస్తారు. అటు తరువాత పూర్వ జన్మలలో ఏర్పడిన బంధాలు వలన ఎక్కడెక్కడో వేరే ప్రాంతాలలో వేరే కుటుంబాలలో జన్మిస్తారు.

అలాగే ప్రతీసారి మళ్ళీ మానవజన్మయే లభిస్తుందని కూడా లేదు. మనం చేసే పుణ్య పాపకార్యాల ఫలితంగా ఒకొక్కసారి తరువాత జన్మలలో ఏదో జంతువుల గానో, ఏదో పక్షుల లాగానో కూడా జన్మించవచ్చు. ఇక్కడ మనందరికి ఒక అనుమానం రావచ్చు. జంతువులు, పక్షులు ఎప్పటికీ అదే జన్మలలో ఉంటాయా అని ! అలా ఎన్నటికీ కాదు! ఒక్కొసారి ఈ జంతువులు కూడా ఎంతో సాధుస్వభావం కలిగి, అనేక జన్మలు జీవించి, ప్రతీ జన్మలోను అంతే సాధుస్వభావంతో ఉండి, అదికూడా కొన్ని పుణ్యస్థలాలలో జన్మించి, తరువాత మానవజన్మను పొందుతాయి.

కొన్ని వందల సంవత్సరాల క్రితం ఎంతో పుణ్యక్షేత్రమైన కాశీపట్టణంలో కృష్ణమోహన్ శర్మ అనే మహాపండితుడుండేవాడు అతడు తన జీవిత చివరికాలంలో ఇరవై సంవత్సరాలపాటు దీర్ఘమైన తపస్సు చేశాడు. తనకు ఒకటే కోరిక తనకు రాజయోగం కలగాలి. వచ్చే జన్మలో సమాజంలో ఎందరిమీదో అధికారంచేసే పదవి కావాలి. అలా ఇరవై సంవత్సరాలు తపస్సు చేసి అతడు తనువు చాలించాడు.

తరువాత జన్మలో అతడు మహారాష్ట్రలో ఒక సామాన్య రైతు కుటుంబంలో పుట్టాడు. తండ్రితోపాటు వ్యవసాయపనులకు వెళతుండేవాడు. అలా కొంతకాలం గడచిన తరువాత ఒకనాడు ఆ ఊరికి ఒక సాధువు రావడం జరిగింది. ఆ సాధువుని చూడగానే అతని అంతరాత్మకి ఒక్కసారిగా పూర్వజన్మవాసనలు గుర్తుకువచ్చాయి. బయటకు కారణం చెప్పలేకపోతున్నాడు కాని ఎందుకో ఆ సాధువుపట్ల ఎంతో ఆకర్షితుడయ్యాడు.

ఆ సాధువు రోజు ఉదయం ధ్యానం చేసుకునేవాడు. ఇతడు కూడా ఆ సాధువు వద్దే ఉండి ధ్యానం చేసేవాడు. తండ్రి వ్యవసాయపనులకు రమ్మని ఎంత వత్తిడి చేసినా ఏ మాత్రం వినేవాడు కాదు. ఆ సాధువు వద్దే ఉండిపోయేవాడు. చివరికి ఒకనాడు ఆ సాధువు ఆ ఊరు వదలి వేరే ఊరు వెళ్ళిపోయాడు. కాని ఇతను మాత్రం ధ్యానం వదల్లేదు. ఒకచిన్న ఆశ్రమం నిర్మించుకొని రోజు గంటలు తరబడి ధ్యానం చేస్తూండేవాడు.

ఇలా ఒకనాడు ధ్యానంలో ఎంతో ఉన్నత స్థాయికి వెళ్ళినప్పుడు అతడికి తన పూర్వజన్మ వృత్తాంతం తెలిసింది. సమాజంలో ఏదైనా ఉన్నత స్థానం పొందాలని ఎక్కువ మంది ప్రజలను శాసించే స్థాయి కలగాలని ఆ జన్మలో తాను తపస్సు చేయడం గుర్తుకు వచ్చింది. అంతే! అప్పటినుంచి తిరిగి మళ్ళీ అదే కోరికతో కొన్ని సంవత్సరాలపాటు ధ్యానం చేసాడు.

అటుతరువాత రెండు జన్మలు  కూడా ఈ విధంగా అదే కోరికతో ఉంటూ కొన్ని సంవత్సరాలపాటు ధ్యానంలో ఉన్నాడు. పూర్వజన్మ పుణ్యఫలంగా తరువాత జన్మలో అతడు పెద్ద పదవిని పొంది ఎన్నో లక్షల మందిని శాసించే వ్యక్తి అయ్యాడు.

అయితే ఈ జన్మలో అతను ఎన్నో పాపపు పనులు చేసి, ఎన్నో అన్యాయాలు చేసి అటుతరువాత ఎన్నో జన్మలు హీనాతిహీనంగా బ్రతికాడు. ప్రస్తుత జన్మలో అతడు అతిహీన స్థితిలో రెండు పూటలా భోజనానికి కూడా లేకుండా జీవిస్తున్నాడు. ఇది వినడానికి ఎంతో నమ్మశక్యంగా లేనప్పటికీ ఇది సత్యం.

ఇలా ఈరోజు మనం సమాజంలో చూస్తున్న పెద్ద పెద్ద పదవులలో ఉండి ఎంతో అధికారం చలాయిస్తున్నవారిలో కొందరు క్రిందటి జన్మలలో గొప్ప యజ్ఞ యాగాలు చేస్తూ కేవలం ఇటువంటి పదవులపై తీవ్రమైన ఆకాంక్ష పెట్టుకొన్నవారే. వీటి ఫలితంగా వారికి తాత్కాలికంగా ఒక జన్మలో కొన్ని పదవులు లభించినా అనేక పాపాలు చేసి వీరిలో చాలామంది అతి సామాన్య జీవితాలు అనుభవిస్తారు. అలా కాక ఈ జన్మలో అధికారం పొందినప్పటికి పుణ్యకార్యాలు చేస్తూ సత్ప్రవర్తనతో జీవిస్తే తరువాత జన్మలలో సంతోషకర జీవితాన్ని గడుపగలుగుతారు.

ఈమధ్య నేను రామారావు అనే ఒక వ్యక్తిని కలవడం జరిగింది. అతడు చిన్న ఉద్యోగం చేస్తూ ఎన్నో కష్టాలకు లోనవడం చూసాను. ఇన్ని కష్టాలు పడుతున్నప్పటికి అతనిలో అహంకారం ఏమాత్రం తగ్గలేదు. ఒకరోజు అతని ప్రవర్తనకు కారణం నాకు అర్థమయ్యింది. అతడు క్రిందటి జన్మలో అమెరికాలో ఒక రాష్ట్రంలో ఒక గవర్నరు పదవి పొందాడు. అక్కడ చాలా పలుకబడి కలిగిన వ్యక్తిగా జీవించాడు. తన అధికారంతో ఎంతో మందిని హింసించాడు. స్త్రీలతో అనుచితంగా ప్రవర్తించి తరువాత అతి సామాన్య జన్మలు పొంది అనేక కష్టాలు అనుభవిస్తూ జీవించాడు. అతడే ఈ జన్మలో ఈ రామారావుగా జన్మించాడు. ఆ జన్మలో అంత గొప్ప పదవిలో ఉన్నాకూడా, అప్పుడు చేసిన పాపాల వలన ఈ జన్మలో ఎన్నో కష్టాలు పడుతున్నాడు.

చాలా మంది నా పేరులో ఉన్న 'విశ్వపతి' ఒక బిరుదు అనుకుంటారు. కాని ఇది నా పేరులోని భాగమే! నా పేరులో విశ్వపతి అని రావడం వెనుక ఒక కథ ఉంది. ఆ కథ కూడా కాశీతో ముడిపడి ఉండటం విశేషం. మా అమ్మగారికి శారద అనే చెల్లెలు ఉండేది. తన తరువాత కాశీపతి అనే తమ్ముడు ఉండేవాడు. మా తాతమ్మగారు కాశీకి వెళ్ళి వచ్చిన తరువాత ఈ పిల్లవాడు పుట్టడంతో అతడికి కాశీపతి అనే పేరు పెట్టారు. మా శారద పిన్నికి ఈ కాశీపతి అంటే ఎంతో ప్రాణం. దురదృష్టవశాత్తు కాశీపతి పుట్టిన కొన్ని నెలలకే మరణించాడు. అటుతరువాత కొంతకాలానికి శారద పిన్ని కూడా దురదృష్టవశాత్తు టైఫాయిడు వచ్చి కన్ను మూసింది. తరువాత కొన్ని నెలలకే అమ్మకి నేను పుట్టాను. పుట్టిన అయిదవరోజు నాటి రాత్రి నేను ఒకటే ఏడవసాగాను. ఎవరు ఎంతగా ప్రయత్నించినా నేను ఏడుపు మానలేదు. ఇంతలో అమ్మకి చిన్నగా కునుకు పట్టింది.

ఆ నిద్రలో అమ్మకి కలలో శారద పిన్ని కనబడింది. అమ్మతో ఇలా అన్నది. అక్కా! వీడికి కాశీపతి అనే పేరు పెడతావా? అని అన్నది. అయితే అమ్మ దానికి ఏ సమాధానం చెప్పలేదు. ఇలా ఒకటి రెండుసార్లు శారద పిన్ని అమ్మని అడిగినా ఏ సమాధానం చెప్పలేదు. అప్పుడు మళ్ళీ ఇలా అంది. అక్కా! పోనీలే! కాశీపతి తమ్ముడు చనిపోయాడు కదా! అందుకని వాడిపేరు పెట్టడం నీకు అంత ఇష్టం ఉన్నట్లు లేదు! పోనీ విశ్వపతి అని పెట్టు! అని అన్నది. అందుకు అమ్మ సరేనని ఒప్పుకుంది. అప్పుడు శారద పిన్ని విశ్వపతి అనే పేరు అమ్మని మూడుసార్లు చెప్పమని అంది. అమ్మ అలా మూడుసార్లు చెప్పగానే పిన్ని మాయమైంది. కల చెదిరిపోయింది. ఆశ్చర్యంగా నేను వెంటనే ఏడుపు మానేశాను. అమ్మ ఈ విషయం పెద్దవాళ్ళందరికీ చెప్పింది. అక్కడితో నా పేరు విశ్వపతిగా నిర్ణయమైంది. నాకు ఈ విశ్వపతి అనే పేరు రావడం వెనుక ఇంత విశేషం ఉన్నది.

మా తండ్రి గారు శ్రీ తిమ్మరాజు లక్ష్మీనరసింహారావు. నాన్నగారు చిన్నతనంలో ఎన్నో కష్టాలు అనుభవించారు. వీరి తండ్రి గారు అంటే మా తాతగారు శ్రీ తిమ్మరాజు కృష్ణారావుగారు ఆ రోజుల్లో స్కూలు మాష్టారుగా పనిచేసారు. అనేక ఊర్లు తిరుగుతూ ఒకచోట నిలకడగా ఉండేవారు కాదు. వారి పెద్ద కుమారుడు మా నాన్నగారు.

తాతగారు రిటైర్ అయ్యే సమయానికి నాన్నగారి వివాహం జరిగింది. ఎ.జి. ఆఫీస్‌లో 1954 సం॥లో ఉద్యోగంలో చేరారు. తన తమ్ముళ్ళను, చెల్లెళ్ళని

ఎంతో కష్టపడి చదివించారు. వారు కూడా ఎన్నో స్కాలర్‌షిప్‌లు తెచ్చుకొని ఎంతో కష్టపడి చదువుకొన్నారు. చదువుకుంటూనే తోటి వారికి ట్యూషన్ చెపుతూ చాలా కష్టపడి చదువుకున్నారు.

మేము ఐదుగురు అన్నదమ్ములం. నా తరువాత తమ్ముడిపేరు పద్మనాభం. అతడి భార్య సుమిత్ర, రెండవ తమ్ముడు సుబ్రహ్మణ్యం. భార్య పద్మ, మూడవ తమ్ముడు శ్రీనివాస్. ఇతడి భార్య శ్రీదేవి. నాల్గవ తమ్ముడు రామ్మోహన్. ఇతడి భార్య ఉష. నా మామగారు శ్రీవల్లూరు ఆనందరావు గారు , అత్తగారు శ్రీమతి వాణిగారు. నాభార్య రుక్మిణికి ఒక చెల్లెలు రాధిక. ఆమె భర్త త్రివిక్రమ్ మా పెద్దమ్మాయి అర్పిత, పెద్దల్లుడు సురేష్, పెద్ద మనుమరాలు చి॥ తన్వి. మా రెండవ అమ్మాయి ఆముక్త, అల్లుడు ధీరజ్, రెండవ మనుమరాలు చి॥ పర్ణిక, మా అబ్బాయి ఆదిత్య.

వీరందరు కూడా నేను హిమాలయపు ఆశ్రమంలో ఉన్నప్పుడు వేరు వేరు ప్రదేశాలలో వేరు వేరు కుటుంబాలలో జన్మించి అనేక రీతులలో అనేక మార్గాల ద్వారా ఆ ఆశ్రమానికి వచ్చి నన్ను కలిసిన వారే! అప్పటి బంధమే వీరందర్ని తిరిగి నావద్దకు చేర్చింది. మా అబ్బాయి ఆదిత్యకు ఇంకా వివాహం కాలేదు. ఆదిత్యకు కాబోయే భార్య, పుట్టే సంతానం కూడా ఆ హిమాలయపు దివ్యాశ్రమంలో నన్ను కలిసినవారే!.

అప్పటి హిమాలయాశ్రమంలో కలిసి ఇప్పుడు మళ్ళీ నన్ను కలిసినవారిలో నరసింహా అనే పేరుతో జన్మించిన తిరుపతిలో పరిచయం అయిన కారు డ్రైవర్ ఉన్నాడు. నరసింహా క్రిందటి జన్మలో తమిళనాడులోని ఒక గ్రామంలో నటేశన్ అనే పేరుతో జన్మించాడు. ప్రముఖ వైద్యుల కుటుంబంలో జన్మించాడు. ఆ కుటుంబం చాలా ఐశ్వర్యం కలది. ఎంతో గొప్ప ధనవంతులు. వారి కుటుంబానికి ఎన్నో వ్యాపారాలుండేవి.

నటేశన్ వీలున్నప్పుడల్లా తిరుమల వెళ్ళి శ్రీ వేంకటేశ్వరస్వామి వారిని దర్శించుకొనేవాడు. ఇంకా ఎన్నో పుణ్యక్షేత్రాలు కూడా దర్శించాడు. ధనవంతులు అవ్వడం చేత ఎన్నో ఆలయాలు కూడా నిర్మించాడు. తిరుమల వచ్చినప్పుడల్లా అతనికి శ్రీ స్వామివారి అద్భుత దర్శనం లభించేది.

శ్రీ స్వామి వారి సేవలన్నిటిల్లోను పాల్గొన్నాడు. ఇలా వచ్చినప్పుడల్లా సామాన్య భక్తులకు ఎంతో కష్టపడి అతి సామాన్య దర్శనం లభించడం గమనించేవాడు. వీరెంత కష్టపడుతున్నారో కదా! వీరికి ఈ సేవలేమి తెలియవు కదా! ఎప్పుడైనా సామాన్య భక్తుని లాగ శ్రీ స్వామి వారి దర్శనానికి రావాలి అని నటేశన్ ఎప్పుడూ మనస్సులో అనుకునేవాడు. ఎల్లప్పుడు ఏ పని చేస్తున్నా నటేశన్ ఆ శ్రీనివాసునే తలుస్తూ ఉండేవాడు.

ప్రస్తుత జన్మలో నటేశన్ తిరుపతి సమీపంలోని గ్రామంలో నరసింహా అనే పేరుతో జన్మించాడు. కొన్నాళ్లు ఏవో చిన్న చిన్న పనులు చేస్తూ కాలక్షేపం చేసాడు. తరువాత నెమ్మదిగా ఒక కారు కొనుక్కొని డ్రైవింగ్ మొదలు పెట్టాడు. పూర్వజన్మ కర్మ ఫలంగా తిరుపతి సమీపంలోనే జన్మించి ప్రతి రోజు తిరుమలకు యాత్రికులను తీసుకువెళ్ళే పనిలో ఉన్నాడు. వారితో పాటు ప్రతి రోజు తిరుచానూరు, శ్రీకాళహస్తి, కాణిపాకం వంటి పుణ్యక్షేత్రాలు కూడా వెళ్ళేవాడు. క్రిందటి జన్మలో ఎంతో పుణ్యం చేసుకున్న కారణంగా ప్రతీనిత్యం శ్రీస్వామివారికి అతి సమీపంలో ఉంటున్నాడు.

ఒక 15 సం॥లు క్రితం మేము తిరుపతి స్టేషన్‌లో దిగగానే యాదృచికంగా అతని కారులోనే పైకి వెళ్ళడానికి మాట్లాడుకోవడం జరిగింది. అప్పుడు కొండమీద ఉన్న మూడురోజులు మాతోనే ఉన్నాడు. అప్పటికి నేను వ్రాసిన రెండు పుస్తకాలు అతనికి ఇచ్చాను. అటుతరువాత కొన్ని సంవత్సరాలు నేను మళ్ళీ కలవలేదు.

ఒకసారి మా తమ్ముడు శ్రీనివాస్ కుటుంబం తిరుపతి వెళితే అనుకోకుండా అతడి కారులోనే కొండపైకి వెళ్ళడం జరిగింది. మాటల మధ్యలో నరసింహా మా తమ్ముడిలో నా పోలికలు చూసి తన కారులో ఉన్న నా పుస్తకం చూపించి ఈ పుస్తకం వ్రాసిన సార్ మీ బంధువా అని అడిగాడు. అప్పుడు మా తమ్ముడు ఆశ్చర్యపోయి నేను తనకు అన్నయ్య అవుతాడని చెప్పాడు. అప్పుడు నరసింహా ఎంతో సంతోషపడ్డాడు. అక్కడినుంచి మళ్ళీ మేమిద్దం కలిసాము.

తిరుపతి రైల్వేస్టేషన్ బయట కొన్ని వందలమంది కారు డ్రైవర్లు ఉంటారు. ఇంతమందిలో నరసింహానే నాకు కలవడం, అదీ కొన్ని సంవత్సరాలు విడిపోయి మళ్ళీ ఆశ్చర్యకరంగా మా తమ్ముడి ద్వారా నాకు దగ్గర అవ్వడం అప్పటి

హిమాలయ దివ్యాశ్రమపు బంధమే! అది మొదలు ఇప్పటిదాకా మేము తిరుపతి వెళ్ళిన ప్రతిసారీ మాతోనే ఉంటాడు. మేము తిరుపతి స్టేషన్‌లో దిగినప్పటినుంచి తిరిగి హైదరబాద్ వెళ్ళడానికి రైలు ఎక్కేవరకు నరసింహా అన్నిరోజులు మాతోనే ఉంటాడు. ఇప్పుడు ప్రస్తుతం మా కుటుంబంలో ఒకడయ్యాడు. నరసింహా ఎంతో సౌమ్యుడు.

ఒక విధంగా చెప్పాలంటే నరసింహ సత్యకాలపు మనిషి. మా అమ్మాయిల వివాహానికి కూడా హైదరాబాద్ వచ్చాడు. మా బంధువులు తిరుపతి ఎవరు వెళ్ళినా అతని కారునే తీసుకుంటారు. అతను అంటే ఇప్పుడు అందరికి ఎంత నమ్మకం అంటే నరసింహా ! ఆ కొండ మీద ఆ స్వామివారు, కొండక్రింద నువ్వు ఉండబట్టే మేమందరం తిరుపతి రాగలుగుతున్నాం అంటారు. లేకపోతే ఇంత జనంలో మా వల్ల అయ్యేపని కాదు అని అంటారు. నరసింహా తన కారు ఎక్కిన ప్రతీ ఒక్కరిని తన కుటుంబ సభ్యులుగా చూసుకుంటాడు.

నరసింహ ఈ జీవితంలో ఎన్నో కష్టాలు పడ్డాడు. ఇతడి ప్రారబ్ధకర్మ అంతా ఇంక కొన్ని జన్మలతో పూర్తికాబోతుంది. ఇంక కొన్ని జన్మలకే ఆ దివ్యశక్తిలో లీనమవుతాడు. వచ్చే జన్మలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన అరుణాచలంలో జన్మిస్తాడు. అక్కడ ఒక సంపన్న కుటుంబంలో పుట్టి ఎన్నో దాన ధర్మాలు చేస్తాడు, ఎన్నో ఆలయాలు కట్టిస్తాడు.

అటు తరువాత జన్మలో నరసింహా తిరిగి తిరుమల పరిసర ప్రాంతాలలోనే ఒక గొప్ప శ్రీవైష్ణవ కుటుంబంలో జన్మిస్తాడు. ఈ జన్మలో ఎంతో సాధన చేసి గొప్ప ప్రవచనకారుడిగా పేరు పొందుతాడు. నిరంతరం దైవ చింతనలోనే ఉంటాడు. ఎప్పుడూ మంచి కార్యాలు చేస్తూ నలుగురికి భగవత్‌తత్వం బోధిస్తుంటాడు. అటు తరువాత కొన్ని జన్మలకే జన్మరాహిత్యం కలుగుతుంది.

ఈ జన్మలో నా తల్లిదండ్రులు క్రిందటి జన్మలలో ఎంతో పుణ్యవంతమైన జీవితం గడిపినప్పటికి ఈ జన్మలో ఎన్నో కష్టాలు పడ్డారు. మా తండ్రి గారు శ్రీ లక్ష్మీనరసింహారావు గారు క్రిందటి జన్మలో ఆంధ్రప్రదేశ్‌లోని రాజమండ్రి దగ్గర చిన్న పల్లెటూరులో జన్మించారు. ఒక అగ్రహారంలో వేదపండితుల ఇంట జన్మించిన వీరు స్కూల్ టీచర్‌గా ఉద్యోగం చేశారు. వీరికి ఆరుగురు అక్కచెల్లెళ్ళు ఉండేవారు. తండ్రి చిన్నప్పుడే మరణించడంతో సంసారభారం అంతా వీరిపైనే పడింది.

ఎన్నో ఆర్థిక ఇబ్బందులు పడి అక్కచెల్లెళ్ళకు పెళ్ళిళ్ళు చేసారు. తాను వివాహం చేసుకోకుండా ఉండిపోయారు. ఇన్ని కష్టాలు పడుతున్న ఎప్పుడూ భగవంతున్ని ఆరాధిస్తూ ఉండేవారు. ఆ విధంగా రోజులు వెళ్ళదీస్తూ ఒకనాడు ఎంతో పుణ్యదినమైన ముక్కోటి ఏకాదశి నాడు కాలం చేసారు.

ఈ జన్మలో కూడా అతిసామాన్య కుటుంబంలో పుట్టి చిన్నప్పుడు చదువుకోవడానికి కూడా ఎంతో కష్టపడ్డారు. నాన్న గారికి చిన్నప్పటినుంచి శ్రీ వేంకటేశ్వర స్వామి అంటే ఎంతో భక్తి ఉండేది. ఇంతకు ముందు కొన్ని వేల జన్మలలో చేసుకున్న ప్రారబ్ధకర్మ తీరిపోవడం కోసం ఈ జన్మలో కూడా ఎన్నో కష్టాలు పడి తన 56 వ ఏట అకస్మాత్తుగా మరణించారు. మా అందరికి తండ్రి ఋణం అంతవరకే ! వీరికి మరికొన్ని ఉత్తమ జన్మలు కలిగి త్వరలోనే జన్మరాహిత్యం పొంది ఆ దివ్యశక్తిలో ఏకమౌతారు.

మనకు పూర్వజన్మల ఋణాలు ఎంతవరకు ఉంటాయో అంతవరకే ఆయా వ్యక్తులతో బంధం ఉంటుంది. ఆ ఋణం తీరిపోగానే ఆ వ్యక్తి మన నుంచి దూరమౌతాడు. లేదా మనం ఆ వ్యక్తినుంచి దూరంగా వెళ్ళిపోతాం. అందుకనే కొందరు ఈ జీవితంలో ఒక్కో దశలో కలిసి కొన్ని సంవత్సరాలు మనతో స్నేహం చేసి ఎంతో దగ్గరకి వచ్చి తిరిగి దూరమైపోతారు. ఇక మళ్ళీ జీవితంలో కనబడరు. ఆ ఋణం అంతవరకే అన్నమాట. ఎక్కడో పూర్వజన్మల బంధం మనల్ని వారితో అలా కొంతకాలం కలుపుతుంది.

మా అమ్మగారు నాగరత్నాంబ ఎంతో సౌమ్యురాలు. ఆవిడ క్రిందటి జన్మలో ఢిల్లీ సమీపంలో ఎంతో ఉన్నత కుటుంబంలో జన్మించారు. అయితే ఆఖరి దశలో ఎంతో అనారోగ్యంతో బాధపడ్డారు. ఆవిడ ఈ జన్మలో కూడా ఎన్నో కష్టాలు పడి, ఎంతో అనారోగ్యంతో కొన్ని సంవత్సరాలు జీవించి తరువాత ఈ జన్మ చాలించారు. ఈవిడకు ఇంకా ఎక్కువ జన్మలు లేవు. ప్రస్తుత జన్మలో ఈవిడ మధురైలో ఒక సాంప్రదాయ బ్రాహ్మణ కుటుంబంలో జన్మించారు. నిత్యం భగవంతునికి సంబంధించిన అనేక స్తోత్రాలు చదువుకుంటూ రోజు ఆలయానికి వెళ్ళి వస్తూ ఎంతో సుఖమైన జీవితం సాగిస్తున్నారు. ఆవిడ ఈ జన్మలో 72 సం॥లు పూర్తి ఆరోగ్యంతో జీవిస్తారు.

నాకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు. పెద్ద కుమార్తె అర్పిత హైదరాబాద్ లోనే ఉంటోంది. రెండవ కుమార్తె ఆముక్త అమెరికా దేశంలో డల్లాస్‌లో ఉంటోంది. ఆదిత్య ఐ.ఐ.టి. హైదరాబాద్‌లో బి.టెక్. చదివి ఆ శ్రీనివాసుని అనుగ్రహంతో గోల్డ్‌మెడల్ సంపాదించి అమెరికాలోని ప్రతిష్టాత్మక స్టాన్‌ఫర్ట్ యూనివర్సిటీలో యం.యస్. చదివి ప్రస్తుతం కాలిఫోర్నియాలో మంచి ఉద్యోగంలో ఉన్నాడు.

ఆముక్త వివాహమై ఐదు సంవత్సరాలు అయినప్పటకి నేను అమెరికా వెళ్ళలేదు. రెండు సార్లు వెళ్ళాలనుకొని చివరి నిమిషంలో ప్రయాణం వాయిదా వేసుకున్నాను. నాకు విదేశాలపై అంత ఆసక్తి ఉండదు. మా బంధువులు, చిన్ననాటి స్నేహితులు ఆ దేశంలో ఎందరో ఉన్నప్పటికి నేను ఎప్పుడూ వెళ్ళలేదు. చివరకు 2018 ఏప్రిల్ నెలలో నేను, రుక్మిణి అమెరికా వెళ్ళాము. అక్కడ నాకు నేను గత జన్మలలో హిమాలయ దివ్యాశ్రమంలో ఉన్నప్పుడు వచ్చిన కొంతమంది సాధకులు ఇప్పుడు లౌకిక జీవితాలు గడుపుతూ తిరిగి నన్ను కలుసుకున్నారు. బహుశా అప్పుడు నేను అందుకే అమెరికా వెళ్ళానని అనుకుంటాను.

ఆముక్త వాళ్ళు ఇంతకు ముందు అమెరికాలో వేరే నగరంలో ఉండేవాళ్ళు అప్పుడు నేను అమెరికా వెళ్ళడం జరగలదేదు. అయితే అప్పటి హిమాలయాశ్రమంలో ఉన్న కొందరు ప్రస్తుతం ఈ డల్లాస్ నగరరంలో ఉండడంతో నేను ఈ సమయంలోనే ఇక్కడకి రావడం జరిగింది. ముందుగా నన్ను రీజనల్ ఇంజనీరింగ్ కాలేజ్‌లో యం.టెక్. స్నేహితుడు యస్.వి.ఆర్. కలిసారు. 1982 లో విడిపోయిన మేము 36 సం॥లు తరువాత 2018 లో ఇలా అనుకోకుండా ఇక్కడ కలిసాము. యస్.వి.ఆర్. కూడా అప్పుడు హిమాలయాశ్రమంలో ఉన్నవాడే!

నేను వ్రాసిన పుస్తకాలు 15 సం॥లు గా నిత్యం ఎంతో మందికి పంపుతున్నాను. ఇలా ఈ పుస్తకాలు చదవిన వారు కొంతమంది నాకెంతో ఆప్తులయ్యారు. ఇలా ఆప్తులయినవారిలో కాకినాడలో శ్రీజగన్నాథరావుగారు అనే రిటైర్ట్ పోస్ట్‌మాష్టర్ ఒకరు. వీరబ్బాయి ఒకరు శ్రీకృష్ణశర్మగారు డల్లాస్‌లో ఎప్పటినుంచో ఉంటున్నారు. కొన్ని సంవత్సరాల క్రితం వీరు వారి అబ్బాయి దగ్గరకి అమెరికా వెళ్లినప్పుడు శ్రీ వేంకటేశ్వర వ్రతకల్పం పుస్తకాలు తనతో పాటు తీసుకువెళ్ళారు.

తనను కలిసిన తెలుగువారికి ఈ పుస్తకాలు ఇచ్చేవారు. వీరబ్బాయి కృష్ణశర్మ యస్.వి.ఆర్. కి మిత్రుడు కావడంతో ఒకసారి యస్.వి.ఆర్. ఇంటికి వచ్చినప్పుడు అతనికి కూడా ఒక పుస్తకం ఇచ్చారు. యధాలాపంగా ఆ పుస్తకం మీద నా పేరు చూసి శ్రీజగన్నాథరావు గారిని నేనెలా తెలుసునని అడిగాడు.. అందుకు వారు నా పుస్తకాలు వారికి పంపించడం, కొన్ని సంవత్సరాలుగా వారు ఎంతో మందికి ఇవ్వడం అన్ని విషయాలు వివరంగా చెప్పారు. యస్.వి.ఆర్. ఎంతో సంతోషపడ్డాడు... ఈ విధంగా మా ఇద్దరి మధ్య మళ్ళీ బంధం ఏర్పడింది. కృష్ణశర్మ కూడా ఎంతో సంతోషపడ్డారు. శ్రీజగన్నాథరావు గారికి మా కుటుంబం అంటే ఎంత ఇష్టం అంటే వారు సతీసమేతంగా మా పెద్దమ్మాయి అర్పిత వివాహానికి కూడా కాకినాడ నుంచి ప్రత్యేకంగా వచ్చారు.

ఇంకో విశేషం ఏమిటంటే జగన్నాథరావు గారి అబ్బాయి కృష్ణశర్మ కూడా నాతో హిమాలయ ఆశ్రమ బంధం ఉన్నవారే! ఆ జన్మలో కృష్ణశర్మ నేటి రాజస్థాన్‌లో ఒక వ్యాపార కుటుంబంలో జన్మించి ఎన్నో ధార్మిక కార్యక్రమాలు చేసి చివరి రోజుల్లో సన్యాసం తీసుకొని హిమాలయాల్లో తిరుగుతూ నా ఆశ్రమం చేరుకున్నారు. నా స్నేహితుడు యస్.వి.ఆర్. కూడా అప్పటి ఆశ్రమంలో నన్ను కలిసిన వాడే! ఆ జన్మలో అతడు ఉత్తరప్రదేశ్‌లోని ఒక గ్రామంలో వ్యవసాయ కుటుంబంలో జన్మించి ఆ ఊరిలో వారందరికి ఎంతో సహాయం చేసేవారు. ఆ ఊరిలో ఒక పెద్ద అన్నదాన సత్రం కట్టించాడు. ఎన్నో ధార్మిక కార్యక్రమాలు చేసాడు. అటు తరువాత కొంతకాలానికి ఆ హిమాలయ ఆశ్రమం చేరుకున్నాడు.

మరుసటి జన్మలో యస్.వి.ఆర్. జర్మనీలో జన్మించి పెద్ద డాక్టర్ గా పేరు తెచ్చుకున్నారు. ఒక పెద్ద హాస్పటల్ స్థాపించి పేదలకు ఉచితంగా వైద్యసేవ చేసేవారు. అతని సేవల గురించి ఇప్పటికి ఆ పట్టణంలో చెప్పుకుంటారు. అతడికి ఎన్నో అవార్డులు కూడా లభించాయి. సన్మార్గంలో పయనిస్తున్న అతడి ఆత్మ ప్రతీసారి ఉత్తమ జన్మలు తీసుకుంటూ సమాజానికి ఎంతో ఉపయోగకరమైన పనులు చేస్తోంది. అటు తరువాత జన్మలో యస్.వి.ఆర్. అనంతపూర్ పట్టణ సమీపంలో జన్మించాడు.

ఈ జన్మలో కూడా బాగా చదువుకొని ఎన్నో మంచి పనులు చేసి ఎందరో పేదలకు ఉచితంగా విద్యను అందించి ఎందరికో వివాహాలు కూడా జరిపించాడు. ఈ జన్మలో మళ్లీ ఆంధ్రప్రదేశ్‌లోనే పుట్టిన యస్.వి.ఆర్. కొంత కాలం ఇక్కడే పనిచేసి

తరువాత అమెరికా వెళ్ళి అక్కడ అనేక మంచి కార్యక్రమాలలో పాల్గొంటున్నారు. ఎవరికి ఏ సహాయం అవసరమయినా తాను ముందుంటాడు.

పూర్వజన్మల కర్మఫలం క్షయమవుతున్నదనడానికి సూచనగా ఈ జన్మలో ఎన్నో కష్టాలు పడ్డాడు. అప్పుడప్పుడు కొంత అనారోగ్యంగా కూడా ఉండేవాడు. ఇతడికి ముందు ముందు ఇంక ఎక్కువ జన్మలు ఉండవు. కొద్ది జన్మల తరువాత ఒక జన్మలో గొప్ప ఉన్నత విలువలు కలిగిన కుటుంబంలో జన్మించి ఎన్నో గొప్ప పనులు చేసి ఈ బంధాలనుంచి బయటపడి ప్రారబ్దకర్మ పూర్తిగా క్షయం చేసుకొని జన్మరాహిత్యం పొందుతాడు.

అప్పుడు అమెరికా వెళ్ళినప్పుడు నాకు శ్రీ వాజపాయి గారు అని యస్.వి.ఆర్. స్నేహితుడు మరొకరిని కలవడం జరిగింది. వీరి కలయిక కూడా చాలా అపూర్వమే ! వాజపాయి గారు కూడా నాతో హిమాలయాశ్రమంలో ఉన్నవారే. ఆ జన్మలో వీరు కాశీలో మిశ్రా అనే మహాపండితుడుగా జన్మించి గొప్ప వ్యాకరణ కావ్యాలను సంస్కృతంలోకి రచించి ఎందరో శిష్యులను తీర్చిదిద్దారు. వీరు తన 72 వ ఏట ఆధ్యాత్మిక ఉన్నతి కోసం అనేక సాధువులని, యోగులను కలిసేవారు. వారి నుంచి ఎన్నో దివ్య రహస్యాలను తెలుసుకునేవారు. ఒకనాడు ఒక సాధువుల సమూహం హిమాలయాలవైపు వెళుతుండగా, వీరు కూడా వారితో కలిసి హిమాలయాలకు చేరుకున్నారు. అక్కడ ఒక చోట వీరికి శ్రీ దత్తాత్రేయుల వారి దర్శనం కలిగింది. అక్కడి నుంచి నా హిమాలయ దివ్యాశ్రమానికి చేరుకున్నారు. ఆశ్రమంలో ఎంతో ఉన్నతమైన జీవితం గడిపారు.

ఆ తరువాత జన్మలో వీరు ప్రస్తుత తూర్పుగోదావరి జిల్లాలో ఒక గొప్ప అగ్రహారంలో ఆధ్యాత్మిక వ్యక్తిగా జన్మించారు. ఎంతో మందికి ఎన్నో ధార్మిక పరమైన, యోగరహస్యాలను బోధించారు. ఎంతో సరళ భాషలో ఉండే వీరి ప్రసంగాలకు సామాన్యులు సైతం ఎంతో ఆకర్షితులయ్యేవారు.

అంతకు ముందు జన్మల కర్మ ఫలంగా వీరికి ఒకసారి రెండుసంవత్సరాలు అనారోగ్యం కలిగితే తన యోగ శక్తితో పూర్తిగా నయం చేసుకున్నారు. కుటుంబ సభ్యులు తోటి స్నేహితులు అప్పుడు ఎంతో బాధపడ్డారు. అంత రోగంతో బాధపడుతున్న వీరెప్పుడూ నవ్వుతూ ఉండేవారు. అనారోగ్యం శరీరానికే గాని తన ఆత్మకు కాదు అనేవారు. ఇప్పటి జన్మలో కూడా వారెంతో సౌమ్య

స్వభావులు. వారికి ఇక ఎన్నో జన్మలు లేవు. వచ్చే జన్మలో వీరు తమిళనాడులోని ఒక గొప్ప పుణ్యక్షేత్రంలో ఒక ధనిక కుటుంబంలో జన్మించి ఎన్నో దేవాలయాలు, విద్యాలయాలు స్థాపిస్తారు. ఎంతో మందికి వీరు ఆచరణపురుషులౌతారు.

మళ్ళీ మనం అప్పటి హిమాలయ దివ్యాశ్రమపు విషయానికి వద్దాం. అప్పుడు నన్ను కలిసిన 108 మంది తరవాత జన్మలలో ఎక్కడెక్కడో ఎన్నో దేశాలలో ఎన్నో మతాలలో జన్మించారని అనుకున్నాం కదా ! ఈ జన్మలో నా భార్య రుక్మిణి క్రిందటి జన్మలలో ఒక జన్మలో అమెరికాలో ఎలీనా అనే పేరుతో జన్మించింది. చిన్నప్పటినుంచి ఆమెకు నలుగురికి సహాయం చేసే అలవాటు ఉండేది. చుట్టు ప్రక్కల ఇళ్ళల్లో వారికి ఏదైనా అనారోగ్యం వస్తే వారితో ఎంతో ఎంతో ఆప్యాయంగా మాట్లాడి వారికి స్వాంతన చేకూర్చేది.

యుద్ధం సమయంలో అమెరికా మిలటరీలో నర్సుగా చేరి యుద్ధంలో గాయపడే సైనికులకు సేవచేసేది. ప్రతిరోజు యుద్ధంలో గాయపడిన సైనికులను విమానాల్లో తీసుకువచ్చి ఒక హాస్పటల్‌లో చికిత్స నిమిత్తం దింపేవారు. ఎప్పుడూ విమానాల హోరు. ఎప్పుడు, ఏ రాత్రి వేళ ఏ విమానం, ఎంతమంది గాయపడిన సైనికులతో వస్తుందో తెలియదు. ఎంత రాత్రి వేళయినా ఎలీనా వెంటనే నిద్ర లేచేది. క్షణంలో ఆ వచ్చిన సైనికులకు గాయాలకు కట్లు కట్టేది. మందులివ్వడం వంటివి చేసేది.

ఆమె ఈ గాయపడిన సైనికుల మూలుగులు వినిపిస్తున్నా ఎలీనా ఏమాత్రం ధైర్యం కోల్పోక మనస్సుని చాలా స్థిమితంగా ఉంచుకొని ఎప్పుడూ నవ్వుతూ వారికి నర్సింగ్ సేవలు చేసేది. కొంతమంది కాలు విరిగి, కొంతమంది చేతులు విరిగి, కొంతమందికి ఛాతీపై దెబ్బలు తగిలి, కొంతమందికి లివర్‌పై దెబ్బలు తగిలి రక్తం కారుతూ అక్కడ వాతావరణం అంతా ఎంతో భయంకరంగా ఉండేది. అయినా ఎలీనా వారందరిని ఓదారుస్తూ మంచి మాటలు చెప్తూ, ఎంతో సౌమ్యంగా మాట్లాడుతూ, చిరునవ్వుతో వాళ్ళ గాయాలకి ఆయింట్‌మెంట్లు రాస్తూ, వేళకి మందులు ఇస్తూ ఎంతో సేవచేసేది.

అలా సేవచేసిన వారిలో ఒక పెద్ద మేజర్ ఉండేవాడు. ఆయన పేరు రాబిన్‌సన్ ఆయనకు యుద్ధంలో తీవ్రగాయాలు అయ్యి ఎంతో బాధ పడుతుండేవాడు. ఎలీనా ఆ మేజర్‌ను తన తండ్రిలా కంటికి రెప్పలా చూసుకుంది.

ఇంతలో యుద్ధం ముగిసింది. రాబిన్‌సన్ కూడా పూర్తిగా కోలుకున్నాడు. ఇక హాస్పటల్ నుంచి వెళ్ళిపోయేముందు ఎలీనాకు ఎన్నో బహుమతులు ఇచ్చాడు. తన కంటే 20 సం॥లు చిన్నది కావడంతో ఎలీనాని సొంతకూతురిలా చూసుకునేవాడు.

రాబిన్‌సన్ అంతకుముందు జన్మలలో ఒకసారి భారతదేశంలో ఉత్తరప్రదేశ్‌లో జన్మించాడు. అప్పుడు ఆయన ఒక స్కూల్ టీచర్. ఎంతో దేశభక్తి కలవాడు. స్కూల్ పిల్లలందరికి ఎంతో మంచి విషయాలను చెప్తూ వారిలో దేశభక్తి పెంపొందించేవారు. అతడు అనుకోకుండా కొన్ని పురాతన గ్రంథాలు చదివి కొన్ని రోజులు హిమాలయాల్లో గడపాలని నిశ్చయించుకొని హిమాలయాల వైపు వచ్చి నా దివ్యాశ్రమంలో కొన్ని సంవత్సరాలు గడిపాడు.

ఆయనే మరుజన్మలో ఆనందరావు అనే పేరుతో ఆంధ్రప్రదేశ్‌లోని తెనాలి పట్టణంలో జన్మించాడు. యుద్ధ సమయంలో వీరు రాబిన్‌సన్‌గా పుట్టినప్పుడు ఆయనకి సేవలందించిన ఎలీనా, ఈ జన్మలో వీరి కుమార్తె రుక్మిణిగా జన్మించింది. ఆ రుక్మిణే ప్రస్తుత జన్మలో నా భార్య.

రుక్మిణి కొన్ని జన్మల క్రితం బీహార్‌లో రామ్‌నాథ్ మిశ్రా అనే పేరుతో గొప్ప పండితుడిగా జన్మించింది. మిశ్రా శ్రీమద్భాగవతానికి గొప్ప వ్యాఖ్యానం రచించాడు. వీరికి శ్రీకృష్ణుడంటే ఎంతో ప్రేమ. శ్రీకృష్ణ తత్వం గురించి అందరికి ఎంతో అద్భుతంగా వివరించేవాడు. ఒకనాడు ఒక శ్రీకృష్ణ ఆలయంలో ఆ విధంగా భాగవతంలోని శ్రీకృష్ణ లీలలు కొన్ని ఎంతో రసరమ్యంగా చెప్తున్నాడు. అప్పుడు సాక్షాత్తు శ్రీకృష్ణుల వారే ఒక సామాన్య యాదవ భక్తుని రూపంలో వచ్చి ముందు వరుసలో కూర్చొని అన్నీ ఎంతో ముచ్చటతో విన్నారు.

ఆ ప్రవచనం కాగానే రామ్‌నాథ్ మిశ్రా దగ్గరకి వచ్చి భాగవత ప్రవచనం ఎంతో అద్భుతంగా ఉందని తనకి ఎంతో ఆనందం కలిగిందని మిశ్రాతో అన్నాడు. ఆ విధంగా ఆ జన్మలో మిశ్రాకు శ్రీకృష్ణ దర్శనం లభించింది. అటు తరువాత కొన్ని రోజులకే మిశ్రా మరింత సాధనకోసం హిమాలయాలు వచ్చి సాధనకు అనువైన ప్రదేశం గురించి వెతుకుతూ నా ఆశ్రమం చేరుకున్నారు. అప్పటి ఆ హిమాలయ దివ్యాశ్రమపు బంధమే ఈ జన్మలో రుక్మిణిని మళ్ళీ నా వద్దకు చేరేలా చేసింది.

ఈమెకి పూర్వజన్మల వాసనలు ఇంకా ఉండి ఈ జన్మలో కూడా శ్రీకృష్ణుడంటే ఎంతో ప్రేమ. అలాగే అనారోగ్యంతో ఉన్న ఎవరికైనా సేవచేయడానికి

ఎప్పుడూ ముందుకు వస్తుంది. బీహార్‌లో మిశ్రాగా జన్మించినప్పుడు ఈమెకు రుక్మిణి బాయ్ అనే అక్క ఉండేది. ఆమె కూడా మిశ్రాతో పాటు ఆ ఆశ్రమానికి వచ్చి నన్ను కలిసింది. రుక్మిణి బాయ్ తరువాత జన్మలో మహారాష్ట్రలోని ఔరంగాబాద్ దగ్గర గ్రామంలో దేవకీబాయ్ అనేపేరుతో ఒక పెద్ద ఉమ్మడి కుటుంబంలో జన్మించింది. పెద్దవారందరికి ఎంతో సేవ చేసేది.

ఆ ఊరిలో ఉండే హనుమాన్ ఆలయం అంటే ఆమెకు ఎంతో మక్కువ. ప్రతి సంవత్సరం ఆ ఆలయంలో హనుమాన్ జయంతి ఎంతో గొప్పగా జరిగేది. దేవకీబాయ్ కుటుంబం అంతా ఆ ఉత్సవాలలో ఎంతో గొప్పగా పాల్గొనేవారు. భక్తులందరికి భోజనం సదుపాయాలన్నీ చూసేవారు. ప్రసాదాలు వితరణ చేసేవారు.

ఆరోజు సాయంత్రానికి దేవకీబాయ్ అలసి అక్కడ ఉత్సవాలు సందర్భంగా కట్టిన ఒక పెద్ద షామియానా స్థంభానికి ఆనుకొని కూర్చుంది. అప్పుడు సాక్షాత్తు హనుమంతుల వారు ఆమె వద్దకు ఒక వృద్ధ భక్తుని రూపంలో వచ్చి కాస్త మంచినీరు ఇచ్చారు. ఆ మంచినీరు త్రాగిన ఐదు నిమిషాలకే ఆమె కన్ను మూసింది. హఠాత్తుగా జరిగిన ఈ పరిణామానికి అందరూ ఎంతో ఆశ్చర్యపోయారు. ఎంతో బాధపడ్డారు. ఆమె ఎన్నో జన్మల్లో చేసుకున్న పుణ్యఫలం ఫలితంగా హనుమంతులవారి దర్శనం, వెంటనే సునాయాస మరణం లభించాయి. దేవకీబాయే తరువాత జన్మలో నా భార్య రుక్మిణి తల్లి శ్రీవాణిగా జన్మించారు. అలా అప్పటి హిమాలయ ఆశ్రమపు బంధం మా అందరిని ఇలా కలిపింది.

అప్పటి హిమాలయాశ్రమంలో నన్ను కలిసిన వారిలో శ్రీ కృష్ణారావు అనే పేరుతో జన్మించారు. కొన్ని సంవత్సరాల క్రితం జరిగిన ఒక సంఘటన నేనెప్పటికీ మర్చిపోలేను. మా తమ్ముడి స్నేహితుడు వేంకటేశ్వరరావు అని ఉండేవాడు. ఆయన తండ్రి శ్రీ కృష్ణారావుగారికి ఎవరి ద్వారానో నేను రాసిన శ్రీ శ్రీనివాస మహత్మ్యం చేరింది. కృష్ణారావు గారి వయస్సు దాదాపు 90 సంవత్సరాలు. ఈ శ్రీనివాస మహత్మ్యం పుస్తకాన్ని 2001లో వ్రాశాను. ఇదే నా మొదటి పుస్తకం. ఈ పుస్తకం కొద్దిగా గ్రాంధిక భాషలో ఉంటుంది. ఈ పుస్తకం ఎంతోమందికి నిత్య పారాయణ గ్రంథం అయింది. ఇప్పటికీ ఆ పుస్తకం కావాలని ఎంతోమంది నన్ను అడుగుతుంటారు. వేంకటేశ్వరరావు గారు తన తండ్రి కృష్ణారావు గారికి ఈ పుస్తకమే తన ప్రపంచంగా అయిందని మా తమ్ముడితో చెబుతుండేవారు.

కృష్ణారావుగారు 90 సంవత్సరాలు వస్తున్నప్పటికీ ఎంత ఆరోగ్యంగా ఉండేవారు. ప్రతీరోజు శ్రీ శ్రీనివాస మహత్యం లో ఒక్క అధ్యాయమైనా తప్పక చదవడం ఆయన దినచర్యలో భాగమైంది. కొన్ని రోజులకు ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం మూడు పూటలా ఈ పుస్తకమే చదువుతుండేవారు. ఈ విశేషమంతా ఆయన మా తమ్ముడికి చెప్పటంతో తెలిసింది. ఇలా ఒక సంవత్సరం జరిగింది. కృష్ణారావుగారికి ఎందుకో గాని ఒక్కసారిగా జీవితం మీద విరక్తి కలిగింది. తన బాధ్యతలన్నీ అయిపోయాయి. ఇక ఈ లోకంలో ఎందుకు ఉండాలి అనే ఆలోచన కలిగింది. చాలామందికి వృద్ధాప్యంలో ఇటువంటి ఆలోచన రావడం సహజం.

కృష్ణారావుగారికి ఈ ఆలోచన రాగానే ఆహారం పూర్తిగా తగ్గించేశారు. ఎవరితో ఎక్కువ మాట్లాడేవారు కాదు. టీవీ చూడటం కానీ, పేపర్ చదవడం కానీ మానివేశాడు. ఆయనకు ప్రస్తుతం ఒక్కటే లోకం. అదే శ్రీనివాస మహత్యం పుస్తకం. రోజూ ఆ పుస్తకం చదవటమే తప్ప వేరేపని చేసేవారు కాదు. ఆయన తన కుమారుడు వేంకటేశ్వరరావుతో ఒక్కసారి నన్ను చూడాలని ఉందని, మా ఇంటికి తనను తీసుకెళ్ళమని అన్నారు. వేంకటేశ్వరరావు గారు ఇదేమాట మా తమ్ముడితో చెప్పటం, మా తమ్ముడు నాకు చెప్పటం జరిగింది. అప్పుడు నేను మా తమ్ముడితో ఆయన చాలా పెద్దవారు. ఈ వయసులో ఆయన్ను రమ్మనడం భావ్యం కాదు. మనమే ఒకరోజు వారింటికి వెళదాం అని అన్నాను. అందుకు తను సరేనన్నాడు.

అయితే వేంకటేశ్వరరావుగారి ఇల్లు నాకు తెలీకపోడటం వలన మా తమ్ముడే నన్ను వారింటికి తీసుకెళ్ళాలి. నేను వచ్చేటప్పటికి వేంకటేశ్వరరావుగారికి కూడా ఇంట్లో ఉండాలని ఉంది. అందుకని ఏదైనా ఒకరోజు సాయంత్రం ఆఫీసు అవగానే వారింటికి వెళదామని అనుకున్నాం. ఒకరోజు ఉదయం ఫోన్ చేసి ఆ రోజు సాయంత్రం వారింటికి వెళదామని మా తమ్ముడు చెప్పాడు. కానీ మధ్యాహ్నం ఫోన్ చేసి ఏదో మీటింగ్ ఉందని ఈ రోజు కుదరదని అన్నాడు.

ఆ తరువాత నాలుగు రోజులకు వేంకటేశ్వరరావు గారు ఫోన్ చేసి ఆ రోజు సాయంత్రం తానే మా ఇంటికి వస్తానని నన్ను వారి తండ్రి గారి వద్దకు తీసుకెళ్తానని మా తమ్ముడికి ఫోన్ చేసి చెప్పాడు. సాయంత్రం నేను రెడీ అయి ఉండగానే వేంకటేశ్వరరావుగారు ఫోన్ చేసి తనకు ఏదో అర్జంటు పని వచ్చిందని, ఈ రోజు రావటం కుదరదని ఏమీ అనుకోవద్దని అన్నారు. మరో రెండు రోజులలోనే

తప్పక తీసుకెవెళతానని అన్నారు. కానీ రెండు రోజులు కాదు కదా పది రోజులు అయినా వారినుంచి ఫోన్ రాలేదు.

ఇలా దాదాపు 2 నెలలు గడిచాయి. ఈ లోపల మా తమ్ముడి ద్వారా మరో విషయం తెలిసింది. కృష్ణారావుగారు ఆహారం పూర్తిగా మానివేశారు. చాలా నీరస పడ్డారు. పూర్తిగా మంచాన పడ్డారు. ఆయన ఆహారం కేవలం ఉదయం ఒక కప్పు కాఫీ మాత్రమే! అంతేకాదు, అందరితో మాట్లాడటం మానివేశారు. వారి కుటుంబ సభ్యులందరికీ ఇది చాలా బాధగా అనిపించింది. వారు ఎంత బతిమాలినా ఏ ఆహారం తీసుకునేవారు కాదు. బహుశా వారి మనసులో ఈ లోకంనుంచి వెళ్ళిపోవాలనే సంకల్పం గట్టిగా కలిగినట్టుంది. అయితే ఆయన శ్రీనివాస మహత్మ్యం చదవటం మాత్రం మానలేదు. ఆ పుస్తకం తన తలదిండు కిందనే ఉంచుకునేవారు. మంచం మీద పడుకునే మధ్య మధ్యలో తీసి చదువుకునేవారట. ఇవన్నీ వినేసరికి నాకు చాలా బాధ కలిగింది. ఒకరోజు మా తమ్ముడితో ఇలా అన్నాను. ఈరోజు సాయంత్రం మనం వారింటికి ఎలాగైనా వెళదామని, నేను నీ ఆఫీసు దగ్గరికే ఐదు గంటలకల్లా వస్తానని అన్నాను.

ఆ సాయంత్రం మా తమ్ముడి ఆఫీసు దగ్గరికి వెళ్ళి మేమిద్దరం కలిసి కృష్ణారావు గారింటికి వెళ్ళాం. వారి కుమార్తెలు నన్ను ఆయన ఉన్న గదిలోకి తీసుకెళ్ళారు. ఆయన కళ్ళు మూసుకుని ఉన్నారేతప్ప ఎవరినీ చూడటం లేదు. ఇంతలో ఒక కుమార్తె ఆయన చెవిలో గట్టిగా నాన్నగారూ! విశ్వపతిగారొచ్చారు. కళ్లు తెరచి చూడండి అని అన్నారు. అలా అనగానే ఆయన ఒక్కసారిగా కళ్లు తెరచి నాకేసి చూసి ఎంతో ఓపిక తెచ్చుకుని రెండు చేతులు ఎత్తి నమస్కారం పెట్టారు. నేను వెంటనే ఆయన చేతులు పట్టుకుని అయ్యా! మీరు పెద్దవారు, మీరు నాకు నమస్కారం పెట్టకూడదు. మీ ఆరోగ్యం చక్కగా ఉంటుంది. ఏమీ బెంగ పడకండి, అన్నింటికీ ఆ శ్రీనివాసుడే ఉన్నాడు అని ఆయనపై చెయ్యివేసి నిమిరాను.. ఎందుకో ఆయన కళ్ళలో నీరు కారాయి. వెంటనే కళ్ళు మూసుకున్నారు. ఆయన తలవద్దే నా శ్రీనివాస మహత్మ్యం పుస్తకం కనపడింది. కాసేపు ఆయనవద్దే నిల్చుని ఆయన కుటుంబ సభ్యుల వద్ద శెలవు తీసుకుని ఇంటికి వచ్చేశాను.

ఆ తరువాత రెండోరోజు మా తమ్ముడు నాకు ఫోన్ చేసి ఇలా చెప్పాడు. మేము వెళ్ళిన తరువాతి రోజు రాత్రే కృష్ణారావుగారు కాలంచేసారని చెప్పాడు.

ఒక్కసారిగా నాకు షాక్ తగిలినట్టుయింది. ఆయన నన్ను చూడటం కోసం ఇన్నాళ్లు ఎదురుచూశారా? అందుకే ఆ ప్రాణం ఇలా నిలబడిందా? నేను వచ్చి వెళ్ళిన తరువాత రోజే ఆయన ప్రాణం విడిచారంటే ఆ ఆత్మ అలా ఎదురుచూస్తున్నదా? నేను ఇంకా ఆలస్యం చేసుంటేనో? ఈ సంగతి తలచుకున్నప్పుడల్లా ఇప్పటికీ నా ఒళ్ళు జలదరిస్తుంది. ఇలా మనకు తెలీని బంధాలు ఎన్నో ఉంటాయి. ఆయనకీ, నాకు గల ఏ జన్మ సంబంధం అలా చేసింది? ఈ జన్మలో నేను వారిని ఎప్పుడూ కలవనప్పటికీ కనీసం చివరగానైనా ఒక్కసారైనా నన్ను చూడకుండా ఆ ఆత్మ శరీరం వీడదలచుకోలేదు. ఆ కోరిక తీరిన మరునాడే కృష్ణారావుగారి ఆత్మ శరీరాన్ని వీడింది. ఈ జన్మ జన్మల బంధాలు ఎంత విచిత్రంగానో, సామాన్య మానవుల ఊహకు కూడా అందనివిగా ఉంటాయి.

ఈ అనంత విశ్వంలో కేవలం 70, 80 సం॥లు జీవించే మన ఉనికి ఎంతటిది? ఈ విశ్వంలో మనం ఉన్నది ఒక సౌరమండలంలోని భూమండలంపై ఏదో ఒక చిన్న ప్రదేశం. ఇటువంటి కోటానుకోట్ల సౌరమండలాలు కలిస్తే ఒక పాలపుంత అవుతుంది. మన కంటికి కనిపించే సూర్యునికంటే కోటిరెట్లు ప్రకాశవంతమైన సూర్యులు ఇంకా అనేక మంది ఉన్నారు. ఇటువంటి అనేక పాలపుంతలు కలిస్తే ఈ విశ్వం మొత్తానికి కారణభూతుడైన దివ్యశక్తిలో సహస్ర, మళ్ళీ సహస్ర వంతుకంటే చిన్నవి. వీటితో పోల్చుకుంటే మానవ జన్మ ఎంత చిన్నది? అసలు పోల్చడానికి కూడా వీలు లేనటువంటిది. ఇన్ని కోట్ల సంవత్సరాల కాల గమనంలో మనం బ్రతికే 70, 80 సం॥లు ఏపాటిది? ఈ మాత్రం దానికే ఇన్ని ఆవేశాలు, అహంకారాలు, ఈర్ష్యాద్వేషాలు, అసూయలు... ఒక్కసారి ఆలోచించండి... మనం ఎన్నో పరిస్థితుల్లో ఎంత మూర్ఖంగా ప్రవర్తిస్తున్నామో అర్థమవుతుంది.

మరొక విషయం గమనించండి. ఈ సృష్టి మొదటిలో ఇన్ని మతాలు, కులాలు లేనే లేవు. ఇవన్నీ మనం సృష్టించుకున్నవే కదా! ఇంకొక విషయం... ఈ జన్మలో మనం హిందూ మతంలో జన్మించాం అనుకోండి. క్రిందటి జన్మలో మనం క్రీస్తు మతంలోనో, ఇస్లాం మతంలోనో జన్మించి ఉండవచ్చు కదా! ఒక జన్మలో ఒక మతంలో, ఒక కులంలో జన్మిస్తే ఇక అన్ని జన్మలలో అదే మతంలో, అదే కులంలో జన్మిస్తారని ఎక్కడా లేదు. అలా జన్మించరు కూడా! వారి వారి సంస్కారాన్ని బట్టి వారు ఆ జన్మలలో చేసే పాప పుణ్యాలను బట్టి వారికి ఆ జన్మలో ఏర్పడే బంధాలను బట్టి, ఆ

జన్మలో ఏర్పడే గాఢ కోరికల బట్టి తరువాత జన్మలో, ఎక్కడో ఏదో దేశంలో, ఏదో మతంలో జన్మిస్తారు.

ప్రతి మనిషి ఈ విధంగా ఒక జన్మ తరువాత మరొక జన్మలో రకరకాల మతాలలో రకరకాల ప్రదేశాలలో వేరు వేరు కులాలో, వేరు వేరు కుటుంబాలలో జన్మిస్తుంటారు. ఈ జన్మలో మీ ప్రక్క ఇంట్లో ఉండి మీరెంతో అభిమానిస్తున్న ముస్లిం సోదరుడు క్రిందటి జన్మలో నీవు ఒక హిందూ కుటుంబంలో జన్మించినప్పుడు నీ తండ్రి అయి ఉండవచ్చును. అలాగే నిన్ను కలిసిన క్రీస్తు సోదరి ఒక 10 జన్మల క్రితం నీవు ముస్లింగా పుట్టినప్పుడు నీ కుమార్తె అయి ఉండవచ్చును. అంతే కదా! ఈ విషయం ప్రతీ ఒక్కరు గట్టిగా ఆలోచిస్తే ప్రపంచమంతా చక్కగా సర్వమానవ సౌభ్రాతృత్వం విలసిల్లుతుంది.

ఒక్కోసారి మనం ఒక హిందూ యువకుడు ముస్లిం యువతినో, లేక ఒక క్రిష్టియన్ యువతినో, అలాగే ఒక క్రిష్టియన్ యువకుడు ఒక హిందూ యువతినో, లేదా ముస్లిం యువతినో ఇలా మతాంతర వివాహం చేసుకోవడం చూస్తుంటాము. అది కూడా వారిద్దరు ఎంతో గాఢంగా ప్రేమించుకొని వారి కుటుంబ పెద్దలను ఎదిరించి ఎన్నో కష్టాలు పడి మరీ పెళ్ళి చేసుకుంటారు.

వీరు తమ తల్లిదండ్రులకు కూడా ఎదురు తిరిగి ఇలా ఎందుకు చేసారా అని ఆలోచిస్తే మనకు ఒక విషయం బోధపడుతుంది. వీరిద్దరు వారి పూర్వజన్మలలో ఎప్పుడో కలిసి ఉంటారు. ఆ జన్మలో వీరిద్దరు తల్లిదండ్రులో, అక్కచెల్లెళ్లో, అన్నదమ్ములో లేదా గాఢ స్నేహితులో అయి ఉంటారు.

అందువలన వీరు ఈ జన్మలో మళ్ళీ కలుసుకున్నప్పుడు వీరికి ఆ పూర్వజన్మ బంధపు వాసనల వలన ఒకరు అంటే ఒకరికి ఎంతో ప్రేమానుబంధాలు కలుగుతాయి. ఇది వారు వివరించి చెప్పలేరు. కాని ఆ పూర్వజన్మల బంధం ఎంత గాఢమైనదంటే వీరు రెండు కుటుంబాల పెద్దలని ఎంతో గట్టిగా ఎదిరిస్తారు. చివరికి కన్న తల్లిదండ్రులకు కూడా దూరంగా ఉండడానికి ఏమాత్రం ఆలోచించరు. ఎందుకంటే పూర్వజన్మలలో ఎప్పుడో ఒకసారి వీరి మధ్య అంత గాఢ బంధం ఏర్పడి ఉంటుంది. ఆనాటి ఆ బంధం తిరిగి ఇన్ని జన్మల తరువాత ఇలా మరొక బంధంగా రూపు దిద్దుకుంటుంది.

నాకు తెలిసిన రామకృష్ణ అనే వ్యక్తి ఉన్నాడు. అతడు ఎంతో సాంప్రదాయ బ్రాహ్మణ కుటుంబంలో జన్మించి ఇంజనీరింగ్ చదివాడు. అతడికి గాని, అతని తల్లిదండ్రులకు గాని, అమెరికా వెళ్ళడం ఏ మాత్రం ఇష్టంలేదు. తన తోటివారు ఎంతో మంది పై చదువులకు అమెరికా వెళ్ళినా తాను ఏమాత్రం ప్రయత్నం చేయలేదు. ఇలా గడుస్తుండగా ఒక రోజు ఒక ఆప్తమిత్రుడు రామకృష్ణతో తాను యం.యస్. చదవడానికి అప్లై చేస్తున్నానని రామకృష్ణను కూడా అప్లై చేయమన్నాడు. అప్పటి దాకా అసలు ఎటువంటి పరిస్థితిలోను వెళ్ళనన్నవాడు ఆ క్షణంలో మనస్సులో ఏదో ఆలోచన కలిగింది. అమెరికా వెళదామని ఒక్కసారిగా స్ఫురించింది. అంతే! తన మనస్సు ఎందుకు అలా అమెరికావైపు లాగుతోందో అర్థం కావడం లేదు. యం.యస్.కి అప్లై చేయడం, ఇంట్లో వారు ఎంత వారించిన వినకుండా అమెరికా వెళ్ళడం, యం.యస్. పూర్తి చేసి మంచి ఉద్యోగంలో చేరడం జరిగిపోయింది.

ఇంతలో అతడికి తల్లిదండ్రులు పెళ్లి చేయాలని సంకల్పించారు. అప్పుడు రామకృష్ణ తాను ఇప్పుడే వివాహం చేసుకోనని, ఒక నాలుగు సంవత్సరాలు ఆగమని అన్నాడు. రెండు సంవత్సరాలు ఉద్యోగంలో ఉన్న తరువాత ఒకనాడు అక్కడ అదే ఆఫీసులో పనిచేస్తున్న క్రిష్టినా అనే అమెరికన్ యువతి పరిచయమయింది. వీరిద్దరి మధ్య గాఢమైన ప్రేమ కలిగింది. అంతే ఇద్దరు ఒకరోజు రిజిష్టర్డ్ వివాహం చేసుకున్నారు.

ఇండియాలో ఉన్న తల్లిదండ్రులు, బంధువులు రామకృష్ణ ఇలా ఒక అమెరికన్ యువతిని వివాహం చేసుకున్నందుకు ఎంతో బాధపడ్డారు. కాని లాభం లేకపోయింది. ఇదంతా ఎందుకు జరిగింది? క్రిందటి జన్మలో వీరిద్దరు అమెరికన్ జాతీయులే! అంతే కాదు, వీరిద్దరు తండ్రి కొడుకులు కూడానూ! ఒకరంటే ఒకరు ప్రాణప్రదంగా ఉండేవారు. ఆ జన్మలో దురదృష్టవశాత్తు ఇద్దరు ఒకరోడ్డు ప్రమాదంలో మరణించారు.

తండ్రి తరువాత జన్మలో అమెరికాలో క్రిష్టినాగా జన్మించాడు. కొడుకు ఇక్కడ ఇండియాలో జన్మించాడు. కాని ఆ పూర్వజన్మలో వీరి బంధం ఎంతటిదంటే రామకృష్ణ ఎటువంటి పరిస్థితులలోను అమెరికా వెళ్ళవద్దని అనుకున్నా కూడా మళ్ళీ అక్కడికే వెళ్ళేలా చేసింది. అంతే కాకుండా ఒకే నగరంలో ఇద్దరు చేరడం ఇద్దరు ఒకే

ఆఫీసులో ఉద్యోగంలో చేరడం జరిగింది. చూసారా! పూర్వజన్మ బంధాలు మనుషుల్ని ఎలా ఎంతెంత దూరాలు తీసుకెళ్తాయో! మనం జాగ్రత్తగా ఆలోచిస్తే మన చుట్టూ జరిగే ప్రతీ సంఘటనకి మనకి సమాధానాలు దొరకుతాయి. అసలు మనకు వచ్చే ప్రతీ సందేహానికి ఈ ప్రకృతినుంచే చక్కటి సమాధానం దొరకుతుంది. మనం దాన్ని అర్థం చేసుకుంటే మనకు ఏ విషయంలోను అశాంతి, ఆందోళన కలుగకుండా మనసుకి ప్రశాంతత, సంయమనం కలుగుతాయి.

మహాభారత కాలం నాటి అనేక మంది వ్యక్తులు తరువాత అనేక జన్మలు ఎత్తి ఇప్పటికి మనమధ్యనే తిరుగుతున్నారు. ఆ కాలం నాటి అనేక మందిని ధ్యానంలో ఉన్నత స్థితిలో ఉన్నప్పుడు దర్శించడం జరిగింది. మహాభారత సమయంలో ఎంతో ముఖ్య పాత్ర వహించిన అనేకమంది చక్రవర్తులు, సామంతులు, వీరులు, సామాన్యులు అనేక మంది అటు తరువాత ఎన్నో జన్మలెత్తుతూ ప్రస్తుతం అనేక దేశాలలో అనేక రకాల జీవితాలు గడుపుతున్నారు.

అప్పటి శకుని ఆ తరువాత అనేక జన్మలెత్తి భారతదేశంలో ఒక 200 సంగులు క్రితం ఒక చిన్న సామ్రాజ్యానికి రాజుకూడా అయ్యాడు. అప్పుడు కూడా కొన్ని అధర్మ కార్యాలు చేసి అతి సామాన్య జీవితం గడుపుతూ ఇప్పటికి మన మధ్యనే ఉన్నాడు. అలాగే అప్పటి ఒక మహారాజు అటు తరువాత కాలంలో దక్షిణ భారత దేశంలో తమిళనాడులో జన్మించి ఒక రాజ్యంలో గొప్ప వీరుడిగా ప్రసిద్ధి పొందారు.

అప్పటి కాలంలో ఉన్న ఒక మహాపండితుడు తరువాత శ్రీనాథునిగా జన్మించాడు. ఆ శ్రీనాథుడు ఎన్నో అద్భుత కావ్యాలు వ్రాసినా ఇంకా ఎన్నో కోరికలు తీరక తరువాత అనేక జన్మలెత్తుతూ ఇప్పటికి తూర్పుగోదావరి జిల్లాలోని ఒక అగ్రహారంలో ఉన్నాడు.

అప్పటి కౌరవులలో కొందరు తరువాత జన్మలలో భారతదేశం, ఆఫ్ఘనిస్తాన్, రష్యా, ఇరాన్ ప్రాంతాలలో ఎన్నో జన్మలలో జన్మిస్తూ ఇప్పటకీ మనమధ్యనే ఉన్నారు. అప్పటి మహాపండితులలో కొందరు ఆ తరువాత కాలంలో ఎన్నో ఉత్తమ జన్మలు పొంది గొప్ప సంస్కారవంతులై జన్మించి భారతదేశంలోని అనేకక రాజ్యాలలో మహాపండితులుగా పేరొందారు.

శ్రీకృష్ణదేవరాయుల ఆస్థానంలో ఉన్న అష్టదిగ్గజాలలో కొందరు మహాభారత కాలం నాటివారే! వీరిలో కొందరు అటు తరువాత కాలంలో గొప్ప

సాహిత్యకారులు గాను, తరువాత సంగీతకారులు గాను జన్మించి ఎంతో ప్రసిద్ధిపొందడం నేను గమనించాను. వీరిలో కొందరు నన్ను హిమాలయాశ్రమంలో కూడా కలిసారు. వారు కూడా తిరిగి కొన్ని జన్మల తరువాత ఈ జన్మలో నన్ను కలిసారు.

ఆ మధ్య ఒకసారి నేను ఆంధ్రప్రదేశ్‌లోని మహాపుణ్యక్షేత్రమైన ద్రాక్షారామం వెళ్ళినప్పుడు మహాభారత కాలం నాటి ఒక గొప్ప శైవ పండితుడు తరువాత అనేక జన్మలెత్తి ప్రస్తుత జన్మలో ఈ ఆలయంలో అర్చకుడిగా పని చేస్తుండడం గమనించాను. ఎన్నో వేద శాస్త్రాలలో మహాపండితుడు అయినప్పటకీ కొన్న పూర్వజన్మ పాపకార్యాల ఫలితంగా అత్యంత బీదరికం అనుభవిస్తున్నాడు. అలాగే ఆ కాలంలో నివసించిన అనేక మంది మహాపండితులు ఇప్పటికి మన మధ్యనే ఉన్నారు. మహాభారత కాలంనాటి దృష్టద్యుమ్ముడు, ద్రుపదుడు ఇలా ఆనాటి ఎందరో వీరులు తరువాత అనేక దేశాలలో అనేక జన్మతెత్తుతూ ఇంకా మోక్షం కలుగక మన మధ్యనే తిరుగుతున్నారు.

అప్పటి అష్టదిగ్గజాలలోని ఇద్దరు తరువాత అనేక జన్మలెత్తి నేను హిమాలయాశ్రమంలో ఉన్నప్పుడు నన్ను కలిసారు. తరువాత అనేక జన్మలెత్తి వేరు వేరు దేశాలలో, వేరు వేరు ప్రాంతాలలో జన్మించి ప్రస్తుత జన్మలో వీరిద్దరు అమెరికన్ యూనివర్సిటీలలో ప్రొఫెసర్‌గా ఉన్నారు. ఒకరు హార్వర్డ్ యూనివర్సిటీలో ఎంతో ప్రముఖ స్థానంలో ఉన్నారు. మరొకరు మిచిగన్ యూనివర్సిటీలో ఉన్నారు. వీరిద్దరు క్రైస్తవ మతంలో జన్మించినప్పటికీ పూర్వ జన్మ వాసనలు వలన ప్రస్తుత జన్మలో హిందూ సాంప్రదాయాలపై ఆకర్షితులై హిదుత్వంపై పరిశోధనలు చేస్తున్నారు. ఆశ్చర్యకర రీతిలో నాతో పరిచయం కలిగింది. వ్యక్తిగతంగా కలవకపోయినా ఎంతో అభిమానంగా ఉంటారు. ఈ మెయిల్‌లో మాట్లాడుతుంటారు. వీరేకాక ఇంకా చాలా మంది ప్రముఖవ్యక్తులు ఇలా ఎన్నో వందల సంవత్సరాల క్రితం భారతదేశంలో జన్మించి ఎంతో గొప్ప పండితులుగా జీవించి ప్రస్తుతం కొన్ని విదేశీ విద్యాలయాలో ఎంతో ప్రముఖ స్థానంలో ఉన్నారు. వీరిలో కొంతమంది అప్పటి జన్మలో నన్ను హిమాలయాశ్రమంలో కలుసుకున్నవారే! పూర్వజన్మ బంధాల వలన వారందరు ఈ జన్మలో తిరిగి నాకు పరిచయం అయ్యారు. వీరిలో కొంతమంది చాలా ఆప్తులయ్యారు కూడా!.

మహాభారతకాలం నాటి ఒక గొప్ప పండితుడే తరువాత ప్రముఖ శాస్త్రవేత్త లియో టాల్‌స్టాయ్ గా జన్మించాడు. ఇతడు కొన్ని జన్మల తరువాత భారతదేశంలో ఒక ప్రముఖ సైంటిస్ట్ గా జన్మించాడు. అలాగే ఆ కాలంలో హిమాలయ ప్రాంతాలలో తపస్సు చేస్తున్న ఒక మహర్షి తరువాత కాలంలో శ్రీ బమ్మెర పోతనమాత్యులుగా జన్మించి ఆంధ్రమహాభాగవతాన్ని తెలుగులో రచించాడు.

శ్రీకృష్ణదేవరాయుల కాలంలో ఉన్న ధూర్జటి మహాకవి తరువాత కాలంలో కాశ్మీరు దేశంలో ఒక మహాపండితుడిగా జన్మించి నేటి కాలంలో ఒక గొప్ప సినీరచయితగా ప్రసిద్ధిపొందాడు. అలాగే అష్టదిగ్గజాలలో మరొక కవి అటు తరువాత అనేక జన్మలు పొంది ఈ జన్మలో కాకినాడ సమీపంలో అయ్యగారి సూర్యనారాయణ మూర్తి అనే పేరుతో జన్మించాడు. వీరు ఒక నాలుగు జన్మల క్రితం ఉత్తర ప్రదేశ్‌లో మహా పండితుడుగా జన్మించి హిమాలయాశ్రమంలో నన్ను కలుసుకున్నారు. ఈ జన్మలో వీరు నన్ను ఆశ్చర్యకర రీతిలో తిరిగి కలుసుకున్నారు.

వీరు ఇంజనీరింగ్ చదివినప్పటికీ పూర్వజన్మల పుణ్యఫలం వలన అద్భుతంగా చందోబద్ధంగా గొప్ప కవిత్వం చెప్పగల వారు. ఒక పెద్ద కంపెనీలో పెద్ద హోదాలో ఉన్నారు. ఆ కంపెనీ ఛైర్మన్ పెద్దగా దైవభక్తి లేనివారు. వారు వేరే దేశంలో ఒక క్రొత్త కంపెనీ నెలకొల్పినప్పుడు ఆ కంపెనీ అభివృద్ధిలోకి రావడానికి మంచి లోగో కోసం నన్ను సంప్రదించదలిచారు.

ఆ కంపెనీ యాజమాన్యం వారికి ఈ వేద శాస్త్రాలపై ఏ మాత్రం నమ్మకం లేనప్పటికి ఆ క్షణంలో వారికి ఏదో ఆలోచన కలిగి లోగో కోసం నన్ను కలవ వలసిందిగా శ్రీ సూర్యనారాయణ మూర్తిగారిని నా వద్దకు పంపారు. ఇది భగవత్ప్రేరణ కాక మరేమిటి?.

ఇప్పటి దాకా ఎటువంటి నమ్మకాలు లేని ఆ ఛైర్మన్ ఈ సూర్యనారాయణ మూర్తిగారిని నా వద్దకు పంపడం భగవంతుడు తిరిగి మా ఇద్దరిని కలపడానికే జరిగింది. ఆ విధంగా లోగో కోసం నన్ను కలిసిన శ్రీ మూర్తిగారు మా కుటుంబానికి ఎంతో ఆప్తులయ్యారు. వారు మామగారు మహాపండితుడు. శ్రీమూర్తిగారు తమ ప్రారబ్ధ కర్మలన్నీ క్షయం కావడానికి ఈ జన్మలో ఎన్నో బాధలు పడుతున్నారు. వారికి ఇక కొన్ని జన్మలలోనే జన్మరాహిత్యం కలిగి ముక్తి లభిస్తుంది.

ఇలాగే ఇప్పటి చరిత్రలో ప్రముఖులైన నెపోలియన్, అలెగ్జాండర్, హిట్లర్, ముస్సోలినీ, ఇలా ఎందరో తరువాత అనేక జన్మలెత్తుతూ ఇప్పటికి మనమధ్యనే ఉన్నారు. వీరిలో కొందరు తరువాత కాలంలో కూడా పెద్ద రాజకీయ వేత్తలు గా జన్మించారు. కొన్ని దేశాలలో రాష్ట్రాలకు గవర్నరుల గానో, ముఖ్యమంత్రులు గానో అయ్యారు. వారికున్న విపరీతమైన రాజ్యకాంక్షతో కొందరు పెద్ద పదవులు కూడా అధీష్టించారు.

అయితే అనేక అధర్మ కార్యక్రమాలు చేయడం వలన ప్రస్తుత జన్మలో కొందరు చాలా పేదరికంలో జీవిస్తున్నారు. అటువంటి కొందరిని ఈ జన్మలో నేను చూడడం జరిగింది. అటువంటి ఒకరింటికి నేను వెళ్ళినప్పుడు వారింట్లో ఒక నాలుగు వందల సంవత్సరాల నాటి ఒక ప్రముఖ అమెరికన్ నాయకుడి ఫొటో ఒకటి గోడకు ఉండడం చూసాను. అతడిని ఆ ఫొటో ఎవరిది అని ఎందుకు పెట్టుకున్నారని అడిగాను. అతడు దానికి సరియైన సమాధానం చెప్పలేకపోయాడు.

అతడు పెద్దగా చదువుకోలేదు. అతిచిన్న ఉద్యోగం చేస్తూ రోజులు వెళ్ళదీస్తున్నాడు. ఇతనికి వేరే దేశపు నాయకులు కాదు గదా మనదేశపు వారే పూర్తిగా తెలియదు. అటువంటిది ఆ అమెరికా దేశపు ప్రముఖుడి ఫొటో ఇతను ఎందుకు పెట్టుకున్నాడా అని ఆలోచించాను.

అప్పుడు నాకు ఒక ఆశ్చర్యకరమైన విషయం తెలిసింది. అప్పటి ఆ అమెరికా ప్రముఖుడే ఇప్పటి ఈవ్యక్తి! ఎన్నో జన్మల తరువాత ప్రస్తుతం ఇక్కడ హైదరబాద్‌లో పుట్టి ఇక్కడే ఉన్నాడు. అతి సామాన్య జీవితం గడుపుతున్నాడు. అతనికి ఎక్కడికో వెళ్ళినప్పుడు ఈ ఫొటో ఒకటి పాత న్యూస్ పేపర్‌లలో కనబడింది. ఆ ఫొటోలోని వ్యక్తి పట్ల ఎంతో ఆకర్షితుడై ఆ ఫొటో కత్తిరించి తెచ్చుకొని తన ఇంట్లో పెట్టుకొని నిత్యం చూస్తుంటాడు. చూసారా! పూర్వజన్మల వాసనలు ఎంత గట్టిగా ఉంటాయో?.

ఈ విధంగా మనలో చాలా మంది మన నిత్య జీవితాలలో ఎన్నో సార్లు గమనిస్తుంటాము. మీరు ఏదైనా మేగజైన్ తిరగేస్తున్నప్పుడో లేదా ఇంటర్‌నెట్‌లో ఏదో చూస్తున్నప్పుడో ఎవరో అపరిచిత వ్యక్తి ఫొటోనో, వీడియోనో చూడడం జరుగుతుంది. మనకు తెలియకుండానే కాసేపు ఆ ఫొటో దగ్గరే ఉండిపోతాము. అలాగే ఆ వీడియో అంత ఆసక్తికరంగా లేకపోయినా ఆ వీడియో మొత్తం చూస్తారు.

అలా మీరు చూసిన ఆ వ్యక్తికి, మీకు పూర్వజన్మలలో ఏదో సంబంధం ఉందన్నమాట! మీ ఆత్మకి ఈ విషయం తెలుసు కానీ మీ మనస్సుకి తెలియదు. పూర్వజన్మ వాసనల వలన ఒక్క క్షణం మీరు ఆ వ్యక్తివైపు ఆకర్షితులౌతారు. కాసేపు ఆ వ్యక్తినే చూస్తూ తరువాత ముందుకు వెళతారు.

ఇలా నేను ఎందరో పూర్వకాలపు ప్రముఖ రచయితలను, సినీతారలను, శాస్త్రజ్ఞులను, క్రీడాకారులను, ఇలా అనేక రంగాలలోని ప్రముఖ వ్యక్తులు ఈ జన్మలో వివిధ దేశాలలో జన్మించి రకరకాల వృత్తులలో జీవించడం గమనిస్తున్నాను.

కృష్ణారావు అనే నా స్నేహితుడొకడు ఇంజనీరింగ్ చదివి ఒక మంచి కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. అతనికి ఉన్నట్టుండి ఫ్రెంచ్ భాష నేర్చుకోవాలనే కోరిక కలిగింది. అది ఎంత ఎక్కువ అయిందంటే అతడు ఫ్రెంచ్ భాషను నేర్చుకోవడమే కాకుండా ఆ భాషలో వచ్చిన గొప్ప సాహిత్యాన్ని కూడా చదివాడు. కొన్నింటిని తెలుగులోకి అనువదించాడు కూడా! అతని స్నేహితులు చాలామంది ఇదంతా చూసి ఎంతో ఆశ్చర్యపోయారు.

ఇతడికి ఉన్నట్లుండి ఫ్రెంచ్ భాషపై ఎందుకు అంత మక్కువ ఏర్పడిందా అని అనుకున్నారు. దానికి కారణం ఒక్కటే ! అతడు గత జన్మలలో ఒక జన్మలో ఫ్రాన్స్ దేశంలో జన్మించాడు. అంతే కాదు ! ఈ రోజు తాను తెలుగులోకి అనువదించిన ఒక పుస్తకం ఆ జన్మలో రచించిన ప్రముఖ ఫ్రెంచ్ రచయిత ఇతడే ! ఇతడికి ఆ జన్మలో భారతదేశం మీద ఎంతో మక్కువ ఉండేది. ఆ కారణం చేత ఈ జన్మలో ఇక్కడ భారతదేశంలో జన్మించాడు. అయితే పూర్వజన్మ వాసనలు వలన ఇతడు ఫ్రెంచ్ భాషపై, ఫ్రెంచ్ సంస్కృతిపై ఎంతో ఆకర్షింపబడి ఆ భాషను ప్రత్యేకంగా నేర్చుకొని ఆ భాషలో ఎంతో పట్టుసాధించి చివరికి తన పుస్తకాన్ని ఆ జన్మలో తను రాసిన ఫ్రెంచ్ పుస్తకాన్ని ఈ జన్మలో తానే తెలుగులో అనువదించాడు.

ఇతడే ఈ జన్మలో ఇండియాలో హిందూ మతంలో పుట్టి 25 సం॥లు వయస్సులో క్రీస్తుమతం తీసుకొని ఆ మతంలో గొప్ప ప్రవచనకారుడయ్యాడు. ఇతడు ఇచ్చే ఉపన్యాసాలు లక్షలమందిని ఆకట్టుకుంటాయి. స్వతహాగా క్రీస్తుమతంలో జన్మించిన అమెరికన్లు, బ్రిటీష్ వారు సైతం ఆశ్చర్యపోతారు.

ఇతడు ఇంత గొప్పగా క్రైస్తవ మతం గురించి బోధించడానికి ఒకటే కారణం. అతడు క్రిందటి నాలుగు జన్మలలో వివిధ దేశాలలో క్రీస్తు మతంలో పుట్టి

ప్రతీ జన్మలోను చర్చిలో బోధకుడై ఉండి, క్రీస్తుమతం మీద ఎంతో గురికలవాడై అయ్యాడు. ఇతడు ఆ జన్మలో ఇచ్చే ఉపన్యాసాలను అందరూ ఎంతో శ్రద్ధగా ఉండేవారు. ఒక విశేషం ఏమిటంటే అతడు ఇలా ఒక జన్మలో అమెరికాలో ఉన్నప్పుడు ఒక హిందూ యువతితో పరిచయమై ఎంతో ఆకర్షింపబడ్డాడు. కాని తాను సమాజంలో ఎంతో ఉన్నత స్థాయిలో ఉండడంతో, అదీ క్రీస్తు మతంపై అంతగా ఉపన్యాసాలు ఇచ్చేవాడుకావడంచేత ఆమెపై గల తన ప్రేమను అలా గుండెల్లోనే దాచుకున్నాడు.

అది అతడి ఆత్మని ఎంత గాఢంగా పట్టుకుందంటే తరువాత జన్మలో అతడు హిందువుగా జన్మించి ఆ యువతి ప్రస్తుత జన్మలో ఎక్కడ జన్మించిందో ఆ గ్రామం దగ్గరగా మరో కుటుంబంలో జన్మించి ఆమెనే పెళ్ళి చేసుకున్నాడు. చూసారా ! పూర్వజన్మల గాఢమైన బంధం ఎంతెంత దూరం తీసుకువస్తుందో! అతడి గాఢమైన ప్రేమ ఆత్మను గట్టిగా పట్టుకొని అతన్ని తరువాత జన్మలో ఇక్కడ పుట్టేలా చేసింది. హిందూ మతంలో జన్మించినప్పటికి అతడు తన 25 వ యేట తిరిగి క్రీస్తు మతం వైపు ఆకర్షించినప్పటికి బైబిల్‌ను క్షుణ్ణంగా చదివి ఆ మతంలో ఎంత గొప్ప బోధకుడు అయ్యాడు.

మళ్ళీ మనం హిమాలయాశ్రమానికి వద్దాం. అప్పుడు నాతో ఉన్నవారిలో ఆంధ్రప్రదేశ్‌లో జన్మించిన కృష్ణశాస్త్రి అనే పండితులు ఒకరు ఉండేవారు. అప్పటి మద్రాసు రాష్ట్రంలో కృష్ణ శాస్త్రి చాలా గొప్ప పండితులు. తూర్పుగోదావరి జిల్లాలోని ఇంజరం గ్రామంలో జన్మించాడు. సంస్కృత భాషలో ఎంతో గొప్ప పాండిత్యం సంపాదించాడు. అతని ఇద్దరి కొడుకులు కూడా గొప్ప పండితులయ్యారు. కృష్ణశాస్త్రిగారు ఎన్నో బిరుదులు పొందారు. గజారోహణ సత్కారం, గండపెండేర సన్మానం జరిగింది. అటుతరువాత తన 65 వ యేట హిమాలయ పర్వతాలకు వచ్చిన ఆయన నా ఆశ్రమం చేరుకున్నారు. నాకెంతో ఆప్తులయ్యారు. ఆ తరువాత జన్మలో వారు కాశీపట్టణంలో జన్మించారు. అటు తరువాత జన్మలో ఫ్రాన్స్ దేశంలో జన్మించారు. ఫ్రాన్స్ దేశంలో ఉన్నప్పుడు చర్చిలలో బోధకుడిగా ఉండేవాడు. క్రీస్తు మతంలో జన్మించినప్పటికి మిగిలిన మతాలమీదకూడా గౌరవం కలిగియుండేవారు. ప్రపంచంలోని అన్ని మతాల వారు ఎంతో సహనంగా, కలిసి మెలిసి ఉండాలని చెప్పేవారు.

ప్రస్తుత జన్మలో ఆయన అమెరికాలోని ప్రఖ్యాత హార్వర్డ్ యూనివర్సిటీలో రిచర్డ్ అనే పేరుతో ఉద్యోగం చేస్తున్నారు. ఆశ్చర్యమేమిటంటే తనకున్న పూర్వజన్మల బంధం వలన రిచర్డ్ ఈ జన్మలో కూడా కొన్ని నెలలు ఇండియాలో గడిపాడు. అంతే కాకుండా ప్రఖ్యత పుణ్యక్షేత్రమైన అరుణాచలంలో ఒక నెలరోజుల పాటు ఉన్నాడు. పౌర్ణమి నాడు ఆ పవిత్ర కొండనెక్కి శ్రీస్వామివారిని దర్శించుకున్నాడు కూడా! స్వతహాగా ఇప్పుడు కూడా క్రీస్తు మత బోధకుడైనప్పటికి పూర్వ జన్మ వాసనల వలన ఇండియా వచ్చి ఇలా అరుణాచలంలో ఉండి ఆ శ్రీఅరుణాచలేశ్వరుని సన్నిధిలో ఒక నెలరోజులు గడిపాడు. అతడి భార్య రియా కూడా ఎంతో సౌమ్యురాలు. ఆమె ఎంతో ఉన్నతమైన గుణాలు కలిగిన వ్యక్తి. ఆమె కూడా అదే హర్వర్డ్ యూనివర్సిటీలో పనిచేస్తుంది.

నేను విదేశాలు వెళ్ళడానికి అంతగా ఇష్టపడను. మా బంధువులు, స్నేహితులు ఎంతోమంది ఎన్నో సంవత్సరాలుగా అమెరికాలో ఉన్నప్పటికి నేను క్రిందటి సంవత్సరం వరకు కూడా అమెరికా వెళ్ళలేదు. మా రెండవ అమ్మాయి ఆముక్త వివాహం 2013 లో జరిగి గత అయిదు సంవత్సరాలుగా అమెరికాలో ఉంటోంది. వాళ్ళకి పాప పుట్టినప్పుడు నేను, రుక్మిణి అమెరికా వెళ్ళవలసిన వాళ్ళం. అప్పుడు మా అబ్బాయి ఆదిత్య స్టాంఫర్డ్ యూనివర్సిటీలో గ్ర్యాడ్యుయేషన్ కూడా ఉంది. అయినా కూడా చివరి నిమిషంలో నేను టిక్కెట్ క్యాన్సిల్ చేసుకున్నాను.

ఇక్కడ రోజు మా ఇంటికి నా పుస్తకాలు కోసం, సలహాల కోసం ఎవరో ఒకరు వస్తూంటారు. అంతే కాక ప్రతీరోజు పోస్ట్ ద్వారా, కొరియర్ ద్వారా ఈ పుస్తకాలు ఎంతో మందికి పంపుతుంటాము. నేను ఆరు నెలలు హైదరబాద్‌లో లేకుండా వెళితే వీళ్ళందరూ ఇబ్బందిపడతారు అని అనుకొని నేను అమెరికా వెళ్ళడానికి అంత సుముఖత చూపలేదు. చివరికి రుక్మిణి ఒక్కత్తే వెళ్ళింది. నేను ఒక్కడిని ఇక్కడే ఉండిపోయాను.

ఇలా ఉండగా 2018 వ సం॥లో నేను శ్రీవారి దర్శన్ అనే ఇంగ్లీష్ పుస్తకాన్ని వ్రాసాను. ఇన్ని సంవత్సరాలుగా నాకు ఎంతో ఆప్తులైన కొందరు స్నేహితులకు బహుమానంగా ఇద్దామని తిరుమల కొండల విశిష్టతను, శ్రీవేంకటేశ్వర స్వామి వారికి సంబంధించిన అనేక విశేషాలతో పూర్తి ఫొటోలతో ఇంగ్లీష్‌లో ఈ శ్రీవారి దర్శనం పుస్తకం వ్రాసాను. ఆ స్వామివారి అపారమైన దయవలన ఈ పుస్తకం ప్రపంచంలోని అనేక దేశాలలోని ప్రముఖ యూనివర్సిటీల

లైబ్రరీలలో ఉంచబడింది. అమెరికాలోని హార్వర్డ్, స్టాంఫర్డ్, కార్నెల్, వాషింగ్టన్, కొలంబియా, చికాగో లైబ్రరీలలోను, బ్రిటన్‌లోను ఆక్స్‌ఫర్డ్, కేంబ్రిడ్జ్ యూనివర్సిటీ లైబ్రరీలలోను, బ్రిటీష్ లైబ్రరీ, లండన్‌లోను, డెన్మార్క్‌లోని రాయల్ డేనిష్ లైబ్రరీలోను, జర్మనీలోని హైడెల్‌బర్గ్ యూనివర్సిటీలోను, ఫిలిప్పైన్స్ లోని ఫిలిప్పైన్స్ యూనివర్సిటీలోను ఇంకా అనేక ప్రముఖ యూనివర్సిటీలలోను ఈ శ్రీవారి దర్శన్ పుస్తకం ఉంచడం జరిగింది. ఇదంతా శ్రీనివాసుని సంకల్పం తప్ప మరొకటి కాదు.

ఇలా వెళ్ళిన యూనివర్సిటీలలోని కొందరు ప్రొఫెసర్లు ఈ పుస్తకం చదివి ఎంతో సంతోషపడుతూ నాకు ఈ మెయిల్స్ ఇచ్చారు. ఇప్పటికీ అప్పుడప్పుడు వీరిలో కొందరు నాతో ఈమెయిల్‌లో మాట్లాడుతున్నారు. అయితే వీరందరిలో హార్వర్డ్ లైబ్రరియన్ రిచర్డ్ నాకెంతో దగ్గరయ్యాడు. ఇంకో విశేషమేమిటంటే హార్వర్డ్ వారికి నా పుస్తకాలు గురించి తెలిసి నేను వ్రాసిన 15 తెలుగు పుస్తకాలు వారు లైబ్రరీలో ఉంచారు.

ఒకే రచయిత వ్రాసిన 15 తెలుగు పుస్తకాలు హార్వర్డ్ లైబ్రరీలో ఉంచడం ఇదే ప్రథమం. ఇదంతా ఆ శ్రీవేంకటేశ్వర స్వామి వారి అనుగ్రహం తప్ప మరొకటి కాదు. క్రిందటి సంవత్సరం నేను, రుక్మిణి మా రెండవ అమ్మాయి ఆముక్త వద్దకు అమెరికాలో మూడు నెలలు ఉండడానికి వెళ్ళాము. అప్పుడు హార్వర్డ్ యూనివర్సిటీకి వెళ్ళి లైబ్రేరియన్ రిచర్డ్‌ను కలవడం కూడా జరిగింది. మమ్మల్ని కలిసినందుకు రిచర్డ్ ఎంతో సంతోషపడ్డాడు.

విశేషమేమిటంటే అప్పటి హిమాలయాశ్రమంలో రిచర్డ్ కూడా ఉన్నాడు. ఆ బంధమే నన్ను అంత దూరం వెళ్ళి రిచర్డ్‌ను కలిసేలా చేసింది. ఆ రోజు నేను, రుక్మిణితో పాటు మా తోడల్లుడు త్రివిక్రమ్, మరదలు రాధిక, మా బావమరిది హయగ్రీవ్ కూడా ఉన్నారు. విశేషమేమిటంటే నాతోపాటు ఉన్న మిగిలిన నలుగురు కూడా అప్పటి హిమాలయాశ్రమంలో ఉన్నవారే! పూర్వజన్మ బంధాలు మనుషుల్ని ఎలా కలుపుతాయో చూసారా! లేకపోతే ఎప్పుడూ అమెరికా వెళ్ళని నేను మొదటిసారి హార్వర్డ్ వెళ్ళి రిచర్డ్‌ని కలవడం ఏమిటి? అదికూడా మేము వెళ్ళినప్పుడే మా తోడల్లుడు, మరదలు కూడా రావడం, మాతో మా బావమరిది హయగ్రీవ్ కూడా రావడం ఇదంతా అప్పటి బంధం కాక మరేమిటి?.

ఇలా అప్పటి హిమాలయపు ఆశ్రమంలో ఉండి తిరిగి ఈ జన్మలో నన్ను కలిసిన వారిలో ఎల్లాప్రగడ రమణమూర్తిగారు ఒకరు. ఈయన 2001 వ సంవత్సరంలో వారి బంధువు ఒకరిని ఏదో సలహాకోసం నా వద్దకు తీసుకొచ్చారు. అతనికి ఒక ఫ్యాబ్రికేషన్ కంపెనీ ఉండేది. ఆ కంపెనీ నష్టాల్లో ఉండడంతో లోగో విషయంలో నా సలహా తీసుకుందామని నా వద్దకు వచ్చారు. ఆశ్చర్యం ఏమిటంటే ఆరోజు వచ్చిన ఆ బంధువు మళ్ళీ ఇప్పటిదాకా నన్ను కలవలేదు. కాని రమణమూర్తిగారు మాత్రం నాకు ఎంతో దగ్గరగా వచ్చి ఈ రోజు మా కుటుంబానికి ఎంతో ఆప్తులయ్యారు. ఎందుకంటే మా ఇద్దరిది అప్పటి హిమాలయాశ్రమ బంధం కాబట్టి!.

నేను హిమాలయాశ్రమంలో ఉన్న సమయంలో రమణమూర్తిగారు ఢిల్లీ నగరానికి దగ్గరలో ఒక పల్లెటూరులో ఒక సంపన్న మార్వాడి కుటుంబంలో కేశవ్‌చంద్ గుప్తా అనే పేరుతో జన్మించారు. ఆ కుటుంబానికి ఎన్నో రకాల వ్యాపారాలు ఉండేవి. ఆ కుటుంబానికి చుట్టుప్రక్కల ఊళ్ళలో ఎంతో పలుకుబడి ఉండేది. వీరు కొన్ని వ్యాపారాలు న్యాయంగా చేసినప్పటికి మరికొన్ని వ్యాపారాలు చాలా అన్యాయంగా చేసేవారు.

కేశవ్ చంద్ స్వభావరీత్యా ఎంతో గట్టివాడు. వ్యాపార విషయాలలో చాలా ఖచ్చితంగా ఉండేవాడు. అయితే బాగా డబ్బు ఉండడం వలన మాట కొంచెం గట్టిగా, అహంకారంగా ఉండేది. ఎదుటి మనిషిని కొద్దిగా తేలికచేసి మాట్లాడేవాడు. ఏం చెప్పాలనుకున్నా ఆలోచించక ఆ మనిషి మొహం మీదనే అనేసేవాడు. ఆ ఊరిలో చాలా మందికి కేశవ్ చంద్ అంటే చాలా కోపం ఉండేది.

రోజులు ఇలా గడుస్తుండగా ఒకనాడు కేశవ్ చంద్ తన దగ్గర పనిచేస్తున్న గుమాస్తాను ఏదో చిన్న తప్పుచేస్తే చాలా గట్టిగా మందలించాడు. ఆ మాటలకు ఎంత కాలం నుంచో వారి దగ్గర పని చేస్తున్న గుమాస్తా ఎంతో బాధపడ్డాడు. ఎంత బాధ పడ్డాడంటే ఆ బాధ తట్టుకోలేక ఒకనాడు అతను ఆత్మహత్య చేసుకున్నాడు. అక్కడితో భార్య, పిల్లలు రోడ్డున పడ్డారు. అటు తరువాత ఆ కుటుంబం ఎన్నో కష్టాలు పడ్డారు. గుమాస్తా భార్య కేశవ్ చంద్‌ను ఎన్నో శాపనార్థాలు పెట్టింది. ఊరి వారందరు కేశవ్ చంద్‌ను నానా మాటలు అన్నారు.

ఇవన్నీ భరించలేక ఒకనాటి రాత్రి కేశవ్ చంద్ ఊరు వదలి ఎటో వెళ్ళిపోయాడు. అలా ఎన్నో రోజులు ప్రయాణం చేసి మనశ్శాంతి కోల్పోయి చివరకు హిమాలయాలు చేరుకున్నాడు. మధ్యలో కొందరు సాధువులను, సన్యాసులను కలుసుకున్నారు. తాను చేసిన దానికి ఎంతో పశ్చ్యాతాప పడ్డాడు. అలా కొన్ని రోజులు తిరిగి తిరిగి నా హిమాలయాశ్రమానికి చేరుకున్నాడు.

నా ఆశ్రమంలో ఉన్నప్పుడు అక్కడున్న వారందరితో ఎంతో సఖ్యంగా ఉండేవాడు. ఒక రోజు పూజకు పువ్వులు కోసుకురావడానికి ప్రక్కన ఉన్న పూలతోటకి వెళ్ళాడు. అప్పుడు అక్కడ శ్రీహనుమంతులవారు ఒక సాధువు రూపంలో దర్శనమిచ్చారు. ఆ విధంగా వీరికి ఆ జన్మలో భగవద్దర్శనం జరిగింది. కేశవ్ చంద్ గుప్తా తరువాత జన్మలో తమిళనాడులోని కన్యాకుమారి దగ్గర గ్రామంలో వేలుపిళ్ళై అనే పేరుతో జన్మించాడు. ఈ జన్మలో కూడా కొన్ని వ్యాపారాలు చేసాడు. అయితే ఈ జన్మలో వేలుపిళ్ళై ఎంతో నిజాయితీగా వ్యాపారం చేసాడు. ఇతడికి ఇద్దరు కొడుకులు. వీరు సరిగ్గా చదువుకోక, వ్యాపారంలో కూడా తండ్రికి ఏమాత్రం సహాయపడకుండా ఉండేవారు. వీరెవరో కాదు! క్రిందటి జన్మలో కేశవ్ చంద్ మాటకి బాధపడి మరణించిన గుమాస్తా కుమారులే!.

తరువాతి జన్మలో వారు ఈ విధంగా ఇతని కుమారులుగా జన్మించి తండ్రిని దూషిస్తూ ఉండేవారు. తండ్రి చెప్పిన మాట వినేవారు కాదు. వారి ఆత్మ అప్పటి కేశవ్ చంద్ పై ఎంతో కోపం పెంచుకొని ఈ జన్మలో అతని కుమారులుగా జన్మించేలా చేసింది. పూర్వ జన్మలలో మనం చేసే పాపకార్యాలు మనల్ని ఇలా చుట్టుకుంటాయి, ఇలా బాధిస్తాయి. ఈ విషయం మనం బాగా గ్రహించాలి. మనం ఎంత ఎక్కువగా ప్రేమిస్తున్నప్పటికి, ఎంత ఆప్యాయంగా చూసుకుంటున్నప్పటికి ఒకొక్కసారి మన కొడుకులు, కూతుళ్ళు మనల్ని విపరీతంగా విసిగిస్తారు, బాధపెడతారు, రకరకాల మాటలు అంటారు. ప్రతీ చిన్నదానికి మనమీద అరుస్తారు. ఒకొక్కసారి వారికి కూడా తాము తన తండ్రినో, తల్లినో ఎందుకు అంతగా విసుక్కుంటున్నామో తెలియదు.

ఆ సమయంలో వారి మనసు వారి ఆధీనంలో ఉండదు. ఆ తరువాత వారన్న మాటలకు పశ్చ్యాతాప పడతారు. ఇదంతా పూర్వజన్మలకర్మల ఫలమే! పూర్వజన్మలలో ఆ వ్యక్తితో ఏదో విధమైన బంధం కలిగియున్నప్పుడు మనకు ఆ

వ్యక్తితో కలిగిన అనేక సంఘటనలు, బాధ, కోపం, ఆవేశం ఆత్మను అంటిపెట్టుకొని ఇప్పుడు ఈ జన్మలో ఈ విధంగా తీర్చుకుంటారు.

ఇలాగే ఒకొక్కసారి తల్లిదండ్రులకు కూడా ఎంతో ప్రేమగా చూసుకునే వారి పిల్లలపై ఒక్కసారిగా ఎంతో కోపం వస్తుంది. ఒక్కోసారి ఈ కోపం ఎంతదాగా వెళుతుందంటే ఆ కొడుకో, కూతురో ఇంటినుంచి కూడా వెళ్ళిపోయి కొన్ని సంవత్సరాలు విడిగా ఉంటారు. ఇది అటు తల్లిదండ్రులకి బాధ, ఆ కొడుకో, కూతరుకో కూడా బాధ కానీ వీరిద్దరూ ఏమీ చేయలేని పరిస్థితిలో ఉంటారు. పూర్వజన్మలలో ఉన్న బంధం వలన ఒకే కుటుంబంలో జన్మించినప్పటికీ, ఒకరంటే ఒకరికి ఎంతో ఆప్యాయంగా ఉంటున్నప్పటికీ, ఏవో జన్మలలో వీరిద్దరి మధ్య జరిగిన కొన్న సంఘటనల ప్రభావం చేత వీరిద్దరు ఈ జన్మలో ఇంత తీవ్రంగా ఘర్షణ పడడం జరుగుతుంది. ఇలా మనం కలలో ఊహించని సంఘటనలు ఈ జన్మలో జరగడం గమనిస్తుంటాము. ఇదంతా పూర్వజన్మ బంధాల ప్రభావం అని మనం గ్రహించాలి. అంతే గాని ఇటువంటి సంఘటనల వలన మనం పూర్తిగా కృంగిపోకూడదు.

క్రిందటి జన్మలో రమణమూర్తిగారు ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం జిల్లా ఆముదాల వలస గ్రామంలో రామారావు అనే పేరుతో జన్మించారు. ఒక స్కూలు టీచర్‌గా ఉద్యోగం చేసేవారు. ఈ జన్మలో ఎంతో మంచితనంతో నెమ్మదైన మనస్తత్వంలో ఉండేవారు. తన దగ్గర చదివిన ఎందరో విద్యార్థుల్ని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దారు. చాలామందిని ఎంతో సన్మార్గాలలోనికి నడిపించారు. 72 సం॥లు వరకు జీవించారు. ఈ జన్మలో ఆయనకి సంతానం కలుగలేదు. ఎన్నో పుణ్యక్షేత్రాలు దర్శించారు. నిత్యానుష్ఠానం చేసేవారు. ప్రతీరోజు క్రమం తప్పకుండా అక్కడ ఊరిలో ఉన్న శ్రీ సీతారామచంద్రుల వారి ఆలయానికి వెళ్ళేవారు. తండ్రికి రామారావు అంటే ఎంతో అభిమానం, ఎంతో ఆప్యాయత ఆ జన్మలోని అతడి తండ్రే ఈ జన్మలో రమణమూర్తిగారికి సోదరుడుగా శ్రీనివాస్ అనే పేరుతో జన్మించాడు.

రమణమూర్తిగారు ఈ జన్మలో ఎన్నో కష్టాలు పడ్డారు. చిన్నతనంలోనే తండ్రిని పోగొట్టుకొని కుటుంబానికి పెద్దదిక్కై అన్ని వ్యవహారాలు తానే చూసేవారు. ఆర్థిక ఇబ్బందులు ఎన్నో పడ్డారు. ఎందరో బంధువులచేత, స్నేహితులచేత ఎన్నో అవమానాలు పడ్డారు. ఇవన్నీ వారి ప్రారబ్ధకర్మ తీరిపోవడానికే! ఇంక కొన్ని జన్మలతో

వీరి కర్మక్షయం పూర్తవుతుంది. వచ్చే జన్మలో రమణమూర్తిగారు అమెరికా దేశంలో ఒక సంపన్న వ్యాపారుల కుటుంబంలో జన్మిస్తారు. పెద్ద సేవాసంస్థను స్థాపించి అన్ని మతాల వారికి ఎంతో సహాయపడతారు. వారి సంస్థ ద్వారా ఎందరో బీద విద్యార్థులకు చదువు చెప్పిస్తారు. ఎందరో అనారోగ్యవంతులకు ఉచితంగా చికిత్స చేయిస్తారు. వచ్చే జన్మ మొత్తం ఈ విధంగా ప్రజాసేవకే వినియోగిస్తారు. ఆ తరువాత జన్మలలో వీరు మళ్ళీ భారతదేశంలోని ఆంధ్రప్రదేశ్‌లోనే జన్మిస్తారు. ఆ జన్మలలో మళ్ళీ కొన్ని కష్టాలు పడతారు. అలా కొన్ని జన్మల తరువాత జన్మరాహిత్యం కలిగి ఆ మహాశక్తిలో ఐక్యమతుతారు.

ఇక వీరి తమ్ముడు శ్రీనివాస్ ఒక విచిత్ర మనస్తత్వం గల వ్యక్తి. అతడికి ఎన్నో మంచి విషయాలు తెలుస్తాయి. ప్రతీరోజు పూజ చేస్తుంటాడు. ఎన్నో గొప్ప పుణ్యక్షేత్రాలు దర్శిస్తాడు. ఎందరో గొప్ప గురువుల సాంగత్యం లభిస్తుంది. అయినా మనస్సు పూర్వజన్మలకర్మ ఫలంగా ఎప్పుడూ చంచలంగా ఉంటుంది. శ్రీనివాస్ ఏ పనీ దృఢసంకల్పంతో చేయడు. ఇతడు కూడా నేను హిమాలయాశ్రమంలో ఉన్నప్పుడు నా వద్దకు వచ్చాడు. అతడు వచ్చిన రీతి చాలా ఆశ్చర్యకరంగా ఉంటుంది.

అతడు కొన్ని జన్మల క్రితం నేటి యుగోస్లేవియా దేశంలో జన్మించాడు. అప్పుడు ఒక స్త్రీగా జన్మించి ఒక స్కూలు టీచర్‌గా పనిచేశారు. తరువాత జన్మలో భారతదేశంలోని కాశీపట్టణంలో జన్మించాడు. ఎన్నో గొప్ప విద్యలు నేర్చుకున్నాడు. అటు తరువాత జన్మలో ఢిల్లీ దగ్గర జన్మించాడు. ఒక పెద్ద వ్యవసాయ కుటుంబంలో జన్మించాడు. చాలా మంచి అలవాట్లు ఉండేవి. అయితే ఆ జన్మలో చాలామంది చెడు స్నేహితులు ఉండేవారు. ఆ స్నేహితులతో కలిసి పక్షులను విపరీతంగా వేటాడుతుండేవాడు. అటు తరువాత జన్మలో ఒక చిలుకగా జన్మించాడు. అయితే అంతకు ముందు జన్మలలో కొన్ని మంచి పనులు చేయడం వలన అతడు ప్రముఖ పుణ్యక్షేత్రమైన హరిద్వార్‌లో చిలుక రూపంలో జన్మించాడు.

ఒకరోజు ఒక సాధువు ఆ చిలుకను చూసి ఎంతో ముచ్చటపడి తనతోపాటు తీసుకకువెళ్ళాడు. చిన్న చిన్న మాటలు కూడా ఆ చిలుకకు నేర్పించాడు. అటు తరువాత కొంతకాలానికి ఆ సాధువు హిమాలయాలకు వచ్చి కొంతకాలం తపస్సు చేసి ఈ చిలుకను తీసుకొని నా హిమాలయాశ్రమానికి వచ్చాడు.

ఆ సాధువు, చిలుక బ్రతికినంతకాలం నా ఆశ్రమంలోనే ఉన్నారు. ఆ చిలుక ప్రతీరోజు ఎందరో సాధువుల, యోగుల మధ్య ఉంటూ కొన్ని సంవత్సరాలు ఆ ఆశ్రమంలో ఉండడం చేత తరువాత జన్మలో కంచి పట్టణంలో గొప్ప బ్రాహ్మణ కుటుంబంలో జన్మించాడు. అటు తరువాత మరొక జన్మలో ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ సమీపంలోని గ్రామంలో జన్మించాడు. అప్పటి హిమాలయాశ్రమ బంధం కారణంగా ఇతడు నన్ను తిరిగి కలుసుకున్నాడు.

ఈ జన్మలో ఎన్నో కష్టాలు పడుతున్న శ్రీనివాస్ తరువాత ఉత్తమ జన్మలు లభించి మంచి నడవడికతో ఉంటాడు. ఇక ఎక్కువ జన్మలు కూడా ఉండవు. ఎన్నో జన్మలలో కలిగిన ఋణాలు ఈ జన్మలో ధనం రూపంలో అతని నుంచి తీరిపోతాయి. ఆ ఋణాల వలన ఇతడు ఇంతకు ముందు జన్మలలో చేసుకున్న పుణ్యం కూడా వీరిలో కొందరికి ధారపోస్తాడు. ఇక ముందు జన్మలలో మంచి లక్షణాలతో మంచి పనులు చేస్తూ కొన్ని జన్మల తరువాత జన్మరాహిత్యం కలిగి ఆ దివ్యశక్తిలో లీనమవుతాడు.

మళ్ళీ ఒకసారి హిమాలయాశ్రమపు విశేషాల దగ్గరకి వద్దాం ! నా వద్దకు 2006 వ సంవత్సరంలో మా కారు డ్రైవర్ గా పనిచేయడానికి అశోక్ అనే అతను వచ్చాడు. వయస్సులో చిన్నవాడు అప్పటికి వివాహం కూడా కాలేదు. కాని ఎంతో మంచి స్వభావం కలవాడు. అప్పటినుంచి మా దగ్గర ఉంటూ ఎంతో నమ్మకంగా పనిచేస్తున్నాడు. ఇతనిది ఎక్కడో గుల్బార్గా దగ్గర చిన్న పల్లెటూరు. కనీసం కరెంటు కూడా లేని చిన్న పల్లెటూరు. మేము మోతీనగర్‌లో ఉంటున్నప్పుడు అతని స్నేహితుడెవరి ద్వారానో మమ్మల్ని కలవడం జరిగింది. తరువాత అతనికి వివాహం జరిగింది. ఇద్దరు ఆడపిల్లలు.

మేము సాధారణంగా బయటకు వెళ్ళేది చాలా తక్కువ. అశోక్ డ్రైవర్ అన్న పేరే గాని అతను చేసే పనంతా నా పుస్తకాలకు సంబంధించిందే! ప్రతిరోజు ఈ పుస్తకాలన్నింటిని ప్యాకింగ్ చేయడం, పోస్టాఫీస్‌లోను, కొరియర్ వాళ్ళకి ఇవ్వడం తనే చేస్తుంటాడు. ఇలా ఈ 15 సం॥లలో కొన్ని లక్షల పుస్తకాలు ప్యాకింగ్ చేసాడు. అశోక్ కూడా అప్పటి హిమాలయాశ్రమంలో నన్ను కలిసిన వాడే! అందుకే ఎక్కడో గుల్బర్గా దగ్గర చిన్న పల్లెటూరులో పుట్టినప్పటికి అటు ఇటు తిరిగి చివరికి నా వద్దకే వచ్చాడు. అశోక్ క్రిందటి జన్మలో బెంగాల్‌లో ఒక పెద్ద భూస్వామి ఇంట్లో పుట్టాడు.

బాగా ధనవంతుడు కావడం చేత అహంకారంతో ఎన్నో దుర్మార్గపు పనులు చేశాడు. దాని వలననే ఈ జన్మలో ఇన్ని కష్టాలు పడుతున్నాడు. కాని పూర్వజన్మల పుణ్యఫలం కారణంగా తిండికి, బట్టకు లోటు లేకుండా జరిగిపోతోంది. ముందు ముందు ఇతనికి ఉత్తమ జన్మలు లభిస్తాయి.

అప్పటి 108 మందిలో మా పెద్ద అల్లుడు సురేష్ కూడా ఒకడు. సురేష్ క్రిందటి జన్మలలో ఒక జన్మలో 1600 సం॥ ప్రాంతాలలో ఫ్రాన్స్ దేశంలో ఒక గొప్ప ఫిలాసఫర్ గా పేరొందిన వ్యక్తి. ఆ జన్మలో తాను కేవలం 45 సం॥లు మాత్రమే జీవించి ఎంతో గొప్ప తత్వవేత్తగా పేరుపొందాడు. ఫ్రాన్స్ దేశంలోనే కాక ఇతని పేరు ప్రపంచ దేశాలన్నింటిలోను మారుమ్రోగింది. ఇప్పటికి ఫ్రాన్స్ దేశంలో అతని పేరు తెలియని వారు ఉండరు. అతడు తన తత్వబోధనలతో ఎంతోమందిని ప్రభావితం చేసాడు. ఆ తరువాత జన్మలో సురేష్ మధురైలో రామకృష్ణన్ అనే పేరుతో ఒక బ్రాహ్మణ కుటుంబంలో జన్మించాడు. ఆ జన్మలో ఎన్నో వేదాలు, శాస్త్రాలు నేర్చుకున్నాడు. గొప్ప వైష్ణవ పండితుడిగా పేరు తెచ్చుకున్నాడు.

ఆ తరువాత జన్మలో సురేష్ ఉత్తర ప్రదేశ్‌లో గొప్ప వ్యాపారస్తుల కుటుంబంలో జన్మించాడు. ఎంతో గొప్ప పనులు చేసి ఒక పెద్ద విద్యాలయాన్ని స్థాపించాడు. అనాథ శరణాలయం నెలకొల్పాడు. తరువాత తన 62 వ ఏట నా హిమాలయాశ్రమం చేరుకున్నాడు. హిమాలయాశ్రమంలో ఉన్నప్పుడు అక్కడ హిమాలయాలలో తిరుగతూ ఎందరో మహర్షులను దర్శించాడు. ఒకనాడు అతనికి సాక్షాత్తు పరమేశ్వరుడే ఒక మహర్షి రూపంలో దర్శనమిచ్చాడు. ఆ తరువాత జన్మలో సురేష్ మహారాష్ట్రలో జన్మించాడు. ఈ జన్మలో అతడు తోటి అన్నదమ్ములచేత ఎన్నో అవమానాలు పడ్డాడు. కుటుంబ వ్యాపారంలో ఇతన్ని బాగా మోసం చేసాడు. కాని స్వతహాగా ఎంతో వేదాంత ధోరణి కలవాడు అవ్వడం చేత అన్ని కష్టాలను చాలా ధైర్యంగా ఎదుర్కొన్నాడు. సురేష్‌కు ముందు ముందు ఎన్నో ఉత్తమ జన్మలు లభిస్తాయి.

ప్రతీ మనిషి తన జీవితంలో ఎప్పుడో ఒకప్పుడు ఏదో అనారోగ్యంతో బాధపడతాడు. అలాగే ఒకొక్కసారి మనం ఏ దురలవాట్లు లేనివారికి కూడా ఏదో అనారోగ్యం కలగడం గమనిస్తుంటాము. ఇలా ఎందుకు జరిగింది ? ఎంతో మంచి అలవాట్లు గల వీరికి ఎందుకు ఇంతటి అనారోగ్యం కలిగిందా ! అని మనం ఎంతో

బాధపడతాము. దీనికి అంతటికి కారణం మనం పూర్వజన్మలో చేసిన పాపకర్మలు. ఏదో జన్మలలో చేసిన పాపాలు ఇప్పుడు అనుభవిస్తున్నామన్నమాట.

ఎప్పుడైనా అనారోగ్యం కలిగితే అది శరీరానికి గాని, ఆత్మకు కాదని గట్టిగా సంకల్పం చేసుకోవాలి. మీరు ఎప్పుడైతే ఎంతో గట్టి సంకల్పంతో అలా ఆలోచిస్తారో అప్పుడు మీకు ఆ అనారోగ్యపు బాధ తెలియదు చాలా ఉపశమనం కలుగుతుంది. ఈ ప్రకృతిలో అనంతమైన శక్తి ఉంది. మీరు కనులు మూసుకొని ఆశక్తిని ఒక ధారలాగ అనారోగ్యం ఉన్నచోటికి ఆకాశం నుంచి ప్రవహిస్తున్నట్లుగా ఊహించుకోండి. మీరు ఎంత ఎక్కువ ఏకాగ్రతతో ఊహించుకుంటారో మీకు ఆ శక్తి అంత ఎక్కువగా వస్తుంది.

మీకు ఇది వినడానికి చాలా విచిత్రంగాను, నమ్మశక్యం కానిది గాను అనిపించవచ్చును. కాని ఇది తప్పక సాధ్యపడుతుంది. ఎందరో మహాపురుషులు, సిద్ధులు వారికి ఏదైనా శారీరక అనారోగ్యం కలిగితే ఈ విధంగా కాస్మిక్ శక్తిని తమ శరీరంలోనికి ప్రసరింపచేసుకుంటారు. అక్కడితో వారికి ఆ బాధనుండి ఉపశమనం కలుగుతుంది. ఇది మనందరికి కూడా సాధ్యమే ! కావలసిందల్లా అంతటి గాఢనమ్మకం, విశ్వాసం ఉండటం.

ఈ విశ్వం అంతటా అటువంటి దివ్యశక్తి వ్యాపించి ఉంటుంది. అయితే ఈ శక్తి కొన్ని కొన్ని ప్రదేశాలలో అంటే గొప్ప పుణ్యక్షేత్రాలు, కొన్ని పురాతన దేవాలయాలు, నిత్యం దేవతారాధన జరిగే ఇళ్ళలోను, పుణ్యాత్ములు ఉండే ఇళ్ళలోను ఈ శక్తి ఎక్కువగా ఉంటుంది. మనం గనుక ఇటువంటి ప్రదేశాలలో కూర్చొని ఆ శక్తిని గ్రహిస్తే మన అనారోగ్యం ఇంకా త్వరగా నయమౌతుంది.

అందుకే మనకు ఏదైనా అనారోగ్యం కలిగినప్పుడు ఎవరి దగ్గరికైనా సలహాకు వెళితే వారు ఏదైనా పుణ్యక్షేత్రంలో మూడు రోజులు నిద్రచేయమని లేదా ఇరవైయొక్క రోజులు ఉండమని ఇలా చెప్తారు. దీని వెనుక అంతరార్థం ఇదే ! ఆ క్షేత్రంలో ఉండే దైవశక్తి వలన అక్కడ గొప్ప శక్తిగల తరంగాలు ఉంటాయి. అక్కడ కొన్ని రోజులు మనం గడపడంతో అవి మన శరీరంలోకి ప్రవేశిస్తాయి. అప్పుడు మనం మన అనారోగ్యం నుంచి త్వరలో బయటపడతాం.

ఈ ప్రపంచంలో ఇప్పటిదాకా ఎన్నో లక్షల కోట్ల మంది జన్మించి మరణించారు. వారందరు కూడా వారి జీవిత కాలంలో ఎన్నో రకాల అనారోగ్యాలు

అనుభవించి ఉంటారు కదా! మనం కూడా క్రిందటి జన్మలో ఏ అనారోగ్యానికి గురయ్యామో ఇప్పుడు మనకి తెలియదు కదా! ఆ మధ్య నాదగ్గరకి చంద్రశేఖర్ అనే స్నేహితుడొచ్చాడు. అతడు తనకు షుగర్, బి.పి. ఉన్నాయని ఎంతో బాధపడుతున్నాడు. ఇంక ఈ ప్రపంచమంతా తన తలపై పడుతున్నట్లు బాధపడుతున్నాడు. ఈ ప్రపంచంలో ఎందరికో ఈ బి.పి. షుగర్‌లు ఉన్నాయని, ఇవి అతి సామాన్యం అని అందుకు అంత ఆందోళన పడనక్కర్లేదని నేను చెప్పేవాడిని అయినా అతను వినేవాడు కాదు.

ఇలా ఉండగా ఒకరోజు అతను నా దగ్గరకి వచ్చినప్పుడు ఒక 10 నిమిషాలు ధ్యానంలోకి వెళ్ళాను. అప్పుడు అతడి పూర్వజన్మలు కొన్ని గోచరించాయి. అతనితో ఇలా చెప్పాను. చంద్రశేఖర్! నీవు రెండు జన్మల క్రితం ఔరంగాబాద్‌లో జన్మించావు. అప్పుడు నువ్వు 12 సం॥లు పాటు క్యాన్సర్‌తో బాధపడి మరణించావు. ఆ 12 సం॥లు నరకయాతన అనుభవించావు. క్రిందటి జన్మలో నీవు విజయవాడ దగ్గర కంకిపాడు గ్రామంలో సుబ్బారావు అనే పేరుతో ఒక వ్యవసాయ కుటుంబంలో జన్మించావు. అప్పుడు కూడా నీ పూర్వజన్మ కర్మఫలం వలన 14 సం॥లు పక్షవాతం వచ్చి మంచంమీదనే ఉన్నావు.

ఈ రెండు జన్మలలోను నువ్వు ఇంతకు మునుపు 20 జన్మల క్రితం కొన్ని జన్మలలో చేసిన పాపకార్యాల వలననే ఈ విధంగా అనారోగ్యం పాలయ్యావు. అటు తరువాత కొన్ని జన్మలలో చేసుకున్న పుణ్యఫలం వలన ప్రస్తుత జన్మలో నీకు అటువంటి తీవ్ర వ్యాధులు రాక నీ ప్రారబ్ధ కర్మ కొంచెం తగ్గి ఈ మాత్రం షుగర్,బి.పి.ల వంటి తేలికపాటి అనారోగ్య సమస్యలతో ఉన్నావు. నువ్వు ఒక్కసారి ఆలోచించు ఆ జన్మలలో నువ్వు ఎంత బాధపడిఉంటావో ఇప్పటి నీ బాధ ఎంత?.

అప్పటి బాధతో పోలిస్తే ఇప్పటిది ఒక బాధేనా? అని అతడితో గట్టిగా చెప్పాను. అప్పుడు అతనికి కొంచెం అర్ధమయ్యింది. ఒక అరగంట నా ఎదురుగా కూర్చొని ఏమీ మాట్లాడలేదు. ఎందుకు అలా మౌనంగా ఉన్నావు అని అడిగితే ఒక్కసారి ఆ క్రిందటి రెండు జన్మలలో తాను ఎంత బాధపడి ఉంటానో తల్చుకున్నానని అన్నాడు. ఆ ఊహే ఎంతో తీవ్రమైన బాధ కలిగించిందని అన్నాడు. ఇంక అటు తరువాత చంద్రశేఖర్ ఎప్పుడూ తన షుగర్, బి.పి. ల గురించి నా వద్ద ఎప్పుడూ ప్రస్తావించలేదు.

మనలో చాలా మందికి ఈ జన్మలో వచ్చే అనారోగ్యాలు కూడా పూర్వజన్మల కర్మఫలాలని చెప్పుకున్నాం కదా! ఆ అనారోగ్యాలు కూడా మనం పూర్వజన్మలలో చేసిన పాపాలు బట్టి మనకు కలుగుతాయి. ఉదాహరణకి మన దగ్గర పనిచేసే ఎవరినైన చాలా హింసిస్తే వచ్చే జన్మలో మనకు నరాలకు సంబంధించిన వ్యాధి వస్తుంది. అలాగే ఈ జన్మలో పరస్త్రీ వ్యామోహం కలిగిన వారికి తరువాత ఏదో జన్మలో పక్షవాతం వచ్చి నోటి మాట పడిపోతుంది. అలాగే ఎవరి వద్ద అయినా ఎక్కువ డబ్బు అప్పుగా తీసుకొని ఈ జన్మలో ఇవ్వగలిగి ఉండి కూడా ఇవ్వకపోతే, తరువాత జన్మలలో గుండెకు సంబంధించిన వ్యాధి కలుగుతుంది. వ్యాపారంలో తోటి భాగస్వామిని మోసం చేస్తే తరువాత ఏదో జన్మలో వారి చివరి రోజులలో చాలా కష్టాలు పడి చివరికి మతిస్థిమితం కూడా కోల్పోయి, చివరికి కుటుంబ సభ్యులు కూడా వారిని పట్టించుకోకుండా ఎన్నో కష్టాలు పడుతూ జీవితం సాగిస్తారు.

ఇంకో విశేషం ఏమిటంటే మనకు జాతకరీత్యా ఏ గ్రహదశ జరుగుతున్నప్పుడు మనం ఇలాచేసిన ఏ పాపమైనా, తరువాత జన్మలలో ఒక జన్మలో పుట్టినప్పుడు మళ్ళీ అదే గ్రహదశ జరుగుతున్నప్పుడు దాని ఫలితం అనుభవించడం జరగుతుంది. అందుకనే కొంతమంది అతిచిన్న వయస్సులోనే అకారణంగా వ్యాధులతో బాధ పడడం గమనిస్తుంటాము.

నా స్నేహితుడి భార్య ఒకరికి 40 సంవత్సరాల వయస్సులోనే కేన్సర్ వచ్చింది. ఆమె అప్పటిదాకా ఎంతో ఆరోగ్యంగా ఉండేది. ఆమె చిన్నప్పటినుంచి అందరితో ఎంతో సరదాగా ఉంటూ అందరికీ ఎంతో సహాయం చేసేది. ఎవరింట్లో ఏ అవసరం వచ్చినా తాను వెళ్ళి వారికి ఎంతో సహాయం చేసేది. అటువంటి ఈమెకు అకస్మాత్తుగా కేన్సర్ వచ్చి చాలా బాధ పడింది. ఇలా మన తెలిసిన వ్యక్తులలో కొంతమందిని గమనిస్తుంటాము. వారు ఈ జన్మలో ఎంతో మంచితనంతో, నలుగురికి చేతనైనంతలో సహాయం చేస్తూ ఉంటాడు. అంతటి మంచి వాడికి ఇటువంటి పెద్ద వ్యాధి ఎందుకు వచ్చిందా అని మనకి ఎంతో బాధ కలుగుతుంది. ఒకరోజు నేను ధ్యానంలో ఉన్నప్పుడు మా స్నేహితుడు, అతటి భార్య గురించి ఆలోచించాను. అప్పుడు నాకొక ఆశ్చర్యమైన విషయం స్ఫురించింది. నా స్నేహితుడి భార్యకు అకస్మాత్తుగా ఈ కేన్సర్ వ్యాధి ఎందుకు వచ్చిందో అర్థమయ్యింది. ఆమె పూర్వజన్మలలో ఎన్నో పుణ్యకార్యాలు చేసింది. అంతకు ముందు కొన్ని జన్మలలో కొన్ని పాపకార్యాలు చేసింది. మనమందరం కాలగమనంలో ఎన్నో లక్షల జన్మలలో

పుడుతూ ఈ జన్మకి వచ్చాము కదా! నా స్నేహితుడి భార్య ఒక 120 జన్మలలో చేసిన పాపకార్యాల ప్రారబ్ధకర్మ ఒక్కసారిగా ఈ జన్మలో ఈ కేన్సర్ వ్యాధిరూపంలో తొలగిపోయిందని గ్రహించాను. ఇక ఈమెకు కొన్ని జన్మలలోనే జన్మరాహిత్యం కలుగుతుంది.

ఇందాక చెప్పినట్లుగా అనారోగ్యం సద్గురువుల దర్శనం వలన, ఎంతో గొప్ప శక్తి గల పుణ్యక్షేత్రాలు దర్శించడం వలన తప్పక తగ్గుతుంది. సద్గురువులు మన కష్టం, మనం పడుతున్న బాధ గ్రహించి మన అనారోగ్య తీవ్రత కొంచెం తగ్గిస్తారు. అక్కడితో మనకి బాధ తగ్గి ఎంతో ఉపశమనం కలుగుతుంది. ఎంతటి వారికైనా ప్రారబ్ధ కర్మ అనుభవించక తప్పదు. మానవ జన్మ ఎత్తిన మహాయోగులు కూడా తమ చివరి దశలో ఎన్నో బాధలు పడడం మనం చూసాం. అంతటి శక్తి గలవారు తాము కావాలనుకుంటే ఆ బాధను తగ్గించుకోలేకనా? లేక పూర్తిగా పోగొట్టుకోలేకనా? కాని వారు అలాచేయక శరీరానికి కలిగిన ఆ బాధను చిరునవ్వుతో స్వీకరిస్తారు.

అయితే విశేషమేమిటంటే అటువంటి మహాత్ములు ఎంత బాధపడుతున్నప్పటికి వారి వద్దకు ఎంతో అనారోగ్యంతో వచ్చిన వారికి తమ శక్తితో ఉపశమనం కలిగేలా చేస్తారు. మహాత్ములు ఇది ఎన్నో రకాలుగా చేస్తారు. నేను ఇక్కడ రెండు పద్ధతులు మాత్రమే చెప్తాను. మిగిలినవి అర్థం చేసుకోవడవం చాలా కష్టం. ఇవన్నీ ఎంతో దేవరహస్యాలతో కూడా ఉన్నవి. మీకు తేలికగా అర్థమయ్యే ఒక రెండు విషయాలు మాత్రమే చెప్పదలచుకున్నాను.

ఒకసారి కృష్ణ ప్రసాద్ అనే అతను నా వద్దకు వచ్చాడు. అతను తీవ్రమైన కడుపునొప్పితో బాధపడుతున్నాడు. ఆ బాధ తీవ్రత ఎంతో ఎక్కువగా ఉంది. ఎందరో పెద్ద పెద్ద డాక్టర్ల వద్దకు వెళ్ళినా, ఎన్ని మందులు వాడినా ఏ మాత్రం తగ్గలేదు. అతని పరిస్థితి చూస్తే నాకు చాలా జాలివేసింది. అతని అనారోగ్యం వలన అతను ఆర్థికంగా కూడా చాలా చితికి పోయాడు. అతనికి కడుపులో చిన్న పుండు వచ్చింది. దాని వలన అతను ఇంత బాధపడుతున్నాడు.

ఒక్కసారి నేను కళ్ళుమూసుకొని ధ్యానించగానే అతని విషయమంతా నాకు అర్థమయ్యింది. కొన్ని రోజులలో ఇది క్యాన్సర్ కి కూడా దారితీసే పరిస్థితి ఉంది. ఇదే గనుక జరిగితే ఈ కుటుంబం చిన్నాభిన్నమౌతుంది. ఇతని కుటుంబం

పూర్తిగా రోడ్డున పడతారు. ఇతడికి ఎలాగైనా కొంచెం ఉపశమనం కలిగించాలని ఆ క్యాన్సర్ రాకుండా చూడాలని అనుకున్నాను.

కేవలం సంకల్పమాత్రం చేత ఆ అనారోగ్యాన్ని తరువాత జన్మలలోకి ఏదో ఒక జన్మలోకి పంపవచ్చును. నేను అప్పుడు అదే చేసాను. అతనికి రాబోయే ఆ క్యాన్సర్ అనారోగ్యాన్ని అతడి తరువాత జన్మలోనికి కేవలం సంకల్పం ద్వారా పంపివేశాను. అంతే! ఆ క్షణం నుంచి ఇతనికి పూర్తిగా బాగుంటుంది. ఆక్షణంలోనే అతని కడుపులోని పుండు మాయమైపోయింది. అయితే నేను ఇప్పటినుంచి నీకు బాగుంటుంది అంటే అతడు నమ్మడు కదా! అందుకని అతడిని నేను హైదరాబాద్‌కు 250 కి॥లు దూరంలో ఉన్న ఒక పుణ్యక్షేత్రంలో మూడు రోజులు ఉండి ప్రతీరోజు 108 ప్రదక్షిణలు చేయమన్నాను. అతను నా సలహాకు ఎంతో సంతోషపడి వెళ్ళాడు.

మరుసటి నెలలోనే ఆ పుణ్యక్షేత్రానికి వెళ్ళి మూడు రోజులు ఉండి 108 ప్రదక్షిణలు చేసి వచ్చాడు. ఒక రోజు నా వద్దకు వచ్చి అనారోగ్యం పూర్తిగా తగ్గిపోయిందన్నాడు. మనకు ఇంతకంటే కావలసిందేముంది?

అయితే మనం ప్రతీ ఒక్కరి విషయంలో ఇలా చేయకూడదు. కొంతమంది విషయాలలోనే, వారి వారి పూర్వజన్మల కర్మ ఫలాలు ఎలా ఉన్నాయో గమనించి, విశ్లేషించి దానిని బట్టి మాత్రమే చేయాలి. అది తరవాత ఏ జన్మలోకి బదిలీ అవుతుందో అది భగవత్‌నిర్ణయం. కొంతమందికి చిన్నపాటి అనారోగ్యం కలిగినప్పుడు దానిని స్వప్నంలోనికి బదిలీ చేయవచ్చు. ఈ భౌతిక శరీరంలో పడే బాధను అతను స్వప్నావస్థలో పడతాడు. స్వప్నావస్థలో అనుభవించిన దాని వలన ఈ లౌకిక ప్రపంచంలో అతని నిత్య జీవితం పై ప్రభావం ఉండదు కదా ! ఈ విధంగా కూడా కొందరికి అనారోగ్యాలనుంచి ఉపశమనం కలిగేలా చేయవచ్చు.

ఈ విధంగా చేయగలిగే శక్తి గల మహాపురుషులు ఇప్పటికి భారతదేశంలోను, ఇతర దేశాలలో కూడా ఉన్నారు. అయితే వీరి ఉనికి మనకు తెలియదు. మనమధ్య అతి సాధారణ వ్యక్తులులాగ సంచరిస్తూంటారు. వారికి ఇంత గొప్ప శక్తి ఉన్నట్లు వారికి ఎంతో దగ్గరగా ఉండే ఎంతో కొద్ది మందికి తప్పవేరే ఎవరికి తెలియదు. ఆ దగ్గరగా ఉండేవారికి కూడా వీరికి ఉన్న శక్తిలో కేవలం ఒక సహస్ర వంతు మాత్రమే తెలుస్తుంది.

ఇంతకు ముందు కాలంలో అయితే ఇటువంటి మహాపురుషులు బాహ్యంగా కనపడేవారు. అప్పటి సంఘ పరిస్థితులు వేరు. అటువంటి మహాపురుషులను ప్రజలు అలాగే చూసేవారు. వారి ప్రశాంతతకు లోపం ఉండేది కాదు. అదే నేటి మారిన సమాజంలో ఇది ఏ మాత్రం సాధ్యపడదు. అందువలన అటువంటి శక్తులు ఉన్నవారు కూడా ఏ మాత్రం బయట ప్రపంచానికి వారి గురించి తెలియకుండా అతి సాధారణ జీవితం గడుపుతుంటారు. అయితే ఇలా ప్రస్తుతం అక్కడక్కడ ఉన్న మహాపురుషులు, గొప్ప సాధకులు ఒకరితో ఒకరు దివ్య తరంగాల ద్వారా సంభాషించుకుంటూ ఉంటారు. వీరిలో కొందరు అప్పుడప్పుడు వారి ద్వారా ఈ లోకానికి కొన్ని మంచి పనులు జరగవలసి ఉండడం చేత బాహ్య ప్రపంచానికి తమ ఉనికి తెలియజేస్తారు.

తమిళదేశంలో జన్మించిన 12 గురు ఆళ్వార్లు, వైష్ణవ మతోద్ధారణకు కంకణం కట్టుకున్న శ్రీమద్రామానుజాచార్యులు వారు, రామచరిత మానస రచించిన తులసీదాసు, కబీరుదాసు, మహారాష్ట్రలో జన్మించిన తుకారాం, శ్రీవేంకటేశ్వరుని తన కీర్తనలతో స్తుతించిన శ్రీఅన్నమయ్య, శ్రీతరిగొండ వెంగమాంబ... ఇలా ఎందరో మహాశక్తి సంపన్నులు ఒక ప్రత్యేక కార్య నిమిత్తమై ఈ భూమిపై జన్మించి ప్రజలను భక్తి మార్గంలోకి తీసుకెళ్లి, సమాజహితం కోసం ఎన్నో రకాలుగా తోడ్పడ్డవారే!.

వీరందరు ఎక్కడెక్కడో గ్రహమండలాలనుంచి, నక్షత్ర మండలాలనుంచి వచ్చి ఈ భూమి మీద వివిధ కాలాలలో, వివిధ దేశాలలో, వివిధ కులాలలో పురుషులు గాను, స్త్రీలు గాను ఈ భూమిమీద జన్మించినవారే! వీరందరు వేరు వేరు కాలాలలో పుట్టినప్పటికి, ఏకకాలంలో లేకపోయినప్పటికి వీరందరు ఎప్పుడూ ఒకరితో ఒకరు అనుసంధానింపబడి ఉంటారు. ఎందుకంటే వీరంతా ఈ విశ్వానికి మూలకారణమైన ఆ దివ్యశక్తి నుంచి వచ్చినవారే కాబట్టి.

వీరిలో చాలామంది రకరకాల కులాలలో పుట్టి ఏమాత్రం విద్యలు కూడా నేర్వని వారు ఉన్నారు. ఎటువంటి శాస్త్రజ్ఞానం లేనివారు కూడా ఉన్నారు. అయినప్పటికి వీరు ఆ శాస్త్రాల సారాన్ని అద్భుతంగా మాట్లాడుగలుగుతారు. ఇంతకు ముందు చెప్పినట్లుగా వీరందరు మానవ జాతికి కావలసిన కొన్ని విశేషాలు అందించడానికి మానవ శరీరాలు ధరించారు తప్ప వీరందరు ఆ దివ్యశక్తిలోని భాగాలే! వీళ్ళందరికి అన్నీ తెలిసినా కూడా వారు చేయవలసిన కార్యం మాత్రమే చేస్తారు.

తులసీదాసు ఒక రామయణాన్ని మాత్రమే రచించినా ఆ మహాపురుషునికి భారత భాగవతాలతో సహా అన్నీ తెలుసు కదా! అలాగే ఒక పోతనామాత్యుడు భాగవతాన్ని ఆంధ్రీకరించినా వీరికి కూడా మహాభారత రామాయణాలు కూడా తెలుసు. అయితే వీరు ఆయా కార్యాలకోసమే మానవ జన్మ తీసుకోవడం జరిగింది కాబట్టి కేవలం ఆ కార్యం మాత్రమే చేస్తారు.

వీరందరికి అన్ని వేదాలు, అన్ని ఇతిహాసాలు తెలుసును. వీరి అంతరాత్మలో సర్వశాస్త్రాలు ఉంటాయి. వీరికి లౌకికమైన సంపదపైన, రాజాశ్రయం పైన ఏ మాత్రం అశక్తి ఉండదు. వారెప్పుడూ తాము వచ్చిన పనిలోనే నిమగ్నులై ఉంటారు. వారికి ఉండడానికి ఇళ్ళు కూడా ఉండవు. వారికి తమ భార్య పిల్లలు ఎలా జీవిస్తున్నారు అనే ధ్యాస కూడా ఉండదు. వారెళ్ళప్పుడూ తాము చేయవలసిన పనిమీదనే ధ్యాసతో ఉంటారు.

ఇంతకు ముందు చెప్పినట్లుగా హిమాలయాల్లో ఇటువంటి యోగులు ఎంతో మంది ఉన్నారు. హిమాలయాలే కాక మనమధ్య కూడా అతి సామాన్య వ్యక్తుల లాగ ఉన్నవారు కూడా ఉన్నారు. అయితే వీరిని గర్తించడం ఎలా? వీరు మీ ఇంటికి సమీపంలో గాని, మీ ఊరిలో గాని ఉన్నారని తెలుసుకొనడానికి ప్రకృతి మనకు కొన్ని సంకేతాలు ఇస్తుంది. అటువంటి మహానుభావులు ఎప్పుడూ చిరునవ్వుతో ఉంటారు. అలాగే వారు అతి సాధారణ వ్యక్తులులాగ కనిపిస్తారు. వారు నివసిస్తున్న దగ్గర ప్రదేశంలో ఎవరికీ ఎటువంటి దీర్ఘవ్యాధులు కలుగవు.

వారు ఉంటున్న ఊర్లలో ఎప్పుడూ కరువు కాటకాలు కలుగవు ప్రజలందరు కలిసి మెలిసి అన్నదమ్ముల్లా జీవిస్తారు. అలాగే అక్కడ ఉండే జంతు జాలం కూడా తమ సహజ వైరం మరచి సాధుస్వభావంతో ఉంటాయి. ఎక్కడైనా మీకు ఒక కుక్క, పిల్లి స్నేహభావంతో ఆడుకున్నట్లు గమనిస్తే ఆ చుట్టుపక్కల ఎక్కడో ఇటువంటి మహానుభావుడున్నాడని గ్రహించండి. ఇతడు ఎవరు అనేది మీరు గుర్తించలేకపోవచ్చును. కాని ఆ చుట్టు ప్రక్కల ప్రదేశంలో ఎంతో అద్భుత శక్తులు కలిగిన ఒక మహాపురుషుడు తప్పక ఉండే ఉంటాడు.

మళ్ళీ మనం హిమాలయాశ్రమపు విషయం వద్దకు వద్దాం. అక్కడ నాతో ఉన్నవారిలో ప్రస్తుత జన్మలో నా స్నేహితులలోని నారాయణరావు అనే స్నేహితుడు ఒకడున్నాడు. నారాయణరావు క్రిందటిజన్మలో తమిళనాడులోని రామేశ్వరంలో

రామకృష్ణన్ అనేపేరుతో జన్మించి ఒక ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేసేవాడు. అతనికి తన తండ్రి నుంచి సంక్రమించవలసిన ఇల్లు కొందరు అన్యాయం చేయడం వలన తనకు రాలేదు. సొంత ఇల్లు లేక ఎంతో బాధపడ్డాడు. తనది చాలా చిన్న ఉద్యోగం అవ్వడంతో జీతం చాలక ఎంతో ఇబ్బంది పడేవాడు.

తోటి స్నేహితులు కొందరు గవర్నమెంటు ఉద్యోగాలలో స్థిరపడి చక్కగా జీవించేవారు. తనకు అలా ప్రభుత్వ ఉద్యోగం లేదని ఈ చిన్న ఉద్యోగంలో చిన్న అద్దింట్లో జీవితం గడుపుతున్నందుకు ఎంతో బాధపడేవాడు. అయితే ఎంతో దైవభక్తిగలవాడు అవ్వడం చేత సంయమనంతో ఉండి ప్రతీరోజు అక్కడ ఉన్న శివాలయానికి వెళ్ళి శ్రీస్వామివారిని దర్శింస్తుండేవాడు.

తనకు వారసత్వంగా రావలసిన ఇంటికోసం కోర్టులో కేసులు వేసి సంవత్సరాలు తరబడి అలా కోర్టుల చుట్టూ తిరుగుతుండేవాడు. చివరకు తన 62 వ ఏట ఆ కేసులన్నీ ఒక కొలిక్కివచ్చి అతడి ఇళ్ళు అతడి చేతికి వచ్చింది. ఆ జన్మలో అతనికి పిల్లలు లేరు. ఇన్ని సంవత్సరాలు కోర్టుల చుట్టూ తిరిగి విసిగెత్తుకుపోయిన రామకృష్ణన్ ఆ ఇంటిని అమ్మేసి ఒక వృద్ధాశ్రమానికి దానం చేసి దాంట్లోనే తన భార్యతో కలిసి జీవితాంతం అక్కడే జీవించాడు.

విచిత్రమేమిటంటే ఆ జన్మలో గవర్నమెంటు ఉద్యోగం చేయాలని ఎక్కువ కోరిక ఉండడంతో ముందుగా చాలాకాలం ఈ జన్మలో గవర్నమెంటు ఉద్యోగమే చేసాడు. అలాగే ఆ జన్మలో కోర్టులు చుట్టూ తిరిగి ఆ కేసుల విషయాలు తనకు అర్థం కాక ఆ లాయర్లు ఏంచెప్తున్నారో తనకు తెలియక ఎంతో బాధపడ్డాడు. ఆశ్చర్యకరంగా ఆ పూర్వజన్మల వాసనలు అతని ఆత్మను గట్టిగా పట్టుకొని ఈ జన్మలో మొదట్లో గవర్నమెంటు ఉద్యోగం చేసినా తరువాత న్యాయశాస్త్రం కూడా చదివి ఒక పెద్ద ప్రైవేటు కంపెనీలో మంచి స్థానంలో ఉన్నాడు. చూసారా ! పూర్వజన్మ వాసనలు ఎలా ఉంటాయో?.

నారాయణరావు భార్య కళ్యాణి. కళ్యాణి రెండు జన్మల క్రితం మహారాష్ట్రంలోని పూణె నగర సమీపంలో పుట్టింది. చిన్నప్పటినుంచే సంగీతంలో మంచి ప్రావీణ్యత సంపాదించి తరువాత గొప్ప గాయకురాలుగా ప్రసిద్ధి చెందింది. ఎంతో కీర్తినార్జించింది, ఎన్నో సన్మానాలు పొందింది. ఎన్నో అవార్డులు కూడా వచ్చాయి. గానం భగవత్సంబంధమైనది. గాయకులు ఎప్పుడూ భగవంతుడితో

అనుసంధానమై ఉంటారు. ఎన్నో జన్మల పుణ్యఫలం చేతగాని మంచి గాత్రం లభించదు.

కళ్యాణి తరువాత జన్మలో కేరళ రాష్ట్రంలో పాల్ఘాట్ సమీపంలో ఒక గ్రామంలో జన్మించిది. పూర్వజన్మల వాసనల వలన చక్కగా పాడేది. అక్కడ ఊరిలో గల శ్రీకృష్ణ ఆలయంలో ప్రతీరోజు వెళ్ళి శ్రీకృష్ణుని కీర్తిస్తూ పాడుతుండేది. ఒకనాడు సాయంత్రం వేళ ఆ శ్రీకృష్ణాలయంలో కూర్చొని పాడుతుండగా సాక్షాత్తు శ్రీకృష్ణుల వారే చిన్న బాలుని రూపంలో ఆమె ప్రక్కనే కూర్చొని ఆనాడు కళ్యాణి పాడిన రెండు పాటలు విన్నాడు.

విచిత్రమేమిటంటే ఆ జన్మలో ఈమె పేరు రాధ. ఆ విధంగా ఆమెకు ఆ జన్మలో శ్రీకృష్ణ భగవానుల దర్శనం కూడా లభించింది. ప్రస్తుత జన్మలో కళ్యాణి మంచి గాయకురాలు. రెండు జన్మల తరువాత ఫ్రాన్స్ దేశంలో జన్మించి దేశమంతా పేరు తెచ్చుకునే గొప్ప గాయకురాలు అవుతుంది. అంతే కాక ఒక ప్రముఖ యూనివర్సిటీలో మ్యూజిక్ ప్రొఫెసర్‌గా ఉద్యోగం చేస్తుంది. జీవితమంతా సంగీత ప్రపంచంలో జీవిస్తుంది. నారాయణరావు, కళ్యాణి ఇద్దరు కూడా నన్ను ఆ హిమాలయాశ్రమంలో కలిసినవారే! అప్పటి బంధం వలన తిరిగి ఇన్ని జన్మల తరువాత మళ్ళీ నాకు ఆప్తులయ్యారు.

హిమాలయాశ్రమంలో ఉన్నప్పుడు కలిసిన వారిలో గుజరాత్ కు చెందిన కేశవ్‌భాయ్ అనే పెద్ద వజ్రాల వర్తకుడు ఉన్నాడు. అతడు తన వ్యాపారంలో ఎన్నో నష్టాలు వచ్చి చాలా బాధపడి కొంతకాలం ప్రశాంతత కోసం హిమాలయాలలో గడుపుదామని అటు ఇటు తిరుగుతూ నా ఆశ్రమానికి చేరుకున్నాడు. అతడు ఆ జన్మలో ఎన్నో శ్రీ మహావిష్ణువుల వారి ఆలయం కట్టించాడు, ఎన్నో ధర్మసత్రాలు కట్టించాడు. కాని పూర్వజన్మల కర్మఫలాల కారణంగా ఎన్నో కష్టాలు పడి నా ఆశ్రమానికి చేరాడు. కేశవ్‌భాయ్ చాలాకాలం అక్కడే ఉన్నాడు. తరువాత ఎన్నో ఉత్తమ జన్మలు పొంది క్రిందటి జన్మలో రామేశ్వరంలో శివన్ అనే పేరుతో జన్మించాడు.

శివన్ గొప్ప శివ భక్తుడు. నిత్యం ఆలయంలో శ్రీ స్వామివారిని కొలుస్తూ ఎన్నో గొప్ప కీర్తనలు కూడా రచించాడు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎంతో సహాయం చేసేవాడు. ఆ పరమేశ్వరుడికి శివన్ అంటే ఎంతో ఇష్టం. ఒకసారి శివన్‌కి

అపరిచిత భక్తుని రూపంలో వచ్చి దర్శనం కూడా ఇచ్చాడు. ఆ శివన్ ఈ జన్మలో ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు పట్టణంలో ప్రమోద్ అనే పేరుతో సంపన్న కుటుంబంలో జన్మించాడు. అప్పటి జన్మలో శివన్ భార్య రాధిక ఈ జన్మలో విజయవాడలో అమృత అనే పేరుతో జన్మించి ఇతడికి భార్య అయింది. ఇలా ఎప్పుడో గాని వెంట వెంట జన్మలలో తిరిగి భార్యా భర్తలుగా అవ్వడం జరగదు. అయితే నా వద్దకు వచ్చిన కొందరు దంపతులలో ఈ విశేషం గమనించాను. ఇలా వచ్చిన వారిలో కొందరు గత జన్మలలో ఏదో ఒక జన్మలో భార్యా భర్తలే! ఈ జన్మలో ఎక్కడెక్కడో జన్మించినప్పటికి తిరిగి మళ్ళీ దంపతులౌతారు.

అమృత కూడా నేను హిమాలయాశ్రమంలో ఉన్నప్పుడు నన్ను కలిసింది. ఆ జన్మలో అమృత రష్యాదేశంలో పుట్టింది. హిమాలయాలపై ఆసక్తితో ఒక పర్వతారోహణ బృందంతో కలిసి భారతదేశం వచ్చి హిమాలయాలను చేరుకుంది. వాళ్ళతో హిమాలయాలలో తిరుగుతూ నా ఆశ్రమానికి చేరుకుంది. అక్కడి గొప్ప సాధకులు, ఆధ్యాత్మిక వాతావరణం ఆమెను ఎంతగానో ఆకర్షించింది. ఆమె కొన్ని సంవత్సరాలు ఆశ్రమంలోనే గడిపి తిరిగి రష్యా వెళ్లిపోయింది. ఆతరువాత జన్మలో ఆమె శ్రీరంగంలో రాధిక అనే పేరుతో జన్మించింది. ఈ జన్మలోనే ఆమెకు రామేశ్వరానికి చెందిన శివన్ తో వివాహం అయింది. ఈ దంపతులిద్దరు ఈ జన్మలో ప్రమోద్, అమృత అనే పేర్లతో జన్మించి తిరిగి భార్యా భర్తలై అప్పటి హిమాలయ బంధం కారణంగా తిరిగి ఈ జన్మలో నన్ను కలుసుకొని నాకెంతో ఆప్తులయ్యారు.

ఒకరోజు నాకు ఫ్రాన్స్ నుంచి గల్లెమా అనే అతని నుంచి ఒక ఈ మెయిల్ వచ్చింది. తనకి ఒక కన్సల్టెన్సీ ఉందని దానికి లోగో చేసి పెడతారా అని నన్ను అడిగాడు. నేనెంతో ఆశ్చర్యపోయాను. ఎక్కడో ఫ్రాన్స్‌లో ఉన్న వ్యక్తికి నేను లోగోలు డిజైన్ చేస్తానని ఎలా తెలిసిందా అనుకున్నాను. ఇదే మాట నేను అతనిని అడిగాను. అతడు చెప్పిన సమాధానానికి నేనెంతో ఆశ్చర్యపోయాను. మీరు రాసిన శ్రీ వేంకటేశ్వర వ్రతకల్పం రెండు సంవత్సరాల క్రితం ఫ్రెంచ్ భాషలోకి అనువాదం చేసింది నేనేనండి అని అన్నాడు.

అతనికి ఒక స్నేహితుడి ద్వారా ఈ శ్రీవేంకటేశ్వర వ్రత కల్పం గురించి తెలిసింది. అప్పుడు గల్లెమా ఈ పుస్తకాన్ని ఫ్రెంచ్ భాషలోకి అనువదించాడు. అంతే కాదు, ప్రతీ శనివారం ఈ వ్రతంలోకి కథలు చదువుతాడు. ఇతడు కూడా హిమాలయాశ్రమంలో నాతో కలిసి ఉన్నవాడే. అప్పటి బంధమే ఈ జన్మలో మళ్ళీ

కలిపింది. ఆ జన్మలో గల్లెమా భారతదేశంలో జన్మించి వేద శాస్త్రాలలో ఎంతో ప్రావీణ్యం సంపాదించి హిమాలయాలకు వచ్చి నా ఆశ్రమానికి వచ్చి నన్ను కలిసాడు. చూసారా! పూర్వ జన్మల బంధాలు ఎంతగట్టిగా ఉంటాయో? ఈ జన్మలో ఫ్రాన్స్‌లో పుట్టినప్పటికి వాస్తు, జ్యోతిష్యం నేర్చుకుని వీటిని వృత్తిగా స్వీకరించాడు. దానికి లోగో కోసం నన్ను అడిగాడు. నేను సంతోషంగా అతడి కన్సల్టెన్సీకి లోగో వేసి పంపించాను.

హిమాలయాశ్రమంలో కలిసి తిరిగి ఈ జన్మలో నన్ను కలిసిన వారిలో సుబ్రహ్మణ్యం, పద్మావతి అనే దంపతులు కూడా ఉన్నారు. సుబ్రహ్మణ్యం ఆ జన్మలో ఉత్తర్‌ప్రదేశ్‌లో ఒక మార్వాడీ కుటుంబంలో జన్మించి తను 42 వ ఏట హిమాలయాశ్రమానికి వచ్చి నన్ను కలిసారు. ఆశ్రమంలో 12 సంవత్సరాలు గడిపి తిరిగి తన ఊరు వెళ్ళిపోయాడు. పద్మావతి ఆ జన్మలో తమిళనాడులోని రామేశ్వరంలో రమేశన్ అనే పేరుతో జన్మించింది. రమేశన్ ఎంతో దైవభక్తి కలిగి ఉండేవాడు. సమాజంలో అందరికి ఎంతో సహాయం చేసేవాడు. సుబ్రహ్మణ్యం, పద్మావతిలకు ఇంకా కొన్ని జన్మలకే జన్మరాహిత్యం కలుగుతుంది.

ఇలా నన్ను ఈ జన్మలో కలిసినవారిలో నా పుస్తకాలన్నీ ఎంతో శ్రద్ధగా ప్రింట్‌చేస్తున్న వాసవి గ్రాఫిక్స్ జగదీష్, విమల్ ప్రింటర్స్ శ్రీ సత్యనారాయణగారు, మహేశ్వరి ప్రింటర్స్ శ్రీ బాలనారాయణ, వెబ్‌డిజైనర్ శివరామ్, ఈ అమృత దర్శనం తెలుగులో డి.టి.పి. చేసిన తామరపల్లి కృష్ణ కూడా ఉన్నారు. వీరందరు కూడా ఆ జన్మలో వేరు వేరు రాష్ట్రాలలో జన్మించి, నన్ను హిమాలయాశ్రమంలో కలిసినవారే. ఆ తరువాత జన్మలలో అనేక చోట్ల జీవించి అప్పటి ఆశ్రమ బంధం కారణంగా ఈ జన్మలో తిరిగినన్ను కలుసుకున్నారు.

ఇలా నన్ను కలిసినవారిలో శ్రీనివాస్, జయంతి దంపతులు కూడా ఉన్నారు. వీరిద్దరూ నేను హిమాలయాశ్రమంలో ఉన్నప్పుడు మహారాష్ట్రలో ఒక ఉన్నత బ్రాహ్మణ కుటుంబంలో జన్మించారు. వారి ఊరిలోని శ్రీ పాండురంగ ఆలయంలో ఎంతో సేవ చేసేవారు. విశేషమేమంటే ఆ జన్మలో కూడా వీరిద్దరు దంపతులే. వీరు కొంతకాలానికి ఒక సద్గురువును సేవించి వారితో పాటుగా ఈ దంపతులు కూడా హిమాలయాలకు వచ్చారు. వారి గురువు ఏకాంతంగా తపస్సు చేసుకొనడానికి హిమాలయాలలోనికి వెళ్లినప్పుడు వీరిద్దరూ అక్కడ

హిమాలయాలలోనే ఉన్న నా ఆశ్రమానికి వచ్చి నన్ను కలిసారు. ఆశ్రమ వాసులందరితో ఎంతో సఖ్యంగా మెలిగేవారు. అటు తరువాత రెండు జన్మలలో వేరు వేరు ప్రదేశాలలో జన్మించి ఈ జన్మలో తిరిగి శ్రీనివాస్, జయంతిలుగా జన్మించి భార్యాభర్తలయ్యారు. వీరు నన్ను ఒక స్నేహితుని ద్వారా కలుసుకున్నారు. నేను రాసిన నాలుగు పుస్తకాలు వీరు తమిళంలోకి అనువదించారు. ఈ జన్మలో ఈ దంపతులు ఎన్నో కష్టాలు పడి ప్రస్తుతం మంచి స్థితిలో ఉన్నారు. అప్పటి హిమాలయాశ్రమ బంధం తిరిగి మమ్మల్ని ఈ జన్మలో కలిపింది.

పూర్వజన్మ వాసనలు మనుషుల్ని ఎంత గట్టిగా పట్టుకొని ఉంటాయంటే మా స్నేహితుడు కృష్ణమోహన్ అనే ఒకతను ఒక నాలుగు జన్మల వెనుక శ్రీలంకలో నూనె వ్యాపారం చేసేవాడు. అతడికి ఆ వ్యాపారం పై ఎంతో ఎక్కువ మక్కువ ఉండేది. నూనె వ్యాపారమంటే ఎంతటి మక్కువ అంటే అటు తరువాత జన్మలో కృష్ణమోహన్ గుజరాత్‌లో ఒక మార్వాడి కుటుంబంలో మూల్‌చంద్ అనేపేరుతో జన్మించాడు. ఈ కుటుంబానిది కూడా నూనె వ్యాపారమే. అతనికి కిషన్‌చంద్, కిషన్‌శర్మ అనే ఇద్దరు ఆప్తమిత్రులుండేవారు. ఈ ముగ్గురు ప్రతీరోజు కలుసుకునేవారు. కిషన్‌చంద్ ఆ ఊరివాడే కాని కిషన్‌శర్మ కుటుంబం మాత్రం పంజాబ్ నుంచి వచ్చి అక్కడ నివాసం ఏర్పరచుకున్నారు.

కిషన్‌శర్మ ఎంతో భక్తి ప్రపత్తులతో ఎప్పుడూ భజనలలో మునిగితేలుతుండేవాడు. ప్రత్యేకంగా శ్రీదుర్గామాత పూజలు ఎక్కువగా చేసేవాడు. ఒకసారి కిషన్‌శర్మ ఆ ఊరిలోగల శ్రీదుర్గామాత ఆలయంలో జరిగిన నవరాత్రి ఉత్సవాలలో పాల్గొన్నాడు. అమ్మవారిని కీర్తిస్తూ ఎంతో గొప్పగా పాడాడు. ఆ పాటలకు ఎంతో ఆనందించిన ఆ జగన్మాత ఒక చిన్న బాలిక రూపంలో వచ్చి కిషన్‌శర్మ ప్రక్కనే కూర్చొనిఉంది. ఈ విధంగా కిషన్‌శర్మకు ఆ జన్మలో శ్రీదుర్గామాత దర్శనం లభించింది.

మొదట్లో మూల్‌చంద్ నూనె వ్యాపారం బాగా లాభాలతో సాగినప్పటకి తరువాత నష్టపోయాడు. ఎంతో ధనం పోగొట్టుకున్నాడు. అప్పటి మూల్‌చంద్ ఈ జన్మలో మంచి చదువు చదివి సాఫ్ట్‌వేర్ రంగంలో ఉన్నాడు. అయితే పూర్వజన్మ వాసనల వలన అతడు ప్రతీరోజు లేవగానే ముందు చేసేపని తలకి నూనెగట్టిగా పట్టించడమే! నూనెతో అతనికి గల రెండు జన్మల బంధం ఇప్పటికి పోలేదు. అలాగే

అప్పటి తన స్నేహితుడు కిషన్‌శర్మ ఈ జన్మలో ఇతడి భార్యగా జన్మించాడు. వచ్చే జన్మలో కృష్ణమోహన్ పెద్ద ధనవంతుల ఇంట్లో పుట్టి ఎన్నో ధానధర్మాలు చేస్తాడు. సమాజానికి ఉపయోగపడే పనులు ఎన్నో చేస్తాడు.

తిరుమల శ్రీనివాసుని ఆలయంలోని శ్రీస్వామి వారి విగ్రహం ఎన్నో కోట్ల సంవత్సరాల నాటిది. తిరుమల క్షేత్రానికి ఎంతో ప్రాముఖ్యత ఉంది. సాక్ష్యాత్తు శ్రీవైకుంఠంలోని శ్రీమన్నారాయుణుల వారే కొన్ని కోట్ల సంవత్సరాల క్రితం ఇక్కడ తిరుమలపై తానే స్వయ్యంగా శిలారూపంలో ఆవిర్భవించాడని మన విశ్వాసం. ప్రతీ రోజు ప్రపంచంలోని ఎన్నో ప్రదేశాలనుంచి లక్షలాది భక్తులు ఎన్నో కష్టాలకోర్చి తిరుమల చేరి శ్రీస్వామి వారిని దర్శించుకొంటున్నారు. కాని అక్కడ వారికి దొరికేది కేవలం అరసెకను దర్శనమే! ఆమాత్రం దానికే ఎంతో సంతృప్తి చెంది ఎంతో ఆనందపడి తిరిగి వెళతారు. దర్శనమయ్యి బయటకి రాగానే తాను పడిన శ్రమంతో మరచిపోతారు. మళ్ళీ తిరిగి తిరుమల ఎప్పుడు వస్తామో అని ఆలోచించడం మొదలు పెడతారు. అక్కడ ఉన్న శ్రీ స్వామి వారి శక్తి అంతటి మహత్తరమైనది.

అయితే అక్కడ అంత శక్తి ఎలా ఉంది? అసలు ఏ శక్తి మనల్ని అంతగా ఆకర్షిస్తోంది. ఏ శక్తి ప్రపంచం నలుమూలలనుండి భక్తులను తన దగ్గరకు ఆకర్షిస్తోంది. ఇవన్నీ తెలుసుకుంటే ఈసారి మనం తిరుమల వెళ్ళినప్పుడు దివ్య అనుభూతికి లోనవుతాము.

ఈ విశ్వంలో అక్కడక్కడ ఎంతో శక్తివంతమైన ప్రదేశాలు ఉంటాయి. అక్కడ కొన్ని దివ్య తరంగాలు ఎప్పుడూ ప్రసరిస్తూ ఉంటాయి. అటువంటి శక్తి గల ప్రదేశాలలో నెలకొల్పబడే ఆలయాలు, అక్కడ ఉండే దేవతలు ఎంతో మహిమాన్వితమైనవిగా ప్రసిద్ధి పొందుతాయి. తిరుమల, శ్రీరంగం, మధుర, కంచి, కాశీ, హరిద్వార్, కేథార్‌నాథ్, బదరీనాథ్, కాశ్మీర్‌లోని వైష్ణోదేవి, నేపాల్ లోని పశుపతినాథ దేవాలయం ఇటువంటి దేవాలయాలు ఉన్న ప్రదేశాలు ఈ భూమండలంపై ఎంతో శక్తి ఉన్న ప్రదేశాలు ఉదాహరణకు తిరుమల గురించి ఆలోచిస్తే తిరుమల ఆనంద నిలయంలో మనం శ్రీమహావిష్ణువు రూపంలో కొలుస్తున్న అక్కడ ఉన్న దేవత నిజం చెప్పాలంటే ఈ సృష్టి మొత్తానికి మూలకారణమైన దివ్యశక్తియే!.

సామాన్య మానవులు ఏరూపం లేని ఆ దివ్యశక్తిని ఊహించుకొని అర్చించలేరు కాబట్టి ఆ మహాశక్తియే తిరుమలలో శ్రీవేంకటేశ్వరుని గాను, కాశీలో పరమేశ్వరుని గాను, కంచిలో కామాక్షిగాను, బృందావనంలో శ్రీకృష్ణునిగాను, కాశ్మీర్‌లో శ్రీవైష్ణోదేవి గాను, శ్రీలంకలో శాంకరీ దేవి గాను మనకు దర్శనమిస్తున్నారు. కానీ మనం దీర్ఘంగా ఆలోచిస్తే ఈ క్షేత్రాలన్నింటిలో ఉన్నది ఒకే ఒక మహాశక్తియే. ఆశక్తియే అనేక చోట్ల అనేక రూపాలు ధరించి భక్తులను అలరిస్తున్నది. ఇంతకు ముందు చెప్పినట్లుగా సామాన్య మానవులకు వీలైన అర్చారూపంలో ఈ దేవతలందరు మనకు సామాన్య నేత్రాలకు కనిపిస్తున్నారు. ఈ క్షేత్రాలలో సాధకులు ధ్యానంలోకి వెళ్ళినప్పుడు అక్కడ ఉన్న దివ్య తరంగాలను అనుభవించి అక్కడ ఉన్న దేవత కేవలం ఏ మహావిష్ణువో, ఏ మహేశ్వరుడో కాక ఈ విశ్వం మొత్తానికి కారణభూతమైన దివ్యశక్తిగా గ్రహిస్తారు.

పూర్వకాలంలో అనేక మంది యోగులు, మహర్షులు ఈ క్షేత్రాలను ఇలాగే దర్శించారు. ఈ కేత్రాలలోని అనంతశక్తిని వారు గ్రహించగలిగారు. ఈ పుణ్యక్షేత్రాలలో ఇంతటి శక్తి ఉన్నది కాబట్టే మనం ఈ క్షేత్రాలకు వెళ్ళినప్పుడు మన మనస్సు ఎంతో ప్రశాంతంగా ఉంటుంది. మన మనస్సులలో మాటల్లో వర్ణించలేని దివ్యానుభూతులు కలుగుతాయి.

తిరుమల కూడా అటువంటి ఒక అద్భుతమైన శక్తిగల ప్రదేశమే. ఈ కొండలపై శ్రీవారి ఆలయం ఉన్న పరిసర ప్రాంతాలలో నేరుగా గ్రహమండలం దాటి ఈ సృష్టిమొత్తానికి ఆధారమూలమైన దివ్యశక్తి తరంగాలు ఈ ప్రాంతంలో నిత్యం ప్రసరిస్తుంటాయి. మనం శ్రీమహావిష్ణువుగా కొలుస్తున్నప్పటికి ఇప్పటికి చాలా మంది దేవతలు, సిద్ధులు, యోగులు, మహాపురుషులు అదృశ్యరూపాలలో తిరుమలకు వచ్చి ఆ మహాశక్తిని దర్శించుకొని వెళుతుంటారు. అక్కడ ఉన్న మూర్తి కేవలం శ్రీమహావిష్ణువుగా మాత్రమే వారు భావించరు. ఈ సృష్టి మొత్తానికి కారణభూతమైన ఆ దివ్యశక్తిగా గ్రహించి ఆరాధిస్తారు. సామాన్య మానవులైన మనం మాత్రం అక్కడ ఉన్నది శ్రీమన్నారాయణులవారిలాగా మనం తలుస్తాము. మనం అంతటి ఉన్నత స్థాయికి వెళ్ళి ఆలోచించలేము కాబట్టి శ్రీమన్నారాయణుని రూపంగా అక్కడ ఉన్న మూర్తిని కొలుస్తున్నాము.

అక్కడ అంతటి మహాశక్తి ఉన్నది కాబట్టే తిరుమల క్షేత్రం అంతా నిత్యం దివ్యతరంగాలతో నిండి ఉంటుంది. అందుకే మనం ఆ కొండ ఎక్కుతున్నంతసేపు

ఎటువంటి శ్రమ తెలియదు. ఆ దివ్యతరంగాలు మన శరీరం గుండా ప్రసరిస్తూ ఉంటే మన శరీరాలు ఎంతో శక్తివంతమౌతాయి. మనస్సు ఎంతో హాయిగా ఉంటుంది. ఇప్పటికి నాతో కొంతమంది అక్కడకు వెళ్ళినప్పుడు తిరుమల ఆలయంలో ఉన్న మూర్తి తమకు శివునిగా దర్శనమిచ్చాడని చెబుతారు. తమిళనాడుకు చెందిన కొందరు భక్తులు ఇప్పటికి అక్కడ ఆలయంలో ఉన్నది శ్రీసుబ్రహ్మణ్య స్వామిగా నమ్మి కొలుస్తారు. ఇప్పటికి ఎందరో భక్తులు శ్రీస్వామివారిని అనేక దేవతా రూపాలలో దర్శించుకుంటారు.

తిరుమలకు నేను వెళ్ళినప్పుడల్లా అక్కడ ఎన్నో అద్భుతాలు గమనించాను. ఒకసారి ఆలయంలోనికి వెళ్తున్నప్పుడు ఆలయ ధ్వజస్థంబం దగ్గర బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు ముగ్గురు దర్శమిచ్చారు. అక్కడే దివ్యశరీరాలతో నుంచొని ఉన్నారు. మరొకసారి తెల్లవారుఝామునే దర్శనానికి వెళ్ళినప్పుడు మేము వెండి వాకిలి దాటగానే అక్కడ శ్రీసరస్వతి, శ్రీమహాలక్ష్మీ, శ్రీపార్వతీదేవి కనిపించారు. మరొకసారి తిరుమల వెళ్ళినపుడు నేను కాసేపు నారాయణగిరి శ్రీవారి పాదాల దారిలో ఉంటే అడవిలో కాసేపు ధ్యానంలో కూర్చొని ఉన్నప్పుడు అక్కడ ప్రక్కనే హనుమంతులవారు దర్శనమిచ్చారు. హనుమంతులవారు తిరుమల కొండలలో నేటికి దివ్యరూపంలో సంచరిస్తుంటారు. ఎంతో మంది మహాపురుషులకు తమ దర్శన భాగ్యాన్ని అనుగ్రహించారు కూడా!.

ఒకసారి మేము నాలుగు కుటుంబాల వాళ్ళము కలిసి తిరుమల వెళ్ళాము. అప్పుడు మేము ఎంత ప్రయత్నించినా తరువాత రోజుకు ఏ దర్శన టిక్కెట్లు దొరకలేదు. అప్పుడు నేను కాసేపు కాటేజ్ బయటకు వచ్చి ఎదురుగా ఉన్న చెట్టు వద్ద కనులు మూసుకొని నుంచున్నాను. ఆ చెట్టు సామాన్య వృక్షం కాదు ఎన్నో వేల సంవత్సరాలనుంచి తపస్సు చేస్తున్న ఒక మహామునీశ్వరుడు. ఆ వృక్షరూపంలో అక్కడ ఉన్నాడు. ఒక్క క్షణం నన్ను చూసి చిరునవ్వు నవ్వాడు. ఇంతలో కాటేజ్ లోపలినుంచి నా ఫోన్ మ్రోగుతోందని మావాళ్ళు ఒకరు నా ఫోన్ తెచ్చి ఇచ్చారు. అవతల వ్యక్తి మా అందరికి రేపటి ఉదయం దర్శనానికి టిక్కెట్లు దొరికాయని చెప్పారు. చూసారా ! ఆ మహర్షి నా మనస్సులోని ఆలోచనలు అర్థం చేసుకున్నారు. క్షణంలో స్వామివారి దర్శనం ఏర్పాటు జరిగింది. ఇటువంటి అనుభూతులు తిరుమలక్షేత్రంలో నిత్యం ఎందరికో జరుగుతుంటాయి.

తిరుమల, శ్రీరంగం, కాశీ, మధుర వంటి గొప్ప పుణ్యక్షేత్రాలలో మరొక గొప్ప విశేషం కూడా ఉంది. ముందు చెప్పినట్లు ఈ క్షేత్రాలన్నింటిలో ఈ సమస్త విశ్వానికి ఆధారభూతమైన శక్తి ఉండడం వలన ఈ పుణ్యక్షేత్రాలలో మనం ఏ ఒక్కటి దర్శించినా, ఈ భూమండలంలోని అన్ని పుణ్యక్షేత్రాలను దర్శించిన పుణ్యఫలం కలుగుతుంది. ఈ క్షేత్రాలు ఎంత శక్తి ప్రదమైనవంటే వీటిలో ఏదైనా ఒక క్షేత్రంలో ధ్యానం చేస్తూ ఉన్నత స్థాయికి వెళ్ళగలిగితే ఆ క్షణంలోనే అక్కడ నుంచే ఈ విశ్వంలోని ఏ పుణ్యక్షేత్రాన్నైనా దర్శించవచ్చు.

అంటే మనం తిరుమలలో ఉన్నత స్థాయిలో ధ్యానం చేస్తూ ఉంటే మనకు కాశీ, ప్రయాగ, హరిద్వార్, కేధార్‌నాథ్, ముక్తినాథ్ అన్నీ దర్శనమిస్తాయి. అంతే కాదు అక్కడ కొండలన్నీ ఒక్కసారిగా మనకు హిమాలయాల్లాగా దర్శనమిస్తాయి. పూర్వకాలంలో వివిధ క్షేత్రాలలో ఉన్న కొంతమంది మహాపురుషులు జీవితాంతం ఒకే క్షేత్రంలో ఉన్నప్పటికి వారు తమ దివ్యదృష్టితో అన్ని క్షేత్రాలను దర్శించేవారు. ఉదాహరణకు రమణ మహర్షి అరుణాచలంలో ఉన్నప్పటికి అక్కడి నుంచే విశ్వంలోని క్షేత్రాలన్నింటిని దర్శించేవారన్నమాట. అలాగే అన్నమాచార్యులవారు కేవలం తిరుమలతో మాత్రమే సంబంధం ఉన్నట్టు మనకు అనిపించినా వారు తన యోగశక్తితో ఈ విశ్వంలోని అన్ని క్షేత్రాలను దర్శించారు కాబట్టే ఈ విశ్వం మొత్తానికి కారణభూతమైన ఆ దివ్యశక్తి గురించి ఇంత అద్భుతంగా కీర్తనలు వ్రాయగలిగారు.

ఒకసారి హిమాలయాశ్రపు విషయాలవద్దకు వద్దాం. అప్పుడు నా ఆశ్రమానికి రామప్రకాశశాస్త్రి అనే ఒక మహాపండితుడు తన 44వ ఏట వచ్చాడు. అతడు ఎన్నో వేదశాస్త్రాలలో నిష్ణాతుడు. ఎంతో గొప్ప పండితుడు ఒక్కసారిగా ఈ లౌకిక విషయాలన్నీ వదిలి తపస్సు చేసుకోవాలని తలచి హిమాలయప్రాంతాలకు వచ్చి నా ఆశ్రమం చేరుకున్నాడు. మిగిలిన జీవితం అంతా అక్కడే గడిపాడు. తరువాత జన్మలో ఇతడు శ్రీరంగంలో గొప్ప ఆచార్యపురుషుడుగా జన్మించాడు. బ్రతికినంతకాలం వైష్ణవ మత వ్యాప్తికి ఎంతో కృషి చేశారు.

ఇప్పటికి అతడి గురించి ఆ ప్రాంతాల ప్రజలు ఎంతో గొప్పగా చెప్పుకుంటారు. ఈ జన్మలో అతను శేషగిరి అనే పేరుతో జన్మించాడు. ఒకసారి ఇతను తన స్నేహితుల ఇంటికి వెళితే అక్కడ నా పుస్తకం ఒకటి ఆశ్చర్యకర రీతిలో

చూసాడు. ఆ స్నేహితుడి భార్య మాకు దూరపు బంధువు. అప్పటిదాకా ఆ దూరపు బంధువుని నేనెప్పుడూ కలవలేదు. కానీ నా పుస్తకాలు ఎలాగో వీరి వద్దకు వచ్చాయి. అక్కడకి వచ్చిన శేషగిరి నా పుస్తకం ఒకటి చూడడం తరువాత నన్ను కలవాలని అనిపించడం జరిగి మా ఇంటికి వచ్చి నన్ను కలిసారు. ఇప్పుడు వీరు తిరుమల తిరుపతి దేవస్థానంలో ఎంతో ఉన్నత ఉద్యోగంలో ఉన్నారు.

ఇంతకు క్రితం జన్మలలో చేసిన అనేక పుణ్యకార్యాల వలన ఈ జన్మలో వీరు శ్రీవేంకటేశ్వర స్వామి వారికి అతిచేరువయ్యారు. ఆ స్వామివారి సేవలోనే నిత్యం తరిస్తున్నారు. ఆరోజు వారి స్నేహితుల ఇంట నా పుస్తకం చూడకపోతే నన్ను కలిసేవారు కాదు కదా! అప్పటి హిమాలయాశ్రమపు బంధమే తిరిగి మమ్మల్ని కలిపింది.

వీరికి ముందు ముందు ఇంకా ఉత్తమ జన్మలు కలిగి సమాజానికి ఎంతో సేవ చేస్తారు. లోకానికి వీరిద్వారా కొన్ని అద్భుతమైన గ్రంథాలు రావలసి ఉన్నది. ఇవన్నీ ఈ జన్మలో కొన్ని, మరుజన్మలో కొన్ని వస్తాయి. ఈ పుస్తకాలు ఎంతో తేలిక భాషలో రచింపబడి ప్రజలకు ఎంతో జ్ఞానాన్ని అందించే విధంగా ఉంటాయి. ఎంతోమంది జీవితాలను ప్రభావితం చేసే విధంగా ఉంటాయి.

మళ్ళీ హిమాలయాశ్రమాలకు వద్దాం. అప్పుడు నా దగ్గరకి వచ్చిన వారిలో కృష్ణశర్మ, రాధ అనే ఇద్దరు దంపతులు ఉన్నారు. వీరిద్దరు ఉత్తర ప్రదేశ్‌వారు కృష్ణ శర్మ మహాపండితుడు. రాధ కూడా ఎంతో గొప్ప దైవభక్తి కలది. వీరిరువురు అనేక పుణ్యక్షేత్రాలు తిరిగేవారు. ఒకనాడు కాశీపట్టణంలో తిరుగుతుండగా వీరిద్దరికి ఆ పరమేశ్వరుడు ఒక సాధువు రూపంలో దర్శనమిచ్చాడు. మనం ఎంతో పుణ్యం చేసుకొని, ఎన్నో జన్మలు సత్ప్రవర్తనతో జీవిస్తూంటే భగవంతుడు ఏదో రూపంలో మనకు తప్పక దర్శనమిస్తాడు.

అయితే చాలా సార్లు చాలా మందికి వారు భగవంతుని దర్శించినట్టు కూడా తెలియదు. ఎందుకంటే భగవంతుడు సాధారణ మానవరూపంలోను లేదా ఒక్కోసారి పశుపక్ష్యాదుల రూపంలోను కూడా మనకు దర్శనమిస్తాడు. కేవలం భగవంతుడే కాదు, కొన్ని వేల సంవత్సరాలుగా జీవిస్తున్న సిద్ధులు, యోగులు కూడా ఒక్కోసారి ఎంతో పుణ్యఫలం చేసుకున్నవారికి తప్పకుండా దర్శనమిస్తారు. ఇంతకు ముందు చెప్పినట్లుగా చాలామంది తమకు భగవద్దర్శనం కలిగిందని గ్రహించలేరు.

అయితే వారు ఆశ్రయించిన సద్గురువు మాత్రమే వారికి భగవద్దర్శనం ఎప్పుడు ఏ రూపంలో అయిందో చెప్పగలుగుతాడు. అలాగే ముందు కాలంలో కూడా ఆ పురుషోత్తముని దర్శనం ఎప్పుడు ఎక్కడ కలుగుతుందో చెప్పగలుగుతాడు. అంత స్పష్టంగా చెప్పగలిగే గురువు దొరకడం మనం చేసుకున్న అదృష్టం. ఎన్నో జన్మల పుణ్యఫలముంటే గాని అంతటి సద్గురువుల సాంగత్యం లభించదు.

కృష్ణశర్మ, రాధలకు కూడా ఈ జన్మలో సాక్షాత్తు పరమేశ్వరుడే తమకు దర్శనమిచ్చాడని తెలియదు. అయితే ఆ సాధువు దర్శనం తరువాత వారి జీవితాలలో ఎన్నో అద్భుతాలు జరిగాయి. అవన్నీ వారి పూర్వజన్మ ఫలం వలన, భగవంతుని అనుగ్రహం వలన జరిగాయని అనుకున్నారే తప్ప ఆ పరమేశ్వరుని దర్శనం వలన సాధ్యమయ్యాయని వారు గ్రహించలేదు.

తరువాత కొన్నాళ్ళకు ఆ దంపతులకు హిమాలయాలు దర్శించాలని అక్కడ యోగులకు, సిద్ధులను దర్శించాలనే కోరిక కలిగింది. అలా తిరుగుతూ వారు నేనున్న ఆశ్రమానికి రావడం కూడా జరిగింది. వారిద్దరు జీవితాంతం అక్కడే గడిపారు.

అటు తరువాత జన్మలో కృష్ణశర్మ బ్రిటన్ దేశంలో ఒక ఉన్నత కుటుంబంలో పుట్టి సైన్యంలో చేరి మొదటి ప్రపంచ యుద్ధంలో గొప్ప కమాండర్ గా పేరు తెచ్చుకున్నాడు. రాధ పంజాబ్ రాష్ట్రంలోని సింధూనదీ ప్రాంతంలో ఒక సాంప్రదాయ పంజాబీ కుటుంబలో పురుషునిగా జన్మించాడు. ఈ జన్మలో అతడు ఎన్నో మంచి పనులు చేశాడు. ఎన్నో విద్యాలయాలు నెలకొల్పాడు, ఒక పెద్ద అనాథశరణాలయం నిర్మించాడు.

తరువాత జన్మలో రాధ మధురై పట్టణంలో శ్రీకృష్ణమాచార్యులు, శ్రీమతి ఆండాళ్ దంపతులకు పద్మజ అనేపేరుతో జన్మించింది. చిన్నప్పటినుంచి ఎంతో భక్తిశ్రద్ధలతో ఉండేది. అద్భుతమైన భరత నాట్యకారిణిగా కూడా పేరు సంపాదించింది. ప్రతిరోజు మీనాక్షి అమ్మవారి ఆలయానికి వెళ్ళేది. వెళ్ళి అమ్మవారిని దర్శించుకునేది. ఆలయ ఉత్సవాలలో గొప్పగా నాట్యం చేసేది. తల్లిమీద ఎంతో ప్రేమ కలిగిఉండేది. తల్లి కూడా ఎంతో భక్తి కలదై ఎప్పుడూ ఏవో కీర్తనలు పాడుతూ ఉండేది. చుట్టుప్రక్కల వారందరికి ఎంతో సహాయం చేసేది. పద్మజ ఎక్కడ నాట్య ప్రదర్శనకి వెళ్ళినా తల్లిదండ్రులిద్దరూ ఆమెతో వెళ్ళేవారు.

ఆ జన్మలో పద్మజే ఈ జన్మలో నా కుమార్తె ఆముక్తగా జన్మించింది. అలాగే హిమాలయాశ్రమానికి వచ్చినప్పటి కృష్ణశర్మ ఈ జన్మలో ధీరజ్ అనేపేరుతో పుట్టి ఆముక్తకు భర్త అయ్యాడు. మధురైలో పద్మజగా జన్మించినప్పటి ఆమెతల్లి ఈ జన్మలో ధీరజ్ ఆముక్తలకు పర్ణిక అనేపేరుతో కుమార్తెగా పుట్టింది. అప్పటి హిమాలయాశ్రమపు బంధం ఈ జన్మలో ఈ విధంగా మమ్మల్నందర్ని తిరిగి కలిపింది.

పూర్వకాలంలో భారతదేశంలో అనేకమంది అవధూతలు ఉండేవారు. వారికి ఈ లోకం అస్సలు పట్టదు. వారిలో కొందరి వద్ద గొప్ప యోగ శక్తులుండేవి. అసలు వారిని లోకం పూర్తిగా అర్థం కూడా చేసుకోగలిగేది కాదు. ఎంతో అదృష్టం ఉండి వారిని అర్థం చేసుకున్న కొంతమంది వారిని నిత్యం కొలుస్తూ తమ జన్మధన్యం చేసుకునేవారు. అవధూతలకు నిద్రాహారాలతో పని ఉండదు. ఎప్పుడూ లోక కళ్యాణం కోసం ధ్యానంలో ఉంటారు. చూడడానికి ఎప్పుడూ పరధ్యానంలో, ఒక్కోసారి లోకం దృష్టిలో కొంతమందికి పిచ్చి వారుగా అనిపించినా, వారు ఎప్పుడూ ఆ భగవంతునితో అనుసంధానమై ఉంటారు.

ఇటువంటి కొందరు అవధూతలు నేటికి ఉన్నారు. కాని వారిని గుర్తించడం చాలా కష్టం. మనకు ఎన్నో జన్మల పుణ్యఫలం ఉంటే గాని వారిని మనం గ్రహించలేము. అవధూతలు ప్రతి ఒక్కరికి వెంటనే జన్మరాహిత్యం లభించదు. వారిలో కొంతమంది మళ్ళీ మానవజన్మలు ఎత్తి లోకకళ్యాణానికి, సమాజహితానికి మంచి పనులు చేస్తుంటారు.

నన్ను హిమాలయాశ్రమంలో కలిసిన వారిలో కొంతమంది ముందు జన్మలలో అవధూతలుగా ఉన్నవారే. అటుతరువాత సామాన్య మానవులుగా జన్మించి మంచి కార్యాలను చేస్తూ కొన్ని జన్మల తరువాత ఈ జన్మలో నన్ను తిరిగి కలిసారు.

అలా కలిసిన వారిలో శ్రద్ధానంద స్వామి అనే పేరుతో నా వద్దకు వచ్చిన వారు ఒకరు. శ్రద్ధానందులవారు ఉత్తర ప్రదేశ్‌లోని లక్నో సమీపంలో జన్మించారు. స్కూలు టీచర్ గా ఉద్యోగం చేశారు. విద్యార్థులను మంచి మార్గంలో తీర్చిదిద్ది రిటైర్ అయిన తరువాత సన్యాసం తీసుకొని హిమాలయప్రాంతాలకు వచ్చి అక్కడ అనేక సాధువులను, యోగులను దర్శించి తరువాత నా ఆశ్రమం చేరారు. ఆ తరువాత జన్మలో శ్రద్ధానందుల వారు ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడ వద్ద ఒక బ్రాహ్మణ కుటుంబంలో జన్మించారు. వేదాలలో ఎంతో గొప్ప పేరు ప్రఖ్యాతులు గడించారు.

అటు తరువాత జన్మలో శ్రీకాకుళంలో ఒక మత్స్యకారుల కుటుంబంలో జన్మించారు. చిన్నప్పటి నుంచి మంచి బుద్ధితో ఉండేవారు. తండ్రి నాగన్నతో కలిసి సముద్రం మీదకు చేపలు వేటకు వెళ్ళేవారు. ప్రతీ శ్రీరామనవమికి వారి ఊరి దగ్గర ఉన్న శ్రీసీతారామచంద్రులవారి ఆలయంలో శ్రీసీతారామకళ్యాణం అద్భుతంగా జరిగేది. ఆ ఉత్సవంలో చుట్టుప్రక్కల గ్రామాలలో ఉన్న మత్స్యకారుల కుటుంబాలన్నీ ఎంతో శ్రద్ధతో పాల్గొనేవారు. అందరు కోలాటాలు ఆడేవారు. భజనలు చేసేవారు.

ఆ జన్మలో అప్పన్న అనే పేరుతో జన్మించిన శ్రద్ధానందుల వారు కూడా ఆలయ వేడుకల్లో ఎంతో సంతోషంగా పాల్గొనేవాడు. తండ్రితో కలిసి సముద్రంమీదకి వెళ్ళినప్పుడల్లా తండ్రిని అయ్యా ఆ సముద్రం అవతల ఏముంది ? అని అడిగేవాడు. అందుకు తండ్రి సముద్రం అవతల దేవతలు ఉంటారు అనేవాడు.

అప్పన్నకి ఎప్పుడూ ఆ దేవతలను చూడాలని కోరికగా ఉండేది. తండ్రితో అదేమాట అంటే విసుక్కునేవాడు. సముద్రం దాటి వెళ్ళాలంటే మాటలేంటిరా? మనుషులు ఎవ్వరూ వెళ్ళలేరు అనేవాడు. ప్రస్తుత జన్మలో అప్పటి అప్పన్నే గుంటూరు జిల్లాలో ప్రసాద్ గా జన్మించాడు. ఇక్కడ చదువు అయిన తరువాత కొన్నాళ్ళకు ఉద్యోగం కోసం ఆస్ట్రేలియా వెళ్ళాడు. పూర్వజన్మ వాసనలు గట్టిగా ఉండడం చేత చివరికి సముద్రం దాటి అవతలకే వెళ్ళాడు. నాపుస్తకాలు ఒకసారి ఇంటర్నెట్‌లో చూసాడు. ఎంతో ఆకర్షింపబడి ఇంటర్నెట్‌నుంచి డౌన్‌లోడ్ చేసుకొని గత నాలుగేళ్ళుగా శ్రీవేంకటేశ్వర స్వామి వ్రతం చేస్తున్నాడు. అంతే కాకుండా ప్రింట్‌లు తీసి ఎంతోమందికి అక్కడి సిడ్నీలో పంచిపెడుతున్నాడు. చివరికి క్రిందటి సంవత్సరం ఒకసారి నాకు ఫోన్‌చేసి మాట్లాడాడు ఎంతో సంతోషపడ్డాను. అప్పటి హిమాలయపు ఆశ్రమబంధం తిరిగి మమ్మల్ని కలిపింది.

ప్రసాద్ క్రిందటి జన్మలో అప్పన్నగా జన్మించినప్పుడు ఒకసారి తండ్రితో కలిసి సముద్రం మీదకి వెళ్ళినప్పుడు వారి పడవ ప్రక్కన నీటిలోనుంచి ఒక పెద్ద చేప ఎంతో ఎత్తుకు ఎగిరి తిరిగి నీటిలోకి వెళ్ళింది. తండ్రి దాన్ని పట్టుకుందామని ఎంత ప్రయత్నించినా తిరిగి కనబడలేదు. ఆ చుట్టుప్రక్కలంతా పడవతో వేగంగా తిరిగాడు. కాని ఆ చేపమాత్రం కనబడలేదు. ఆశ్చర్యకరంగా ఒక క్షణం కనబడి మాయమైంది. ఆ చేప మరెవరో కాదు! సాక్షాత్తు శ్రీమన్నారాయణులవారే! తండ్రి నాగన్నకు కొడుకు అప్పన్నకు ఆ జన్మలో ఆ విధంగా శ్రీమన్నారాయణులవారు మత్స్య రూపంలో

దర్శనమిచ్చారు. ప్రసాద్ తండ్రి నాగన్న కూడా అంతకు ముందు జన్మలో నన్ను హిమాలయాశ్రమంలో కలుసుకున్నవాడే! కొన్ని ఉత్తమ జన్మలలో జన్మించి ఈ జన్మలో కృష్ణదేవ్ అనే పేరుతో పుట్టి తిరిగి నన్ను కలుసుకున్నాడు.

ప్రసాద్ నా ఆధ్యాత్మిక పుస్తకాల ప్రచురణకు ఎంతో సహాయం చేస్తున్నాడు. ఆస్ట్రేలియాలో ఎన్నో ఆలయాల్లో ఎంతో మంది భక్తులకు ఈ పుస్తకాలు పంచుతున్నాడు. ప్రసాద్‌కు ఇక ముందు ఎన్నో ఉత్తమ జన్మలు కలుగుతాయి. వచ్చే జన్మలో అమెరికాలో జన్మించి ధర్మ పరిరక్షణకు ఎంతో పెద్ద ఎత్తున ప్రచారం చేస్తాడు. ఒక పెద్ద వేద విశ్వవిద్యాలయం స్థాపిస్తాడు. సంఘానికి ఉపయోగపడే ఎన్నో కార్యక్రమాలు చేస్తాడు. ఇలా రాబోయే జన్మలలో సత్ప్రవర్తనతో జీవించి ఇంక కొన్ని జన్మలకే జన్మరాహిత్య కలిగి ఆ దివ్యశక్తిలో ఐక్యమౌతాడు.

మళ్ళీ మనం అప్పటి హిమాలయాశ్రమపు విశేషాల వద్దకు వద్దాం. 1942 వ సం॥ లో ప్రపంచ దేశాల మధ్య భీకరంగా జరిగిన రెండవ ప్రపంచ యుద్ధ కాలంలో భారత సైన్యం కూడా బ్రిటీష్ వారి తరపున పోరాడింది. అలా పోరాడిన వారిలో రఘునందన్ మిశ్రా అనే ఒక సైనికుడు ఉండేవాడు. అతను సైన్యంలో ఎంతో క్రమశిక్షణతో మెలుగుతూ ఉండేవాడు. అతనికి విపరీతమైన కోపం ఉండేది.

కోపం, అహంకారం అనే గుణాలు ఆత్మని కొన్ని వేల జన్మల వరకు అంటిపెట్టుకొని ఉంటాయి. ఎంతో గట్టి ప్రయత్నం చేస్తే తప్ప ఈ రెండు గుణాలు తొలగవు. మనుషులందరిని ఉత్తమ జన్మల వైపు గడిచే క్రమంలో అడ్డు వచ్చేవి ఈ రెండు గుణాలే. మనం మన చుట్టూ ఉన్న అనేక మందిలో ఈ రెండు గుణాలు ఎక్కువగా చూస్తూంటాము. ఈ రెండిటినుంచే ద్వేషం, అసూయ కూడా కలుగుతాయి. మంచి గుణాలు ఆత్మను పట్టుకొని కొన్ని జన్మల పాటు ఉండడానికి ఎంతో సాధన చేయాలి. కాని చెడ్డ గుణాలైన కోపం, అహంకారం కొన్ని లక్షల జన్మల వరకు ఎంతో ప్రయత్నిస్తే తప్ప మనల్ని పట్టుకొని ఉంటాయి. వీటి వల్లనే మానవుడు జనన మరణ చక్రంలోపడి కొట్టుకుపోతుంటాడు.

రఘునందన్ మిశ్రా ఇలా ఎంతో మంచి గుణాలు ఉన్నప్పటికి కోపం వలన జీవితంలో ఎంతో నష్టపోయాడు. అతడు అంతకు ముందు జన్మలో ఒకసారి హిమాలయాశ్రమానికి చేరుకున్నాడు. ఆ జన్మలో అతడు రాకేశ్ అనే పేరుతో బెంగాల్ దేశంలో జన్మించాడు. ధర్మనందుడు అనే సాధువు ఒకసారి భాగవతం

గురించి ఎంతో ఆకర్షణీయంగా ఉపదేశిస్తుంటే అతడితో పాటే హిమాలయాశ్రమానికే చేరాడు. ధర్మనందుడు, రాకేశ్ తమ జీవితం చివరి వరకు ఆ ఆశ్రమంలోనే జీవించారు.

జీవితంలో ఎన్నో నేర్చుకున్నప్పటికి రాకేశ్ కు ఇంకా తృప్తి ఉండేది కాదు. అటు తరువాత కొన్ని జన్మల తరువాత రాకేశ్ ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాళహస్తి సమీపంలోని గ్రామంలో శ్రీరామశెట్టి అనే పేరుతో జన్మించాడు. చిన్న చిన్న వ్యాపారాలు చేసేవాడు. ప్రతిరోజు శ్రీకాళహస్తీశ్వరుడిని సేవించుకొనేవాడు. ఉదయం లేవగానే స్నానాదులు చేసి శ్రీకాళహస్తీశ్వరుని ఆలయానికి వెళ్ళి ఆలయం బయట పార్వతమ్మ అనే ఒక పూలు అమ్మే మనిషి దగ్గర పువ్వులు కొని ఆలయంలోనికి వెళ్ళి శ్రీకాళహస్తీశ్వర స్వామి వారిని, అమ్మవారిని దర్శించుకొనేవాడు.

ఇలా ప్రతిరోజు కొన్ని సంవత్సరాల పాటు ఆలయానికి వెళ్ళి శ్రీకాళహస్తీశ్వరుని, అమ్మవారిని ఎంతో భక్తితో అర్చించాడు. పార్వతమ్మ తగ్గర ప్రతిరోజు పువ్వులు తీసుకునేవాడు. ఆమె తన దగ్గర పువ్వులు కొనడానికి వచ్చిన వారందరిని ఎంతో చిరునవ్వుతో పలకరించేది. వారి యోగ క్షేమాలు అడిగి తెలుసుకొనేది. ప్రతి ఒక్కరిని శ్రీ స్వామి, అమ్మవార్ల అనుగ్రహం జరుగుతుందని ఆశీర్వదించేది. వచ్చిన వారందరితో ఈ రోజంతా మీకు బాగుంటుందని చెప్పేది.

ఒకరోజు ఉదయాన్నే ఆలయానికి వచ్చిన శ్రీరామశెట్టికి అక్కడ పూలు అమ్మే పార్వతమ్మ కనబడలేదు. ఆమె దగ్గర పూలు కొనడమే కాకుండా రోజు తమ కష్టసుఖాలు చెప్పుకొనేవాడు. శ్రీరామశెట్టి కంటే ఆమె వయస్సులో ఇరవై సంవత్సరాలు పెద్దది. ఆరోజు ఆమె కనబడకపోయేటప్పటికి ప్రక్కన ఉన్న దుకాణాల వారిని అడిగాడు. ఆమె నిన్ననే అకస్మాత్తుగా కాలం చేసిందని వారు చెప్పారు. అందుకు శ్రీరామశెట్టి ఎంతో బాధపడ్డాడు. అటు తరువాత కొంత కాలానికి తన వ్యాపారాలన్నీ కుమారుడికి అప్పగించి ఏర్పేడు ఆశ్రమానికి చేరుకున్నాడు. మిగిలిన జీవితమంతా అక్కడే గడిపాడు.

ఆ జన్మలో శ్రీరామశెట్టే ప్రస్తుత జన్మలో విశ్వనాధం పేరుతో నా స్నేహితుడుగా జన్మించాడు. ఆ జన్మలో పూలమ్మిన పార్వతమ్మ ఈ జన్మలో కస్తూరిగా పుట్టి విశ్వనాధంకి భార్య అయింది. కస్తూరి అంతకు ముందు జన్మలో

హిమాలయాశ్రమంలో కూడా ఉండేది. అటు తరువాత జన్మలో ఒకసారి శ్రీకాళహస్తీశ్వర ఆలయంలో అర్చకుడిగా జీవించింది. కొన్ని సంవత్సరాల పాటు నిత్యం స్వామినే తలుస్తూ ఆలయం వెలుపల కూర్చొని పూలమ్మిన పార్వతమ్మ ఈ జన్మలో శ్రీస్వామి వారికి దగ్గరగా అర్చకుడిగా జన్మించింది. ఆ విధంగా ఆమెకు శ్రీకాళహస్తీశ్వర స్వామి వారికి నిత్యం సేవ చేసుకునే భాగ్యం లభించింది. ఆ స్వామితో ఎంతో అనుబంధం ఉండడంతో ఆమెకు భక్తి ప్రపత్తులు ఎంతో ఎక్కువగా ఉండేవి. అప్పటి భక్తి ఆమె ఆత్మను గట్టిగా పట్టుకొని ఈ జన్మలో కూడా నిత్యం ఎన్నో పూజలు చేస్తుంది.

ఈ సృష్టి ప్రారంభం నుంచి మనందరం ఎన్నో జన్మలెత్తుతూ మధ్య మధ్య జంతు, పక్షి, క్రిమికీటకాల జన్మలెత్తుతూ వస్తూంటాము. ఈ జన్మలో మనం చేసే ప్రతీదీ మన పూర్వజన్మల కర్మల ఫలంగానే భావించాలి. ప్రతీ జన్మలో మనం సత్ప్రవర్తనతో జీవిస్తూంటే ముందు ముందు మరింత ఉత్తమ జన్మలు లభిస్తాయి. మన కుటుంబ సభ్యులపైన, మనచుట్టూ ఉండే వారిపైన, మన సంపదల పైన, మనకు కనబడే అనేక వస్తువుల పైన మనం ఎక్కువ మమకారం పెట్టుకోరాదు. మనకు వీటన్నింటితో వాత్సల్యం, అనురాగం ఉండాలి. అంతే తప్ప ఎక్కువ బంధం పెట్టుకోకూడదు.

అలాగే మన సంతానం యొక్క జీవితంలోని కష్ట సుఖాలకు మనమే బాధ్యులమని అనుకోకూడదు. వారి జీవితం వారు పూర్వ జన్మలలో చేసుకున్న పాపపుణ్యాల ఫలంగా జరుగుతుంది. అంతే తప్ప మీరెంత ప్రయత్నించినా అతడి జీవిత గతిని మార్చలేదు. మీ కుమారుడు గాని, కుమార్తె గాని జీవితంలో ఎంత బాగా చదువుకుంటాడు, ఎంత ఆస్తిపరుడు అవుతాడు, ఎంత హోదాలకి ఎదుగుతాడు, ఎంతకాలం జీవిస్తాడు ఇలా వేటిపైన మనకు ఏమాత్రం నియంత్రణ లేదని దృఢంగా గ్రహించాలి. చాలా మంది తల్లి దండ్రులు తమ సంతానం సరిగ్గా చదువుకోలేదని దానికి వారే కారణం అని భావిస్తారు. అది ఏమాత్రం నిజం కాదు.

మీ కుమారుడు సరిగ్గా చదువుకోకపోవడానికి అతని పూర్వజన్మల కర్మ ఫలమే కారణం తప్ప, మీరు ఏమాత్రం కారణం కాదని గ్రహించాలి. చాలా మంది పిల్లలను ఎంతో గారాబంగా పెంచడం వలన పాడయ్యారని, సరిగ్గా చదువు రాలేదని బాధపడతారు. కాని మన చుట్టూ ఉన్న కొంతమంది పిల్లలు చాలా గారాబంగా

పెరిగిన కూడా బాగా చదువుకోవడం చూస్తుంటాము. అలాగే ఎంతో శ్రద్ధపెట్టి చదివించినా చదువు పెద్దగా అబ్బని వారిని చూస్తుంటాము. దీనికి కారణం ఆ పిల్లవాడి పూర్వజన్మ కర్మఫలమే! తల్లి దండ్రులలైన మీరు ఏ మాత్రం కారణం కాదని మీరు గట్టిగా గ్రహించాలి. ఎవరి జీవితం ఎలా గడుస్తుందనడానికి వారి వారి పూర్వజన్మల కర్మలే కారణం అని గ్రహించాలి.

ఏ జన్మలోనైనా చేసిన పాప పుణ్యాల ఫలం తరువాత ఏ జన్మలో అనుభవానికి వస్తుందన్నది పూర్తిగా భగవంతుడి నిర్ణయం ప్రకారం జరుగుతుంది. ఒక వ్యక్తి నూరు జన్మల క్రితం ఒక పది జన్మలు సామాన్య మానవుడిగా ఉండవచ్చు. ఇప్పటి జన్మలో అతను గొప్ప సంగీతకారుడో, గొప్ప రచయితో అవ్వచ్చు. ఎప్పుడో చేసుకున్న పుణ్యఫలం కొద్దీ గొప్ప పేరు తెచ్చుకున్న ఇతడు మళ్ళీ వచ్చే జన్మలో సామాన్య జీవితం అనుభవించవచ్చు.

ఆ మధ్య నేను అమెరికా వెళ్లినప్పుడు ఒక హోటల్ లో సర్వర్‌గా చేస్తున్న ఏండర్‌సన్ అనే వ్యక్తిని చూసాను. అతడు ఒక రెండు వందల సంవత్సరాల క్రితం అమెరికాలో గొప్ప రచయితగా జన్మించాడు. ఆ జన్మలో గొప్ప రచయితగా పేరు సంపాదించుకొన్నప్పటికి కొన్ని పాప కార్యాలు చేసిన ఫలితంగా తరువాత అనేక సామాన్య జన్మలెత్తుతూ ఈ జన్మలో ఒక హోటల్‌లో సర్వర్‌గా పనిచేస్తున్నాడు.

అలాగే మరొకచోట పూర్వజన్మలలో ఒక గొప్ప హిందీ సినిమా నటుడిని ఈ జన్మలో హైదరబాద్ లో అతి సామాన్య జీవితం గడుపుతున్న వాడిగా చూసాను. ఇప్పటికి ఇతడికి పూర్వజన్మ వాసనలు పోక వచ్చిన ప్రతీ హిందీ సినిమా చూస్తుంటాడు. డల్లాస్‌లోని ఏండర్‌సన్ కూడా ఎక్కడ ఏ చిన్న కాగితం మీద కూడా ఏం వ్రాసి ఉన్న ఎంతో ఉత్సుకతతో చదువుతాడు.

కాబట్టి మనం ఈ జన్మలో మనచుట్టూ సమాజంలో ఉన్నత స్థానాలలో ఉన్న వ్యక్తుల గురించి, వారు ప్రస్తుత జీవితంలో అనుభవిస్తున్న భోగ భాగ్యాల గురించి ఈర్ష్య పడకూడదు. అలాగే మనం ఈ జన్మలో ఎంతో ఉన్నత స్థానంలో, ఐశ్వర్యవంతులై ఉండి ఉన్నట్లయితే మన బంధువులను, మనదగ్గర పనిచేసేవారిని ఏ మాత్రం చులకనగా చూడకూడదు. ఎందుకంటే క్రిందటి జన్మలో నీవు కూడా అటువంటి అతిసామాన్య వ్యక్తివే ! అంతే కాదు వచ్చే జన్మలో కూడా సామాన్యుడుగానే పుడతావు. వచ్చే ఒక్క జన్మ ఏమిటి ? వచ్చే నూరు జన్మలలో కూడా నీవు అతి

సామాన్యుడిగా పుట్టవచ్చు. మనం ఈ కోణంలో ఆలోచించడం నేర్చుకోవాలి. మనందరం ఈ సమాజంలోని తోటి వ్యక్తుల పట్ల ఈ దృక్పథం అలవాటు చేసుకోవాలి. అప్పుడే మనం ఆనందంగా ఉండగలుగుతాము. మన చుట్టూ ఉన్నవారు కూడా ఆనందంగా ఉంటారు.

అసలు ఆనందం అంటే ఏమిటి? ఆనందానికి ఎవరైనా సరియైన నిర్వచనం ఇవ్వగలరా! ఒకరికి ఒక సినిమా చూస్తే ఆనందం...ఒకరికి డబ్బు సంపాదించడం ఆనందం... మరొకరికి ఎంత డబ్బు సంపాదించినా ఏమాత్రం డబ్బు ఖర్చుపెట్టకపోవడం ఆనందం... కొంత మంది ఎంత పిసినారిగా ఉంటారంటే వాళ్ళ కుటుంబ సభ్యులకు అనారోగ్యం కలిగినా ఒక్కరూపాయి ఖర్చుపెట్టడానికి వంద సార్లు ఆలోచిస్తారు... వారికి డబ్బును అలా చూసుకొనడంలోనే ఆనందం...మరొకరికి పది రూపాయలు సంపాదిస్తే ఆ పదిరూపాయలు ఖర్చుపెట్టేస్తేనే ఆనందం...ఒకరికి ఎప్పుడూ ప్రయాణం చేయడం ఆనందం... మరొకరికి దేశంలోని పుణ్యక్షేత్రాలు చూడడం ఆనందం...మరొకరికి ఎటూ కదలకుండా ఇంట్లో కూర్చోవడం ఆనందం...

ఒక్కసారి ఆలోచించండి ఆనందం ఇన్ని రకాలుగా ఉంటుందా? లేక ఇవన్నీ ఆనందాలు అని మనం భ్రమ పడుతున్నామా? ఆనందాన్ని ఇంత, అంతా అని లెక్కించలేము. ఒక పెద్ద వ్యాపారవేత్తకి ఒకరోజు కోటి రూపాయలు సంపాదిస్తే వచ్చే ఆనందం, ఆ ఆఫీసు ప్రక్కనే ఉన్న టీస్టాల్ లో ఐదు రూపాయలు ఇచ్చి బయట స్టూలుపై కూర్చొని ఒక కాఫీత్రాగే వాడి ఆనందంతో సమానం అవ్వచ్చుకదా!

ఆనందం అనేది ఆత్మకు, మనస్సుకు, శరీరానికి సంతోషం ఇచ్చేదే అసలైన ఆనందం. ఎప్పుడైతే ఆత్మ, మనస్సు ఆనందమైన స్థితిలో ఉంటాయో అప్పుడు శరీరం కూడా ఆనందంగా ఉంటుంది. మనం ఎప్పుడూ మన చుట్టుప్రక్కల విషయాలన్నీ శాశ్వతం అని తలవకుండా వాటితో బంధం పెట్టుకోకుండా ఈర్ష్యా ద్వేషాలకు లోనవకుండా జీవిస్తే అప్పుడే మన ఆత్మ, మనస్సు, శరీరం ఆనందంగా ఉంటాయి. అదే స్థితప్రజ్ఞతగా పిలవబడుతుంది. ఎవరైతే నిత్య జీవితంలో మంచి పనులు చేస్తూ ఆ పుణ్యఫలం కూడా వారికి అంటకుండా జీవిస్తారో వారు నిశ్చలమైన మనస్సుతో ఎప్పుడూ ఆనందంగా ఉండగలుగుతారు.

అందరు అనుకునేటట్లు ఇది ఏమాత్రం కష్టం కాదు. గట్టిగా ప్రయత్నిస్తే ఎవరికైనా సాధ్యమవుతుంది. అయితే ఇలా ఉండడానికి ఎవరు ప్రయత్నించరు. ఒక విధంగా చెప్పాలంటే ప్రయత్నించడానికి ఇష్టపడరు కూడా! ఎందుకంటే చాలా మంది స్థితప్రజ్ఞత వలన తమకు ఉన్న ఆనందం కోల్పోతాము అని తలుస్తారు. కాని స్థితప్రజ్ఞత అంటే ఆనందం కోల్పోవడం కాదు అని వీరు గ్రహించరు. స్థితప్రజ్ఞత లోనే అసలైన శాశ్వత ఆనందం ఉందని గ్రహించరు. చిన్న చిన్న విషయాలను ఆనందంగా భ్రమించి పరిగెట్టడం మాని శాశ్వతానందం ఒకటి ఉందని అదే స్వచ్ఛమైనది, శాశ్వతమైనది అని అందరూ గ్రహించాలి.

ఈ సృష్టి ఆవిర్భావానికి కారణమైన దివ్యశక్తి వలననే గ్రహాలన్నీ తమతమ కక్ష్యల్లో కొన్ని కోట్ల సంవత్సరాలుగా ఏ మాత్రం గతి తప్పకుండా నిర్దిష్ట వేగంతో తిరుగుతున్నాయంటే ఆ దివ్యశక్తి ఎంతటి మహోన్నతమైనదో ఊహించుకోండి. ఎవరైతే ఎల్లప్పుడూ ఆ దివ్యశక్తిని మనస్సులో ఊహించుకొని ఆరాధిస్తారో వారికి అద్భుతమైన ఆనందం కలుగుతుంది. వారు ఏ పుణ్య కర్మలు చేసినా పూర్తిగా దైవార్పణంగా చేస్తారు. కర్మఫలం గురించి ఆలోచించరు. ఏ విషయ వాసనలు వారికి అంటవు. ఎప్పుడూ నిమిత్తమాత్రులుగా ఉంటూ తమ పని తాము చేస్తూ చిరునవ్వుతో ప్రతీ విషయాన్ని, ప్రతీ సంఘటనని సమానంగా తీసుకోగలుగుతారు.

అయితే అందరికి, కేవలం సామాన్య మానవులకే కాకుండా మేధావులకు సైతం, ఏ రూపం లేని ఆ దివ్యశక్తిని ఎంతో ఉన్నత స్థాయిలో ధ్యానించడం, ఆరాధించడం చాలా కష్టం కాబట్టి ఆ శక్తియే సమస్త దేవతాగణాన్ని సృష్టించింది. మనం సృష్టి కారకుడిగా ఆరాధించే బ్రహ్మదేవుడు, స్థితికారకుడైన శ్రీమన్నారాయణుల వారు, లయకారకుడైన శ్రీమహేశ్వరుడు అలాగే వీరి పత్నులైన త్రిశక్తులు, శ్రీసరస్వతీమాత, శ్రీమహాలక్ష్మి , శ్రీపార్వతీదేవి, శ్రీదత్తాత్రేయులవారు, శ్రీసుబ్రహ్మణ్య స్వాములవారు, శ్రీవిఘ్నేశ్వరుడు, ఇంద్రాది అష్టదిక్పాలకులు, ఆదిత్యాది దేవతలు ఇలా మనం చెప్పుకునే 33 కోట్ల దేవతలు ఆ మహాశక్తినుంచి ఉద్భవించినవే!.

కాని కొందరు పీఠాధిపతులు, ప్రవచన కారులు వారు ఏ దేవతనైతే కొలుస్తారో ఆ దైవమే ఈ సృష్టి మొత్తానికి కారణమని అంటారు. మిగతా దేవతలందరూ ఆ దేవత రూపాలే అంటారు. ఇలా ఒకొక్కరు తాము నమ్మిన దేవతే

ఈ సృష్టి మొత్తానికి కారణమైన దివ్యశక్తి అంటారు. కొంతమంది ఇంకా కొంచెం దూరం వెళ్ళి మిగిలిన దేవతలను పూజించరు కూడా! ఇవి మనుషుల మధ్య లేనిపోని వైషమ్యాలకు దారి తీస్తాయి. సమాజంలో ఎందరో కంటే ఉన్నత స్థానంలో ఉండే పీఠాధిపతులు, ప్రవచన కారులు ప్రజలు వారు ఏ దేవతను కొలుస్తున్న, అందరి దేవతలు ఒకరేనని చెప్పి సామాన్య ప్రజల మధ్య వైషమ్యం లేకుండా చూడాలి. ఈ సృష్టి మొత్తానికి ఆధారభూతమైన శక్తి ఏ రూపం లేనిదని అందరికి తెలిసిన విషయమే కదా!.

బ్రిటన్‌లో 1700 వ సం॥ కాలంలో ఒక ప్రఖ్యాత డాక్టరు ఉండేవాడు. అతడు వైద్య రంగంలో విశేషమైన సేవ చేసాడు. ఎంతో మానవత్వం కలిగి ప్రజలకు మెరుగైన వైద్య పద్ధతులు కనిపెట్టాలని ఎంతో తాపత్రయ పడేవాడు. అతనికి ఎన్నో అవార్డులు కూడా వచ్చాయి. ముఖ్యంగా అతను మొట్ట మొదటి కంటి ఆపరేషన్ చేశాడు. అదికూడా ఒక చిన్న పిల్లవాడికి చేశాడు. ఒకరోజు నేను ధ్యానంలో ఉండగా ఈ విషయాలన్నీ నాకు స్ఫురించాయి. ఆశ్చర్యం ఏమిటంటే ఆ డాక్టరే తరువాత జన్మలో అమెరికాలో పుట్టాడు. ఈ జన్మలో అతడు గొప్ప ఇంజనీర్ గా పేరు తెచ్చుకున్నాడు. ముందు ముందు ఉత్తమ జన్మలలో జన్మించి కొంతకాలానికి జన్మరాహిత్యం పొందుతాడు.

అటు తరువాత జన్మలో అతడు భారతదేశంలో పుట్టాడు. ఈ జన్మలో మళ్ళీ డాక్టరు డిగ్రీ చదివి మంచి డాక్టర్ గా పేరు ప్రసిద్ధిపొందాడు. అతని ఆత్మ ఎప్పుడూ ప్రజలకు సేవ చేయాలి అనే దృక్పథంలోనే ఉండేది. ఈ జన్మలో అతడు లక్ష్మీనారాయణ మిశ్రా అనే పేరుతో పుట్టాడు. కేవలం అర్థరూపాయి మాత్రమే తీసుకొని వైద్యం చేసేవాడు. అతని హస్తవాసి ఎంతో గొప్పదిగా ప్రసిద్ధిపొందింది. అతనికి 60 సం॥లు దాటిన తరువాత ఆధ్యాత్మిక విషయాల వైపు మనసు మళ్ళి కొన్ని సంవత్సరాల తరువాత అతను హిమాలయాశ్రమానికి వచ్చి నన్ను కలిసాడు.

ఆ తరువాత జన్మలో అతను మైసూరు రాష్ట్రంలో జన్మించాడు. ఈ జన్మలో అతను ఒక సాధారణ కుటుంబంలో జన్మించి చాలా కష్టపడి ఇంజనీరింగ్‌లో డిప్లమా చదివాడు. అటు తరువాత చిన్న ఉద్యోగంలో చేరి ఉద్యోగం చేసుకుంటూ ఇంకా పై చదువులు చదివి చివరికి ఒక ఇంజనీరింగ్ కంపెనీలో ఉన్నత అధికారి స్థాయికి చేరుకున్నాడు. ఇంకో విశేషమేమంటే ఒక జన్మలో అతను నాకు తండ్రి కూడా! ఎన్నో

జన్మలలో ఉత్తమ సంస్కారంతో జీవించిన అతడే ఈ జన్మలో నా కుమారుడు ఆదిత్య అనే పేరుతో జన్మించాడు. అప్పటి హిమాలయపు బంధం ఈ విధంగా ఈ జన్మలో మమ్మల్ని మళ్ళీ కలిపింది. ఈ జన్మలో ఇంజనీరింగ్ లో విస్తృత పరిశోధనలు చేస్తాడు. సమాజానికి మేలు కలిగించే పనులు చేస్తాడు. ఎంతో పేరు తెచ్చుకుంటాడు.

ఈ భూమండలం పై అక్కడక్కడ చాలా శక్తివంతమైన ప్రదేశాలు ఉన్నాయి. కొన్ని వేల సంవత్సరాల క్రితం దేవతలు, సిద్ధులు, యోగులు, మహాపురుషులు సంచరించిన ఈ ప్రదేశాలలో ఇప్పటికి ఎంతో శక్తి నిగూఢంగా నిక్షిప్తమై ఉంది. ఇటువంటి ప్రదేశాలలో నిర్మించిన ఆలయాలు ఎంతో శక్తివంతమౌతాయి. అవి నిర్మించినప్పుడు వారికి ఆ స్థలం శక్తి తెలియకపోయిన, అక్కడ కట్టబడిన దేవాలయం అతి త్వరలోనే గొప్ప పుణ్యక్షేత్రంగా ప్రసిద్ధి పొందుతుంది. దీనికి కారణం అక్కడ కొన్ని వేల సంవత్సరాల క్రితం ఎవరో మహాభక్తుడు తపస్సు చేసాడన్నమాట. కాలక్రమేణ ఇటువంటి ప్రదేశాలు మహా నగరాలలో కలిసిపోయాయి. అందువలన ఇప్పటి ఆధునిక నగరాలలో కూడా ఒకొక్కచోట ఇప్పుడు కట్టిన ఆలయాలు ఎంతో ప్రసిద్ధి చెందడం మనం గమనిస్తుంటాం.

భూమిపై అలా ఎంతో శక్తి ఉన్న ప్రదేశాలలో ఏమైనా కర్మాగారాలు నిర్మించిన, వ్యాపారాలు చేసినా ఎంతో వృద్ధి చెందుతాయి. ఆ స్థలానికి అంత శక్తి ఉన్నదని అక్కడి వారికి తెలియకపోవచ్చు. అక్కడ స్థలం తక్కువ ధరకి దొరకడం వలనో లేదా మరి ఏ ఇతర కారణాల వలనో వారు అక్కడ వారి ఆఫీసులు నెలకొల్పడం జరుగుతుంది. ఆ విధంగా వారికి తెలియకుండా, వారి ప్రయత్నం లేకుండా ఆ ప్రదేశం పురాతన కాలంలో ఒక గొప్ప మహర్షి తపస్సు చేసుకున్న స్థలం కాబట్టి ఇప్పటికి ఆ శక్తి అలా ఉండి అక్కడ ఏ వ్యాపారం చేసినా ఎంతో అద్భుతంగా లాభాలార్జించడం చూస్తుంటాము. చాలామంది అనే స్థల మహిమకు అర్థం ఇదే. ఇంతటి శక్తి గల ప్రదేశాలు ప్రపంచమంతటా అన్ని దేశాలలోను ఉన్నాయి.

ఈ రోజున ప్రపంచ ప్రసిద్ధి చెందిన కొన్ని బహుళజాతి సంస్థలు నెలకొల్పబడిన ప్రదేశాలు అటువంటివే! అలాగే ఇప్పుడు ప్రపంచంలో ఎంతో ప్రఖ్యాతి గడించిన అమెరికాలోని హార్వర్డ్ యూనివర్సిటీ, స్టాంఫర్డ్ యూనివర్సిటీతో పాటు మరొకొన్ని ప్రముఖ విద్యాసంస్థలు ఉన్న ప్రదేశాలలో కొన్ని వేల సంవత్సరాల క్రితం కొందరు మహర్షులు తపస్సు చేశారు. అందుకే ఈ విశ్వ విద్యాలయాలు

ప్రపంచ వ్యాప్తంగా ఇంతగా ప్రసిద్ధి పొందాయి. అంతే కాక ఇక్కడ చదివే విద్యార్థులకు అక్కడ ఉన్న దివ్యతరంగాల వలన గొప్ప మేధస్సు కలుగుతుంది. ఇక్కడ అధ్యాపకులచేత, విద్యార్థుల చేత గొప్ప ఆవిష్కరణలు జరుపబడతాయి.

క్రిందటి సంవత్సరం నేను అమెరికాలోని హార్వర్డ్ యూనిర్సిటీ వెళ్ళినప్పుడు, అక్కడకు దాదాపు 50 కిలోమీటర్ల దూరంలోకి రాగానే ఆ ప్రదేశంలో గొప్ప శక్తి గల తరంగాలు ఉన్నట్లు నాకు తెలిసింది. మేము కారులో ఆ నగరానికి వస్తూంటే ఆ నగరం దగ్గర అవుతున్న కొద్దీ ఆ ప్రదేశమంతా అద్భుతమైన కాస్మిక్ తరంగాలతో నిండి ఉండడం గమనించాను. ఆ నగరానికి దాదాపు 70 చదరపు మైళ్ళ స్థలమంతా ఎంతో దివ్యశక్తితో నిండి ఉంది. అక్కడ ఒకప్పుడు ఎంతో శక్తివంతమైన మహర్షులు తపస్సు చేశారు. సాధకులకు ఇప్పటికీ ఆ దివ్యతరంగాలు అనుభవానికి వస్తాయి.

అలాగే అమెరికాలోని మరొక ప్రతిష్ఠాకరమైన స్టాంఫర్డ్ విశ్వవిద్యాలయానికి వెళ్ళినప్పుడు కూడా ఇదే విషయాన్ని గమనించాను. అసలు ఆ కాలిఫోర్నియా రాష్ట్రంలో చాలా ప్రదేశాలు ఎంతో శక్తివంతమైనవి. పూర్వకాలంలో ఎందరో మహర్షులు తపస్సు చేసుకున్న ప్రదేశాలు అక్కడ ఎన్నో ఉన్నాయి. అందుకే అక్కడ చాలాచోట్ల ప్రకృతి ఎంతో అద్భుతంగా ఉండడం గమనించాను. మేము అలా ఒకసారి కాలిఫోర్నియా నగరంలో ఒక అడవి ప్రాంతంలోనికి వెళ్ళినప్పుడు అక్కడ కొందరు మహర్షులు ఇప్పటికి అతి పురాతనమైన అతి పొడవైన చెట్ల రూపంలో తపస్సు చేసుకొనడం గమనించాను.

అంటే ఇవన్నీ వీరికి ఎంతో పెద్ద చెట్లలాగ కనిపిస్తున్నప్పటికి వేల సంవత్సరాలుగా తపస్సు చేస్తున్న మహర్షులే! త్రేతాయుగం నుంచి తపస్సు చేస్తున్న మహర్షులు కూడా ఇప్పటికి ఉన్నారు. అందుకే ఆ రాష్ట్రమంతా దివ్యతరంగాలతో నిండి ఉంటుంది.

అందుకే అక్కడ పనిచేస్తున్న ఇంజనీర్లకు, శాస్త్రజ్ఞులకు వారి మెదడులలో ఎన్నో అద్భుత ఆలోచనలు వచ్చి గొప్ప ఆవిష్కరణలకు దారి తీస్తాయి. ఇటువంటి శక్తి కలిగిన ప్రదేశాలు అమెరికాలో చాలా చోట్ల ఉండడం గమనించాను. అందుకే అమెరికా ప్రపంచంలో అత్యంత సంపన్న దేశాలలో ఒకటిగా రూపుదిద్దుకుంది. అమెరికాలో వెళ్ళినప్పుడు నేను డల్లాస్ పట్టణంలో ఒక హనుమంతుల వారి

ఆలయంలో దర్శించడం జరిగింది. ఆ ఆలయం ఈ మధ్యనే నిర్మించినప్పటికి అతి తక్కువ కాలంలోనే ఎంతో ప్రసిద్ధి పొందింది. ఆ ఆలయం దర్శించినప్పుడు నాకు ఎన్నో దివ్యానుభూతులు కలిగాయి. ఒకప్పుడు ఈ ప్రాంతంలో పెద్ద యజ్ఞం జరిగింది. ఆ యజ్ఞానికి ఎందరో దేవతలు వచ్చారు. ఎందరో మహర్షులు నిర్వహించిన ఈ యజ్ఞం ఎంతో విశిష్టమైనది. వేల సంవత్సరాల క్రితం జరిగిన ఆ యజ్ఞం యొక్క దివ్య తరంగాలు ఆ ప్రదేశమంతా ఇప్పటికి వ్యాపించి ఉన్నాయి. అంతే కాదు సాక్షాత్తు శ్రీహనుమంతులవారే ఇప్పటికి ఈ ఆలయానికి అపరిచిత భక్తుడి రూపంలోను, సూక్ష్మరూపంలోను దర్శిస్తున్నారు. అందుకనే ఈ ఆలయాన్ని దర్శిస్తున్న భక్తులకు ఎన్నో దివ్య అనుభూతులు కలుగుతున్నాయి.

మళ్ళీ హిమాలయాశ్రమ విషయాలకు వద్దాం. 1700 సం॥ సమీపంలో గుంటూరు జిల్లాలో ఒక గ్రామంలో ఒక గొప్ప అవధూత ఉండేవాడు. అతడు ఏ ఊరునుంచి అక్కడికి వచ్చాడో కూడా ఎవరికి తెలియదు. అతను ఊరిబయట ఒక చెట్టుక్రిందనే ఉండేవాడు. అతను వద్ద ఒక గుడ్డ సంచి ఉండేది. ఆ సంచిలో ఒక ధోవతి తప్ప ఏదీ ఉండేది కాదు. అతని వద్దకు వచ్చే వారికి తత్త్వ బోధలు చేసేవాడు. ఎండాకాలమైనా, వానాకాలమైనా అతని నివాసం ఆ చెట్టుక్రిందనే. పగలు ఊరివారు వచ్చినా, రాత్రి మాత్రం ఎవరిని తన దగ్గర ఉండనిచ్చే వాడు కాదు. వారి ఇళ్ళకి వెళ్ళి పడుకోమని చెప్పేవాడు. అతడి చేతి స్పర్శ తగిలితేనే ఎంతటి అనారోగ్యమైనా తగ్గిపోయేది. అలా కొంతకాలం జీవించి ఎన్నో మహిమలు చూపించి చిరికి ఒకనాడు ఆ ఊరిలోనే సమాధి చెందాడు.

అతడే నాలుగు జన్మల తరువాత కాశీపట్టణంలో మహాపండితుడిగా జన్మించి కొంతకాలానికి హిమాలయాశ్రమంలో నన్ను కలుసుకున్నాడు. అటు తరువాత జన్మలో అతడు తమిళనాడులోని కన్యాకుమారి వద్ద జన్మించాడు. మహాపండితుడై ఎందరికో అద్వైత మార్గం ఉపదేశించాడు. ఆ తరువాత జన్మలో అతడు ఆంధ్రప్రదేశ్‌లోని అమలాపురంలోని కూచిమంచి వారి అగ్రహారంలో పేరయ్యశాస్త్రి అనే పేరుతో గొప్ప పండితుడిగా జన్మించాడు. గొప్ప ఘనాపాటిగా పేరు ప్రఖ్యాతలు గడించాడు. ప్రస్తుత జన్మలో తిరిగి ఆంధ్రప్రదేశ్‌లోనే మోహన్ అనేపేరుతో జన్మించారు. మళ్ళీ ఇన్ని జన్మల తరువాత కలవడంతో మా ఇద్దరి ఆత్మలు ఎంతో ఆనందపడ్డాయి. ఇతడు వచ్చే జన్మలో ఎంతో గొప్ప సంగీతకారుడు అవుతాడు. ఇతడికి ఇక ఎక్కువ జన్మలు లేవు. కొన్ని జన్మల తరువాత జన్మరాహిత్యం కలిగి ఆ దివ్యశక్తిని చేరుకుంటాడు.

హిమాలయాశ్రమంలో నాతో పాటు ఉన్న 108 మందిలో విశ్వనాథుడు అనే సాధువు కూడా ఉండేవాడు. అతడు ఎప్పుడూ ప్రశాంతంగా అందరిని నవ్వుతూ పలకరిస్తూండేవాడు. అతడికి అన్ని వేదశాస్త్రాల సారము తెలిసినప్పటికి ఏ మాత్రం అహంకారం లేకుండా ఉండేవాడు. అంతకు ముందు ఎన్నో ఉత్తమజన్మల తరువాత ఈ జన్మలో హిమాలయాలకు చేరుకున్నాడు. అయితే పూర్వజన్మలలో చేసిన కొన్ని చిన్న పాపకార్యాల ఫలంగా అటు తరువాత జన్మలో అమెరికాలో ఒక క్రైస్తవ కుటుంబలో స్త్రీగా జన్మించాడు. ఆమెకు పుట్టినప్పటినుంచి తోటివారంటే ఎంతో ప్రేమ అభిమానం ఉండేవి. ఎవరికైనా ఏదైనా అనారోగ్యం కలిగితే ఎంతో చలించిపోయేది. వారికి ఎంతో సేవ చేసేది. ఒక హాస్పటల్‌లో నర్సుగా చేరింది.

ఇంతలో రెండవ ప్రపంచ యుద్ధం వచ్చింది. అప్పుడు ఆమె మిలటరీ నర్సుగా ఉద్యోగంలో చేరింది. ఆ నర్సు రెండవ ప్రపంచ యుద్ధంలో పాల్గొని ఫిలిప్పైన్ సమీపంలో యుద్ధంలో గాయపడిన సైనికులకు సేవ చేసే శిబిరంలో చేరింది. రోజు అక్కడకి వచ్చే సైనికులకు ఎంతో సేవ చేసేది. ఒకనాడు ఆ శిబిరం పై శత్రు విమానాలు బాంబుల వర్షం కురిపించాయి. దానివలన ఆ సైనికులలో కొందరు తిరిగి గాయపడ్డారు. ఆ శిబిరంలో ఉన్న వారందరికి అదొక భీకర రాత్రిగా మిగిలింది.

అదృష్టం కొద్దీ ఈ నర్సు ఒక మంచంక్రిందకు పరుగెత్తి ఆ బాంబు దాడిలో గాయాలు కాకుండా జాగ్రత్త పడింది. అటు తరువాత అక్కడ ఉన్న నర్సులందరిని ఆస్ట్రేలియా పంపడం జరిగింది. కొంతకాలం ఆస్ట్రేలియాలో నర్సుగానే సేవలు చేసి ఆ జన్మలో అక్కడే మరణించింది.

అటు తరువాత జన్మలో గుల్బర్గా సమీపంలో జన్మించి ఎన్నో మంచి పనులు చేసింది. ఈ జన్మలో ఈమె పేరు సక్కుబాయ్. ధనవంతుల కుటుంబలో జన్మించడం చేత ఒక పెద్ద అనాథశరణాలయాన్ని కూడా నెలకొల్పింది. ఎందరో అనాథలను చేర్చుకొని ఎంతో సేవ చేసింది. ఆ తరువాత అక్కడే ఒక వృద్ధ ఆశ్రమాన్ని కూడా నెలకొల్పింది. ఈ రెండు ఇప్పటికి అక్కడ ఉన్నాయి. ఈమె ప్రస్తుత జన్మలో అర్పిత అనే పేరుతో నా కుమార్తెగా జన్మించింది. అప్పటి హిమాలయాశ్రమపు బంధమే మమ్మల్ని తిరిగి కలిపింది.

ఈ జన్మలో కూడా ఎన్నో మంచి పనులు చేస్తుంది. వచ్చే జన్మలో కేరళ రాష్ట్రంలో జన్మిస్తుంది. ఒక పెద్ద డాక్టర్ గా ప్రసిద్ధి చెందుతుంది. కొన్ని వేల మందికి ఉచితంగా వైద్యసేవను అందిస్తుంది. అటు తరువాత జన్మలో అమెరికాలో జన్మిస్తుంది. ఒక ప్రముఖ యూనివర్సిటీలో ప్రొఫెసర్గా ఉద్యోగం చేస్తూ కొన్ని వేల మంది విద్యార్థులను తీర్చిదిద్దుతుంది. ముందు ముందు ఎన్నో ఉత్తమ జన్మలు కలుగుతాయి. అటు తరువాత అర్పిత జన్మరాహిత్యం కలిగి ఆ దివ్యశక్తిలో కలిసిపోతుంది.

అప్పటి హిమాలయపు ఆశ్రమంలో జగదీశ్వరుడు అనే మరొక సాధువు ఉండేవాడు. అతడు ఆ ఆశ్రమానికి తన 52 వ ఏట వచ్చాడు. అక్కడ 10 సం॥లు గడిపి తన 62 వ ఏట జన్మ చాలించాడు. ఆశ్రమంలో ఉన్నంత కాలం అందరితో చిరునవ్వుతో మాట్లాడుతూ ఎప్పుడూ వేదాంతపరమైన విషయాలను చర్చిస్తుండేవాడు. అతడు తరువాత జన్మలో అమెరికాలోని ఒక పట్టణంలో ఒక క్రైస్తవ కుటుంబంలో జన్మించి, ఒక ఫ్యాక్టరీలో కార్మికుడిగా ఉద్యోగం చేశాడు. ఎంతో కష్టపడి ఉద్యోగంలో మంచి ఉన్నతస్థానానికి ఎదిగాడు. గ్రీకు, హిందు, అమెరికన్, ఆఫ్రికన్ ఫిలాసఫీ పుస్తకాలు చదివేవాడు.

అటు తరువాత జన్మలో ఇతడు ఇండియాలోని ఆంధ్రప్రదేశ్లో విశాఖపట్నం దగ్గర ఒక చిన్న పల్లెటూరులో రామస్వామి అనే పేరుతో జన్మించాడు. ఈ జన్మలో అతను పెద్దగా చదువుకోక చిన్న చిన్న ఉద్యోగాలు చేస్తూ జీవితం సాగించాడు. అయితే పూర్వజన్మ వాసనల ఫలితంగా అతడెప్పుడు సాధువులు వెంట తిరుగుతుండేవాడు. ఆ ఊరికి ఎవరైనా పీఠాధిపతులు వస్తే వారితో పాటే ఉంటూ ఎన్నో దైవ సంబంధమైన విషయాల గురించి మాట్లాడేవాడు. ఆ విధంగా ఎంతో సత్ప్రవర్తనతో మంచి ఆలోచనలతో ఆ జన్మలో జీవించాడు. ప్రస్తుత జన్మలో అతడు తిరిగి ఆంధ్రప్రదేశ్లోనే రామకృష్ణ అనే పేరుతో జన్మించాడు. పెద్దగా చదువుకోకపోయినా ఎంతో ఉన్నత సంస్కారంతో మంచి ఆలోచనలతో జీవిస్తున్నాడు. పూర్వజన్మల పుణ్యఫలంగా అతను ప్రస్తుతం తిరుమల తిరుపతి దేవస్థానంలో చిన్న ఉద్యోగంలో చేరాడు.

నేను 20 సం॥లు గా దాదాపు ప్రతీ సంవత్సరం తిరుమల వెళ్ళి శ్రీవేంకటేశ్వర స్వామివారిని దర్శించుకుంటున్నాను. ఒకొక్క సంవత్సరం రెండుసార్లు

కూడా వెళ్ళడం జరిగింది. ఆ స్వామి వారి దయవలన ప్రతిసారీ మంచి దర్శనాలే లభిస్తున్నాయి. నేను వెళ్లినప్పుడల్లా తప్పకుండా మూడురోజులు కొండమీద ఉండడానికి ప్రయత్నిస్తాను. ఆ పవిత్ర కొండపై ఉండే అదృష్టం ఎన్నో జన్మల పుణ్యఫలం వలన గాని కలగదు.

ఆ రోజుల్లో రామకృష్ణ శ్రీవరాహస్వామి అతిథిగృహంలో పనిచేసేవాడు. ఒకరోజు రామకృష్ణని కొండమీద జె.ఇ.ఓ. ఆఫీస్‌లో గుమాస్తా సెలవు పెట్టడం వలన అక్కడ పనిచేయడానికి పంపించారు. అదేరోజు నేను తిరుమల రావడం జరిగింది. రాగానే నా వసతి, దర్శనం కోసం జె.ఇ.ఓ. ఆఫీస్‌కి వెళ్ళాను. నేను తరచు వెళ్ళుతుండడంతో అక్కడ ఉండే గుమాస్తా నన్ను గుర్తుపడుతుండేవాడు. కాని ఆ రోజు అతడు లేకుండా ఈ రామకృష్ణ ఉన్నాడు. సాధారణంగా నేను తిరుమల వెళ్ళినప్పుడు ఏ పెద్ద ఆఫీసర్‌ని కలవకుండా నా గురించి ఎవరికి వివరంగా చెప్పకుండా ఉన్న మూడు రోజులు శ్రీవేంకటేశ్వర స్వామివారి గురించే ఆలోచిస్తూ ఆ స్వామి అనుగ్రహించిన సేవలు గాని దర్శనాలు గాని చేసుకుంటూ ఉంటాను. ఆరోజు రామకృష్ణ నేను మామూలుగా నా లెటరు చూపించి వసతి, దర్శనం గురించి వివరాలు తీసుకున్నాను.

నేను వెనక్కి తిరిగి వచ్చేస్తుండగా రామకృష్ణ నన్ను మీరు ఏంచేస్తుంటారు సార్ అని అడిగాడు. అప్పుడు నేను లోగోలు డిజైన్ చేయడం, ఈ పుస్తకాలు వ్రాయడం గురించి చెప్పాను. రామకృష్ణ నాతో ఒకసారి మిమ్మల్ని కలవచ్చాసార్ అన్నాడు. నాకు ఆశ్చర్యం వేసింది. ఇదే మా ప్రథమ పరిచయం. ఇలా వచ్చి కలుస్తాను అన్నాడేమిటి అనుకున్నాను. సరే తప్పకుండా కలవచ్చు అని అన్నాను. ఆరోజు సాయంత్రం మేము ఉన్న కాటేజ్ కి రామకృష్ణ వచ్చి కలిసాడు. కుశల ప్రశ్నలు అయిన తరువాత అతని గురించి అతని కుటుంబం గురించి చెప్పాడు. ఆ కాసేపట్లో అతడు ఎంతో మంచివాడని అందరితో సఖ్యంగా మెలుగుతాడని నాకు అర్థమయ్యింది. నా ఫోన్ నెంబర్ తీసుకొని వెళ్ళిపోయాడు.

అటు తరువాత నుంచి ఇప్పటిదాకా వెళ్ళిన ప్రతీసారి మమ్మల్ని కలుస్తున్నాడు. తన కష్టసుఖాలన్నీ చెప్పుకుంటాడు. మా కుటుంబానికి రామకృష్ణ కుటుంబం ఎంత ఆప్తులయ్యారంటే మా అమ్మాయిల వివాహాలకి కూడా రామకృష్ణ హైదరాబాద్ వచ్చాడు. ఇప్పుడు మా కుటుంబానికి ఎంతో సన్నిహితులయ్యారు.

ఇదంతా ఆ జన్మలోని హిమాలయాశ్రమపు బంధమే. ఇదే తిరిగి మమ్మల్ని ఇలా కలిపింది. నేను ఆరోజు తిరుమల వెళ్ళినప్పుడు అక్కడ జె.ఇ.ఓ. ఆఫీస్‌లో ఉండాల్సిన గుమాస్తా ఆ రోజు సెలవు పెట్టకుండా ఉండుంటే ఆ ముందురోజో, ఆ తరువాతి రోజో సెలవు పెట్టినా ఈ రామకృష్ణ నన్ను కలిసేవాడు కాదు. ఒకవేళ నేను అటు తరువాత ఒక నాలుగు రోజులకు వెళ్ళినా ఈ రామకృష్ణ నన్ను కలవడం జరిగేది కాదు.

అతను అలా సెలవు పెట్టడం, అదే రోజు కొండమీద కొన్ని వందలమంది ఉద్యోగులు ఉన్నా ఈ రామకృష్ణనే ఆరోజు తాత్కాలికంగా అక్కడ విధుల్లోకి రావడం, అది కూడా కేవలం ఒకే రోజు కావడం, ఆరోజే నేను తిరుమల రావడం జరిగాయి. రామకృష్ణ నన్ను తిరిగి ఈ జన్మలో కలవాల్సిన సమయం వచ్చింది కాబట్టే అన్ని పరిస్థితులు ఆ విధంగా ఒనగూరాయి. రామకృష్ణ ఎంతో భక్తిపరుడు. తన విధులు అయిపోయిన తరువాత రోజు ఆలయంలోనికి వెళ్ళి భక్తులకు ఎంతో సేవ చేస్తాడు. ఇతనికి ఇద్దరు కుమారులు. వీరిద్దరు ముందు ముందు ఎంతో వృద్ధిలోకి వస్తారు. రామకృష్ణకు ముందు ముందు ఎంతో ఉత్తమ జన్మలు లభిస్తాయి. కొద్ది జన్మలలోనే ఆ దివ్యశక్తిలో కలిసిపోతాడు.

ఈ పూర్వజన్మ వాసనల ఫలితాలు చాలా విచిత్రంగా ఉంటాయి. ఒకసారి నాకు తెలిసిన మిత్రుడు ఒకరు తీవ్రమైన డిప్రెషన్ కు గురయ్యాడు. అతని వయస్సు సుమారు 40 సం॥లు ఉంటాయి. ఎంత మంది డాక్టర్లను కలిసినా ఇతనికి ఏమాత్రం ఉపశమనం కలుగలేదు. ఎన్నో పూజలు చేశాడు. అతని బంధువులు అతడిని ఎన్నో పుణ్యక్షేత్రాలకి కూడా తీసుకువెళ్ళారు. కాని అతనిలో పెద్ద మార్పు ఏమీ రాలేదు. ఎప్పుడూ చాలా దిగాలుగా ఏదో బాధతో ఉండేవాడు. డాక్టర్లకి కూడా ఏమీ అర్థం కాలేదు. అతను కూడా తన మనస్సు ఇలా ఎందుకు ఉంటుందని ఫలానా కారణమని ఇదమిద్ధంగా చెప్పలేకపోయేవాడు. కాని ఎప్పుడూ దిగాలుగా ఉండేవాడు.

రోజులు ఇలా జరుగుతుండగా ఒకరోజు వాళ్ళ బంధువులొకరు నా వద్దకు వచ్చి ఇతనికి అసలు తగ్గుతుందా లేదా జీవించినంతకాలం ఇలా బాధపడాల్సిందేనా అని ఎంతో బాధపడుతూ అడిగాడు. నేనప్పుడు కాసేపు ఆలోచించి వారితో ఒక విషయం చెప్పాను. రెండు నెలల్లో అతడికి తగ్గడం మొదలు పెడుతుందని, నాలుగైదు నెలలకు పూర్తిగా తగ్గిపోతుందని అన్నాను. ఆరోనెలకల్లా మీ వాడు చాలా

హుషారుగా అవుతాడు అన్నాను. దానికి వాళ్లు ఎంతో ఆశ్చర్యపోయి ఇన్ని మందులు వాడినా తగ్గని వ్యాధి రెండునెలల్లో ఎలా తగ్గుతుంది అని అన్నాడు. లేదు తప్పకుండా తగ్గుతుంది. మీరే వచ్చి నాతో చెప్తారు చూడండి అన్నాను. వాళ్ళు ఎంతో సంతోషపడి వెళ్లిపోయారు.

మా స్నేహితుడు సఫీల్‌గూడ ప్రాంతంలో ఉండేవాడు. రెండు నెలలు తరువాత వాళ్ళ ప్రక్క అపార్ట్‌మెంటులో ఉండే కుటుంబం వేరే ఊరికి ట్రాన్స్‌ఫర్ అయ్యి అపార్ట్‌మెంటు ఖాళీ చేసి వెళ్ళిపోయారు. దాంట్లో వేరే క్రొత్త కుటుంబం వచ్చి అద్దెకు చేరింది. భార్య, భర్త, ఇద్దరు చిన్న పిల్లలు. వాళ్ళ చిన్నబ్బాయి కిషోర్ ఎప్పుడూ మా స్నేహితుడి ఇంటిలోకి వచ్చి ఇక్కడే ఆడుతుండేవాడు. మా స్నేహితుడి దగ్గరకు వచ్చి ఎప్పుడూ ఏదో మాట్లాడించేవాడు. ఇతను డిప్రెషన్‌తో కిషోర్‌కి పెద్దగా సమాధానం చెప్పేవాడు కాదు. అయినా కిషోర్ ఇతన్ని వదిలిపెట్టేవాడు కాదు. ప్రతిరోజు వచ్చి ఏదో చిన్న చిన్న కబుర్లు చెప్తూ వెళుతుండేవాడు.

ఇలా కొన్ని రోజులు గడిచిన తరువాత కిషోర్‌లో నెమ్మదిగా మార్పురావడం మొదలైంది. మనిషి కొంచెం హుషారుగా తయారవుతున్నాడు. రెండు నెలల్లో అతడి డిప్రెషన్ చాలామటుకు తగ్గిపోయింది. శ్యామ్ పూర్తిగా ఆరోగ్యవంతుడై మునుపటి చలాకీతనం పూర్తిగా వచ్చేసింది. వాళ్ల కుటుంబం, బంధువులందరూ ఎంతో సంతోషపడ్డారు. నాకు దగ్గరకు వచ్చి ఎంతో ఆనందంగా తమ కృతజ్ఞతలు తెలిపారు.

ఇంతకీ ఇన్నేళ్ళుగా ఏ మందులకు లొంగని మా స్నేహితుడు శ్యామ్ డిప్రెషన్ ఇలా రెండు నెలల్లో ఒక్కసారిగా ఎలా తగ్గిందో తెలుసా? నాలుగు జన్మల క్రితం శ్యామ్ ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఒక వ్యాపారుల కుటుంబంలో ఘన్‌శ్యామ్ అనే పేరుతో జన్మించాడు. అది చాలా చిన్న ఊరు అతడికి నాలుగు ఎకరాల భూమి ఉండేది. అతనికి వివాహం జరిగిన 12 సం॥లకు రాధేశ్యామ్ అనే కొడుకు పుట్టాడు. తల్లి దండ్రులు అతడిని ఎంతో అపురూపంగా చూసుకునేవారు. తండ్రి ఘన్‌శ్యామ్‌కు కొడుకంటే పంచ ప్రాణాలు.

రోజలు ఇలా గడుస్తుండగా ఒకరోజు రోడ్డుమీద ఆడుకుంటున్న రాధేశ్యామ్ ఒక యాక్సిడెంట్‌లో మరణించాడు. ఉన్నట్లుండి జరిగిన ఈ సంఘటనకు తల్లిదండ్రులు ఎంతో షాక్ అయ్యారు. లేక లేక కలిగిన తమ కుమారుడు ఇలా

అర్థాంతరంగా మరణించడంతో వారెంతో బాధపడ్డారు. ఈ సంఘటన ఘన్‌శ్యామ్ పై చాలా తీవ్రమైన ప్రభావ చూపింది. ఎంత ప్రభావం అంటే కొడుకు మరణించిన బాధ తట్టుకోలేక నెలరోజులకే ఘన్‌శ్యామ్ కూడా కాలంచేశాడు.

ఆ ఘన్‌శ్యామే ఈ జన్మలో మా స్నేహితుడు శ్యామ్‌సుందర్ గా జన్మించాడు. అప్పుడు జరిగిన ఆ దుర్ఘటన అతని ఆత్మను గట్టిగా పట్టుకొని ఈ జన్మలో తనకే కారణం తెలియకుండా ఎప్పుడూ బాధపడుతూ ఉంటూ డిప్రెషన్‌లోకి వెళ్ళాడు. పూర్వజన్మలో ఇతడి కొడుకైన రాధేశ్యామ్ ఈ జన్మలో వేరొక కుటుంబంలో పుట్టాడు. అతడే ఈమధ్య వీరి ప్రక్క అపార్ట్‌మెంటులో వచ్చిన కుటుంబంలోని కిషోర్! అప్పటి రాధేశ్యామే ఇలా కిషోర్ రూపంలో రాగానే మా స్నేహితుడిలో ఎంతో మార్పు వచ్చింది. ఇతని ఆత్మ ఎంతో సంతోషపడింది. పూర్వజన్మలోని తన కుమారుడు దగ్గరకు వచ్చాడని గ్రహించి ఎంతో ఆనందపడ్డాడు.

శ్యామ్ తనకు తెలియకుండానే కిషోర్‌ను కలిసిప్పటినుంచి ఎంతో హుషారుగా అయ్యి డిప్రెషన్ నుంచి బయటపడ్డాడు. ఈ విషయం తెలిసే నేను రెండు నెలల క్రితం వారి బంధువులకి శ్యామ్‌సుందర్ కి రెండు నెలల్లో పూర్తిగా తగ్గిపోతుందని చెప్పాను. కాని ఇదంతా వివరంగా వారికి చెప్పలేదు. శ్యామ్‌సుందర్ ఈరోజు ఎంతో సంతోషంగా ఉన్నాడు. ఇంతకంటే మనకి ఇంకేంకావాలి?.

ఒకొక్కసారి మనం ఇలా కొంత మంది విషయాలలో ఇలా ఏ మందుకు పనిచేయని రోగం ఒక్కసారిగా తగ్గుముఖం పట్టడం చూస్తుంటాము కదా! దానికి ఇలాంటి కారణాలే లేదా పూర్వజన్మలకు సంబంధించిన ఏదో ముఖ్యమైన సంఘటన కారణమై ఉంటుంది. పూర్వజన్మల బంధాలు ఇంత విశేషంగా ఉంటాయి. ఇవి అర్థం చేసుకోవడం చాలా కష్టం. అర్థం చేసుకుంటే ఎంతో ఆశ్చర్యకరంగా ఉంటుంది. అంతే కాక కొన్ని సార్లు మన నిత్య జీవితంలో వచ్చే సమస్యలకు కారణం కూడా తెలిసి మనం కొన్ని బాధలనుంచి బయటపడి ఆనందంగా ఉండగలుగుతాం కూడా!.

నేను హిమాలయాశ్రమంలో ఉన్నప్పుడు నన్ను కలిసిన వ్యక్తులలో ఒకరు ఆంధ్రప్రదేశ్‌లోని ఒక గ్రామంలో వేంకటశాస్త్రి అనే పేరుతో జన్మించాడు. వేంకటశాస్త్రికి భగవంతుడంటే ఎంతో భక్తి, నమ్మకం. అలాగని అతడు ఏ పూజలు చేసేవాడు కాదు. కేవలం ఎప్పుడూ భగవన్నామస్మరణలో ఉండేవాడు. అతడికి లక్ష్మమ్మతో వివాహం అయింది. వారికి కృష్ణ శాస్త్రి అనే కుమారుడు జన్మించాడు.

కుమారునికి ఎనిమిదో ఏడు రాగానే ఆ దంపతులు ఉపనయనం చేశారు. కృష్ణశాస్త్రి ఎప్పుడూ ఏదో ఆలోచిస్తూండేవాడు. వేంకటశాస్త్రి భార్య లక్ష్మమ్మ కుమారుడి పదకొండో ఏట అనారోగ్యంతో మరణించింది. తండ్రి వేంకటశాస్త్రి కొంతకాలానికి ఇల్లు వదలిపెట్టి ఎక్కడో దూరంగా వెళ్ళిపోయి భక్తి తత్వం ప్రచారం చేయసాగాడు. కొంతకాలానికి పూర్తి అవధూతగా మారాడు. చుట్టుప్రక్కల ఏ విషయం అతనికి పట్టేవి కావు.

వేంకటశాస్త్రి ఊరు విడిచి వెళ్ళిపోయిన తరువాత కుమారుడు కృష్ణశాస్త్రి పూర్తి వైరాగ్య బాటలో పడ్డాడు. తల్లిదండ్రులిద్దరు చిన్ననాడే దూరం కావడంతో అతనికి పూర్తి వైరాగ్యం వచ్చి ఎప్పుడూ వేదాంత ధోరణిలో మాట్లాడుతుండేవాడు. ప్రతీరోజు ధ్యానంలో ఉండిపోయేవాడు. ఒకొక్కసారి పది రోజుల వరకు ధ్యానంలోనుంచి బయటకు వచ్చేవాడు కాదు. కొంత కాలానికి గొప్ప మహిమలు ఉన్న అవధూతగా గుర్తింపబడ్డాడు. వేంకటశాస్త్రి, ఇతని భార్య లక్ష్మమ్మ, కుమారుడు కృష్ణశాస్త్రి ముగ్గురు అంతకు ముందు జన్మలో వేరు వేరు కుటుంబంలో జన్మించి నా దగ్గరకు వచ్చి ఆ హిమాలయాశ్రమంలో కలుసుకున్నారు. వేంకటశాస్త్రి అలా నన్ను కలిసిన తరువాత జన్మలో కాశీపట్టణంలో మహాపండితుడిగా జన్మించాడు. వేద శాస్త్రంలో ఎంతో జ్ఞానం సంపాదించాడు.

ఇలాగే ప్రస్తుత జన్మలో కృష్ణశాస్త్రి క్రిందటి జన్మలో మధుర సమీపంలో జన్మించి ఒక పెద్ద గురుకులాన్ని నెలకొల్పాడు. ప్రస్తుత జన్మలో కృష్ణశాస్త్రి అప్పటి వేంకటశాస్త్రికే మళ్ళీ కుమారుడిగా జన్మించాడు. ఈ జన్మలో వేంకటశాస్త్రికి ఆయుష్షు ఎక్కువ లేదు. వేంకటశాస్త్రి ఈ జన్మలో ఎంతో గొప్ప విద్యాపారంగతుడయ్యాడు. ఎంతో ఉత్తమ సంస్కారంతో బ్రతికి  చిన్న వయస్సులోనే కాలం చేశాడు. అతని కుమారుడు కృష్ణశాస్త్రి కొంతకాలం మామూలు ఉద్యోగం చేసినప్పటికి అనుకోకుండా సినీప్రపంచంలోకి వచ్చి ఒక గొప్ప పాటల రచయితగా పేరు సంపాదించాడు. మూడు జన్మల క్రిందటి ఇతడి భార్య లక్ష్మమ్మ ఈ జన్మలో అతడి సోదరునిగా జన్మించింది.

జన్మ జన్మల బంధం కారణంగా ఈ అన్నదమ్ములిద్దరూ ఎంతో అన్యోన్యంగా ఉంటారు. వీరుద్దరు నాకు ఈ జన్మలో తిరిగి కలిసే సమయం రాగానే ఒక స్నేహితుడి ద్వారా పరిచయం అయ్యారు. అప్పటి హిమాలయాశ్రమపు బంధం

కారణంగా వీరిద్దరూ నాకెంతో ఆప్తులయ్యారు. మేము ముగ్గురం ఈ జన్మలో తిరిగి ఈ విధంగా కలుసుకోవడం జరిగింది. ఈ అన్నదమ్ములిద్దరికి ఇక ఎక్కువ జన్మల లేవు. కొన్ని జన్మలలోనే జన్మరాహిత్యం కలిగి ఆ దివ్యశక్తిలో ఏకమౌతారు.

మహాభారతకాలంలో ఉన్న ఒక రాజుకి విపరీతమైన రాజ్యకాంక్ష ఉండేది. అతడు రాజుగా ఉన్న కాలంలో తన పదవి నిలబెట్టుకోవడం కోసం ఎన్నో యజ్ఞాలు, యాగాలు చేశాడు. అటుతరువాత జన్మలలో సామాన్య జీవితం గడిపాడు. అయితే అప్పటి జన్మలో చేసిన యజ్ఞ యాగాల ఫలంతో కొన్ని వందల జన్మల తరువాత ప్రస్తుత జన్మలో ఒక పెద్ద పదవిలో ఉన్నాడు. అతడు రాజుగా ఉన్నప్పుడు ఎంతో మంది అమాయకులను ఎన్నో విధాలా హింసించాడు. వారందరూ కూడా తరువాత అనేక జన్మలెత్తి ప్రస్తుత జన్మలో అతని పరిచయస్తులు లాగానే జన్మించారు.

ఇన్ని జన్మలైనా ఆ జన్మలో వీరిని హింసించడం అతని ఆత్మకు తెలియడం వలన ప్రశ్చాత్తాపంతో ఎంతో కుమిలిపోయింది. వారికి ఎప్పటికైనా ఏదైనా సహాయం చేయాలని ఆత్మకి గట్టిగా ఉండేది. ఈ జన్మలో వీరికి కొన్ని ఉన్నత పదవులు ఇచ్చాడు. అతడు తమకు ఎందుకు ఇంత మంచి పదవి ఇచ్చాడా అని వీరిలో కొందరు ఆశ్చర్యపోతున్నారు కూడా. అతనికి కూడా ఈ కారణం తెలియకుండానే వీరందరిని తన దగ్గరకు తీసుకొని ఎంతో ఆప్యాయంగా చూస్తాడు. వీరందరి మధ్య ఉన్న పూర్వజన్మ బంధం వలన ఈ విధంగా వీరందరు తిరిగి కలవడం జరిగింది.

నేను హిమాలయాశ్రమంలో ఉన్నప్పుడు నాతో పాటు ఉన్నవారిలో రామశర్మ ఒకరు. వీరు కూడా అనేక జన్మలెత్తి క్రిందటి జన్మలో అనంతపురం సమీపంలోని పల్లెటూరులో ఒక అర్చక కుటుంబంలో జన్మించారు. స్థానిక శ్రీవేణుగోపాల స్వామి వారి ఆలయంలో అర్చకత్వం నిర్వహించారు. ఒకనాడు తీవ్రమైన గాలివాన రాగా ఆ ఆలయం మీద పిడుగు పడి ప్రహరీగోడ పూర్తిగా విరిగిపోయింది. ధ్వజస్తంభం కూడా ఒక ప్రక్కకు ఒరిగిపోయింది. అదే సమయంలో ఆలయ ఆవరణలో ఉన్న రామశర్మకు ఒక చేతికి ప్రక్కన బాగా కాలింది. జరిగిన దానికి రామశర్మ ఎంతో బాధపడ్డాడు. గ్రామస్థుల సహాయంతో ఆలయ ధ్వజస్థంబం పునఃప్రతిష్టించి, క్రొత్త ప్రహరీగోడను నిర్మించారు. వీరు ఈ జన్మలో శ్రీరామచంద్రమూర్తి అనే పేరుతో మళ్ళీ రాయలసీమ ప్రాంతంలోనే జన్మించారు. వీరు ఎంతో మృదు స్వభావులు.

ఒకసారి 2001 వ సం॥లో మా ఇంటికి ఎవరో స్నేహితులతో వచ్చారు. అప్పుడు ఒక ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తుండేవాడు. వీరు ఎన్విరాల్‌మెంటల్ ఇంజనీరింగ్ చదివారు. మాటల మధ్యన నేను వారితో మూర్తిగారు మీరు త్వరలో మీ సొంత కన్సల్టెన్సీ సంస్థను పెట్టుకుంటారండి అన్నాను. అందుకు వారు అమ్మో నాకంత ధైర్యం లేదండి అన్నాడు... నిజంగా అలాగే పెట్టుకుంటే మీ దగ్గరే లోగో తీసుకుంటానన్నారు.

అలా నేను అన్నట్లు గానే తరువాత రెండు సంవత్సరాలకే ఆయన సొంతంగా కన్సల్టెన్సీ పెట్టుకోవడం జరిగింది. దానికి నేనే లోగో డిజైన్ చేశాను కూడా! అప్పటి నుంచి మూర్తిగారు మా కుటుంబానికి ఎంతో ఆప్తులయ్యారు. నా పుస్తక ప్రచురణలో ఎంతో సహాయం చేస్తున్నారు. ఇలా ఉండగా ఇద్దరం కొన్ని సంవత్సరాలు మళ్ళీ విడిపోయాం. మేము తరువాత ఇళ్ళు మారడం వలన నాకు అప్పటికి మొబైల్ ఫోన్ లేకపోవడం వలన వారు నన్ను కలుసుకోలేకపోయారు.

వీరు కూడా ఆ రోజు నాతో హిమాలయాశ్రమంలో ఉన్నవారే. మా ఇద్దరిది ఎంతో గాఢమైన బంధం. 2007వ సం॥లో ఒకనాడు సాయంత్రం ఆఫీస్‌లో పెద్దగా పనిలేక ఉదయం చదివిన హిందూ పేపర్ మళ్ళీ ఒకొక్క పేజీ చూస్తున్నారు. ఇంతలో ఒక పేజీలో నా ప్రకటన కనబడింది. నేను ఇళ్ళు మారడంతో ఇన్ని సంవత్సరాలుగా నన్ను కలిసిన వారికి సదుపాయంగా ఉంటుందని నా మొబైల్ నెంబర్‌తో హిందూ పేపర్‌లో ఆరోజు ప్రకటన ఇచ్చాను. వారు వెంటనే అది చూసి నాకు ఫోన్ చేసి తిరిగి నన్ను కలుసుకున్నారు.

అప్పటినుంచి మా బంధం మళ్లీ తిరిగి కొనసాగింది. ఆ రోజు సాయంత్రం వారు అలా పేపర్ చూసి ఉండకపోతే నన్ను మళ్లీ కలిసిఉండేవారు కాదు. కాని అప్పటి హిమాలయ ఆశ్రమపు బంధం వలన వారు అదే పేజీ చూడడం అందులో నా ప్రకటన ఉండడం దైవనిర్ణయంగా జరిగాయి. అలా పూర్వజన్మ బంధం మమ్మల్ని తిరిగి కలిపింది. మూర్తిగారికి ముందు ముందు ఎన్నో ఉత్తమజన్మలు వస్తాయి. వచ్చే జన్మలో వీరు ఒక పెద్ద యూనివర్సిటీలో ప్రొఫెసర్‌గా ఉద్యోగం చేస్తారు. హిందూ ధర్మ వ్యాప్తికి ఎంతో కృషి చేస్తారు. వీరికి కొన్ని జన్మల తరువాత జన్మరాహిత్యం కలిగి ఆ దివ్యశక్తిలో ఏకమౌతారు.

ప్రతీ మనిషి జీవితంలో ఎన్నో ఒడిదుడుకులకు లోనౌతారు. వాటిని తట్టుకునే శక్తికోసం ఎవరో ఒక దేవతని ఆరాధించాలి. దానితో పాటు ఒక గురువును ఆశ్రయించాలి. అప్పుడు ఈ గురువు ద్వారా ఆ భగవంతుడు మనల్ని కాపాడుతూ ఉంటాడు. ఎవరో మహానుభావులకు గాని భగవంతుడే ప్రత్యక్షంగా చెప్పడు. కాబట్టి తాను చెప్పదలచుకున్నది మనం అనుసరిస్తున్న గురువు ద్వారా చెప్పిస్తాడు. మనకు సద్గురువు సాంగత్యం లభిస్తే అంతకుమించిన అదృష్టం మనకు లేదు. ఎవరికైనా ఉత్తమమైన గురువు దొరకడం ఎన్నో జన్మల పుణ్యఫలం వలన గాని జరుగదు. ప్రతీవారు జీవితంలో ఒక గురువుని ఆశ్రయించి వీలున్నప్పుడల్లా వారిన కలుస్తూ ఉండాలి.

మరో విషయం మనందరం గుర్తించుకోవాలి. ఏ గురువు తన గొప్పతనం గురించి బాహాటంగా చెప్పడు. చాలా మంది సద్గురువులు వారికి ఎన్నో మహిమలు ఉన్నప్పటికి ఏవీ కూడా బాహ్యంగా ప్రదర్శించరు. గురువు ఎప్పుడూ ప్రశాంత చిత్తంతో నవ్వుతూ ఉంటాడు. ఎప్పుడూ పరుషపదజాలం మాట్లాడడు. తన దగ్గరకు వచ్చిన ప్రతీ ఒక్కరిని కంటికి రెప్పలా కాపాడుతూంటాడు.

అయితే మనలో చాలామందికి సద్గురువుల మీద ఏకాగ్రత, నమ్మకం అంత త్వరగా ఏర్పడవు. ఒకసారి నా వద్దకు రామకృష్ణ అనే వ్యక్తి వచ్చాడు. అతడు నాకు మంచి స్నేహితుడై అప్పుడప్పుడు నా వద్దకు వస్తూండేవాడు. అతడు ఎప్పుడూ ఒక గురువు వద్దకు వెళుతుండేవాడు. ఆయనంటే రామకృష్ణకి ఎంతో అభిమానం, గురి. నా వద్దకు వచ్చినప్పుడల్లా వారి గురించి గొప్పగా చెప్తూండేవాడు. అయితే ఒకసారి ఏదో మాట్లాడుతూ నాతో ఇలా అన్నాడు. విశ్వపతి గారూ! నేను మా గురువుగారిని ఎంతో నమ్ముకున్నాను. కాని ఆయన నాకు ఏమీ చేయలేదు. ఇన్ని సంవత్సరాలుగా ప్రతినెలా ఆయనదగ్గరకు వెళ్లి కనీసం గంట అయినా కూర్చొని వస్తాను. కాని ఎప్పుడూ నవ్వుతూ మాట్లాడుతారే తప్ప నాకు ప్రత్యేకంగా ఏమీ చేయలేదు. అయిదేళ్ల నుంచి ఇదే ఉద్యోగంలో ఉన్నాను. ఒక ప్రమోషన్ లేదు, జీతం పెద్దగా పెరిగిందీ లేదు. అంతగా నమ్ముకున్న ఆ గురువుగారు నాకు ఏమీ చేసారు చెప్పండి అన్నాడు.

ఇలా నా దగ్గరకు వచ్చే వారిలో చాలామంది ఇద్దరు, ముగ్గురు గురువుల దగ్గరకు వెళ్ళేవారే! కొంతమంది నన్ను కూడా గురువుగానే భావిస్తారు. మంచిదే ! ఒక వ్యక్తికి జీవితంలో ఒక గురువు దొరకడమే కష్టం. అటువంటిది నలుగురైదుగురు

గురువుల సాంగత్యం లభిస్తుందంటే ఎంత అదృష్టంగా చెప్పాలి! కాని వీరిలో చాలామంది ఆ గురువులు తమని ఎలా కాపాడుతున్నది గ్రహించరు. ఏవో లౌకికమైన కోరికలు కోరడం, అవి తీరడం కోసం వీరిని ఆశ్రయిస్తారు. ముందు ఒకరి దగ్గరకు వెళ్తారు. ఆ గురువు తమ కోరికలు తీర్చడంలేదని మరొకరిదగ్గరకి వెళ్తారు...ఆయన తీర్చకపోతే మరొకరిదగ్గరకి వెళ్తారు...అంతే తప్ప తాము వెళ్లే గురువులు ఒకరైనా, ఇద్దరైనా వారిపై పూర్తి నమ్మకం ఉంచాలని గ్రహించరు.

అసలు ఒక మనిషికి పూర్తి నమ్మకం, గురి ఉంటే ఒక్క గురువు చాలు. కొంతమంది తమకు నలుగురు గురువులు ఉన్నారని గొప్పగా చెప్పుకుంటారు. మనకి ఇంతమంది గురువులు తెలుసని గొప్పగా చెప్పడానికి కాదు. సద్గురు సాంగత్యంలోని విశేషాన్ని పూర్తిగా గ్రహించ గలగాలి. నువ్వు నీ సద్గురువు చెంత ఉన్నప్పుడు నీకష్టాలన్నీ మర్చిపోవాలి. వారి వద్దనుంచి వచ్చిన తరువాత కూడా ఆ అనుభూతి, ఆ నమ్మకం అలాగే ఉంచుకోవాలి. అలాగే మనం ఎప్పుడూ ఒక గురువు దగ్గర మరొక గురువు గురించి తేలికచేసి మాట్లాడకూడదు. మీరు అనుకోవచ్చు ఈ గురువుకి ఆ గురువుతో అసలు పరిచయం లేదు కదా అని. ఒక గురువు ఈ రాష్ట్రంలో ఉంటే మరొక గురువు వేరే రాష్ట్రంలో వేరే భాషవారు కదా అని మీరు తలుస్తుండ వచ్చు. వీరిద్దరు ఒకరినొకరు ఎప్పుడూ కలువలేదు కదా అని మీరు అనుకోవచ్చు. ఇక్కడే మీరు పెద్ద తప్పటడుగు వేస్తున్నారు. సద్గురువులు సంభాషించుకునే మార్గం మీకు తెలిసిన టెక్నాలజీ పట్టుకోలేదు. ప్రపంచంలో ఏమూల ఉన్నా సద్గురువులు ఎప్పుడూ ఒకరితో ఒకరు అనుసంధానింపబడి ఉంటారు. ఒకరు హరిద్వార్‌లో ఉండి మరొకరు అమలాపురంలో ఉండి ఒకరినొకరు ఎప్పుడూ కలవకపోయనా ఎప్పుడూ వీరి ఆత్మలు అనుసంధానింపబడే ఉంటాయి.

ఇలా సిద్ధులు, యోగులు, మహాపురుషులు, సద్గురువులు ఏ ఏ దేశాలలో, ఏ ఏ ప్రాంతాలలో ఎక్కడెక్కడో వేల కిలోమీటర్ల దూరంలో ఉన్నా ఏ మతంలో పుట్టినా, ఏ జాతిలో పుట్టినా, ఏ కులంలో పుట్టినా, ఏ భాషవారైనా వీరందరు నిత్యం ఒకరితో ఒకరు అనుసంధానింపబడి ఉంటారు. వారి ఆత్మలు నిత్యం ఒకదానితో ఒకటి సంభాషిస్తూనే ఉంటాయి. ఈ విషయం శ్రీరమణమహర్షి, శ్రీచంద్రశేఖర సరస్వతి ఇలా అనేకమంది మహనీయుల దగ్గర ఉన్న శిష్యులు కొంతమందికి తెలుసు. ఇటువంటి మహాపురుషులకు దగ్గరగా వచ్చినవారికి ఎన్నో దివ్యఅనుభవాలు కూడా కలిగాయి. ఇటువంటి మహాపురుషులందరు ఈ

ప్రపంచాన్ని ధర్మ మార్గాన్న నడిపించడానికి జన్మించినవారు. ఇందాక చెప్పినట్లు వీరందరు ఎప్పుడూ ఒకరితో ఒకరు నిత్యం అనుసంధానింపబడి ఉంటారు.

మనం మళ్ళీ మా స్నేహితుడు రామకృష్ణ విషయానికి వద్దాం. నన్ను అడిగాడు కదా! తాను నమ్ముకున్న గురువు తనకేమీ చేయలేదని! అప్పుడు నేను ఒక్కనిమిషం కళ్లు మూసుకొని ధ్యానంలోకి వెళ్ళాను. అసలు అతని ప్రశ్నకు ఆ క్షణంలోనే సమాధానం చెప్పవచ్చు. కానీ నా మీద అతడికి అంత నమ్మకం లేదుగా! కాసేపు కనులు మూసుకొని ధ్యానిస్తే ఓహో! ఈయన ధ్యానంలోకి వెళితే ఈయనకు ఈ విషయం తెలిసింది. అని నేను చెప్తే నమ్ముతాడు. ఇది నేను నా దగ్గరకి వచ్చే చాలామందిలో చూస్తుంటాను. నా దగ్గరకి వచ్చే వారిలో చాలామందికి పూర్తి నమ్మకం ఉండదు. కొంతమంది మాత్రం ఎంతో నమ్మకం ఉండి అప్పుడప్పుడూ వచ్చి నావద్ద కూర్చొని అవీ ఇవీ మాట్లాడి వెళ్తారు. అంతే తప్ప ఏ కోరికలు కోరరు. ఏవీ ప్రత్యేకంగా కోరనక్కర్లేదని వీరికి బాగా తెలుసు.

రామకృష్ణ అడిగిన దానికి ఇలా సమాధానం చెప్పాను. నాయనా రామకృష్ణా ఇన్ని సంవత్సరాలుగా నువ్వు వెళ్తున్న గురువు నిన్ను ఏమీ కాపాడటం లేదని, నీ బాగోగులు చూడడం లేదని అన్నావు కదా ! ఒక్క విషయం అడుగుతాను చెప్పు ఈ మధ్య మీ ఆఫీసులో పెద్ద ఆర్థిక కుంభకోణం అయింది కదా! అందులో ఎందరో ఇరుక్కున్నారు కదా! అని అన్నాను. అవును విశ్వపతి గారూ! మీరు చెప్పింది నిజమే! చాలా పెద్ద కుంభకోణం అయింది సార్! పాపం కొంతమంది అమాయకులు ఇరుకున్నారు. వారికి ఏమీ ప్రమేయం లేకపోయినా వారికి కూడా జైలు శిక్షపడి వాళ్ళు జైల్లో ఉన్నారు సార్ అని అన్నాడు.

అప్పుడు నేను రామకృష్ణతో చూడు రామకృష్ణ! నువ్వుకూడా ఆ కుంభకోణంలో ఇరుక్కోవలసిన వాడివే! నీ పేరు కూడా ఆ లిస్టులో ఉంది! కాని ఊహించని రీతిలో చివరి నిమిషంలో ఆ లిస్టులో ఉన్న ఇద్దరిని వారు పట్టించుకోలేదు. వారిలో నువ్వు ఒకడివి లేకపోతే నువ్వు కూడా ఈ రోజున మిగిలిన వాళ్ళతో పాటు జైలులో ఉండాల్సినవాడివి. ఇదంతా ఎలా జరిగిందనుకున్నావు? మీ గురువుగారి అనుగ్రహం వలననే! ఆయన నిన్ను కాపాడడం వలననే నిన్ను వాళ్ళు అరెస్ట్ చేయలేదు. మీ గురువు గారికి అన్ని విషయాలు తెలుసు. వారి అనుగ్రహం వలన ఆ లిస్టులో నీ పేరు ఉన్నప్పటికి నీకు నోటీసు ఇవ్వలేదు. నిన్ను

పట్టించుకోకుండా వదిలివేసారు. అయితే మీ గురువు ఎంతో మహాత్ముడు కాబట్టి ఇవన్నీ నీతో చెప్పలేదు. ఏ సద్గురువు ఇలా ఏమీ చెప్పరు. మనం వారిని ఆశ్రయించి ఉండాలి ! అంతే ! వారు నీకు ఎంత గొప్ప మేలు చేసారో అర్థమయ్యిందా ? అని చెప్పాను.

ఇవన్నీ విన్న రామకృష్ణ భోరున ఏడ్చాడు. ఒక్కసారిగా కాళ్ళపై పడ్డాడు. నాకు జ్ఞానోదయం తెప్పించారు గురువుగారూ! నేను వారిని, మిమ్మల్ని కూడా ఇక ఎప్పటికీ వదలను అని అన్నారు. ఇలా నా జీవితంలో ఎందరినో గమనించాను. ఎందరో తమ గురువులను పూర్తిగా అర్థం చేసుకోరు. ఎప్పుడైతే మనం ఆశ్రయించిన గురువుని పూర్తిగా విశ్వసిస్తామో అప్పుడు మన జీవితం ఎంతో శుభప్రదంగా గడుస్తుంది. ఏ ఇబ్బందులు కలుగవు. ఒకవేళ ఏ ఇబ్బంది వచ్చినా ఆ గురువు అనుగ్రహంచేత తేలికగా మనకి ఏమాత్రం బాధ కలుగకుండా జరిగిపోతాయి.

ఎంతో గొప్ప మహిమలు కలిగిన సద్గురువులు ఎప్పుడూ ఏ విషయాలు ఎవరికి వివరంగా చెప్పరు. శ్రీరమణ మహర్షి తన వద్దకు వచ్చిన వారికి తత్వ బోధ చేసేవారే కాని వారి వ్యక్తిగత విషయాలు మాట్లాడరు. కాని వారి చుట్టూ ఉన్న అందరి యోగక్షేమాలు తాను చూసుకుంటాడు. ఎప్పుడూ లోక కళ్యాణం కోసం పాటుపడే వాడికి వారిని ప్రజలందరు పొగడాలనో, ఏదో బహుమతులు ఇవ్వాలనో ఏ మాత్రం ఉండదు కదా!

నేను ఇన్ని సంవత్సరాలుగా నన్ను కలిసిన ఎన్నో వేలమందిలో ఎంతో మందికి ముందు కాలంలో ఎన్నో అనారోగ్యాలు కలగబోతున్నాయని, ఎన్నో కష్టాలు అనుభవించబోతున్నారని తెలిసినపుడు ధ్యానంలో వారందరికి ఆ బాధలు రాకుండా వారందరు సుఖంగా ఉండాలని ఆ దివ్యశక్తిని ప్రార్థించాను. కాని ఈ సంగతి వారెవ్వరకీ నేను చెప్పలేదు చెప్పనవసరం లేదు. నా వద్దకు వచ్చినప్పుడు కొంతమంది కుటుంబాలలో ఎన్నో అనర్థాలు రాబోతున్నాయని గ్రహించి వారికి అవి రాకుండా ఆ పరబ్రహ్మమూర్తిని ప్రార్థించాను. ఆ క్షణంలోనే చాలామంది అటువంటి బాధల నుంచి ఆ దివ్యశక్తి అనుగ్రహంచేత కాపాడబడ్డారు. పొగడ్తో, ధనమో, నేను ఆశించి ఇవి చేయలేదు. నలుగురు సంతోషంగా ఉంటే మనం సంతోషంగా ఉంటాము. అందుకే నేను చేసేవి చేసుకుంటూ ముందుకు పోతుంటాను. ఎవరికీ నేనే చేశానని చెప్పను. ముందు తరాల వారికి ఎంతో శక్తి కలిగి కూడా అతిసామాన్యంగా జీవించే

మహానుభావులు ఈ భూమిమీద నివసించారని, ప్రస్తుతం కూడా ఉన్నారని తెలియజెప్పడం కోసమే ఇంత వివరంగా వ్రాసాను.

ఇలా ఈ జన్మలో నన్ను కలిసిన వారిలో ఒక ప్రభుత్వ ఉన్నత అధికారిణి ఒకరు. వీరు నాలుగు జన్మలలో ఎన్నో గొప్ప కార్యాలు చేసారు. క్రిందటి జన్మలో వీరు మహాపుణ్యక్షేత్రమైన రామేశ్వరంలో అర్చకునిగా ఉన్నారు. ఆ స్వామి వారిని నిత్యం సేవిస్తూ ఎంతో గొప్ప వ్యక్తిగా పేరు తెచ్చుకున్నారు. అంతకుముందు జన్మలో వీరు ఒరిస్సా రాష్ట్రంలో ఒక పల్లెటూరులో కిషన్ అనే పేరుతో ఒక రైతు కుటుంబంలో జన్మించారు. కిషన్ తన తల్లిని ఎన్నో విధాలా కష్టపెట్టాడు. బయటవారందరితో ఎంతో చక్కగా ఉండేవాడు. కాని తల్లిని మాత్రం ఎప్పుడూ ఏదో విసుక్కుంటూ ఉండేవాడు. అంతకుముందు మూడుజన్మల క్రితం ఇప్పటి కిషన్ తల్లి కిషన్ కు అన్నగా జన్మించి ఇతడిని ఎన్నో కష్టాలు పెట్టాడు.

అప్పటి వాసనలు ఆత్మకు అలాగే ఉండి ఆ సోదరుడే ఈ జన్మలో తన తల్లిగా పుట్టి ఆమె కడుపున తాను జన్మించినప్పటికి ఆమెను ఎన్నో విధాలా బాధపెట్టేవాడు. అలా విసుకున్న ప్రతీసారి కాసేపటికి తాను ఎంతో బాధపడేవాడు. అప్పటి కిషనే ఈ జన్మలో ఒక ప్రభుత్వ అధికారి సత్యవతిగా జన్మించింది. అప్పటి జన్మలో తల్లి ఈ జన్మలో వీరి భర్తగా జన్మించాడు. సత్యవతికి చిన్నప్పటి నుంచి ఎంతో దైవభక్తి ఎక్కువ తోటి వారందరిని ఎంతో ప్రేమగా చూస్తుంది. ప్రభుత్వంలో ఎంతో పెద్ద పదవిలో ఉన్నప్పటికి అత్యంత క్రింది స్థాయిలో ఉండే ఉద్యోగులు కూడా ఆమె ఎంతో ఆప్యాయంగా చూస్తుంది. అసలు ఇంతటి మంచి భావాలు కలిగిన వ్యక్తి, ఇంతటి సున్నితమైన వ్యక్తి, ఇంతటి కఠినమైన పదవిలో ఎలా ఉంటోందని నాకెప్పుడూ అనిపిస్తూంటుంది.

క్రిందటి జన్మలో కిషన్ తల్లి ఈ జన్మలో వీరి భర్తగా జన్మించాడు. పూర్వజన్మ వాసనల వలన ఈ జన్మలో ఆమెలో ఎంతో భక్తి భావం పెంపొందింది. క్రిందటి జన్మలో ఆమె తల్లి భర్తగా జన్మించి అప్పటి తల్లి కొడుకుల బంధం వలన ఒకరంటే ఒకరు ఎంతో అభిమానంగా ఉంటారు. అయితే జన్మ జన్మల జ్ఞాపకాలు ఆత్మని అంటిపెట్టుకొని ఉండడం చేత ఈమెను ఒకొక్కసారి మానసికంగా ఎంతో వేధిస్తుంటాడు. సత్యవతి అంటే ఎంతో ప్రేమ ఉన్నప్పటికి తనకి తెలియకుండానే భర్త అలా ప్రవర్తిస్తుంటాడు. ఇటువంటి బంధాలు మనం ఎందరి విషయాలలోనో

చూస్తుంటాం. కొంతమంది భార్యాభర్తలు ఎంతో అన్యోన్యంగా ఉంటారు. అయినప్పటికి ఉన్నట్లుండి ఏదో చిన్న విషయానికి విపరీతంగా ఒకరినొకరు దూషించుకుంటారు. అది ఎంతదాకా వెళుతుందండే చూసేవారికి ఇంతకంటే బద్ధ శత్రువులు ఉండరు అన్నట్లుగా అనిపిస్తుంది.

ఒకొక్కసారి మన మనసుల్లో మనకే తెలియకుండా అవతల వ్యక్తితో ఎన్నో జన్మల క్రింద ఏదో సంఘటన జరిగి, మన మనస్సుని అది ఎంతో కలచివేస్తే. ఒకొక్కసారి అప్పటి సంఘటనల తాలూకూ వాసనలు మన ఆత్మని పట్టుకొని ఉండి. ఆ వ్యక్తి ఈ జన్మలో ఏదో రూపంలో తారస పడినప్పుడు మనకు అప్పటి సంఘటనలు గుర్తుకువచ్చి మనకు తెలియకుండానే అతన్ని విసుక్కుంటాము. కాసేపటికి మళ్ళీ మామూలుగా ప్రవర్తిస్తాము. అయితే ఆ వ్యక్తి మీ కుటుంబంలోని వారే కాకపోవచ్చును. మీ స్నేహితుడో, మీ చుట్టుప్రక్కల ఉన్నవారో, మీరు ఉద్యోగం చేస్తున్నప్పుడు మీతో ఉన్నవారో, లేదా మీరు ఏదైనా ప్రదేశానికి వెళ్ళినప్పుడు అక్కడ పరిచయం అయినవారో అయి ఉండవచ్చు. అయితే మనం ఒకొక్క జన్మలో మంచి సంస్కారంతో జీవిస్తూ ముందుకు వెళుతూ ఉంటే ఈ జన్మ జన్మల బంధాలు నెమ్మదిగా తగ్గుతూంటాయి. మనిషి ఉన్నత స్థాయికి చేరుకోవడం జరుగుతుంది.

ఇందాక నేను చెప్పిన సత్యవతి కొన్ని జన్మలుగా ఉత్తమ సంస్కారం కలిగిఉండడం చేత భర్త ఎంత హింసించినా తట్టుకోగలుగుతుంది. వీరి బంధం ఈ జన్మతో తీరిపోతుంది. తరువాత జన్మలో వీరద్దరి దారులు వేరు అవుతాయి. భర్త వేరొక ప్రదేశంలో వేరొక కుటుంబంలో జన్మిస్తాడు. సత్యవతి వచ్చే జన్మలో ఒక గొప్ప పుణ్యక్షేత్రం గల పట్టణంలో ధనవంతుల కుటుంబంలో జన్మిస్తుంది. ఈ సమాజానికి ఉపయోగపడే కార్యాలు ఎన్నింటినో చేస్తుంది. సత్యవతి భర్తకూడా వచ్చే జన్మలో ఎన్నో మంచి పనులు చేస్తాడు. ఎంతో సత్ప్రవర్తతనో జీవించి సమాజానికి ఉపయోగపడే ఎన్నో మంచి పనులు చేస్తాడు.

పూర్వకాలంలో ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పుగోదావరి జిల్లాలో దాదాపు రెండు వందల సంవత్సరాల క్రితం శ్రీసుబ్బరాయశాస్త్రిగారు అనే మహాపండితుడుండేవాడు. వారు సంస్కృత, ఆంధ్ర భాషల్లో గొప్ప పాండిత్యం సంపాదించి ఎంతో పేరు ప్రతిష్టలు తెచ్చుకున్నారు. వారికి అనేక మంత్రశక్తులు ఉన్నట్లుగా ప్రజలు చెప్పుకునేవారు. వారు ధ్యానంలో ఉన్నప్పుడు సూక్ష్మదేహంతో

హిమాలయ పర్వతాల వద్దకు వెళ్ళి అక్కడ ఎందరో దేవతలను, సిద్ధులను కలుసుకొని తిరిగి ఈ భౌతిక దేహంలోకి వచ్చేవారు. నిత్యం ధ్యానంలో ఎందరో దేవతలను దర్శించేవారు. అయితే వారు బయటకు అతి సామాన్యంగా కనిపించేవారు. ఇన్ని శక్తులు ఉన్నట్లు చుట్టుప్రక్కల వారెవ్వరికీ తెలియదు. వారు శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామి అంశతో జన్మించినట్లు చెప్పుకునేవారు. వీరికి వేంకటశాస్త్రి అనే తమ్ముడు ఉండేవాడు. అతడికి ఏమీ విద్యలు వంటపట్టక ఎంతో అమాయకంగా ఉండేవాడు. అందువలన అతనికి వివాహంకూడా కాలేదు. అన్న శ్రీసుబ్బరాయశాస్త్రిగారి వద్దే ఉండేవాడు. అన్న వదినలు వేంకటశాస్త్రిని చక్కగా చూసుకుంటుండేవారు.

శ్రీసుబ్బరాయశాస్త్రిగారు తరువాత జన్మలో ఆ చుట్టుప్రక్కల ప్రాంతాలలోనే వేంకటరాయశాస్త్రి అనే పేరుతో జన్మించాడు. ఎంతో గొప్ప పండితుడై శ్రీమహాభాగవతానికి చక్కటి భాష్యాన్ని రచించారు. అటుతరువాత ఎంతో సాధన చేసి, ఎందరో శిష్యులను చక్కటి వేద విద్యలో తీర్చిదిద్దారు. వీరు ఒకసారి హిమాలయ పర్వత ప్రాంతాల వద్దకు వచ్చి నా ఆశ్రమంలో నన్ను కలిసారు. కొన్ని నెలలు అక్కడ గడిపి తిరిగి తన ఊరు వెళ్ళిపోయాడు. వీరికి శ్రీమన్నారాయణుడంటే ఎంతో భక్తి ఉండేది. వీరు ఆ జన్మలో సర్వాంతర్యామి అయిన శ్రీమన్నారాయణులవారి గుణగణాలను కీర్తిస్తూ అద్భుతమైన శతకాలను రచించారు. వీరికి ఎలాగైనా శ్రీమహావిష్ణువాలయం నిర్మించాలని ఎంతో కోరికగా ఉండేది. కాని జీవితాంతం ఎంత ప్రయత్నించినా అది సాధ్యపడలేదు. వీరు అటుతరువాత ఎన్నో ఉన్నత జన్మలు కలిగి ఎన్నో గొప్ప కార్యాలు చేశారు.

ఈ జన్మలో వీరు తూర్పుగోదావరి జిల్లాలోనే ఇంజరం అనే గ్రామంలో శ్రీకాకరపర్తి సుబ్రహ్మణ్యం అనే పేరుతో జన్మించారు. పూర్వజన్మల వాసనలు ఫలితంగా ఈ జన్మలో కూడా ఎంతో జ్ఞానం లభించింది. ఎంతో పాండిత్యం లభించింది. వీరు కొన్ని జన్మల క్రితం సుబ్బరాయశాస్త్రిగా జన్మించినప్పుడు వీరి సోదరుడైన వేంకటశాస్త్రి ఈ జన్మలో సుబ్రహ్మణ్యం గారికి భార్యగా జన్మించారు. వీరి వద్దకు నేను రచించిన శ్రీవేంకటేశ్వర వ్రతకల్పం చేరింది. అప్పటి నుంచి వీరి భార్య ప్రతీ శనివారం ఈ వ్రతం ఆచరిస్తూండేది. అంతే కాక ప్రతీ ఏకాదశి పౌర్ణమి రోజులలోను తొలిఏకాదశి, వైకుంఠ ఏకాదశి వంటి పుణ్యదినాలలోను ఆమె ఈ వ్రతం ఆచరిస్తుంది. వీరిద్దరు ఎంతో అన్యోన్యంగా జీవిస్తూ ఎప్పుడూ ఆ ఊరు విడిచి బయటకు వచ్చేవారు కాదు. అయితే ఒకసారి హైదరాబాద్ మా ఇంటికి రావడం

జరిగింది. ఎంతో సాంప్రదాయ వస్త్రధారణతో మంచి సద్గుణాలు కలిగిన ఆ భార్యాభర్తలను చూస్తే మాకెంతో సంతోషం కలిగింది. వారి ఊరు రమ్మని వారు మమ్మల్ని ఎంతగానో అడిగారు. మేము వీలున్నప్పుడు తప్పక వస్తామని చెప్పాము.

రోజులు ఇలా గడుస్తుండగా ఒకనాడు తెల్లవారుఝామునే నా ఫోన్ మ్రోగింది. మరీ ఇంత తెల్లవారుఝామునే ఎవరు ఫోన్ చేసారా అని చూడగా అది ఈ సుబ్రహ్మణ్యం గారే. వారు నాతో ఇలా చెప్పసాగారు. అయ్యా ! విశ్వపతి గారూ ఈరోజు తెల్లవారుఝామున నాకు ఒక కల వచ్చింది. దానిలో శ్రీవేంకటేశ్వర స్వామి వారు దర్శనమిచ్చి తనకు ఆలయం కట్టించవలసిందిగా నన్ను కోరారు. పెద్దగా ఆస్తి ఏమీ లేని నేను ఇద్దరు ఆడపిల్లల తండ్రి అయిన నేను ఒక్కక్షణం తటపటాయించాను. ఇది నా వల్ల ఎలా సాధ్యమౌతుందా అని ఆలోచించాను. నా మనస్సులో విషయం ఆ స్వామి వారే గ్రహించి సుబ్రహ్మణ్యం! నువ్వు కార్యక్రమం మొదలుపెట్టు! తప్పక విజయం వశం అవుతుంది అని చెప్పి అంతర్ధానమయ్యారు. నేను వెంటనే నిద్రలేచి ఎవ్వరికి చెప్పకుండా పెరటిబావిలో నీళ్లతో తలమీదనుంచి స్నానంచేసి పంచపాత్ర, ఉద్ధరిణి తీసుకొని ఒక చిన్న చాప నా చంకన పెట్టుకొని నా పొలానికి వెళ్ళాను. ఆ ప్రదేశంలో కూర్చొని శ్రీసూక్తం, పురుష సూక్తం చదువుతూ ఇక్కడ ఈ ప్రదేశంలో శ్రీవేంకటేశ్వర స్వామి వారి ఆలయం నిర్మిస్తానని గట్టిగా సంకల్పించుకొని శ్రీమన్నారాయణుల వారికి నాకున్న కొబ్బరితోటలో కొంతభాగం ధారబోసాను. నా మనస్సు ఎంతో తేలికగా అనిపించింది. ఇంక మిగిలినదంతా ఆ స్వామి వారే చూసుకుంటారు. అని గట్టిగా తలచాను.

అక్కడ నుంచి నేరుగా ఇంటికి వచ్చి ముందుగా ఈ విషయం మీకే చెప్తున్నాను. విశ్వపతిగారూ! మీ వేంకటేశ్వర వ్రతకల్పం పుస్తకాలు ఇంటిలోకి రావడం, నా భార్య ఇది నిత్యం ఆచరిస్తూండటము ఆ స్వామి అనుగ్రహం ఈ విధంగా నా కుటుంబం పై కలిగిందని నమ్ముతున్నాను. మమ్మల్ని ఇంత అనుగ్రహించినందుకు ఆ స్వామి వారికి శతకోటి నమస్కారాలు. మీ ద్వారా మాకీ స్ఫూర్తి కలిగినందుకు మీకు ఎన్నో కృతజ్ఞతలు అని అన్నారు. ఆ విధంగా వీరు పూర్వజన్మలో ఎంతో గట్టిగా సంకల్పించినా శ్రీమహావిష్ణువు వారి ఆలయం ఈ జన్మలో ఇలా శ్రీవేంకటేశ్వర స్వామివారి ఆలయంగా రూపుదాల్చింది. శ్రీసుబ్రహ్మణ్యం గారి జన్మ ధన్యం అయింది.

నన్ను, రుక్మిణిని ఎన్నో వేలమంది వారింటికి రావలసిందిగా ఆహ్వానించారు. కాని నేనంతగా ఎక్కడకి వెళ్ళడానికి ఇష్టపడను అటువంటిది అప్పటి హిమాలయాశ్రమ బంధం కారణంగా మేమిద్దం వీరి ఊరు ఇంజరం వెళ్లి వీరింట భోజనం కూడా చేయడం జరిగింది. వారింట ఎంతో ఆప్యాయమైన అద్భుత ఆతిధ్యాన్ని స్వీకరించాము. ఆ కుటుంబం మొత్తం మాపై చూపిన ఆప్యాయత ఇప్పటికి మరువలేదు. ఆరోజు నన్ను సుబ్రహ్మణ్యం గారు వారు ఆలయం నిర్మిస్తున్న ప్రదేశానికి తీసుకువెళ్ళారు. అక్కడ అప్పటికి కేవలం భూమిపూజ మాత్రమే జరిగింది. ఆలయ నిర్మాణం ఇంకా మొదలు కాలేదు. అప్పుడు నేను ఆ ప్రదేశంలో కాసేపు ధ్యానం చేస్తూ కూర్చున్నాను. మున్ముందు కాలంలో శ్రీవేంకటేశ్వర స్వామి వారి అనుగ్రహంతో ఈ ఆలయం ఎంతో గొప్పగా రూపుదిద్దుకొని, ఈ చుట్టుప్రక్కల ప్రాంతాలలో గొప్ప ప్రసిద్ధిగల పుణ్యక్షేత్రంగా విలసిల్లుతుంది.

ఆరోజు ఆ ప్రదేశంలో కూర్చొని ధ్యానం చేస్తున్నప్పుడు అక్కడ అద్భుతమైన దివ్యతరంగాలను గమనించాను. ఒక నాలుగువందల సంవత్సరాల క్రితం ఈ ప్రదేశంలో ఎంతో గొప్ప యజ్ఞం చేయబడింది. ఆ యజ్ఞానికి ఆంధ్రప్రదేశ్‌లోని గొప్ప గొప్ప పండితులందరు వచ్చారు. ఎంతో గొప్ప దీక్షతో, ఎంతో నియమనిష్టలతో శాస్త్రోక్తంగా, ఎందరో ఋత్వికులతో నిర్వహించబడ్డ ఈయజ్ఞానికి ఎందరో దేవతలు, మహర్షులు దివ్యశరీరాలతో విచ్చేసారు. అందువలన ఈ ప్రదేశం అత్యంత పవిత్రతను సంతరించుకుంది. అందువలననే ఇక్కడ ఆ శ్రీనివాసుడు శ్రీసుబ్రహ్మణ్యం గారి ద్వారా తమ ఆలయం నిర్మించుకున్నారు.

రాబోయే కాలంలో ఈ శ్రీ శ్రీ భూసమేత శ్రీవేంకటేశ్వరస్వామి వారి ఆలయం ఎంతో ప్రసిద్ధి పొందుతుంది. ఇక్కడ వెలసిన స్వామివారు భక్తుల కోర్కెలు తీర్చే కామధేనువుగా కీర్తించబడతారు. ఈ ఆలయంలో శ్రీ వేంకటేశ్వర స్వామి వారి వ్రతం ఆచరించినవారికి సర్వశుభాలు కలుగుతాయి. సంకల్పించిన పనులన్నీ విజయవంతంగా పూర్తి అవుతాయి. ఈ ఆలయంలో ఏ పూజ నిర్వహించినా భక్తులకు ఎన్నో శుభాలు జరుగుతాయి. కోరిన కోర్కెలు తీరుతాయి. శ్రీకాకరపర్తి సుబ్రహ్మణ్యం గారు ముందు ముందు ఇంకా కొన్ని ఉత్తమ జన్మలో జన్మించి గొప్ప గొప్ప కార్యాలు నిర్వహించి జన్మరాహిత్యం పొంది ఆ దివ్యశక్తిలో ఐక్యమవుతారు.

కొంతకాలం క్రితం 1800 వ సం॥లు సమీపంలో రష్యాదేశంలో ఒక గొప్ప డాక్టర్ ఉండేవాడు. అతడు ఎంతో గొప్ప వైద్యం చేస్తూ ఎంతో మందిని ఎన్నో రోగాలనుంచి కాపాడాడు. సైబీరియా ప్రాంతాలలో నివసించిన ఇతడు పేదలకు ఉచితంగా వైద్యం అందించేవాడు. ఈ డాక్టర్‌కి ప్రజలందరిలోను మంచి పేరు రావడంతో తోటి డాక్టర్లకి ఇతడంటే ఎంతో ఈర్ష్య, అసూయగా ఉండేది. అతడికి అంత గొప్ప పేరు రావడం వీరికి ఏమాత్రం నచ్చేది కాదు. అదికూడా చాలామందికి పూర్తి ఉచితంగా సేవలందించడం వలన ఎక్కువ మంది రోగులు ఇతని వద్దకే వెళ్ళేవారు. వారిలో ఈర్ష్య ఎంతదాగా వెళ్ళిందంటే ఒక ఇద్దరు కలిసి ఇతనిని ఎలాగైనా అంతమొందించాలని తలిచారు. ఒకనాడు ఇతనిని ఒక విందుకు పిలిచి అతనికి ఇచ్చిన పానీయంలో విషం కలిపారు. అక్కడితో ఆ డాక్టర్ మరణించాడు.

ఆ డాక్టరు తరువాత జన్మలో భారతదేశంలోని ఉత్తర్‌ప్రదేశ్‌లో జన్మించాడు. క్రిందటి జన్మలో ఉన్న సేవాభావం అతని ఆత్మని అలాగే హత్తుకొని ఉన్నది. అతను ఎంతో పేద కుటుంబంలో పుట్టినప్పటికి ఎంతో కష్టపడి చదివి అక్కడ ఉన్న కాలేజీలో లెక్చరర్‌గా చేరాడు.

తనకున్న కొద్ది సంపాదనతో వీలైనంత ఇతరులకు సహాయం చేసేవాడు. వివాహం చేసుకుంటే తన సంఘసేవకు అడ్డం రావచ్చునని అనుకొని వివాహం కూడా చేసుకోలేదు. అలా వీలున్నప్పుడల్లా తనకు తోచిన సంఘసేవా కార్యక్రమాలలో పాల్గొంటూ ఉండేవాడు. ఒకసారి వారి ఊరి దగ్గరలో గల ఆలయంలో పెద్ద ఉత్సవం జరిగింది. అప్పుడు ఎక్కడెక్కడినుంచో అనేకమంది సిద్ధులు, యోగులు ఆ ఉత్సవంలో పాల్గొనడానికి వచ్చారు. వారిలో ఒకరిని చూసి ఈ లెక్చరర్ ఎంతో ఆకర్షితుడయ్యాడు. ఉత్సవం జరుగుతున్న మూడు రోజులు ఆ సిద్ధుడు వెంటే తిరుగుతూ తనని శిష్యునిగా చేసుకోమని అర్థించాడు. అందుకు సిద్ధుడు ఒప్పుకొన్నాడు. ఉత్సవాలు పూర్తి అవగానే ఆ సిద్ధుడుతో కలిసి హిమాలయాలకు వెళ్ళాడు. ఒకరోజు ఆ సిద్ధుడు కొన్ని రోజులు తపస్సుకోసం వేరే ఆశ్రమానికి వెళ్ళగా ఈ లెక్చరర్ కిషన్ హిమాలయ ప్రకృతిని ఆస్వాదిస్తూ అక్కడ కొండలలో తిరుగుతూ నేనున్న ఆశ్రమానికి చేరుకున్నాడు. అక్కడ ఉన్న ఎందరో వ్యక్తులను చూసాడు. వారిలోని గొప్ప సాధకులను పరిచయం చేసుకున్నాడు. వారికెంతో సన్నిహితుడయ్యాడు.

కిషన్ తరువాత రెండు జన్మలలో అమెరికాలోను, బ్రిటన్‌లోను జన్మించాడు. ప్రస్తుత జన్మలో కిషన్ మాస్కోలో ఐరిన అనే పేరుతో జన్మించాడు. సాధారణ మధ్యతరగతి కుటుంబంలో జన్మించిన ఐరిన స్టాంఫర్డ్ విశ్వవిద్యాలయంలో చదువుకుంది. ఆమెను పూర్వజన్మ వాసనలు వెంటాడడంతో హిందూ సాంప్రదాయాల వైపు ఎంతో ఆకర్షితురాలయ్యింది. ప్రత్యేకించి జ్యోతిష, వాస్తు శాస్త్రాల పై ఆమెకు ఎంతో ఆసక్తి కలిగింది. ఈ రెండిటిలోను ఎంతో ప్రావీణ్యం కూడా సంపాదించి వేద జ్యోతిష్యం నేర్పించే ఒక స్కూల్ కూడా పెట్టింది. అందులో ఎంతో మంది రష్యన్ యువతీ యువకులు చేరారు.

ఐరిన కు హైదరాబాద్‌లో ఉన్న ఒక వాట్సప్ గ్రూప్‌తో పరిచయం అయింది. ఈ గ్రూప్‌లో ఉన్నవారందరు మన హిందూ సాంప్రదాయాలపై ఎంతో మక్కువ కలిగిన వారు. వీరిలో చాలామంది ఇప్పుడు సంస్కృతం కూడా నేర్చుకుంటున్నారు. ఈ గ్రూప్‌లోని సభ్యులు ఒకరితో ఐరినకు పరిచయం కలిగి ఒకసారి మాస్కో నుంచి హైదరాబాద్ వచ్చింది. మాస్కోలో తన స్కూలులోని విద్యార్థులు కొంతమందిని హైదరాబాద్ తీసుకురావాలని తలచింది. ఈ వాట్సప్ గ్రూప్ సభ్యులలో ఒకరు నా గురించి, నా పుస్తకాల గురించి విని ఉన్నారు. కాని నన్ను ఎప్పుడూ కలువలేదు. ఐరినతో మాట్లాడుతున్నప్పుడు ఈ గ్రూప్ సభ్యుడు నాగురించి నేను చేస్తున్న పనుల గురించి ఆమెకు చెప్పాడు. దానికి ఆమె ఎంతో సంతోషపడి ఆమెను నా వద్దకు తీసుకువెళ్ళమని అడిగింది.

ఒకరోజు ఐరిన ఆ గ్రూప్ సభ్యురాలు ఒకరితో కలిసి మా ఇంటికి రావడం జరిగింది. నేను చేస్తున్న పనుల పట్ల ఎంతో ఆకర్షితురాలయ్యింది. శ్రీవేంకటేశ్వర వ్రత కల్పం రష్యా భాషలోకి అనువదిస్తామని నాతో అన్నది. అటు తరువాత రెండు నెలలకు ఆ వేదిక్ స్కూల్ విద్యార్థులను తీసుకొని మాస్కో నుంచి హైదరబాద్ వచ్చింది. తాను చెప్పినట్లుగానే శ్రీవేంకటేశ్వర వ్రత కల్పం రష్యా భాషలోకి అనువదించి తీసుకువచ్చింది. ఆ పుస్తకాన్ని మేము ఉంటున్న అపార్ట్‌మెంట్ కాంప్లెక్స్‌లోని కాన్ఫరెన్స్ హాల్లో ఒక చిన్న కార్యక్రమంలో ఆవిష్కరించడం జరిగింది. ఎక్కడి మాస్కో? ఎక్కడి హైదరాబాద్ ? కొన్ని జన్మల క్రితం నాటి హిమాలయాశ్రమపు బంధమే ఐరినను ఈ జన్మలో మళ్ళీ ఇంతదూరం తీసుకువచ్చి నాతో కలిపింది. శ్రీవేంకటేశ్వర వ్రత కల్పం రష్యా భాషలోకి కూడా అనువధింపబడడం నాకు ఎంతో

సంతోషం కలుగజేసింది. ఐరిన తాము ఈ వేంకటేశ్వర వ్రతాన్ని మాస్కోలో కూడా చేస్తామని చెప్పింది. శ్రీవేంకటతత్వం ఎన్ని దేశాలలో వ్యాపిస్తున్నదో కదా!.

మా దూర స్నేహితులలో మధుసూధన్ అనే ఒకతను ఉన్నాడు. మధుసూధన్ ఇంజనీరింగ్ చదివి అమెరికా వెళ్ళాడు. మధుసూధన్ ఎంతో ఉన్నత సంస్కారం గల వ్యక్తి. నాలుగు జన్మల క్రితం చెన్నై పట్టణంలో ఒక వైశ్యుల కుటుంబంలో జన్మించాడు. ఎన్నో వ్యాపారాలు చేసి ఎంతో ధనం సంపాదించాడు. ఎన్నో దాన ధర్మాలు చేసాడు. అంతకుముందు ఒక పది జన్మల క్రితం మధుసూధన్ నేటి ఆఫ్ఘనిస్థాన్ రాష్ట్రంలో జన్మించాడు. ఆ జన్మలో కొన్ని పాపకార్యాలు చేసాడు. వాటి ఫలితంగా ఈ జన్మలో ఎన్నో కష్టాలు అనుభవిస్తున్నాడు. మధుసూధన్ ద్వాపర యుగంలో శ్రీకృష్ణపరమాత్ముని కూడా దర్శించుకున్నాడు. ప్రస్తుత జన్మలో అమెరికాలో ఏదో వ్యాపారం చేస్తున్నాడు. చాలాకాలం తీవ్ర అనారోగ్యంతో బాధపడ్డాడు. అతడికి పూర్వజన్మల ప్రారబ్ధకర్మ క్షయమయ్యే కాలం వచ్చింది. అందువలననే ఇతడిని ఈ జన్మలో ఆర్థిక సమస్యలు, అనారోగ్యం ఎంతగానో బాధపెట్టాయి. ఇతడు కూడా నన్ను హిమాలయాశ్రమంలో కలిసినవాడే!

అది 2009వ సంవత్సరం. ఉదయాన్నే గం॥ 6.30 ని॥లకి ఎవరో తలుపు కొట్టారు. ఇంత పొద్దున్నే ఎవరు వచ్చారా అని తలుపు తీసిన నాకు స్త్రీమూర్తి కనిపించింది... చంకలో మూట పెట్టుకుని ఇది విశ్వపతిగారి ఇల్లేనా అన్నారు. అవునమ్మా అని లోపలకి రమ్మని నా భార్య రుక్మిణిని పిలిచాను. కాఫీ తాగుతారా అంటే ఆకలిగా ఉంది అంది ఆవిడ. అప్పుడు రుక్మిణి ఆవిడని కాసేపు కూర్చోమని ఇడ్లీలు వేసి పెట్టింది. పాపం చినిగిన చీరతో ఉన్న ఆవిడని చూస్తే మా ఇద్దరికీ జాలి వేసింది.

టిఫిన్ తిని కాస్త కాఫీ తాగి ఆవిడ ఇలా చెప్పడం ప్రారంభించారు. అయ్యా విశ్వపతిగారూ! నా పేరు విజయలక్ష్మీ మాది రావులపాలెం. మా వారు చిన్న ఉద్యోగం చేస్తూ నిలకడలేక ఎప్పుడూ తాగుతూ చివరికి నన్నూ మా ముగ్గురు కూతుళ్ళని నట్టేట్లో ముంచేసి ఇల్లు వదిలి వెళ్ళిపోయారు. ఎటుపోయారో కూడా తెలీదు... ముగ్గురూ చిన్న పిల్లలు వీళ్ళని ఎలా పెంచాలో తెలియక పడని బాధ లేదు. నాకు వంట చెయ్యడం తప్ప మరొకటి రాదు. మాకు తెలిసిన వాళ్ళ ఇళ్ళలో వంటలు చేస్తూ బతుకుతున్నాను. రెండు రోజుల క్రితం హైదరాబాద్‌లో పెళ్ళికి వచ్చాను. చేతికింద

సహాయానికి వచ్చాను. నా ఆస్తి అంతా ఈ సంచే! ఎక్కడకు వెళ్ళినా ఇది తీసుకొని వెళ్తాను. ఒక పదివేలు విలువచేసే బంగారం ఎప్పుడూ దీంట్లో ఉంటుంది. ఇదే నా ఆస్తి. దురదృష్టం కొద్దీ నిన్న పెళ్ళిలో ఎవరో సంచి తీసి బంగారం పెళ్ళి వారు ఇచ్చిన 2,500 రూపాయలు దొంగిలించారు. నాకు ఇక దిక్కులేదని భోరున ఏడ్చాను. ఇంతలో ఆ కళ్యాణ మండపంలో ఒక కుర్చీలో మీరు రాసిన శ్రీ వేంకటేశ్వర వ్రత కల్పం పుస్తకం కనిపించింది. ఎవరో అక్కడ వదిలిపెట్టి వెళ్ళినట్లున్నారు. నాకు చిన్నప్పటి నుంచీ వెంకటరమణమూర్తి అంటే ప్రాణం.

ఆ పుస్తకాన్ని చేతితో తీసుకొని కళ్ళకద్దుకున్నాను. కంటి నీరు తుడుచుకున్నాను. స్వామి వారు నన్ను రక్షించడానికి ఇలా వచ్చారేమో అనుకున్నాను. దీంట్లో మీ అడ్రస్ చూసి వచ్చాను. కాస్త మమ్మల్ని ఆశీర్వదించండి అన్నారు. మా ఇద్దరికి జాలి వేసి రుక్మిణి లోపలకి వెళ్ళి రెండు చీరలు తెచ్చి ఇచ్చి కొంత డబ్బు ఇచ్చాము. ఆవిడతో నేను అమ్మ ఈ వేంకటేశ్వర వ్రత కల్పం ప్రతి శనివారం చదవండి అన్నీ బాగుంటాయి అని చెప్పాను. అలాగే అని కాసేపు కూర్చుని వెళ్ళిపోయారు.

తర్వాత ఒక సంవత్సరం తరువాత మళ్ళీ వచ్చారు... కొంచెం ఆర్థికంగా కోలుకున్నట్లు అనిపించారు... విశ్వపతి గారూ! నాకు దొరికిన శ్రీవేంకటేశ్వర వ్రతకల్పం ప్రతీరోజు చదువుతున్నాను...జీవితం కొంచెం కుదుటపడుతోంది...అని కాసేపు కూర్చొని వెళ్ళారు...ఒక డజన్ అరటిపళ్ళు ఇచ్చి మా ఇద్దరికి నమస్కారం పెట్టి వెళ్ళారు.

ఆ తరువాత ఐదేళ్లకు వచ్చారు...విశ్వపతి గారూ! శ్రీవేంకటేశ్వర వ్రతకల్పం నా జీవితంలో అద్భుతాలు చేసింది...ఒక పెళ్ళిలో ఒక మంచి కుటుంబం వారు మా పెద్దమ్మాయిని చూసి తమ ఇంటి కోడలిగా చేసుకున్నారు...వాళ్ళే పెళ్ళిఖర్చు మొత్తం భరించారు...తరువాత రెండేళ్ళకే ఇలాగే రెండవ అమ్మాయి పెళ్ళికూడా అయింది...అంతా శ్రీస్వామివారి దయ, మీ ఆశీర్వాదాలు సార్...జీవితాంతం మిమ్మల్ని మర్చిపోను...అని చెప్పి మా ఇద్దరికి బట్టలు పెట్టి వెళ్ళారు.

అప్పటినుంచి ఇప్పటిదాకా ప్రతీ సంవత్సరం మా ఇంటికి వచ్చి మా దంపతులిద్దరికీ బట్టలు పెట్టి వెళతారు...వద్దని ఎంతచెప్పినా వినరు. వచ్చినప్పుడల్లా

శ్రీవేంకటేశ్వర వ్రత కల్పం నూరు పుస్తకాలు తీసుకువెళ్తారు. ఈ వ్రత కల్పం చదివి మరింత మంది జీవితాలు బాగుపడాలి అంటారు. ఒకప్పుడు చిరిగిన చీరతో వచ్చిన ఆవిడ ఇప్పుడు టాక్సీలో వస్తున్నారు. ఆవిడ వచ్చినప్పుడల్లా ఆవిడ ముఖంలో సంతోషం చూస్తే మా ఇద్దరికి ఎంతో ఆనందం కలుగుతుంది. ఇంతకుమించిన సంతోషం ఏముంటుంది. విజయలక్ష్మీగారు కూడా పూర్వజన్మలో నన్ను హిమాలయాశ్రమంలో కలసినవారే! వారు ఈ జన్మలో నన్ను ఈ విధంగా కలవడం జరిగింది. పూర్వజన్మల కర్మఫలం పూర్తి కాబోతుండడం వలన ఆవిడ ఈ జన్మలో ఎన్నో కష్టాలు పడ్డారు. అనుకోకుండా ఆరోజు శ్రీవేంకటేశ్వర వ్రత కల్పం దొరకడం ఆ వ్రతం ఆచరించి ఆవిడ జీవితంలో ఎంతో మంచి మార్పురావడం, నన్ను కలవడం జరిగింది. శ్రీవేంకటేశ్వర వ్రత కల్పం ఎంతమంది జీవితాలలో అద్భుతాలు చేస్తున్నదో చూసారు కదా! అలాగే పూర్వజన్మ బంధాలు ఎంత విచిత్రంగా ఉంటాయో చూసారు కదా!.

నేను తిరుమలలో శ్రీవేంకటేశ్వర వ్రత కల్పం వ్రాస్తున్నప్పుడు శ్రీమన్నారాయణులవారి విశ్వరూపం సందర్శనం జరిగింది. అలా ఆ విశ్వరూప దర్శనంలోనే ఆ పరబ్రహ్మమూర్తి శ్రీవేంకటేశ్వర వ్రతకల్పం విధానాన్ని, ప్రథమ అధ్యాయాన్ని నాకు అనుగ్రహించారు. ఆనాటి అనుభవం నేనెప్పటికీ మర్చిపోలేనిది. శ్రీనివాసుడు ఆలయంలో మరొక శిలామూర్తిగా కనబడుతున్నప్పటికి ఆ ప్రదేశం అంతా ఇప్పటికి సకలదేవతా స్వరూపమైన విశ్వరూపంలో ఆవరించి ఉంటాడు. అప్పటినుండి నాకు కాసేపు కనులు మూసుకొని ధ్యానంలో ఉన్నత స్థాయికి వెళితే ఆ విశ్వరూపం దర్శనం నా హృదయంలోనే కలుగుతోంది.

ఈ విశ్వమంతా వ్యాపించి ఉన్న ఆ దివ్యశక్తి దర్శనం అంతర్ముఖంగా చూడగానే వెంటనే నా హృదయంలోనే ఆ దివ్యశక్తి దర్శనం లభిస్తుంది. అంతే కాదు ఆ క్షణంలో శ్రీసూక్తం, పురుష సూక్తం వంటి ఎన్నో వేదమంత్రాలు కూడా నా హృదయంలో ప్రతిధ్వనిస్తున్నాయి. ఆ విశ్వరూపం దర్శనంతోను ఈ దివ్యతరంగాల ప్రభావం చేతను నా శరీరమంతా ఎంతో తేజస్సు ఆవరించటం గ్రహించాను. ఆ స్థితిలో అందరూ అనుకునే బ్రహ్మానందం కలుగుతుంది. అప్పుడు విశ్వమంతా వ్యాపించి ఉన్న ఆ దివ్యశక్తి, మనలోని ఆత్మ ఒక్కటేనన్న సత్యం బోధపడుతుంది. ఈ విశ్వమంతా వ్యాపించి ఉన్న మహాతత్వమే, మహాశక్తియే మన ఆత్మయందు కూడా ఉంది. మనం ధ్యానంలో ఎంతో ఉన్నత స్థితికి వెళితే ఈ విషయం చక్కగా

తెలుసుకొనగలుగుతారు. ఈ అనుభవం మనకు వర్ణించలేని ఆనందాన్ని కలుగజేస్తుంది.

నేను ఇలా పూర్వజన్మ స్మృతుల లోనికి వెళ్ళినప్పుడు ఇంకా ఎన్నో ఆశ్చర్యకరమైన విషయాలు తెలిసాయి. ప్రతీ వ్యక్తి పుట్టినప్పటినుంచి కలిసే ప్రతీ వ్యక్తి, నివసించే ప్రతీ ప్రదేశానికి, జరిగే ప్రతీ సంఘటనకి, చేసే ప్రతీ పనికి పూర్వజన్మల బంధం ఏదో తప్పక ఉండి ఉంటుంది. ఒక విధంగా బుద్ధి కర్మానుసారిణి అంటే ఇదే! మన పూర్వకర్మల ఫలంగా మన బుద్ధి ప్రవర్తిస్తుంది. ఎన్నో జన్మలు మనం ఎంతో గట్టిగా ప్రయత్నిస్తే తప్ప మన బుద్ధిలో మార్పురాదు. అలా కొన్ని జన్మలు సద్బుద్ధితో జీవించిన తరువాత మనకు ఉత్తమ జన్మలు లభిస్తాయి.

మన భార్యకాని, భర్తకాని, సంతానం కాని, బంధువులు కాని, స్నేహితులు కాని అన్నీ పూర్వజన్మల బంధాల వలనే ఒనగూరుతాయి. మనం ఏ ఇంట్లో పుట్టాం అన్నదే మన జీవితాన్ని దాదాపు సగం నిర్ణయిస్తుంది కదా! నువ్వు అహ్మదాబాద్‌లో అంబానీ కుమారుడుగా పుట్టవచ్చు లేదా అమలాపురంలో ఒక చిన్న రిక్షా తొక్కి జీవనం సాగించే అతి పేద ఇంట్లో జన్మించవచ్చు. ఇదంతా మళ్ళీ పూర్వజన్మ కర్మ ఫలమే! ఇంతే కాదు ఈ జన్మలో అంబానీ కుమారుడికి అతడి తండ్రితోను, రిక్షా వాని కుమారుడికి అతని తండ్రితోను క్రిందటి జన్మలలో ఎప్పుడో ఏదో బంధం ఉండి ఉంటుంది. అందుకే ఆయా కుటుంబాలలో వారి కుమారులుగా జన్మించారు.

పూర్వజన్మలలో చేసుకున్న, పుణ్య పాప ఫలాలు రెండూ కూడా దేనికదే విడి విడిగా తరువాత జన్మలలో అనుభవిస్తాం. మనం ఒకోసారి ఎంతో కోటీశ్వరుల ఇంట్లో పుట్టినవారు చిన్నప్పటి నుండి మూగతనంతోనో లేదా అవిటితనంతోనో జన్మించడం చూస్తాం. ఆ పిల్లవాడికి పూర్వజన్మ పుణ్యఫలం వలన కోటీశ్వరుల ఇంట్లో జన్మించాడు. కాని ఏం లాభం...పూర్వజన్మ పాపఫలం వలన జీవితాంతం ఇలా అనారోగ్యంతో ఉండవలసిందే కదా! అలాగే ఆ కోటీశ్వరుడికి పిల్లవాడు కలిగే యోగం ఉంది. కాని పూర్వజన్మ కర్మఫలం వలన ఆ పిల్లవాడు పుట్టడంతోనే అనారోగ్యంతో పుట్టాడు. ఇటువంటి కర్మఫలాలు ముందు ముందు జన్మలలో జరగకుండా ఈ జన్మలో మనం జాగ్రత్తపడాలి. జాగ్రత్తపడడం అంటే సంస్కారవంతంగా జీవించాలి. మనకి వీలున్నన్ని మంచి పనులు చెయ్యాలి. మనం

చేస్తున్న పుణ్యకార్యాలు అన్నీ భగవదర్పణంగా చెయ్యాలి. మనం గొప్ప పనులు చేస్తున్నాము అనుకోకూడదు. అలా అనుకున్నట్లయితే ఈ పుణ్యఫలం మన ఆత్మని పట్టుకొని ఇది అనుభవించడానికి తిరిగి తిరిగి అనేక జన్మలు ఎత్తవలసి వస్తుంది.

నన్ను హిమాలయాశ్రమంలో కలిసిన 108 మందే కాక ఇంకా నన్ను అనేక జన్మలలో కలుసుకున్నవారు కూడా కొందరు ఈ జన్మలో నన్ను తిరిగి కలిసారు. వీరిలో కొందరు ఇప్పటికే ఎన్నో ఉత్తమ జన్మలలో జన్మించి ముందు రాబోయే జన్మలలో ఎంతో గొప్పవారిగా జన్మిస్తారు. లోక కళ్యాణార్థం గొప్ప పనులు చేస్తారు.

నేను ఒక జన్మలో కాశీలో పండితునిగా జన్మించినప్పుడు నన్ను కలిసిన మరొక 108 మంది మళ్ళీ ఈ జన్మలో నన్ను కలవడం గమనించాను. వీరందరు ఆ జన్మలో ఒకనాడు కాశీలో జరిగిన ఒక గొప్ప పండిత సభకు వచ్చిన మహా పండితులు దేశంలోని ఎక్కడెక్కడ ప్రాంతాలనుంచో వచ్చిన మహా జ్ఞానులు, ఆ పండిత సభలు ఒక వారంరోజులపాటు ఎంతో అద్భుతంగా జరిగాయి. వచ్చిన పండితులందరు ఎన్నెన్నో శాస్త్రాల మీద ఎంతో అద్భుతంగా ప్రసంగించారు.

ఆ పండిత సభలలో పాల్గొన్నవారికి ఎన్నో క్రొత్త విషయాలు తెలిసాయి. ఆ 108 మంది మధ్య ఎంతో గొప్ప అవినాభావ సంబంధం కలిగింది. వీరందరూ తరువాత జన్మలలో వేరు వేరు ప్రదేశాలలో జన్మించి, ఈ జన్మలో తిరిగి నన్ను కలిసారు. ఇంకా కొంతమంది కలవవలసి ఉంది. ఈ జన్మలో వీరందరూ గొప్ప వేద పండితులుగాను, రచయితలుగాను, శాస్త్రజ్ఞులుగాను, ఇంజనీర్లగాను, న్యాయమూర్తులుగాను, జర్నలిస్టులుగాను, కొంతమంది అతి సామాన్యులుగాను జన్మించినప్పటికి ఎంతో గొప్ప సంస్కారంతో జీవిస్తున్నారు. వీరిలో చాలామంది జీవితాలలో అనుకోని కష్టాలు ఎదురై ఎంతో శారీరక, మానసిక బాధలకు లోనౌతున్నారు. అయిన ఆ దివ్యశక్తి అనుగ్రహంచేత పూర్వజన్మ పుణ్యఫలం వలన మనోధైర్యం కోల్పోక దృఢచిత్తంతో జీవిస్తున్నారు.

ఇలాగే నేను ఒక జన్మలో తమిళనాట మధురైలో జన్మించినప్పుడు నాతో మరొక 108 మంది ఎంతో సన్నిహితంగా ఉన్నారు. అప్పుడక్కడ ఒక పెద్ద వైష్ణవ సభ ఉండేది. ఆ సభలో 108 మంది గొప్ప వైష్ణవ పండితులు సభ్యులుగా ఉండేవారు. వైష్ణవ సాంప్రదాయంలో ఉన్నప్పటికీ వీరందరూ ఎంతో విశాల దృక్పథంతో అన్ని సాంప్రదాయాలవారిని ఎంతో గౌరవించేవారు.

వీరందరూ కూడా ఎంతో ఉత్తమ సంస్కారాలతో జీవించేవారు. ఆ జన్మలో నేను ఆ వైష్ణవ సభకు ముఖ్య సలహాదారుగా ఉన్నాను. వారందరూ నాతో ఎంతో సన్నిహితంగా ఉండేవారు. ఆ జన్మలో బంధం అలా కొనసాగి తరువాత జన్మలలో వారు వేరు వేరు దేశాలలో, వేరు వేరు రాష్ట్రాలలో, వేరు వేరు మతాలలో, వేరు వేరు కులాలలో జన్మించి తిరిగి ఈ జన్మలో నన్ను కలుసుకున్నారు.

వీరిలో కొందరు ఈ జన్మలో కొందరు బంధువులుగాను, కొందరు చిన్ననాటి స్నేహితులుగాను, మరికొందరు ఇంజనీరింగ్ స్నేహితులుగాను, మరికొందరు నేను ఉద్యోగం చేస్తున్నప్పుడు నాతోటి ఉద్యోగులుగాను, మరికొందరు నా వద్దకు లోగోలు కోసం వచ్చినవారు గాను, మరికొందరు వారి జీవితంలో ఏదో సమస్యలకు సలహాలకు వచ్చినవారు గాను ఉన్నారు. కొంతమంది కేవలం నేను రాసిన పుస్తకాలు ఎక్కడో చూసి నన్ను వ్యక్తిగతంగా కలిసి మరికొన్ని ప్రతులు తీసుకొనడానికి వచ్చినవారు కూడా ఉన్నారు. అప్పటి పూర్వజన్మ బంధం కారణంగా ఈ జన్మలో వీరు నాకు ఎంతో సన్నిహితులు అయ్యారు.

ఇలాగే మరొక జన్మలో నేను కర్ణాటకలోకి శృంగేరి పట్టణంలో జన్మించినపుడు అక్కడ శ్రీ శారద మఠంలో ఒకసారి గొప్ప పండిత మహాసభలు జరిగాయి. ఆ సభలకు దేశవ్యాప్తంగా 108 మంది గొప్ప పండితులు వచ్చారు. ఆ సభలకు ముఖ్య సమన్వయకర్తగా నేను వ్యవహరించాను. ఆ పండితులందరూ ఒక నెలరోజులపాటు అక్కడ శ్రీ శృంగేరి మఠంలోనే ఉన్నారు. అలా కలిసి నెలరోజులు గడపడంతో మా అందరి మధ్య ఎంతో గొప్ప సాన్నిహిత్యం కలిగింది. వీరందరూ తరువాత ఎన్నో ఉత్తమ జన్మలలో జన్మించి తిరిగి ఈ జన్మలో నన్ను కలుసుకున్నారు. అప్పటి ఆ బంధం కారణంగా ఈ జన్మలో కూడా నాకెంతో సన్నిహితులయ్యారు. అలాగే వీరిలో కూడా కొందరికి ఒకరితో ఒకరికి ఎంతో గొప్ప సాన్నిహిత్యం ఏర్పడింది.

ఇలా నేను ధ్యానంలో ఉన్నత స్థితిలోకి వెళ్ళినప్పుడు వెనుకటి జన్మలలో వీరందరూ ఎక్కడెక్కడ జన్మించినది ఏ విధంగా జీవించింది కూడా గోచరించింది. ఇంకో విశేషమేమిటంటే వీరిలో కొందరికి వారిలో వారికి కూడా పూర్వజన్మ బంధం ఉన్నవారే. పూర్వజన్మలలో తల్లిదండ్రులగాను, భార్యాభర్తలగాను, అన్నదమ్ములగాను, అక్కచెల్లెల్లుగాను కూడా జన్మించి ఈ రోజున వేర్వేరు ప్రదేశాలలో, వేర్వేరు

కుటుంబాలలో జన్మించి నన్ను కలవడం గమనించాను. ఇలా నా వద్దకు వచ్చిన వారిలో వారి పూర్వజన్మ బంధాలు కూడా నాకు గోచరిస్తున్నాయి.

ప్రతీ మనిషి తన జీవితంలో ఎన్నో కష్టాలు పడుతుంటాడు. ఒక్కోసారి కొంతమంది కుటుంబ సభ్యులపైనో, సన్నిహితులపైనో ఎంతో కోపం వచ్చి అస్సలు మనశ్శాంతి ఉండదు. అటువంటి సమయాలలో ఇవన్నీ పూర్వజన్మ బంధాల వలన ఏర్పడినవని గ్రహించండి. అయితే ఇది చెప్పినంత సులభం కాదని నాకు తెలుసు.

దగ్గర వాళ్ళను పోగొట్టుకోవడం, ఆర్థికంగా నష్టాలలో పడడం, మనకు ఏదైనా అనుకోని అనారోగ్యం కలగడం, మనకుటుంబంలోని వారు ఒక్కసారిగా తీవ్ర అనారోగ్యానికి లోనవ్వడం ఇవన్నీ మనకు ఎంతో బాధ తెప్పిస్తాయి. కాని ఇవన్నీ కూడా మనం ఎన్నో జన్మలలో చేసుకున్న ప్రారబ్ధ కర్మల ఫలంగా గ్రహించి మనస్సుని నిగ్రహించుకోవాలి.

ఇంతకు ముందు చెప్పినట్లుగా ఇదంతా తేలికైన విషయం కాదు. మనందరం ఎప్పుడూ మాయతో కప్పబడి ఉంటాం. అందుకే ఇన్ని వేల సంవత్సరాలుగా ఆనాటి శ్రీ ఆదిశంకరాచార్యుల దగ్గరనుంచి నేటి శ్రీ చాగంటి కోటేశ్వరరావుగారి దాకా ఎన్నో వేల మంది మహాపురుషులు ఎన్నో లక్షల సార్లు ఎన్నో గొప్ప విషయాలు చెప్పారు? అయినా ఇవన్నీ విన్న ఎందరిలో మార్పు వస్తోంది?.

ఆ పుస్తకం చదువుతున్నంత సేపో, ఆ ప్రవచనం వింటున్నంత సేపో మన మనస్సు హాయిగా ఉంటుంది. అది అయిన మరుక్షణం మనల్ని మాయ కప్పేస్తుంది. మనం తిరిగి ఈ మాయా ప్రపంచంలో పడిపోతాం. ఈ మాయ మనల్ని ఎంతగా కప్పేస్తుందంటే ఆ చదివింది, విన్నది ఏది మన మనస్సుకు గుర్తుండదు. ఒకవేళ గుర్తున్న అవన్నీ ఆచరించాలనే సంకల్పం కలగదు కాని గట్టి ప్రయత్నం చేస్తే మనం తప్పకుండా ఈ మాయనుండి తప్పించుకోవచ్చు.

అలా మనం కొంచెం ప్రయత్నం చేస్తే మన బుద్ధి ఆ దారిలో మరలడానికి భగవంతుడు తప్పక సహాయం చేస్తాడు. బుద్ధి కర్మానుసారిణి అంటారు కాని, మనకు భగవంతుడిచ్చిన విచక్షణా జ్ఞానంతో ఆ బుద్ధిని సన్మార్గంలో నడిపిస్తే మన ప్రారబ్ధ కర్మ తీవ్రత కూడా తప్పక తగ్గుతుంది. ఇలా కొన్ని వేలజన్మలు ప్రయత్నిస్తే మనం ఈ జనన మరణ చక్రం నుంచి తప్పక విముక్తులౌతాము.

అందుకని మీరందరూ ఈ మార్గములో నడవడానికి గట్టిగా ప్రయత్నించండి. మీరందరు తప్పకుండా మంచి ప్రవర్తనతో జీవించి ముందు ముందు మంచి జన్మలలో జన్మిస్తారు. ఇప్పుడు మీరు పడుతున్న కష్టాలన్నీ మీ ప్రారబ్ధకర్మ పూర్తి అయిపోవడానికే అని గ్రహించండి. గట్టిగా ప్రయత్నించేవారికి ఆ భగవంతుడి ఆశీస్సులు, సహాయం తప్పక ఉంటుందని గ్రహించండి. మీ అందరికి ఇంక కొన్ని జన్మలకే మీ పూర్వజన్మల ప్రారబ్ధకర్మలన్నీ తీరిపోతాయని నా నమ్మకం. మీ అందరిని అనుగ్రహించి, మీ అందరికి ఇక కొద్ది జన్మలకే జన్మరాహిత్యం కలిగేలా అనుగ్రహించమని ఆ దివ్యశక్తిని నేను మనస్ఫూర్తిగా ప్రార్థిస్తున్నాను.

శ్రీలక్ష్మీశ్రీనివాస కటాక్ష సిద్ధిరస్తు

సర్వేజనా సుఖినో భవంతు

సమస్త కళ్యాణాని భవంతు



John Stratton Hawley

*Claire Tow Professor of Religion*
*Columbia University*
*New York , USA*

Dear Vishwapathi ( if I may )
Just back form the Madison conference on South Asia, I find your beautiful book on Tirupati in my mailbox. Thank you! It's a wonderful achievement and that best of all things in a book--a real invitation to read. The photos are, many of them, very striking, and I have already marked a couple of things in the accompanying prose that bear returning to. How nice that you have included a brief historical section, too. Thank you so much for this very generous gift.

Yours with best wishes,
Jack



Francis X. Clooney, S.J.

*Parkman Professor of Divinity*
*Professor of Comparative Theology, Harvard Divinity School*
*Harvard University , USA*

*Fellow of British Academy*
*Director, Centre for Study of World Religions,*
*Harvard (2010-17)*

Dear Mr Murthy, Namaskaram. This is a belated appreciation of your Srivari Darsan, which I perused with pleasure, and shared also with my students. It is a lovely book, and evocative of that holy divya desam. Tiruvenkatam is in fact my own favorite, and I was blessed to have entered for darsan twice, though not in many years now.

And thanks too for Amruthapadham, your very vivid and personal recollection of God's action in your life.

With best wishes for your health and good work,

Prof Clooney



Prof.Bryant, Edwin F.

*Department of Religions*
*RUTGERS School of Arts and Sciences, USA*

Greetings Vishwapati,
Thank you for sending Srivari Darsan. I have had the good fortune of receiving the darsana of Sri Balaji and Tirupati is indeed an unparalleled place. Indeed, it is non different from Vaikuntha. I wish you all the vest best with your publications. It is great you are spreading the Vaishnava teachings in your own way. With all best wishes, EB .

విశ్వపతి కలం పేరుతో ప్రసిద్ధులైన తిమ్మరాజు విశ్వపతి రామకృష్ణ మూర్తి 25 ఆధ్యాత్మిక పుస్తకాలు రచించారు. విశ్వపతి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఏలూరులో బ్రహ్మశ్రీ తిమ్మరాజు లక్ష్మీ నరసింహరావు, నాగ రత్నాంబ దంపతులకు 1956లో జన్మించారు. విశ్వపతి 1978లో బి.ఇ. (ఉస్మానియా యూనివర్శిటీ), 1983లో ఎం.టెక్. (రీజనల్ ఇంజనీరింగ్ కాలేజి, వరంగల్) నుండి చదివి, 1984 నుంచి 1988 దాకా ఆల్విన్ కంపెనీలో పనిచేసారు. తరువాత యమ్.వి.యస్.ఆర్. ఇంజినీరింగ్ కాలేజీలో చేరారు. విశ్వపతి 1984 నుంచి 1990 వరకు ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌లో కార్టూన్‌లు వేశారు. ఆయన కార్టూన్లు వివిధ మ్యాగజైన్లలో ప్రచురించబడ్డాయి.

విశ్వపతి 1998 నుంచి వేదిక్ లోగో డిజైన్ రంగంలో ఉన్నారు... ఇప్పటిదాకా ప్రపంచ వ్యాప్తంగా 6,000 పైగా సంస్థలకు లోగోలు డిజైన్ చేశారు... పూర్తి మెడిటేషన్‌లోకి వెళ్ళి లోగోలు డిజైన్ చేస్తారు... వీరు లోగోలు డిజైన్ చేసిన సంస్థలన్నీ ఎంతో అభివృద్ధిచెందుతాయి.

శ్రీ వేంకటేశ్వరస్వామి భక్తులు అయిన విశ్వపతి మొదట 2001 లో శ్రీ శ్రీనివాస మహత్యం అనే పుస్తకం వ్రాసారు. ఆయన 2005లో రాసిన వేంకటేశ్వర వ్రతకల్పం తెలుగు, తమిళం, కన్నడం, మలయాళం, హిందీ వంటి భారతీయ భాషలే కాక ఫ్రెంచ్, ఇటాలియన్ సహా పన్నెండు భాషల్లో అనువాదం అయ్యింది. ఇప్పటి వరకూ ఆయన వ్రాసిన ఆధ్యాత్మిక పుస్తకాలను ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది మంది చదువుతున్నారు.

ఇవేకాక విశ్వపతి గారు శ్రీ లక్ష్మీ నరసింహ వ్రతం, శ్రీ మహేశ్వర వ్రతం, శ్రీ శుభదుర్గ వ్రతం, శ్రీ ఆనంద ఆంజనేయం, శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర వ్రతం, శ్రీ జ్ఞాన సరస్వతి వ్రతం, శ్రీ రామరక్షా వ్రతం, శ్రీ సాయి రక్షా వ్రతం, ఇంకా అనేక పుస్తకాలు వ్రాసారు. ఇవన్నీ భక్తులకు పూర్తి ఉచితంగా పంచబడుతున్నాయి. ఈ పుస్తకాలన్నీ భక్తుల్ని ఎంతగానో అలరిస్తున్నాయి.

ఇంతేకాక వీరు 2018లో ఇంగ్లీషులో రచించిన శ్రీవారి దర్శన్ పుస్తకం ప్రపంచ ప్రఖ్యాత విశ్వవిద్యాలయాలైన హార్వర్డ్, కార్నెల్, కేంబ్రిడ్జి, ఆక్స్ఫర్డ్, హేయదేల్బర్గ్, రాయల్ డెన్మార్క్ లైబ్రరీ, ఫిలిప్పీన్స్ విశ్వవిద్యాలయ లైబ్రరీలలో ఉంచబడింది.

వీరికి ఈ పుస్తకాలు రాస్తున్నప్పుడు ఎన్నో దివ్యానుభూతులు కలిగాయి...ఒకసారి విశ్వపతి ధ్యానంలో ఉన్నత స్థితికి వెళ్ళినప్పుడు తన పూర్వజన్మల వృత్తాంతాలన్నీ తెలిసాయి. తాను 200 సంవత్సరాల క్రితం హిమాలయాలలో ఒక దివ్యాశ్రమంలో ఉన్నానని అప్పుడు తనను ఎక్కడెక్కడి నుంచో 108 మంది వచ్చి కలిసినట్లు గ్రహించారు. వీరందరు ఈ జన్మలో తిరిగి తనని ఆశ్చర్యకర రీతులలో వచ్చి కలవడం విశ్వపతికి చాలా ఆనందం కలిగించింది... ఆ విశేషాలతో వ్రాసినదే ఈ అమృత దర్శనం. ఈ పుస్తకం చదివిన మీ అందరికీ కూడా ఎంతో దివ్యమైన అనుభూతులు కలుగుతాయని విశ్వపతి నమ్మకం.

Mr. T.V.R.K. Murthy (Viswapathi)
viswapathi@yahoo.com I Ph. : 98494 43752
www.lordofsevenhills.com
www.vratams.com